# భారతి

సాహిత్య మాసపత్రిక
డిసెంబరు 1983

మమత
ఆశల వుదయాలు
దిలావర్

లంచం
కృష్ణారెడ్డి

మౌనభాష్యం
అంజయ్య

అన్నమాచార్య
జననవత్సరం
అబ్బూరి

ఆరో ప్రాణం
మోహన్

వీలు
రామారావు

ఇంకా జ్ఞానానందము, సుబ్బరామశాస్త్రి, రంగారావు, పద్మావతి, సుబ్బారావు, గంగప్ప, హనుమంతప్ప, అనంతకృష్ణ శర్మగారు, శ్రీరంగాచార్య, పాపయ్యశాస్త్రి ఇతరుల రచనలు.

వ్యవస్థాపకులు
దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

# భారతి

మాసపత్రిక

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938-1972)

డిసెంబరు 1983

సంపుటము: 60 సంచిక: 12

విడిపత్రిక వెల నాలుగు రూపాయలు

# విషయానుక్రమణిక

## డిసెంబరు 1983

# భారతి

## పాఠకులకు మనవి

భారతి మొదటి సంచిక వెలువడి 1984 జనవరితో 60 సంవత్సరాలు పూర్తి అవుతుంది.

ఈ 60 సంవత్సరాలలోనూ భారతి లో ఎన్నో మార్పులు వచ్చాయి. ఎన్ని మార్పులు వచ్చినప్పటికి భారతి తెలుగువారి సంస్కృతికీ, వారి సంస్కృతిలోని ఉత్తమమయిన అంశాలకీ, ప్రతిబింబంగా ఉంటూ వచ్చింది. ఇకముందు కూడా ఈ సంప్రదాయాన్నే భారతి కొనసాగించగలదు.

కొన్ని సంవత్సరాలుగా భారతి లో కథలకి (చిన్నవి కాని, పెద్దవి కాని) అంతగా చోటు ఉండటంలేదు ! ఈ లోపాన్ని సరిదిద్దడం కోసం ఇకమీద భారతి లో కథలనీ, నవలలనీ ఎక్కువగా ప్రచురించటానికి నిశ్చయించుకున్నాము !

పాత భారతి సంచికలతో పరిచయం కలవారికి ఇదేమీ కొత్తగా ఉండదు. ఒకప్పుడు భారతి లో ఇప్పుడు కొన్ని వార పత్రికలలో, మాస పత్రికలలో ఉన్నట్లు కథలూ, నవలలూ పుష్కలంగానే ఉండేవి !

కథలూ, నవలలూ ఎక్కువగా వేసినంతమాత్రాన భారతి లో పడే కవిత్వానికీ, వ్యాసాలకీ ఎటువంటి కొరతా ఉండదని వేరేచెప్పనక్కరలేదు !

వీలునిపట్టి, భారతి స్థాయిని అనుసరించి అట్టనికూడా మార్చగలము !

భారతి కి ఎప్పటిలాగే పాఠకుల ఆదరాభిమానాలు లభించగలవని ఆశిస్తున్నాము !

# మ మ త

మనిషిలోని ప్రేమానురాగాలను బతికించే
మృతసంజీవని మమత!
మోడువారిన గుండెల్లో చిగురించే
మానవతా సుమలత!

కన్నీటి బిందువులనే కాందిశీకులను
తన గుండెల్లో దాచుకునే ఆశ్రయం!
క్రోధ మోహ మాత్సర్యాలనే క్రూరసత్వాలకు
మమత కణ్వాశ్రమం!

మానస 'సౌందరనందం' లో
మమత బుద్ధదేవుని పిలుపు!
చీకటి గుహలో నిద్దరోయే మనిషికి
మమత మేలుకొలుపు!

పసితనంతో వేసే తప్పటడుగులకు
మమత తల్లి వొడి!
నూరేండ్ల బ్రతుకు పంటకు
మమత రాజనాల వరిమడి!

కరుణ రసానికి
మమత పారావారం!
బతుకు నావకు
మమత సుందర తీరం!

ముసిరే ద్వేషాల చీకట్లను
చీల్చే ఒక మెరుపు!
విశాల హృదయాకాశానికి
మమత తూరుపు!

# ఆ శ ల వు ద యా లు

ఇంతవరకూ
కేవలం వంటికే సోకిందనుకున్నా—
కాని నా ఆలోచనలకు చూపులుపూయగానే తెలుసుకున్నా;
యీ లోకం మెదడుక్కూడా టైఫాయిడు జ్వరం!
అదెప్పుడూ గుండెకు ఓ తుపాకీ దూరం!
పువ్వుటెదల నెత్తురుల అత్తరులు తియ్యడమే
దాని వ్యాపారం!
పందిరిలేని బతుకుతీగను చూసి
చండ చండంగా లోకం నవ్వినప్పుడు
నిజాన్ని చూడలేని దివాంధత్వం
తన గురివింద తనానికి రంగు పులుము కుంటున్నప్పుడు
రంధ్రాన్వేషణతో బుద్ధికి తూట్లు పడ్డ తోడేళ్ళు
పరమ హంసల వేషంలో ప్రబోధాలు చేస్తున్నప్పుడు
యీ పిచ్చాసుపత్రికి వైద్యుడ్ని కాలేకపోయినా
కనీసం పిచ్చి ఔదార్యంతో క్షమించ గలిగినప్పుడు
అప్పుడు......
నా భావాల నెమళ్ళు పింఛాలు సవరించు కుంటాయి
ఎప్పుడన్నా ఓ మానవతా జలదం జలదరించదా అని.
నా కన్నుల ఆల్చిప్పలు తెరుచుకుంటాయి
ఎప్పుడన్నా ఓ కలల చినుకు రాలిపడక పోతుందా అని.
నా మనసు పూల తెప్పగా మారి పోతుంది
ఎప్పుడన్నా ఓ ఆకాశం వెన్నెలవరద కాకపోతుందా అని.
అప్పుడు—
ఏ ఒక్క పిడికెడు గుండైనా
నా గుండెకు 'గుండెడు' దూరంలో నిలిచినా చాలు
నాలోని ఆకాశాలూ, అర్ణవాలూ
ఆశలవుదయాలను ఆవిష్కరిస్తాయి
ఆనందపులోతుల్లో వుయ్యాల లూగిస్తాయి.

శ్రీ దిలావర్

శ్రీ గోపాలకృష్ణ అబ్బూరి

# శ్రీ అన్నమాచార్య జనన వత్సర నిర్ణయం

తనునాటి ప్రజల ఆనందాలనూ, విషాదాలనూ ప్రతిఫలించే మహత్తరమైన పదకవితను చేబట్టి వేలాదిగా సంకీర్తనలను రచించి, అటు చక్రవర్తులతోనూ, ఇటు సామాన్యులతోనూ సమానస్థాయిలో ప్రవర్తించి శ్రీ వేంకటేశ్వరునికి-తన స్వేచ్ఛా స్వాతంత్ర్యాల ప్రతీకకు, జీవితాన్నే అంకితం చేసుకొన్న మహోన్నత వ్యక్తి అన్నమయ్య. ఏ దేశంలోనైనా ఏకాలంలోనైనా, ఇంత విశాలమైన జీవితానుభవం వుండి మహాకవులు కూడా అయినవారు చాలా అరుదుగానే వుంటారు.

ఇంతటి మహావ్యక్తిని గురించి మనకు తెలిసిన విశేషాలు చాలానే వున్నా తెలియవలసినవికూడా అంతకెక్కువే వున్నాయి. అయితే ఆ మహాపురుషుడి జనన కాలం దురదృష్టవశాత్తూ వివాద గ్రస్తంగా వుండిపోయింది. ఇప్పటి వరకూ వచ్చిన వివిధాభిప్రాయాలను పరిశీలించి, అందుబాటులో వున్న ఆధారాల సహాయంతో ఈ సమస్యను పరిష్కరించ ప్రయత్నించడం ప్రస్తుత వ్యాసానికి ప్రధానాశయం.

మొట్టమొదటగా అన్నమయ సంకీర్తనలున్న రాగిరేకులను తిరుపతి ఆలయంలోని తాళ్ళపాకవారి సంకీర్తన భాండారాన్నుంచి వెలికి తీసి ప్రచురణకు సిద్ధంచేసి, ముందుగా తిరుపతి శాసనాలను గురించిన రిపోర్ట్‌లో అన్నమయ్యనుగురించీ ఆయన పుత్రపౌత్రులను గురించీ లోకానికి తెలియచేసిన ఘనత కీర్తిశేషులు శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి గారికి దక్కింది. వారి రిపోర్ట్‌లో అన్నమయ సంకీర్తనలున్న రాగిరేకు మీది అవతారికనుబట్టి క్రీ.శ. 1424 నాటికి అన్నమయకు 16 ఏళ్ళ వయసుందనీ, ఆ నాటినించే సంకీర్తనల రచనకు ఆయన ఉపక్రమించారనీ నిర్ధయించుకొని రాశారు.(1) అయితే వారు ఈ విషయంలో వివరణలేమీ ఇవ్వలేదు.

అన్నమయ జననకాలాన్ని గురించితరువాతి కాలంలో వివరంగా చర్చించినవారు కీర్తిశేషులు శ్రీ చాగంటి శేషయ్యగారు.వారి ఆంధ్ర కవి తరంగిణిలో శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారి నిర్ధయాన్నే బలపరుస్తూ విపులంగా రాశారు. ఆ తరవాత శ్రీ గౌరిపెద్ది రామసుబ్బ శర్మగారూ, శ్రీ కామిశెట్టి శ్రీనివాసులుగారూ కూడా వారి నిర్ణయాన్నే బలపరుస్తూ రాశారు. వీరందరూ అన్నమయ జనన వత్సరం క్రీ. శ. 1408గా నిర్ధయించి వారికి తోచిన ఉపపత్తులతో తమతమ వాదనలను కొనసాగించారు. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు మొదట 1945 లో ప్రకటించిన శ్రీ వేంకటేశ్వర వచనముల పీఠికలో అన్నమయ జన్మ వత్సరం 1408గా పేర్కొని తరువాత 1949 లో అన్నమాచార్య చరిత్ర పీఠికలో అన్నమయ జన్మవత్సరం 1424గా పేర్కొన్నారు. ఇందుకాయన ఆధారాలను చూపి చర్చచేయలేదుగాని అవతారికలోని వాక్యవిన్యాసాన్ని సూటిగా అర్థం చేసుకొని అభిప్రాయాన్ని మార్చుకొని ఉంటారని అనుకోవచ్చు. వీరిని అనుసరించి క్రీ. శ. 1424 అన్నమయ జన్మవత్సరంగా భావించినవారలో డా॥ వేటూరి ఆనంద మూర్తి, డా॥ ముట్నూరి సంగమేశంగారలు విపులంగా చర్చించి నిర్ణయించారు.

అన్నమయ అధ్యాత్మ, శృంగార సంకీర్తనల తొలి రేకులమీద వున్న వాక్యాలు ఇవీ—

"శుభమస్తు ॥శ్రీమతే రామానుజాయనమః॥ స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహన శకవరుషంబులు 1346 అగునేటి క్రోధి సంవత్సరమందు తాళ్ళపాక అన్నమాచార్యులు అవతరించిన పదారుయేండ్లకు తిరువేంగళ నాథుండు ప్రత్యక్ష మైతేను అది మొదలుగాను శాలివాహన శకవరుషంబులు 1424 అగు నేటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బహుళ 12 నిరుధానకు తిరువేంగళ నాథుని మీదను అంకితముగాను తాళపాక అన్నమాచార్యులు విన్నపము చేసిన శృంగార సంకీర్తనలు॥"(2)

పై అవతారికలోని "శాలివాహన శకవరుషంబులు అగు నేటి క్రోధి సంవత్సరం" అన్నది అన్నమయ జనన వత్సరమా కాక అన్నమయకు శ్రీ వేంకటేశుడు ప్రత్యక్షమైన సంవత్సరమా అన్న సందేహాన్ని కలిగించి పరిశోధకులలో అభిప్రాయ భేదాలను కలిగించింది. పై అవ

తారిక 15వ శతాబ్దంనాటి వ్యావహారిక భాషలో ఉందన్న సంగతి విదితమే. వ్యావహారిక భాషాశైలి రీత్యా సూటిగాఅర్థంచేసుకుంటే క్రోధి సంవత్సరంలో అన్నమాచార్యులు అవతరించారనీ, పదహారయేండ్లకు స్వామి ప్రత్యక్షమైనారనీ అప్పటినుంచీ విన్నపం చేసిన సంకీర్తనలివి అనీ నిర్ణయానికి రావాలి. కాని పండితులైనవారు మరోరకంగా అర్థం చేసుకొని వ్యాఖ్యానించడంవల్ల అభిప్రాయ భేదాలు యేర్పడ్డాయి.

శ్రీ చాగంటి శేషయ్యగారు రేకుమీది అవతారికను గురించి రాస్తూ "ఈ వ్రాత అన్నయాచార్యుల జీవితకాలములో వ్రాసినదికాదు. అన్నయాచార్యుల జనన మరణ కాలములను దెలుపుట యీ లేఖకుని యుద్దేశము కాదు అన్నారు(3).వారే మరొకచోట "అన్నమయ్య చనిపోయిన దినమును గూర్చి భేదము లేదు" (4) అనికూడా అన్నారు. కాని అన్నమయ చనిపోయిన కాలంకూడా పై అవతారిక ఆధారంగానే కదా చెప్పగలిగేది! మరి అది "జనన మరణ కాలములు తెలుపుట"కు కాదనడం ఆశ్చర్యం. అయితే కేవలం రచనా కాలాన్ని మాత్రమే సూచించదలుచుకుంటే పై అవతారిక చెక్కినవారు ఆఖరి తేదీని వివరంగా యిచ్చినట్లే ప్రారంభదినాన్నికూడా వివరంగా యివ్వకుండా యెందువల్ల అశ్రద్ధచూపవలసి వచ్చింది? ఇందుకు శ్రీ శేషయ్యగారు వివరణలేమీ యివ్వలేదు. క్రోధి సంవత్సరంలోనే అన్నమయకు స్వామి సాక్షాత్కారం కలిగి అప్పుడే సంకీర్తనల రచనను ప్రారంభించారని శ్రీ శేషయ్యగారి వాదన. అయితే వారికే "క్రోధి సంవత్సరమున నేనాఁడు స్వామి ప్రత్యక్షమయ్యెనో చెప్పలేదు" అనే విషయంకూడా తోచింది.(5) అంటే క్రోధి సంవత్సర ప్రస్తావన మరి జనన కాలాన్నీ సూచించక, స్వామి ప్రత్యక్షమైన కాలాన్నీ సూచించక మరి దేనిని సూచిస్తున్నట్లో వారు ఆలోచించినట్లు కనబడదు. అయితే వారు శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారి నిర్ణయాన్నే ఉపపత్తులతో బలపరుస్తూకూడా "శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రిగారి యూహ దూరాన్వయ దోషమునకు గురియైనది. ప్రభాకరశాస్త్రిగారి నిర్వచనము నందది లేదు"(6) అనికూడా అన్నారు. నిజమే. అయినా వీరు ఇలా తప్పుదారిన పడటానికి కారణం శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు అన్నమాచార్య చరిత్రపీఠికలో "వైశాఖ మాసమున విశాఖ నక్షత్రము ప్రాయికముగా పూర్ణిమా తిథికి వచ్చును. కనుక వైశాఖపూర్ణిమ జన్మతిథిగాఁగూడ నిర్ణయింపవచ్చును." (7) అని రాసిన వాక్యమే. అయితే పూర్ణిమాతిథి ప్రసక్తి వొక్క శ్రీ వేటూరివారి వాక్యంలో తప్ప అన్నమాచార్య సంబంధాలయిన ఆకరాలలో యెక్కడాలేదు కాని శ్రీ శేషయ్యగారు తమ ప్రయత్నాన్నంతా పూర్ణిమా, విశాఖ నక్షత్రాలు కలిసి తటస్థించిన కాలంకోసం వినియోగించడం వలన విఫలులైనారు. వైశాఖ విశాఖ ప్రస్తావనకు ఆధారం చిన్నన్న అన్నమాచార్య చరిత్రలో

"చక్కని గ్రహములుచ్చమున మూఁడలర
అనుపమ లగ్నంబునందు వైశాఖ
మున విశాఖను జగంబున నుల్లసిల్ల
జనియించె నన్నమాచార్యుండు" (8)

అని రాసి వుండడమే. అదీకాక చిన్నన్న ("తాళ్ళపాక్కం తిరువేంకట నాథరో") క్రీ. శ. 1546 జులై 17వ తారీఖున వేయించిన శాసనంలో "తాళ్ళపాక్కం అన్నమయ్యంగార్" జన్మనక్షత్రం "వైశాఖంలోని వైకాసి" నాడు స్వామికి "పరుప్పువియల్-పడి" ని సమర్పించాలని దేవాలయ స్థానపతులతో వొప్పందం చేసుకున్నాడు.(9) పై రెండు ఆధారాలవల్ల అన్నమయ జన్మ నక్షత్రం వైశాఖ విశాఖగా తేలింది.

పై ద్విపద పంక్తులనుదహరించి చర్చలు సాగించిన శ్రీ శేషయ్యగారు చిన్నన్న శాసనాన్ని చూసినట్లు లేదు. అయితే వారు చూసిన 'అన్నమాచార్య చరిత్ర'కు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి పీఠికలో 'ధర్మకైంకర్యము' అన్న ఉపశీర్షిక కింద (10) ఈ శాసనపు వివరాలను ఇచ్చిన విషయాన్ని ఎందువలననో గమనించలేదు. అయితే పై ద్విపద పంక్తులనుదహరించిన వెంటనే ఆయన "ఈ వాక్యములలోనన్నయ జన్మతిథిని సరిగా నిర్ణయించుట కాధారములు లేవు." (11) అన్నారు. తేదీని నిర్ణయించడానికి అవి చాలవా ?

శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు కూడా మరో ఆలోచన లేకుండా "1408 విరోధి వైశాఖ శుద్ధ పూర్ణిమ విశాఖ నక్షత్ర మనుట సబబు" (12) అంటూ పైవారి పొరబాటు బాటనే పయనించారు. వారు చూపిన ఉపపత్తులు తర్కానికి నిలిచేవికావు. వారు వుద్దేశంలో "జన్మప్రభృతి పదహారేండ్ల వరకు గడచిన కాలము సారహీనమైన దనియు, పదహారవయేట తిరువేంగళనాథుడు ప్రత్యక్షమైన తర్వాత, ఆతనిపై దినమునకు ఒక్క కీర్తనమునకు తక్కువగాకుండ స్వామిని కొనియాడిన కాలమే సారభూతమైనదనియు, ఆ పని నిర్యాణ దినము వరకు సాగినందున నిర్యాణ దినము మాత్రము (దుందుభి - ఫాల్గుణ - బహుళ 12) లెక్కకు వచ్చిన దనియు తెలుపుచే ఈ వాక్యపరమార్థము." అంటూ చెప్పిన వీరు, "విరక్తుడగు అన్నమయ్య ఈ విధముగ లెక్కించెననుట సమంజసము" (13) అంటూ హాస్యస్ఫోరకమైన వ్యాఖ్యానం చేశారు. సత్యశోధనకై సాగిన చర్చలనన్నింటినీ వీరు "ఇంతకూ అన్నమయ్య దృష్టిలోనే అసారభూతమైన పదహారేండ్ల వయసునకై చేసిన ఈ కోలాహలము అసారమే" (14) అంటూ కొట్టేసినా వీరు కొత్తగా సాగించిన

పరిశోధనమూ లేకపోవడం విచారకరం. వీరే మరొకచోట "స్వామి నందకాంశభవుడై మేటి మేధావియై ఐదేండ్లకే ఉపనయనము చేయించుకొన్ననాడు ఎనిమిదేండ్లకు సంకీర్తనము లల్లలేడా?" (15) అని ప్రశ్నించినపుడు అన్నమయ బాల్యం అసారభూతమన్న విషయం మరచిపోవడమూ, స్వామి నందకాంశభవుడైన వ్యక్తికి అసారభూతమైన కాలమెలా ఉండగలదన్న సందేహమూ కూడా కలగకపోవడం విచిత్రం. ఇంతకూ శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి వాక్యంలో "ప్రాయికముగా" అన్న పదాన్ని వదలి "పూర్వి మాతిథిని" పట్టుకుని నేల విడిచి సాము చేసినవారై వారు పరిశోధకులు !

శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారి నిర్ణయాన్నే ఆమోదించి కొంత చర్చచేసిన వారు శ్రీ కామిశెట్టి శ్రీనివాసులుగారు, శ్రీ ముట్నూరి సంగమేశంగారి గ్రంథానికి ఉపోద్ఘాతం రాస్తూ "1346 క్రోధి" అన్నది అన్నమయ్య జననమా? వేంకటేశ్వరుని సాక్షాత్కారమా? అన్నది కొంత యోచించి తేల్చవలసిన విషయం. రాగిరేకులమీది వ్రాత ప్రధాన ఉద్దేశ్యం అన్నమాచార్యుల జనన మరణాలను గురించి తెలపడం కంటే సంకీర్తన రచనా ప్రారంభ పరిసమాప్తాలను తెలపడమే అని తోస్తుంది" (16) అంటూ దానికి బలంగా పెదతిరుమలాచార్యుల సంకీర్తనల తొలి రాగిరేకులోని అవతారిక నుదహరించారు. ఆ అవతారికలో "పెదతిరుమలాచార్యుల సంకీర్తన రచనా ప్రారంభమునే తెలుపడం జరిగింది" అంటారు. పెదతిరుమలాచార్యుల సంకీర్తనల తొలిరేకుల అవతారిక యిలావుంది.

"శ్రీ వేంకటేశాయనమః॥ శాలివాహన శకవర్షంబులు 1424 అగు నేటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బహుళ 12 మొదలుగాను తాళ్లపాక అన్నమాచార్యులుంగారు తమ కొమారుండు తిరుమలాచార్యులను దినమొక సంకీర్తన శ్రీ వేంకటేశ్వరునకు అంకితంచేసిచెప్పమనంగాను విన్నపము చేసిన సంకీర్తనలు॥" (17)

ఈ అవతారికలోని తేదీ అన్నమయ నిర్యాణదినాన్ని సూచిస్తోందన్న సంగతి విదితమే. మరణ శయ్యపైనుండి తండ్రిచెప్పగా తండ్రి మాటను శిరసావహించి, ఆ విషయాన్ని భక్తిగౌరవ పురస్సరంగా స్మరించడం పెదతిరుమలాచార్యుల ఆశయంగా మనం గుర్తించాలి. ఈ సందర్భంగా తాళ్లపాకవారి ఇతర కృతుల తొలిరేకుల మీది అవతారికలను కూడా పరిశీలించాలి.

పెదతిరుమలాచార్యుల సుదర్శనరగడ రేకు మీది అవతారిక-

"శ్రీమతేరామానుజాయనమః॥ తాళ్లపాక అన్నమాచార్యుల కొమారుండు తిరుమలయ్యంగారు చెప్పిన సుదరిశన రగళ॥" (18)

చిన తిరుమలాచార్యుల సంకీర్తన లక్షణం రేకుమీదిఅవతారిక-

"శ్రీమతే రామానుజాయనమః॥ తాళ్లపాక అన్నమాచార్యుల కుమారుండు పెదతిరుమలాచార్యులు। వారి కుమారుండు చిన తిరుమలాచార్యులు ఆనతిచ్చిన సంకీర్తన లక్షణమైన పదచ్ఛందము॥" (19)

చిన తిరుమలాచార్యులదే అష్టభాషా దండకము రేకుమీది అవతారిక—

"శ్రీమతే రామానుజాయనమః॥ తాళ్లపాక అన్నమాచార్యుల కుమారుండు పెదతిరుమలాచార్యులు। వారి కుమారుండు చిన తిరుమలాచార్యులు ఆనతిచ్చిన అష్టభాషా దండకము॥" (20)

ఈ పై అవతారికలను పరిశీలించినట్లయితే వొక పెదతిరుమలాచార్యుల సంకీర్తనలకు తప్ప ఆయన యితర కృతులకుగానీ ఆయనకొడుకు చినతిరుమలాచార్యుల కృతులకుగానీ యేవిధమైన తేదీలూ యివ్వడం జరగలేదు, ఎందువల్ల అన్న ప్రశ్న సహజంగానే ఉత్పన్నమౌతుంది. సంకీర్తనల విషయంలో తండ్రి ఆజ్ఞను గౌరవ పూర్వకంగా స్మరించడమేతప్ప కేవలం రచనాప్రారంభాన్ని సూచించడం అవతారిక లక్ష్యం కాదని విదితమౌతోంది. అంతేకాక తండ్రి ఆజ్ఞను పాటించిన పెద తిరుమలాచార్యులు ఆవిషయాన్ని వొక సంకీర్తనలో చెప్పుకోవడం చూస్తే దానికాయన యెంత ప్రాముఖ్యాన్నిచ్చిందీ వ్యక్తం కాగలదు. ఆ సంకీర్తనలో ఆయన "మాగురుఁడాడే వాక్యము నీయాధీనము" "నీ దాసుని ఆనతి యమోఘము" "పరగ మా సుజనకుని ప్రతిజ్ఞయు నీ పంపు, నిరతి శ్రీ వేంకటేశ నీ పంతము సతము" (21) అంటూ మళ్ళీ స్మరించుకున్నాడు.

ఈ పై ఆధారాలవల్ల శ్రీ కామిశెట్టి శ్రీనివాసులుగారి వాదనకు ఇబ్బంది కలుగుతోంది. అందువల్ల రేకులమీది తేదీలు రచనా ప్రారంభాన్ని సూచించేవి కావనీ, జన్మకాలాన్ని సూచించేవనీ రుజువవుతున్నది. అయితే జన్మవత్సరాన్ని తెలిపినవారు తేదీని కూడా యెందుకు తెలియచేయలేదు అన్న ప్రశ్నకు సమాధానం చెప్పుకోవలసి వుంది. సంకీర్తన భాండారాన్ని వెలయించడమే కాక శిలాఖండాల మీద సరిగమాది స్వరవిన్యాసాలతో సాహిత్యాన్నేకాక సంగీతాన్ని కూడా శాశ్వతంగా ప్రతిష్ఠించాలని అన్నమయ సంతతిచేసిన ప్రయత్నం సామాన్యమైనదికాదు. అలాగే రాగిరేకుల మీదికెక్కించి ప్రతులు తయారుచేసి అహోబలము శ్రీరంగం క్షేత్రాలకు పంపి భద్రం చేయించి, తమసాహిత్యం పదికాలాలపాటు నిలచి వుండాలనే కాంక్షతో ప్రయత్నం చేసినవారు, అన్నమయ జాతక చక్రాన్నికూడా భద్రపరిచే వుంటారు. మనకు తెలిసినంతలోనే మనకు లభ్యం కానివి చాలానే వున్నాయి. అన్నమయ జన్మతిథి ఆనాటికి ప్రసిద్ధమే కనక రేకుమీద

అవతారికను చెక్కించేటప్పుడు వారు పెద్దగా పట్టించుకోలేదని భావించవలసి వుంటుంది.

1408ని అన్నమయ జన్మవత్సరంగా నిరూపించదలుచుకొన్న వారిలోసైతం తేదీ విషయంలో యేకవాక్యత లేకపోవడం గమనార్హం. శ్రీ చాగంటివారి లెక్కలో "విరోధి సంవత్సర వైశాఖ శుక్ల పూర్ణిమా (29 ఏప్రియల్ 1408) సోమవార మాతని జననకాలం కాగా శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారి లెక్కలో "సర్వధారి సంవత్సరమున నిజవైశాఖ మాసమున శుక్ల చతుర్దశి బుధవారమున (9మే1408) జన్మించాడు.(22)

ఇప్పటిదాకా అన్నమయ జననవత్సరం 1408గా ప్రతిపాదించిన వారివాదనలను పరిశీలించి ఆ వాదనలు సహేతుకం కావని గమనించడం జరిగింది. క్రీ. శ. 1424ను జననవత్సరంగా ప్రతిపాదించే పరిశోధకులూ, విపులంగా చర్చించినవారూ యిద్దరున్నారు. శ్రీ వేటూరి ఆనందమూర్తిగారూ, శ్రీ ముట్నూరి సంగమేశంగారూ శాస్త్రీయంగా చర్చించారు. వారి నిర్ణయాలనుకూడా పరిశీలనలోకి తీసుకోవలసిఉంది.

మొట్టమొదటగా 1424 సంవత్సరాన్ని అన్నమయ జననవత్సరంగా సూచించినవారు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు. అయితే వారు విపులంగా చర్చించలేదు. కాని వారు అన్నమాచార్య చరిత్రకు రాసిన విపులమైన పీఠికలో ఎన్నో విషయాలను తెలియజేస్తూ, అనేక సంకీర్తనలను ఉదాహరిస్తూ అత్యంత ప్రామాణిక బుద్ధితో అన్నమయ చారిత్రక రూపాన్ని మనకళ్ళకుకట్టే విధంగా రచించారు. ఆ తరువాత వారి సూచనను సమర్థిస్తూ వారి కుమారులు డాక్టర్. ఆనందమూర్తి గారు శ్రీ చాగంటి శేషయ్యగారి వాదనను ఖండిస్తూ తమ "తాళ్లపాక కవుల కృతులు - వివిధ సాహితీ ప్రక్రియలు" అన్న గ్రంథంలో విపులంగా చర్చించారు. వారి వాదనలో ప్రధానంగా అన్నమయ మనుమడైన చిన తిరుమలాచార్యులకు బ్రహ్మోపదేశం చేశారన్న సమాచారాన్ని పురస్కరించుకొని, చిన తిరుమలాచార్యుల వయసునూ, పెదతిరుమలాచార్యుల వయసునూ అంచనాకట్టి అన్నమయ జన్మవత్సరాన్ని 1424గా నిర్ధారించారు. ఈ సందర్భంగా అన్నమయ వివాహమూ, సంతానం కలగడమూవంటి వివరాలకు ఉజ్జాయింపుగా కాలనిర్ణయం చేశారు.(23) పెదతిరుమలాచార్యుల శాసనాలూ, చిన తిరుమలాచార్యుల శాసనాలనూ కూడా పరిగణనలోకి తీసుకుని తమ వాదాన్ని సహేతుకంగా సాగించారు. ఆయన ప్రస్తావించిన విషయాలు కాక గుర్తించవలసిన మరికొన్ని విషయాలను గురించి చర్చించవలసి వుంది.

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు అన్నమాచార్య చరిత్రపీఠికలో "క్రీ. 1503 దాఁక జీవించిన యన్నమాచార్యుఁడీ పెద తిరుమలయ్య పెద కుమారుఁడగు చిన తిరుమలయ్యగారికి బ్రహ్మోపదేశముఁజేసినాడు. 1500 ప్రాంతముల చిన తిరుమలయ్య యుపనయనము జరిగినదనుకొన్నచో 1493 ప్రాంతముల జన్మించిన తిరుమలయ్య తండ్రి యప్పటికిరువదేండ్లవాఁడేయనుకొన్నను 1473 ప్రాంతముల జన్మించినవాఁడగును"(24) అని రాశారు. శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారికి "ఇదెట్లు పొసగును?" అన్న సందేహం కలిగి ఆ పుటలోనే అధోజ్ఞాపికలో వెల్లడించారు. 1473లో పెదతిరుమలాచార్యులు జన్మించారనీ, చిన తిరుమలాచార్యుల ఉపనయనం 1500 ప్రాంతాన జరిగిందనీ చిన తిరుమలాచార్యులు జన్మించేనాటికి పెద తిరుమలాచార్యుల వయస్సు 20 సంవత్సరాలుండవచ్చనీ శ్రీ ప్రభాకరశాస్త్రిగారు భావించినట్లు నిదానించి చదివితే అర్థం కాకపోదు. అన్నమయ జననవత్సరాన్ని అంచనాకట్టడానికి కాక పెద తిరుమలాచార్యుల జననకాలాన్ని ఉజ్జాయింపుగా లెక్కకట్టడానికి శ్రీ వేటూరివారు ఈ చర్చచేశారు. ఐతే శ్రీ చాగంటివారు ఈ లెక్కను అన్నమాచార్య జననవత్సరాన్ని నిర్ణయించడంకోసమై పొడిగించి చర్చించారు. శ్రీ చాగంటివారు "చిన తిరుమలాచార్యులు తన పితామహుడైన యన్నయాచార్యులను సంబోధించుచు వ్రాసిన కీర్తన యొకటియున్నది. అది యన్నయాచార్యుల జీవితకాలములో రచించినట్లు కన్పట్టుచున్నది. చినతిరుమలయ్య జననము శ్రీ శాస్త్రులుగారనినట్లు 1495 ప్రాంతమైనచో నన్నమాచార్యుల జీవితకాలములో నా కీర్తన వ్రాయుట యసంభవము" అంటారు(25). 1493లో చిన తిరుమలాచార్యులు జన్మిస్తే ఆనాటికి అన్నమయ వయసు 69 సంవత్సరాలుండాలి. అన్నమయ నిర్యాణ సమయానికి చిన తిరుమలాచార్యుల వయసు 10 సంవత్సరాలుంటాయి. కుశాగ్రబుద్ధికలవారు పదోఏట సంకీర్తనరాయడంలో వింత వుండదు గాని బ్రహ్మోపదేశానికి ఆ వయసుచాలు. శ్రీ వేటూరివారు ప్రస్తావించిన విషయం బ్రహ్మోపదేశమే. శ్రీ చాగంటివారు మరొకచోట "చిన తిరుమలయ్య జననము 1585 ప్రాంతమని శ్రీ ప్రభాకరశాస్త్రులవారు వ్రాసి యున్నారు"(26) అంటారు. ఆ మాటను శ్రీ వేటూరివారు అనలేదు. ఆ తరువాత "తిరుమల దేవస్థానము రిపోర్టులోఁ బెద తిరుమలయ్య నాల్గవ సంతానమైన చిన్నన్న (అష్ట మహిషీ కళ్యాణాది గ్రంథకర్త) క్రీ. శ. 1498 - 1561 కాలమువాఁడని వ్రాసి యున్నారు"(27) అనడం నిరాధారం. దేవస్థానపు శాసనాల రిపోర్ట్లలో ఆ విషయం లేనేలేదు. "దానినిబట్టి లెక్కించి చూచినచోఁ పెద తిరుమలయ్యకుఁ బ్రథమ సంతానమైన చిన తిరుమలయ్య క్రీ. శ. 1585 ప్రాంతమున జన్మించి యున్నట్లు తేలుచున్నది. అప్పటికి బెద తిరుమలయ్యకు ముప్పదియేండ్లున్నవన్నచో నాతని జననము 1550 ప్రాంతమగును. దీనినిబట్టికూడ నన్నయాచార్యుల జననము క్రీ. శ. 1506 అనుటయేయుచితము" అన్నారు. ఈ పేరాలోని సంవత్సర

సంఖ్యలన్నీ అచ్చు తప్పులై వుండాలి. వాటిని వరసగా 1485, 1450, 1408గా సవరించుకొని చూస్తే 1485లో చిన తిరుమలాచార్యుల జననమనీ, అప్పటికి ముప్ఫయియేళ్ళ వయసున్న పెద తిరుమలాచార్యులు 1455లో జన్మించాడనీ ఆ ప్రకారంగాచూస్తే అన్నమయ జననం 1408 అవుతుందనీ శ్రీ చాగంటివారి అభిప్రాయమై వుండాలి. అయితే అన్నమయ జననం 1408 లో అయితే అన్నమయ 40వ యేట పెద తిరుమలాచార్యులు జన్మించివుండాలి. 1424లో అన్నమయ జన్మించివుంటే పెద తిరుమలాచార్యుల జననం నాటికి అన్నమయకు 31 సంవత్సరాలుండాలి. అన్నమయ నిర్యాణంనాటికి చిన తిరుమలాచార్యుల వయసు 18 సంవత్సరాలుండివుండాలి.

శ్రీ చాగంటివారు "సామాన్యముగా నాకాలమునఁ పెండ్లివయసు ముప్పది వత్సరములు" అంటూ అన్నమయ విషయంలో "ముప్పది ఐదువత్సరము లనుకొందము" అంటూ కన్సెషన్ ఇచ్చారు. ఈ విషయావిష్కరణకు ఆధారమేమిటో వారు చెప్పలేదు. దాదాపు ఈ శతాబ్దపు ప్రారంభందాకా వున్న సంప్రదాయం పెళ్ళినాటికి పెళ్ళికొడుకు వయసు ఇరవై సంవత్సరాలకు కొద్దిగా అటూ ఇటూగా వున్నది. ఉదాహరణకు గురజాడకు వివాహం నాటికి 23 సంవత్సరాల వయసు. బసవరాజు అప్పారావుగారికి 22వ ఏట వివాహమైంది. మహారాజా ఆనందగజపతికి 20వ ఏట వివాహమైంది. ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారికి 14వ ఏట వివాహమైంది. రావిచెట్టు రంగారావుగారికి 13వ ఏట వివాహమైంది. ఇలా వివరాలిస్తూపోతే వ్యాసం పెరుగుతుందనే భయంతో మానుతున్నాను. పెదతిరుమలాచార్యులు జన్మించేనాటికి అన్నమయ వయసు 31 సంవత్సరాల ప్రాంతాల వుండివుంటుందని భావించడమే సహేతుకం. ఈ విషయంలో శ్రీ చాంగటి వారి వాదనను వారేఇచ్చిన వివరాలు బలంచేకూర్చడంలేదు.

ఇక చిన తిరుమలాచార్యుల విషయం. రాగిరేకులమీద లభించిన సంకీర్తనలను పరిశీలిస్తే విషయం విదితమౌతుంది. అయనవి మొత్తం నాలుగుసంకీర్తనలు అన్నమయను ప్రస్తావించినవి ఉన్నాయి. నాలుగూ అన్నమయపట్ల మనుమనికి వున్న ప్రగాఢగౌరవాన్నీ చనువునీ తెలియ చేసేవే. రెండు మాత్రం విషయచర్చకి అవసరమైన వాటిని ఉదాహరిస్తున్నాను. వీటిలో మొదటిది అన్నమయను ఉద్దేశించి చెప్పినది.

"తాళ్ళ పాకన్న మాచార్యదైవమవు నీవుమాకు
వేళమె శ్రీహరిఁగనే వెరవానతిచ్చివి.
గురుడవు నీవెసుమ్మీకుమతి నైననాకు
సరవిబ్రహ్మోపదేశము సేసితి
పరమ బంధుఁడవైనా పరికింప నీవెసుమ్మీ
వరుసనే చెడకుండ వహించుకొంటివి."(28)

రెండోది శ్రీ వేంకటేశ్వరుని ఉద్దేశించి చెప్పినది—

"నీవు గలిగినఁ జాలు నిక్కము అన్నీఁగలవు
అవల మాయాచార్యుఁడానతిచ్చె నయ్యా
యెన్నడుఁ గలఁగ నట్టి హితుడ నీవె
పన్ని నట్టె వుండె నిచ్చ పంటా నీవె
నన్నుఁగాచే శ్రీ వేంకటనాథుడవని తాళ్ళపా
కన్నమయ్యగారె నాకు నానతిచ్చిరయ్యా" (29)

ఈ రెండు సంకీర్తనలూ అన్నమాచార్యులతో చినతిరుమలాచార్యులకున్న గట్టి పరిచయాన్ని సూచిస్తున్నాయి. ఈ సంకీర్తనలు అన్నమయ జీవిత కాలంలోనే రాసినట్లు శ్రీ చాంగటివారు భావించారు కాని అలా అనుకోవడానికి తగిన కారణాలు లేవు. కాకపోతే అన్నమయ దగ్గర చిన తిరుమలయ్య బ్రహ్మోపదేశం పొందడమేకాక ఇతర విషయాలను కూడా కొంత అధ్యయనం చేసి వుండాలి. పైన ఉదాహరించిన రెండు సంకీర్తనల్లో "మా యాచార్యుఁ డానతిచ్చెనయ్యా""మా గురుడిట్టె ఆనతిచ్చెనయ్యా" "దేశికుడె ఆనతిచ్చెనయ్యా" "తాళ్ళపాకన్నమయ్యగారె నాకు నానతిచ్చిరయ్యా" అంటూ నొక్కి చెప్పడంవల్ల తాతగారిదగ్గర మనవడికున్న చేరిక అర్థమౌతోంది. అన్నమయ నిర్యాణ సమయానికి చినతిరుమలయ్యకు పది సంవత్సరాల ప్రాయముంటే యింతగా నొక్కి చెప్పడానికి ఆ సాన్నిహిత్యం సరిపోదు. అందువల్ల శ్రీ ప్రభాకరశాస్త్రిగారిచ్చిన అంచనాలను సవరించవలసి వుంటుంది. పెద తిరుమలాచార్యుల శాసనాలు క్రీ. శ. 1517 నుంచి 1553 దాకా కనిపిస్తున్నాయి.(30) శ్రీ వేటూరి ఆనందమూర్తిగారు భావించినట్లు పెద తిరుమలయ్య జనన వత్సరం 1458 అయినట్లయితే ఆయన 95 ఏళ్ళ వయసుదాకా జీవించినట్లవుతుంది. లోకాచారం ప్రకారం పెద తిరుమలయ్యకు 20వ ఏట వివాహమైతే 1483 ప్రాంతాల చిన తిరుమలాచార్యులు జన్మించడానికి అవకాశం వుంది. అంటే అన్నమయ నిర్యాణ సమయానికి చిన తిరుమలయ్య వయసు ఇరవైసంవత్సరాలుండి వుండాలి.

చిన తిరుమలా చార్యులు రచించిన మరొక సంకీర్తనలో

"శిరసుకూఁకటుల రాఘవా, చిన్నారి పొన్నారి రాఘవా
గరిమ నా వయసున తాటకిఁజంపిన కౌసల్యా నందన రాఘవా"(31)

అని చెప్పుకోవడాన్ని బట్టి చిన్న వయసులోనే ఆయన సంకీర్తన రచనను ప్రారంభించినట్లు తెలుస్తోంది. శ్రీ. అర్చకం ఉదయగిరి శ్రీనివాసాచార్యులుగారు ఈ సంకీర్తన విషయమై చర్చించి "చిన తిరుమలయ్యాయు పదునైదు వత్సరములు గడచి పదునాఱవ సంవత్సరము

వచ్చిన పిదపనే కీర్తనలు రచించినాడని మనము విశ్వసింపవచ్చును." [32] అంటూ సహేతుకంగా నిర్ణయించారు. అంటే అన్నమయ జీవితకాలంలోనే చిన తిరుమలయ్య తాతగారి పర్యవేక్షణలోనే సంకీర్తన రచనను ప్రారంభించి వుండాలి. అందుకే ఆయనకు తాతగారంటే అంత అభిమానం. ఆ అభిమానంతోనే అన్నమయ సంకీర్తన లక్షణ గ్రంథాన్ని తెలుగు చేశాడు.

ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని చూస్తే డాక్టర్ ఆనంద మూర్తిగారు పెదతిరుమలాచార్యుల, చినతిరుమలాచార్యుల శాసనాల కాలాన్ని పరిగణనలోకి తీసుకుని చర్చించి నిర్ణయించిన కాలక్రమణిక సహేతుకమని చెప్పక తప్పదు.

ఇప్పటిదాకా అన్నమయ జననవత్సర విషయంలో వినూత్నమైన మార్గంలో చర్చించి శాస్త్రీయమైన పద్ధతిలో 1424 ను అన్నమయ జననవత్సరంగా ప్రతిపాదించినవారు డాక్టర్ ముట్నూరి సంగమేశంగారు.

డాక్టర్ సంగమేశంగారు తమ ఆలోచనలను ద్వివిధంగా కొనసాగించారు. వొకటి జ్యోతిషశాస్త్ర పద్ధతిని అన్నమయ జీవితాన్ని పరిశీలించి 1408, 1424 లలో తేదీలు నిర్ణయించి యేది అన్నమయ జీవిత సరళికి అనుకూలమైనదో నిరూపించడం. రెండోది కేవలం లౌకిక విషయాలను బట్టి అంటే చారిత్రక సంఘటనలను కూడా గ్రహించి కాలనిర్ణయం చేయడం. వారిమాటల్లోనే "అవతారికలోని వాక్యములతోపాటు అన్నమయ జీవితములో జరిగిన సంఘటనలు కూడా గ్రహించి, పై రెండిటిలో నేది జన్మతిథిగా గ్రహించినచో అప్పటి కతని కేర్పడు వయస్సు ఆయా సంఘటనల కనుగుణముగా నుండునో అది చూచుట యుక్తము." [33] అన్న శాస్త్రీయదృష్టిని ప్రదర్శించారు. వారి విపులమైన వ్యాసంలోని కొన్ని ముఖ్యాంశాలను పరిశీలించడం విజ్ఞుల విధి. వారి నిర్ణయం ప్రకారం—

"శా. శ. 1330 సర్వధారి సం॥ వైశాఖ శుద్ధ చతుర్దశీ బుధవారము [తేదీ 22.5-1408] నాడు సూర్యోదయ వేళకు విశాఖా నక్షత్రము వర్తించు చున్నది. అది అంతకు తొలినాడు, అనగా 21-5-1408 మంగళవారమునాడు ప్రారంభించి, అ రోజున అనగా బుధవారమునాడు రాత్రి 7-47 గంటలవరకున్నది."

"శా. శ. 1346 క్రోధి సం॥ వైశాఖ శుద్ధ చతుర్దశీ శుక్రవారము [25-5-1424] నాటిరాత్రి 9-22 గంటల వరకు విశాఖ నక్షత్ర మున్నది. అది అంతకు తొలినాడు అనగా 24-5-1424 గురువారము నాడు రాత్రి 7-40 గంటలకు ప్రారంభించినది." [34]

పై తేదీలలో ఉన్న గ్రహసంపదను సమీక్షించి శ్రీ సంగమేశంగారు రెండవది "మరింత మేలుగా నున్నది" అన్నారు. జ్యోతిశ్శాస్త్ర విషయాలతో సాధికారంగా చర్చించారు. అలాగే నిర్యాణ కాలాన్ని బట్టి కూడా జ్యోతిషశాస్త్రరీత్యా చూసి 1424 నాటి తేదీనే సరియైనదిగా నిర్ణయించారు.

ఇందులో 1408కి నిర్ణయించిన తేదీ శ్రీ సాధు సుబ్రహ్మణ్య శాస్త్రిగారూ, శ్రీ చాగంటివారూ యిచ్చిన తేదీలలో దేనితోనూ సంవదించకపోవడం గమనించవచ్చు.

డాక్టర్ ముట్నూరి వారు క్రీ. శ. 1484లో పురుషోత్తమ గజపతి దండెత్తివచ్చి ఉదయగిరిని ఆక్రమించి నరసింహరాయలతో సంధి చేసుకొని వెనక్కు వెళ్లడం పేర్కొని "ఈ సంధి వెనుక చాల రాజకీయములున్నవి" అంటూ నాటి రాజకీయ పరిస్థితులకుకూడా సరైన ప్రాముఖ్యాన్నిచ్చారు. ఆ సమయంలోనే అన్నమయకు గజపతుల సంపర్కమబ్బినట్లు శ్రీ జగన్నాథం వెళ్లివుండవచ్చునీ రెండు సంకీర్తనల ఆధారంగా భావించారు. అన్నమయ జగన్నాథప్రయాణం గురించి మొట్టమొదటగా గమనించి చెప్పింది వీరే. అవాటికి అన్నమయకు 1424 ప్రకారం 60 సంవత్సరముల కటునిటుగా ఉండవచ్చని చెపుతూ "లోకములో దేనికైననూ అపవాద స్వరూపులు కొందరుండకపోరు. కాని అన్నిటికిని ఒకేవ్యక్తి అపవాదముగా చూపట్టుట దుర్లభము" (35) అంటూ 1408 వాదాన్ని తిరస్కరించారు. అన్నమయ ఉత్తరదేశ యాత్రను చర్చించేముందు ఇతర చారిత్రక సంఘటనల ఆధారంగా కూడా అన్నమయ జన్మవత్సరాన్ని నిర్ణయించేందుకు వున్న అవకాశాలను పరిశీలించవలసి వుంది.

ఈ విషయంలో తాళ్లపాక చిన్నన్న విరచితమైన "తాళ్లపాక అన్నమాచార్య జీవిత చరిత్రము" లోని ముఖ్య జీవిత ఘట్టాలను దృష్టిలో పెట్టుకుని కాలనిర్ణయం చెయ్యాలి. ఈదృష్ట్యా చిన్నన్న చెప్పిన విషయాలను స్మరణకు తెచ్చుకోవడం అవసరం. చిన్నన్న తనకుటుంబంలో తెలిసిన విషయాలేకాక మరికొంత కుటుంబ సభ్యులు కాని పెద్దల ద్వారాకూడా సేకరించిన సమాచారంతోపాటు సంకీర్తనలలో వున్న విషయాలను కూడా సమన్వయించుకొని రచించినట్లు కనబడుతున్నది. దీనిని బట్టిచూస్తే మనకు తెలిసినంతలో బహుశా ఈయనే మన మొట్టమొదటి చరిత్ర పరిశోధకుడు. పరంపరగా వచ్చిన గాథలను కూడా ఈయన సేకరించి పెట్టాడు. అందువల్లనే

"ఆ వర కృత్యంబులన్నింటి లెక్క
గావింప నాకు శక్యమె నాఁటివార
లెఱుఁగుదు; రవి పెద్దలెఱుఁగింప వినుచు
నెఱిఁగిన కృతకృత్యులిపుడును గలరు
ఐన నందొక కొన్ని యనఘ మానసుల
వీనుల విందుగా వినుతింతునేను"(36)

అంటూ సవినయంగా చెప్పుకొన్నాడు. అయినా ఆయన అన్నమయ జీవించిన కాలానికి చాలాసన్నిహితుడు కావడంవలన చాలావివరాలనే ఆయన మనకు యిచ్చాడు.

ఐదవయేటనే ఉపనయనం జరిగి ఎనిమిదో యేటనే ఇంటినుంచి పారిపోయి తిరుపతి చేరుకున్నాడు అన్నమయ్య. అక్కడే వైష్ణవయతి వొకాయన పంచ సంస్కారాలు చేసి శ్రీవైష్ణవమిచ్చాడు. చిన్నన్న గ్రంథంలో ఇక్కడకొంత గ్రంథపాతం వున్నట్లు పరిష్కర్త సూచించారు. బహుశా అన్నమయ శాస్త్రాధ్యయనం గురించి కొంత సమాచారమూ, అన్నమయను వెదుకుకుంటూ తల్లిరావడమూ మొదలైన వివరాలుండి వుంటాయి. తల్లి పిలిచినప్పుడు అన్నమయ ఇంటికి రానన్నాడేమో, శ్రీ వేంకటేశ్వరుడు కలలో ప్రత్యక్షమై ఇంటికి వెళ్లమన్నట్టున్నాడు.

"జనని వాక్యము ద్రోయఁజనదు కుమార
పోయిరమ్మనిన నప్పుడు మేలుకాంచ
యా యచ్యుతునిఁగొనియాడి మ్రొక్కుచును
జననియు దాను నిచ్చలుఁదొంటి పురికిఁ
జనుదెంచి నిజనివాసముఁ బ్రవేశించె"[37]

అంటే రాగిరేకుల మీది అవతారికనుబట్టి అన్నమయకు స్వామి పదహారో యేట ప్రత్యక్షమైనట్లుండడం వలన తిరుపతిలోనే ఈ సాక్షాత్కారం జరిగివుండాలి. అప్పటికి అన్నమయ వయసు పదహారేండ్లన్నమాట. ఆ తరవాత "నెలజవ్వనము మేన నిగురొత్తు కొడుకు" వివాహ ప్రయత్నాలు చేశారు తలిదండ్రులు. తిరుమలమ్మ, అక్కలమ్మలను వొకసారే వివాహ మాడినట్లు చిన్నన్న రచన. ఆ తరవాత బహుశా అహోబలంలో శఠకోపముని దగ్గర "సకల వేదాంత పఠనంబు" చేశాడు. ఆ గురువు దగ్గర శుశ్రూష తరవాత "వాల్మీకి రామాయణమెల్ల రాగంబుతో నను రాగంబుతోడ" గానం చేయడమూ, విన్నవారెల్లా మెచ్చుకోవడమూ క్రమంగా కీర్తి వ్యాపించి "ఆ చేర్వ టంగుటూరను పురంబేలు రాచమూకలలోఁబరాక్రమశాలి... సాళువ నరసింహజనపాలుడు" స్వయంగావచ్చివిని తనఊరికి ఆహ్వానించడమూ జరిగాయి. టంగుటూరు కేశవమూర్తి కోవెల దగ్గర "సకల సంపదలతో సవరించియున్న పెద్దనగరిలో" నివాసం ఏర్పాటైంది. అక్కడ సాళువ నరసింహుడు అన్నమయను హితునిగా, బంధువుగా, గురువుగా గౌరవిస్తూ, రాజకీయంగా బలం పెంచుకుంటూ యుద్ధాలు గెలుస్తూ తన కొత్తరాజధాని పెనుగొండకు పిలిపించుకొని తన నగరుకు దగ్గరే వున్న పెద్ద నగరులో అన్నమయకు వసతి కల్పించి ప్రతి దినమూ సంకీర్తనలు వింటూ అనేకంగా కానుకలు సమర్పిస్తూవచ్చాడు. అప్పటికే అన్నమయకు శిష్యబలగం కూడా బాగానేవుంది. వొకనాడు సభలో "ఏ మొకొ చిగురు టధరమున ఎడనెడ కస్తురినిండెను" అన్న సంకీర్తనను విని తనమీద కూడా శృంగార సంకీర్తనను పాడమనడంతో సాళువ నరసింహుడికీ అన్నమయకూ తాత్కాలికంగా స్నేహం చెడింది. క్లుప్తంగా ఇదీ చిన్నన్న మనకు అందించిన అన్నమయ చరిత్ర.

ఇక మనం చూడవలసింది అన్నమయ జీవితంలోనే కాక నాటి దేశ చరిత్రలోకూడా అసాధారణ పాత్రను నిర్వహించిన నరసింహ రాయల వృత్తాంతం. ఆనాడు విజయనగర సామ్రాజ్యపు మనుగడ సాళువ వంశీయుల మీద ఆధారపడి సాగింది. సాళువ వంశానికి నాయకుడుగా నిలిచి నరసింహుడు సాగించిన జీవితయాత్రలో అన్నమయకు సంబంధించినంతవరకు ఘట్టాలను తీసుకొని పరిశీలించడం అనివార్యమౌతోంది.

సాళువ నరసింహరాయలు క్రీ. శ. 1428లో జన్మించి వుండవచ్చని డాక్టర్. వి. శ్రీరామశర్మగారు అభిప్రాయ పడ్డారు.[38] ఇది ఖచ్చితమైన నిర్ణయం కాకపోవచ్చుగాని కొంచెం అటూ యిటూగా సత్యానికి దగ్గరగావుందని మనం భావించవచ్చు. నరసింహుడి మొదటి శాసనం క్రీ. శ. 1453 నాటిది లభిస్తున్నది.[39] అంటే అంతకు ముందు సంవత్సరం 1452 నాటికి నరసింహుడు తండ్రి రాజ్యానికి [చంద్రగిరి?] వారసుడై సింహాసనమెక్కి వుండాలి. అప్పటికి అతని వయసు 24 సంవత్సరాల ప్రాంతాన వుండి వుంటుంది. మనకు చిన్నన్న యిచ్చిన సమాచారం ప్రకారం నరసింహుని మొదటి రాజధాని టంగుటూరు. తండ్రి జీవించివుండగా టంగుటూరులో చిన్నసామంతునిగా వుండివుండాలి. నేటి ప్రకాశం జిల్లాలోని టంగుటూరును శ్రీ వేటూరి ఆనందమూర్తిగారు "తాళ్లపాకవారు తిరిగిన ప్రదేశములు" అనే శీర్షికతో[40] ప్రకటించిన పటంలో చూపారు. ఇది సరికాదనుకుంటాను. కడపజిల్లాలో రెండు టంగుటూరులున్నాయి.[41] వొకటి ప్రొద్దుటూరు తాలూకాలోనూ, రెండోది రాజంపేట తాలూకాలోనూ వున్నాయి. చిన్నన్న "ఆ చేర్వ టంగుటూరను పురం" అన్నాడు కాబట్టి పొత్తపినాటిలోని [రాజంపేట తాలూకా] టంగుటూరే అయివుండాలి

ఈ టంగుటూరు తాళ్లపాకకు సమీపానఉంది. ఇక్కడ కాకతీయ ప్రభువు ప్రతాపరుద్రుడి క్రీ. శ. 1315 నాటి శాసనమూ, మొదటి దేవరాయలనాటి శాసనమూ లభిస్తున్నాయి.[42] రాజంపేట తాలూకా నందలూరు గ్రామాన లభించిన రెండవ దేవరాయల కాలంనాటి [క్రీ. శ. 1433] శాసనం[43] కూడా తాళ్లపాకకు చేరువగావున్న ఈ టంగుటూరునే పేర్కొంటున్నది. పొత్తపినాటికి ఇది ప్రాచీనమైన ప్రధాన కేంద్రంగా కనిపిస్తోంది. ఇక్కడే ఆది కేశవస్వామి ఆలయం కూడా వుంది. నరసింహుడి తొలి రాజధాని ఇదేననడంలో సందేహ ముండదు. ఈ ఆలయం దగ్గరే "సకల సంపదలతో సవరించియున్న పెద్దనగరి"లో అన్నమయకు నివాసం ఏర్పాటైనట్లు చిన్నన్న కథనం. ఇది పొత్తపినాటిలోది కనక యువకుడైన నరసింహుడు తన తండ్రి జీవితకాలంలోనే టంగుటూరు నాయంకరానికి అధిపతిగా వుండివుంటాడు. చిన్నన్న మాటల్లో అప్పటికి నరసింహుడు "రాచమూకలలో పరాక్రమ శాలి" మాత్రమే. ఆనాటికి శఠకోపముని దగ్గర "సకల వేదాంత పఠనంబు" పూర్తిచేసి వాల్మీకి రామాయణమెల్ల "రాగంబుతోనను రాగంబుతోడ" గానం చెయ్యడం వలన నరసింహుడి భక్తి గౌరవాలను అందుకున్నాడు. అన్నమయ "ప్రవిమల ద్విపద ప్రబంధ రూపమున నవముగా రామాయణము" రచించివున్నట్టు చిన్నన్న చెప్పడాన్నిబట్టి ఆ ద్విపద రామాయణం ఈ కాలాన రచించినదై వుండాలి. అన్నమయ రామాయణ సంకీర్తనలు కూడా కొన్ని లభిస్తున్నాయి. రామాయణం ద్విపద చదువుతూ మధ్యమధ్య సంకీర్తనలు పాడుతూండేవాడని ఊహించవచ్చు. సాళువ నరసింహరాయలూ, ఇమ్మడి నరసింహరాయల శాసనాల చివర "శ్రీరామచంద్ర" నామస్మరణ కనిపిస్తోంది.[44] సంగమ వంశీయుల కాలంలో "శ్రీ విరూపాక్ష" నామస్మరణ వుండేది. ఇందువల్ల సాళువ నరసింహుడూ, అతని సంతతీ రామచంద్రభక్తులైనట్లు భావిస్తే రామాయణగానంవల్ల అన్నమయకూ నరసింహునికి స్నేహమూ, గురుశిష్య సంబంధమూ యేర్పడివుండవచ్చనడంలో విప్రతిపత్తి యేమీవుండదు.

క్రీ. శ. 1448 ప్రాంతంలో నరసింహుడు టంగుటూరులో వున్నాడనీ క్రీ శ. 1452 ప్రాంతంలో తండ్రిరాజ్యమైన చంద్రగిరికి ప్రభువైనాడనీ అనుకుంటే అన్నమయ 1408 లో జన్మించివుంటే టంగుటూరుకు చేరేసమయానికి అన్నమయకు నలభై సంవత్సరాల వయసుండాలి. నలభయ్యోయేటిదాకా అన్నమయ గుర్తింపు లేకుండా వున్నాడన్న విషయం అసమంజసంగా తోచకతప్పదు. 1424 ను జన్మవత్సరంగా స్వీకరిస్తే ఇరవైనాలుగు సంవత్సరాల వయసుంటుంది.

పెనుగొండలో అన్నమయను తనమీద శృంగార సంకీర్తనను పాడమనికోరినపుడు అన్నమయ తిరస్కరించడంతో కోపోద్రిక్తుడైన నరసింహరాయలు పలికిన మాటల్లో "తన బాల్యసఖ్యంబు దలఁచి సంపదల దనయంత వానిఁగా దనరఁ జేసితిని" అన్నాడు. లోకవ్యవహారంలో ఒక వృద్ధుడితో వొక యువకుడి చిరకాల సఖ్యాన్ని "బాల్య సఖ్యంబు"గా చెప్పుకోవడం జరగదు. అదీకాక అన్నమయ శ్రీ వేంకటేశ్వర కృపతో సంకెళ్ళను విడిపించుకొన్నప్పుడు పశ్చాత్తాప పడుతూ నరసింహుడు "నను నీవు పిన్నట నాఁటనుండియుసుబనుపడ బంటుగాఁ బనిగొంటి గనుక" క్షమించమని అన్నాడు. ఇక్కడకూడా వారి బాల్య సఖ్యం ప్రస్తావనకు రావడం వలన వారిరువురూ యించుమించు సమవయస్కులని భావించక తప్పదు. డా॥ శ్రీరామశర్మగారు భావించినట్లు నరసింహుని జన్మవత్సరం క్రీ. శ. 1428 గా తీసుకుంటే, అన్నమయ జన్మవత్సరం 1424గా తీసుకుంటే యిరువురి వయసులో తేడా నాలుగేళ్లుంటుంది. అప్పుడే "బాల్య సఖ్యంబు" అన్నమాట సార్థకమౌతుంది. నరసింహునితో అన్నమయ టంగుటూరు వెళ్ళేనాటికి అన్నమయకు 24-25 సంవత్సరాల వయసుండి వుండాలి.

తరువాత పెనుగొండను రాజధానిగా చేసుకొన్న నరసింహుడు-

"బలియుడై పరిపంథి బలముల నడఁచి
నలిరేగి సింహాసనంబు చేకొనుచు
తన రాజధానియై తనరారు పసిడి-
పెనుగొండ గతినుండు పెనుగొండ నుండి"[45]

కబురుపంపి అన్నమయను అక్కడికి పిలిపించుకొన్నాడు. ఇందులో "బలియుడై పరిపంథి బలముల నడఁచి" అనడం ద్వారా నరసింహరాయల యుద్ధ యాత్రలను చిన్నన్న సూచిస్తున్నాడు. అంతేకాక టంగుటూరును విడిచిపెట్టిన తరవాత పెనుగొండకు పిలిపించుకొనేవరకు కొంతకాలం గడిచినట్లుగా కూడా సూచనవుంది. ఈ దృష్టితో నరసింహుని చరిత్రను కొంత పరిశీలించాలి.

క్రీ. శ. 1459 నాటి రెండు శాసనాలవల్ల విజయనగర చక్రవర్తి మల్లికార్జునరాయలు తిమ్మదండనాధుని వెంటబెట్టుకుని సాళువ నరసింహరాయలతో చర్చలకు పెనుగొండకు వచ్చినట్లు తెలుస్తోంది.[46] ఆనాటి రాజకీయ పరిస్థితులను గమనిస్తే ఈ రాకలోని ఆంతర్యం బోధపడుతుంది. కపిలేశ్వర గజపతి కొడుకు హంవీరుడు ఓరుగల్లుపై దండెత్తి ఓరుగల్లును ఆక్రమించాడు.[47] ఓఢ్ర సైన్యాల విజయాలను గమనించి సామ్రాజ్య రక్షణకు అవసరమైన సైనిక సన్నాహాలను చేసేందుకు సాళువ నరసింహరాయలతో చర్చలకు మల్లికార్జున రాయలు వచ్చినట్లు భావించవచ్చు. కాని ఈ సన్నాహాలన్నీ విఫలమైనట్లు కనిపిస్తోంది. క్రీ. శ. 1460లో ఉదయగిరి దుర్గం ఓఢ్ర సైన్యాల ధాటికి నిలవలేక లొంగి

పోయింది. 1464 నాటికి చంద్రగిరి, కాంచీపురం, పడైవీడు, వలుదిలంపట్టి - సావిడి, తిరువారూరు, తిరుచునాపల్లి ఒరియా పాలన కిందకు వెళ్ళిపోయాయి[48] దాదాపు నాలుగు సంవత్సరాలపాటు అదృష్టం చేతులు మారుతూవచ్చింది. నరసింహరాయలు మళ్ళీ 1466 నాటికి గాని గజపతులాక్రమించిన ప్రాంతాలను పూర్తిగా స్వాధీన పరుచుకోలేక పోయాడు. 1467 నాటికి చంద్రగిరికూడా నరసింహునికి స్వాధీనమైంది. ఈ విజయ పరంపరతో నరసింహుని ప్రతిష్ట బాగా పెరిగింది. "బలియుడై పరిపంధి బలముల నడఁచి" అని చిన్నన్న అనడంలో ఈ విషయమే వ్యక్తమౌతున్నది. క్రీ. శ. 1467లో మల్లికార్జునరాయలు మరణించాడు[49] ఆ మరుసంవత్సరం 1468లో కపిలేశ్వర గజపతి మరణించాడు[50] మల్లికార్జునరాయల తర్వాత సింహాసనానికి వచ్చిన యిమ్మడి విరూపాక్షరాయలు అలసుడూ విషయ లోలుడూ అని న్యూనిజ్ కథనం[51] అప్పటికే చెంగల్పట్టు, ఉత్తర ఆర్కాటు, దక్షిణ ఆర్కాటు, చిత్తూరు, శ్రీశైలం, తూర్పు మైసూరు మొదలైన ప్రాంతాలలో సాళువ వంశీయులే విజయనగర సామంతులుగా పరిపాలిస్తున్నారు. వారి నాయకుడు నరసింహ రాయలు. విజయనగర సామ్రాజ్యానికి ఆయువుపట్టులాంటి భాగమంతా అతని అదుపు ఆజ్ఞలలో వుండి మకుటంలేని చక్రవర్తిగావున్న నరసింహ రాయలు ఈ సమయంలోనే అన్నమయను పెనుగొండకు పిలిపించుకొని వుండాలి.

పెనుగొండలో నరసింహుడు ఎంతకాలం వున్నాడో చెప్పడానికి స్పష్టమైన ఆధారాలు లేవు. 1458లో పెనుగొండకు చేరినప్పటి నుంచీ 1478లో విరూపాక్షరాయలహత్య జరిగి రాజకీయ అనిశ్చిత పరిస్థితి యేర్పడిన దాకా పెనుగొండ అతని కార్యక్షేత్రమైవుండవచ్చు. అంటేఇరవై సంవత్సరాలక్కడ నుండి పరిపాలించి వుండాలి. అయితే తరచూ యుద్ధాలలో పాల్గొనడంవల్ల నరసింహుడు ఇరవై సంవత్సరాలలో ఎంతోకాలం కుదురుగా పెనుగొండలోనే వుండడానికి అవకాశం లభించి వుండదు. కాని అన్నమయ పెనుగొండ చేరిన తరువాత

"అను దినంబును వేంకటాద్రీశుమీఁది
వినుతులు వేడుక వినుచుండి యుండె
నరనాథుడు" [52]

అని చిన్నన్న అన్నాడు కనక ఏ కొద్ది సంవత్సరాలో అక్కడ వున్నా తనతోపాటు అన్నమయ్యను కూడా వెంట తీసుకొని వెళుతూ సంకీర్తనలు వింటూ వుండివుండాలి. అన్నమయ కూడా "ప్రతివత్సరంబు తప్పక వృషభాద్రిపతికిఁ గావించు నా బ్రహ్మోత్సవములు సేవించు కొనుచు"[53]వుండివుంటాడు. వివిధ క్షేత్రాలలో వున్న దేవతామూర్తులను కీర్తించినందువల్ల, విజయనగరంలో వున్న దేవతా మూర్తులను కీర్తించడంవల్లా పర్యటనలు కూడా తరచూ చేస్తూండేవాడని విదితమౌతోంది. ఇరవై సంవత్సరాలు నరసింహుడు పెనుగొండకు ప్రభువుగా వున్నకాలంలో అన్నమయకు కూడా పెనుగొండకేంద్రస్థానంగా వుండి వుండవచ్చు. అన్నమయ జన్మవత్సరాన్ని 1408 గా తీసుకుంటే ఆయన తన ఏభయ్యో ఏటనుంచి డెబ్బైఏళ్ల వయసుదాకా అక్కడ వుంటి వుండాలి. 1424 ను తీసుకుంటే ముప్పైనాలుగేళ్ల వయసు నుంచి యాభై నాలుగేళ్ల వయసుదాకా వుంటుంది.

తండ్రి కపిలేంద్రుడు జీవించివుండగానే పురుషోత్తముడు గజపతి రాజ్యానికి క్రీ. శ. 1466 లో పట్టాభిషిక్తుడైనాడు. [54] కాని ఆరుసంవత్సరాలలోనే సోదరుడైన హంవీరుడు బహ్మనీసుల్తాన్ సహాయంతో పురుషోత్తముణ్ణి రాజ్యభ్రష్టుణ్ణి చేశాడు. క్రీ. శ. 1472 నుంచి 1476 దాకా నాలుగు సంవత్సరాలపాటు పురుషోత్తమ గజపతి శాసనాలు కానరావడం లేదు. తన సహాయానికి ప్రతిఫలంగా బహ్మనీ సుల్తాను గజపతి సామ్రాజ్యంలోని దక్షిణ ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నాడు. సాళువ నరసింహుడు 1472 ప్రాంతాలలో నేటి నిజామాబాదు జిల్లాలోని బాలకొండ దుర్గాన్ని దండువెళ్ళి ముట్టడించాడు. [55] బహ్మనీ సైన్యాలకు సహాయంగా హంవీరుడి సైన్యాలు వచ్చి చేరాయి. చివరకు నరసింహుడు బహమనీ గజపతుల సైన్యాలను వోడించి బాలకొండ దుర్గాన్ని పట్టుకొన్నాడు. నరసింహ రాయల దండయాత్రకు కారణం రాజ్యభ్రష్టుడైన పురుషోత్తమ గజపతి నరసింహరాయలను సహాయం కోరడమే కారణమై వుండాలని శ్రీరామ శర్మగారు భావించడం సమంజసమే. [56]

సరిగా అదేకాలానికి క్రీ. శ. 1472-75ల మధ్య దక్కనులో భీకరమైనక్షామం సంభవించింది. రెండు సంవత్సరాలపాటు వర్షాలులేవు. బావులు ఎండిపోయాయి. రైతులు యితర ప్రాంతాలకు వలస పోయారు. అనేక మంది మరణించారు. నగరాలు నిర్జనమైనాయి. తిరిగి వర్షాలు కురిసేనాటికి వ్యవసాయానికి రైతులేలేకుండా పోయారు. (57) బహ్మనీ సుల్తాన్ మహమ్మద్‌షా క్షామ పరిస్థితులవలన ఓఢ్ర రాజ్యవ్యవహారాల్లో జోక్యం చేసుకోలేక పోయాడు. ఈ బలహీనతను వినియోగించుకొని పురుషోత్తముడు హంవీరుణ్ణి వోడించి తన సింహాసనాన్ని తిరిగి సంపాదించుకొన్నాడు. నరసింహుడు బాలకొండ దుర్గాన్ని పట్టుకోవడంకూడా పురుషోత్తమ గజపతికి అనుకూలమైంది. అందువల్ల పురుషోత్తమ గజపతి నరసింహరాయల మధ్య సయోధ్య కుదిరి వుండవచ్చని భావించడానికి అవకాశం ఉంది (58). ఈ విషయాలనన్నిటినీ దృష్టిలో పెట్టుకుని అన్నమయ సంకీర్తనలను పరిశీలించి, శ్రీ ముట్నూరి వారు ప్రస్తావించిన అన్నమయ ఉత్తరదేశ యాత్రల కాలనిర్ణయం చేయవచ్చు.

క్రీ.శ. 1472-75 మధ్య సంభవించిన క్షామాన్ని గురించి ప్రస్తావనవున్న అన్నమయ సంకీర్తన వొకటి కనిపిస్తోంది.

కడు నజ్ఞానపు కరవు కాలమిదె
వెడల ద్రొబ్బి మా వెరపు దీర్చవే
పాపపు పసురము బందెలు మేయ..
పోపుల పుణ్యము పొలివోయె
శ్రీపతి నీకే చేయి చాచెదము
యేపున మమ్మిక నీడేర్చవే

యిలఁగలియుగ మను యెండలు గాయఁగ
చెలగి ధర్మమను చెరువింకె
పొలసి యీ కృపాంబుధి చేరితిమిదె
తెలిసి నా దాహము తీర్చవె

పడిగొని మనసిజ వాయువు విసరగ
పొడవగు నెఱకలు పుటమెగసె
బడి శ్రీ వేంకటపతి నీశరణము
విడువక చొచ్చితి వెసగావగదే.(59)

ఈ సంకీర్తనలో ఆనాటి కరవు పరిస్థితులు కళ్లకు కట్టేటట్లుగా ప్రత్యక్షమౌతున్నాయి. బందెలు పదాన్ని బందులుగా గ్రహిస్తే ఆ పదానికి రాబందులని ప్రౌఢ్యం అర్థం చెపుతోంది. నెఱకలు అంటే నెరియలు నేల బీటలువారడం. నాటి పరిస్థితిని చక్కగా వర్ణించటమే కాక ఈ సంకీర్తనలో ఆధ్యాత్మిక వాసనలను గుబాళింప చేయడం అన్నమయ ప్రతిభకు నిదర్శనం. ఈ సంకీర్తనకు చేసిన కాలనిర్ణయం (1472-75) కాదనరానిది. మరొక సంకీర్తనలో

"చింతల చిగురులె చిచ్చులట
యింతటిలో నిఁక నేలాగే
చక్కని మన్మథ సంవత్సరంబున
చుక్కలరాజే సూరియుఁడై
యెక్కువ ర్రాతుల యెండగాయునట
యెక్కడిదిఁక బ్రతుకేలాగే
.....................
కుంకుమ గుబ్బల కుంభరాశికిని
వంకల చంద్రుఁడు వచ్చెనట
వేంకటరమణుఁడు వెలఁదిఁగూడెనట
యింక నీ తమక మేలాగే(60)

ఈ సంకీర్తన మొదటి చరణంలో ప్రస్తావనకు వచ్చిన మన్మధ నామ సంవత్సరం క్రీ.శ. 1475 లో వచ్చింది. కుంభరాశికి చంద్రుడు రావడం మొదలైన విషయాలు చూస్తే ఇది శృంగార సంకీర్తనమే అయినా జ్యోతిష విషయాలేవో ఈ సంకీర్తనలో దాగివున్నట్టు అనుమానం కలుగుతోంది.

క్రీ.శ. 1476-77 మధ్యలో నరసింహరాయలు అంతకు ముందే మచిలీపట్టణాన్ని వశపరచుకొని రాజమండ్రిని పట్టుకునే ఉద్దేశంతో గోదావరి వొడ్డునదండు విడిశాడు. అదే సమయానికి పురుషోత్తమ గజపతి కూడా అక్కడకు చేరుకున్నాడు. వారిరువురూ సంప్రదింపుల్లో ఉండగానే బహ్మనీ సైన్యం సుల్తాన్ మహమ్మద్‌షా నాయకత్వంలో హుటాహుటిని అక్కడకు చేరుకోవడంతో నరసింహరాయలు యుద్ధం చెయ్యకుండానే వెనుదిరిగాడు. పురుషోత్తమ గజపతికూడా తన దేశం వైపు తరలి పోయాడు. కానీ బహ్మనీసైన్యం పురుషోత్తముడిని వెంటాడి చివరకు వోడించి కప్పం పుచ్చుకొని మళ్ళీ బహ్మనీ రాజ్య ప్రాంతాల్లో కలుగచేసుకోననే మాటతీసుకుని వెనుదిరిగింది.(61) ఈవృత్తాంతాన్ని పరిశీలిస్తే నరసింహరాయలూ పురుషోత్తమ గజపతీ పరస్పరావగాహన తోటే గోదావరి వొడ్డున కలుసుకొన్నట్లు భావించవలసి వస్తోంది. ఇద్దరూ కలిసి కృష్ణానదీ ప్రాంతాల్లోబహ్మనీ పాలనను తుద ముట్టించాలని ప్రణాళిక వేసుకొన్నట్లు కనిపిస్తున్నది. అయితే ఏకారణాల వల్ల ఈ ప్రయత్నం విఫలమైందీ తెలియటంలేదు.

డాక్టర్ సంగమేశంగారు 1484 లో పురుషోత్తమ గజపతి దండెత్తివచ్చి ఉదయగిరిని పట్టుకొని నరసింహరాయలతో సంధిచేసుకొని వెనుకకు మరలినట్లూ, నరసింహరాయల దృష్టి విజయ నగర సింహాసనంమీద ఉండడం వల్ల గజపతులతో వైరం వెన్నుపోటు వంటిది కనుక కొంత భూభాగాన్నిచ్చి సంధిచేసుకొన్నట్లూ, ఆ సందర్భంలోనే అన్నమయకు గజపతుల సంపర్కం మబ్బినట్లూ భావించారు.(62) కాని యిది సరికాదేమో. డాక్టర్॥ ఆర్. సుబ్రహ్మణ్యంగారు క్రీ.శ. 1489 నాటి పోతవరం తామ్ర శాసనం గుండ్ల కమ్మనదిని గజపతి రాజ్యానికి దక్షిణ సరిహద్దుగా పేర్కొని వుండటం వల్లనూ, ఉదయగిరి దుర్గం గుండ్ల కమ్మకు బాగా దూరంగా దక్షిణాన ఉండటం వల్లనూ ఆనాటికి ఉదయగిరి గజపతి రాజ్యంలో భాగంకాదనీ, నరసింహ రాయలు క్రీ.శ. 1490-91 ప్రాంతాల మరణించడం వల్ల ఆకాలంలో ఉదయగిరిపై దండయాత్ర జరిగి ఉంటుందనీ సహేతుకంగా నిర్ణయించారు. (63) అందువల్ల శ్రీ సంగమేశంగారు భావించినట్లు 1484లో ఉదయగిరి గజపతులకు స్వాధీనమైన దనేందుకు ఆధారంలేదు. అయితే వారు అన్నమయ జగన్నాథ క్షేత్రం వెళ్ళిరావడానికి గల అవకాశాన్ని గురించి చర్చించారుకనక ఆ అవకాశం మరొకసమయంలో లభించివుండడానికి ఆస్కారముంది. గజపతితోస్నేహం పటిష్టం చేసు

కోవడానికి మార్గంగా నరసింహుడు అన్నమయను యాత్రమిషతో జగన్నాథ క్షేత్రానికి పంపివుండవచ్చు. ఆ తరవాతనే 1476-77 ప్రాంతాలలో గోదావరి తీరాన పురుషోత్తమ నరసింహుల సమావేశం తటస్థించింది అనుకోవడంలో ఇబ్బంది వుండదు. అన్నమయ సంకీర్తనలలో

"త్వమేవ శరణం త్వమేవ శరణం
కమలోదర శ్రీ జగన్నాథా
బలభద్రానుజ పరమ పురుష దుగ్ధ
జలధి విహార కుంజవరద
సులభ సుభద్రా సుముఖసురేశ్వర
కలిదోషహరణ జగన్నాథా"[64]

"అరుదరుదు నీమహిమ అతిమానుషము చూడ
పురుషోత్తమను దివ్యపుర జగన్నాథా" [65]

అన్న సంకీర్తనలను శ్రీ సంగమేశంగారు ఉదాహరించి అన్నమాచార్యుడచ్చటి భక్తులతో కలిసి, వారికిని తనకును సమానముగనే ప్రీతిపాత్రమైన గీత గోవిందమునునుకరించుచూ, జయదేవుని తరంగ శైలిలోనే, విశిష్టాద్వైతినని మడికట్టుకొనినట్లుండక, రాధా మాధవ లీలా విలాసము లెత్తుకొని, అచటి వారికి తెలియునట్లు సంస్కృత భాషలో సంకీర్తనలు రచించి వినిపించి నట్లున్నది. "రాధా మాధవ రతి చరిత మిదం" [3-664] అనియు "అహోసురత విహారోయం" [12-78] అనియు వ్రాసిన కీర్తన లీతీరున వెలసిన వనిపించును" అన్నారు.[66] గజపతుల రాజ్యంలో ఓఢ్ర, వంగ, తెలుగు భాషా ప్రాంతాలున్నా రాజాదరణపొందిన భాష సంస్కృతమే. పైగా వారు సంస్కృతాన్ని ఆదరించడంలో దేశభాషలను నిర్లక్ష్యం చేశారుకూడా.[67]

"ఈ యాత్రలో అన్నమయ దారిలోగల సింహాచలము, శ్రీకూర్మము వంటి క్షేత్రములు కూడ సందర్శించి, అచ్చటి వేల్పులను కూడ కీర్తించెనో లేక ఆ కీర్తనలు నేడు మృగ్యమైనవో తెలియదు" [68] అన్నారు. కాని సింహాచల ప్రస్తావన వున్న సంకీర్తనలు రెండుకనిపిస్తున్నాయి. నవనారసింహులను కీర్తించే సంకీర్తనలో అహోబల నారసింహ, జ్వాలా నారసింహ, యోగానంద నారసింహ, కానుగుమాని నారసింహ, మట్టెమళ్ల నారసింహ, భార్గోటి నారసింహ ప్రహ్లాద నారసింహ, లక్ష్మీనారసింహ రూపాలను పేర్కొని చివర "వదన భయానకపు వరాహ నారసింహ" అంటూ పేర్కొన్నారు. నాకు తెలిసినంతలో వరాహనరసింహమూర్తి వొక్క సింహాచలంలో తప్ప మరెక్కడా కానరావడంలేదు. పై సంకీర్తన [69]లో పేర్కొన్న అహోబలం, కానుగుమాను, మట్టెమళ్ల, భార్గవం మొదలైనవన్నీ క్షేత్రనామాలు. వ్యాసవిస్తర భీతివల్ల ఈ చర్చను ఇంతటితో ముగించి మరొక సంకీర్తనను గమనించవలసి వుంది. ఈ సంకీర్తనలో ఉత్తరదేశ క్షేత్రాలను పేర్కొనడంవల్ల అన్నమయ ఈ క్షేత్రాలనూ దర్శించి వుండవచ్చునేమో. ఈ సంకీర్తనలోని సింహాద్రి సింహాచలమే.

"అన్నిచోట్లఁ బరమాత్మ నీవు
యిన్నిరూపుల భ్రమయింతువుగా
పాల జలనిధినుండి, బదరీ వనాననుండి
ఆలయమై గయలోఁ బ్రయాగనుండి
భూలోకనిధివై పురుషోత్తమాననుండి
వేల సంఖ్యల రూపై విచ్చేతుగా

వుత్తర మధురలో నయోధ్య లోపలనుండి
సత్తైన నంద్రవజానునుండి
చిత్తగించి పంచవటి సింహాద్రి లోననుండి
వత్తుగా లోకములు పావనము సేయఁగను

కైవల్యముననుండి కమలజ లోకాన
మోవఁగ శ్రీరంగముననుండి
యీవల నావలనుండి యీ వేంకటాద్రిపై
నీవే నీవే వచ్చి నెలకొంటిగా" [70]

పురుషోత్తమ పురాన్ని చూసిన అన్నమయకు పై క్షేత్రాలేకాక దారిలోని సింహాచలం దర్శించడం కష్టంకాదు. ఇంకా అచ్చు కావలసిన సంకీర్తనలూ, అచ్చయికూడా సాహితీలోకానికి లభించని సంపుటులూ అన్నీ వెదకితే శ్రీకూర్మం, సింహాచలంవంటి క్షేత్రాలమీది సంకీర్తనలు లభ్యం కావచ్చునేమో. ఓఢ్రరాజ్య పర్యటన వల్ల ఆయనకి కొంత ఓఢ్రభాష కూడా పట్టుబడి వుంటుంది. అందువల్లనే కావచ్చు ఆయన

"వాగినొడ్డె భాషలాడి వొడ్డెవాఁడనైతిని
తెగి తెలుఁగాడ నేర్చి తెలుఁగువాఁడనైతి
అగడై శ్రీ వేంకటేశ అన్నియు విడిచి నేను
తగు నీ దాసుఁడనై దాసరి నేనైతి" [71]

అని చెప్పుకున్నాడు. ఈ సంకీర్తనలో ఓఢ్రభాష నేర్చినట్టుచెప్పడంలో బాధపడుతూ చెప్పినట్లుకాక యథాలాపంగా చెప్పినట్లు కనిపిస్తూండడం వలన తనకు తానుగానే ఆ భాషను నేర్చుకుని వుండాలి.

చినతిరుమలాచార్యుని కుమారుడైన తిరువేంగళప్ప రచించిన అమరుకానికి వ్యాఖ్య అయిన గురుబాల ప్రబోధిక కృత్యవ తరణిక

లోనూ, కావ్యప్రకాశికకు "సుధానిధి" [72] పేరుతో రచించిన వ్యాఖ్యా గ్రంథంలో కూడా అన్నమయను ప్రస్తావించిన సందర్భంలో

"ఆ సేదా సేతు నీహారగిరి విఖ్యాత నామవాన్,
తాళపాకన్నయా చార్యః వేంకటేశవరాంచితః"

అంటూ స్మరించాడు. దేశంతో విస్తృతంగా పర్యటించి సంస్కృతం లోనూ సంకీర్తనలను పాడిన అన్నమయను

"ఆ సేదా సేతు నీహారగిరి విఖ్యాత నామవాన్" అంటూ ప్రస్తుతించడంలో అతిశయోక్తిలేదని భావిస్తున్నాను.

ఇంతకుముందు అనుకొన్నట్లు ఈ యాత్ర క్రీ.శ. 1476 ప్రాంతాలలో జరిగినట్లయితే 1424 జన్మవత్సరమైతే అన్నమయకు 52 సంవత్సరాల ప్రాంతపు వయసు ఉండాలి. ఆ రోజులలో దృఢమైన ఆరోగ్యమూ, తగినంత మందీ మార్బలమూ వుంటేనే కాని దూర ప్రయాణాలు చేయడం సులభంకాదు. ఇందుకు నిదర్శనంగా ఏనుగుల వీరాస్వామిగారి కాశీయాత్రను తీసుకోవచ్చును, సాళువ నరసింహ రాయల సహాయసహకారాలుంటేనేకాని ఈ దీర్ఘప్రయాణం సాగి వుండదు. అన్నమయ సామాన్యవ్యక్తికాడు. సాళువ నరసింహునికి పూజనీయుడైన వ్యక్తి. అటువంటి వ్యక్తి విషయంలో నరసింహ రాయలు అన్ని జాగ్రతలూ తీసుకునే వుండాలి. నరస్తుతి విముఖుడైన అన్నమయ రాజాధిరాజులతో సఖ్యం చేసినప్పుడు కూడా ఆత్మ గౌరవానికి భంగం లేకుండానే సఖ్యం చేశాడు. అన్నమయ నరసింహుల మధ్య వివాదం తలెత్తినా వారి స్నేహానికి భంగం కలగలేదు. ఈ విషయం

"అది మొదలారాజు నలలేని కూర్మి
సభయుడై యన్నమాచార్య శేషాద్రి-
విభునిగా నాత్మ భావింపుచు నుండె"[73]

అని చిన్నన్న చెప్పడం వలన రుజువౌతున్నది. అందువలన రాచ కార్యమూ, పుణ్యక్షేత్ర దర్శనమూ కలిసి వచ్చేటట్లు అన్నమయకు ప్రయాణ సౌకర్యాలను యేర్పాటుచేయడంలో నరసింహుడు గురుభావం తోనే సహాయపడి వుంటాడు.

"సహజ వైష్ణవ భక్తి సలిపెడు వాని-
సహవాసమైన దోసము లేదటంచు..."[74]

అనుకొనేవాడే కనక అన్నమయ గజపతితో స్నేహం చెయ్యడంలో వెన కాడివుండడు. అదీకాక తరవాతి కాలంలో

"కోపుల రాజులనెల్ల కొలచి కొన్నాళ్ళ మేను
చూపుడుఁ బూట వెట్టితి"[75]

అని ఆయనే చెప్పుకొన్నాడు కూడా. సాళువ నరసింహరాయలే కాక మల్లికార్జున రాయలూ, పురుషోత్తమ గజపతీ మరికొందరు మహా మండలేశ్వరులూ కూడా ఈ "కోపుల రాజుల"లో వుండివుంటారు.

సాళువ నరసింహ రాయలతో పరిచయమేర్పడినప్పటినుంచీ అన్నమయ సామ్రాజ్య రాజధాని విజయనగరానికి రాకపోకలు సాగిస్తూన్నట్లు అతని సంకీర్తనలే సాక్ష్యం పలుకుతున్నాయి. క్రీ. శ. 1467లో మల్లికార్జున రాయలు మరణించాడు. సంగమ వంశంలో తొలిగా వైష్ణవం స్వీకరించిన చక్రవర్తి ఇతనే. అతని తరవాత విరూపాక్షరాయలు సింహాసనాన్ని అధిష్ఠించాడు. విషయలోలుడైన విరూపాక్షరాయలను అతని పెద్ద కొడుకు రాజశేఖరరాయలు చంపించి తన తమ్ముడైన రెండవ విరూపాక్షరాయలకు పట్టం కట్టాడు. ఈ రెండవ విరూపాక్షరాయలు అన్నగారిని చంపి తన కృతజ్ఞతను ప్రకటించుకొన్న ఘనుడు. ఈ సంఘటనలు 1485-86లో జరిగాయి. ఆనాడు అన్నమయ విజయనగరంలో వుండినందువల్ల ఆ సంఘటనల వల్ల ఉద్విగ్నుడై తన బాధనూ, కోపాన్నీ తీవ్రంగానే ప్రకటించాడు.

"వెఱతు వెఱతు నింద వేడుకపడ నిట్టి
కుఱుచ బుద్ధులనెట్టు కూడుదువయ్యా
దేహమిచ్చిన వానిఁ దివిరి చంపెడువాడు
ద్రోహి గాక నేఁడు దొరయటా
ఆహికముగ నిట్టి అధమ వృత్తికి నే
సాహసమున నెట్టు చాలుదు నయ్యా

తోడఁబుట్టిన వాని తొడరి చంపెడువాఁడు
చూడ దుష్టుఁడు గాక సుకృతియట
పాడైన యిటువంటి పాప బుద్ధులు సేసి
నీడ నిలువనెట్టు నేరుతునయ్యా"[76]

అంటూ తీవ్రంగా చలించిపోయి "యింటి వేలుపు వేంకటేశ్వరుఁడన వెంట వెంట దిప్పెడువాడు విభుడటా, దంటనై యాతని దాసాను దాసునై వొంటి నుండెదనేమి నొల్లనోయయ్యా" అంటూ నాటి రాజకీయరంగంలోని అవినీతిని అసహ్యించుకొన్నాడు.

అప్పటిదాకా శ్రీమన్మహామండలేశ్వర మేదినీ మీసర గండ కఠారి సాళువ బిరుదాంచితుడైన నరసింహుడు క్రీ. శ. 1485 లో జులై 29 సెప్టెంబరు 9 తేదీల మధ్య శ్రీ మద్రాజాధిరాజ రాజ

పరమేశ్వర ప్రౌఢ ప్రతాప సాళువ నరసింగ రాయలుగా విజయనగర వజ్ర సింహాసనాన్ని అధిష్టించాడు. నరసింహరాయలు అస్తవ్యస్తమై పోయిన సామ్రాజ్యానికి మళ్లీ నూతనోత్తేజాన్ని, బలాన్నీ ఇచ్చాడు. అప్పుడాయన సరసన అన్నమయ వున్నాడో లేదో తెలియ జెప్పే ఆధారాలేమీ లభించడం లేదు. అప్పటికి ఆయనకు అరవై ప్రాంతాల వయసుండి వుండాలి.

ఈ చర్చలో అన్నమయ్య రచించిన చారిత్రక పరిస్థితులను సూచించే కొన్ని సంకీర్తనలనే ప్రస్తావించడం జరిగింది. చారిత్రకంగా ముఖ్యమైన మరికొన్ని సంకీర్తనలున్నాయి గాని వ్యాస విస్తర భీతితో ఉదాహృతం కాలేదు. ఈ చర్చవల్ల తేలిన అంశాలు ఇవీ—

1. అన్నమయ జననవత్సరం 1408గా ప్రతిపాదించిన వారి వాదనలు సహేతుకంకావనీ, తర్కానికి నిలిచేవికావనీ గమనించడం జరిగింది.
2. చిన్నన్న రచించిన శ్రీ అన్నమాచార్య చరిత్రము మనకు లభించిన చారిత్రకాధారాలతో చక్కగా సంవదిస్తున్నదని తేలింది.
3. శ్రీ అన్నమాచార్యుని సంకీర్తనలలో దేశకాలపరిస్థితులను తెలియ చేసే అంశాలు చారిత్రకంగా ఆమోదయోగ్యమైనవని తేలింది.
4. క్రీ. శ. 1424 లో శ్రీ అన్నమాచార్యులు జన్మించారన్న శ్రీ వేటూరి వారి ప్రతిపాదన చారిత్రకాధారాలవల్ల సత్యబద్ధమైందని రుజువైంది.

## అధోజ్ఞాపికలు

1. తిరుమల తిరుపతి ఎపిగ్రాఫికల్ రిపోర్ట్, పుట 280.
2. తిరుమల తిరుపతి ఎపిగ్రాఫికల్ రిపోర్ట్, చిత్రం 57.
3. ఆంధ్ర కవి తరంగిణి, ఎనిమిదవ సంపుటం, పుట 141.
4. అదే, పుట 140.
5. అదే, పుట 143.
6. అదే, పుట 141.
7. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జీవిత చరిత్రము: శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి పీఠిక, పుట 3
8. అదే, చిన్నన్న రచన, అన్నమాచార్య చరిత్రము, పుట 9.
9. తిరుమల తిరుపతి దేవస్థానమ్ ఎపిగ్రాఫికల్ సీరీస్ ఇన్‌స్క్రిప్షన్స్, వాల్యూమ్ 5, నెం. 71.
10. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జీవిత చరిత్రము, శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి పీఠిక, పుట 93.
11. ఆంధ్ర కవి తరంగిణి, ఎనిమిదవ సంపుటం, పుట 144.
12. శ్రీ తాళ్లపాకవారి పదసాహిత్యము, సంపుటము 12, శృంగార సంకీర్తనలు (అన్నమాచార్య విరచితములు), ద్వితీయ ముద్రణము, 1976.
    ద్వితీయ ముద్రణ పీఠిక, పుట 8, పరిష్కర్త శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ.
13. అదే, పుట 8.
14. అదే, పుట 8.
15. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జీవిత చరిత్రము, తృతీయ ముద్రణ (1978), శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారి వివేక దీపిక, పుట 19.
16. అన్నమాచార్య సాహితీకౌముది, ఉపోద్ఘాతం, పుట 7.
17. తిరుమల తిరుపతి ఎపిగ్రాఫికల్ రిపోర్ట్, చిత్రం 57.
18. అదే, చిత్రం 58.
19. అదే, చిత్రం 59.
20. అదే, చిత్రం 59.
21. శ్రీ తాళ్లపాకవారి గేయరచనలు, సంపుటము 21, అధ్యాత్మ సంకీర్తనలు, శ్రీ తాళ్లపాక పెదతిరుమలాచార్య విరచితములు, పి. టి. జగన్నాథరావుగారి మున్నుడి.
22. ఈ తేదీని శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారి నిర్ణయంగా శ్రీ కామిశెట్టి శ్రీనివాసులుగారు ఉట్టంకించారు. ఆకరాన్ని చూప లేదు. శ్రీ ముట్నూరి సంగమేశంగారి అన్నమాచార్యసాహితీ కౌముది ఉపోద్ఘాతం, పుట 7.
23. తాళ్లపాక కవుల కృతులు - వివిధ సాహితీ ప్రక్రియలు, డాక్టర్ వేటూరి ఆనందమూర్తి, పుటలు 60 నుంచి 70 వరకు.
24. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జీవిత చరిత్రము, శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి పీఠిక, పుట 84.

25. ఆంధ్ర కవి తరంగిణి, ఎనిమిదవ సంపుటము, పుట 145.

26. అదే, పుట 144.

27. అదే, పుటలు 144, 145.

28. శ్రీ తాళ్లపాకవారి గేయరచనలు, సంపుటము 16; చినతిరుమలాచార్య విరచితములు, అధ్యాత్మ సంకీర్తనలు 39 వ సంకీర్తన.

29. అదే, సంకీర్తన సంఖ్య 46.

30. తిరుమల తిరుపతి ఎపిగ్రాఫికల్ రిపోర్ట్, పుట 291; ఇంకా సౌత్ ఇండియన్ ఇన్‌స్క్రిప్షన్స్ వాల్యూం 4 - 710.

31. శ్రీ తాళ్లపాకవారి గేయ రచనలు, సంపుటము, 16; చిన తిరుమలాచార్య విరచితములు, అధ్యాత్మ సంకీర్తన 1: ఇదే సంకీర్తనను కొద్ది పాఠ భేదాలతో శ్రీ తాళ్లపాకవారి పద సాహిత్యము, సంపుటము 1 (ముద్రణ 1980) లో సూచన కూడా లేకుండా అన్నమాచార్య సంకీర్తనగా అచ్చువేశారు. అస్తవ్యస్తంగా సాగుతున్న ఈ పరిష్కరణల గురించి రాస్తే పెద్ద వ్యాసమే అవుతుంది.

32. అదే, పీఠిక 11, 12, 13 పుటలు.

33. డా॥ ముట్నూరి సంగమేశంగారి వ్యాసం, "అన్నమాచార్యుని జన్మతిథి- జాతకము", సప్తగిరి (మాసపత్రిక), జులై 1978, పుట 5. ఈ పెద్దవ్యాసం మూడు భాగాలుగా వరసగా జులై ఆగస్టు, సెప్టెంబరు సంచికలలో ముద్రితమైంది. ఈ వ్యాసాలకు రావలసినంత ప్రచారం రాకపోవడం దురదృష్టకరం. సాహిత్యాభిమానులేకాక జ్యోతిశ్శాస్త్రవేత్తలు కూడా పరిశీలించ దగిన వ్యాసమిది.

34. అదే, సప్తగిరి (మాసపత్రిక), ఆగస్టు 1978, పుట 33.

35. అదే, పుట 8.

36. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జీవిత చరిత్రము, పుట 42-43.

37. అదే, పుట 29.

38. సాళువా డైనాస్టీ ఆఫ్ విజయనగర్, డా॥ పి. శ్రీరామశర్మ, పుట 71.

39. ఏన్యువల్ రిపోర్టు ఆఫ్ ఎపిగ్రాఫీ, మద్రాస్, 575/1926.

40. తాళ్లపాక కవుల పదకవితలు – భాషాప్రయోగ విశేషాలు, డా॥ వేటూరి ఆనందమూర్తి, పుట 296-297 మధ్య.

41. కడపజిల్లా ఊర్లపేర్లు, డా॥ కేతు విశ్వనాథరెడ్డి, పుట 301.

42. ఎటాపోగ్రాఫికల్ లిస్ట్ ఆఫ్ ది ఇన్‌స్క్రిప్షన్స్ ఆఫ్ ది మెడ్రాస్ ప్రెసిడెన్సీ, వాల్యూం I, పుట 655, సంఖ్యలు 878, 879.

43. సౌత్ ఇండియన్ ఇన్‌స్క్రిప్షన్స్, వాల్యూం XVI, శాసన సంఖ్య 31.

44. తిరుమల-తిరుపతి దేవస్థానమ్ ఎపిగ్రాఫికల్ సీరీస్ వాల్యూం II శాసన సంఖ్య 30.

ఎపిగ్రాఫియా ఇండికా, వాల్యూం VII, పుట 74, "ఎ కాపర్ ప్లేట్ గ్రాంట్ ఆఫ్ ఇమ్మడి నరసింహ", జె. రామయ్య పంతులుగారి వ్యాసం. ఈ శాసనాన్ని నా దృష్టికి తెచ్చిన డా॥ సి. సోమసుందరరావుగారికి నా కృతజ్ఞతలు.

45. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జీవిత చరిత్రము, పుట 32.

46. హిస్టారికల్ ఇన్‌స్క్రిప్షన్స్ ఆఫ్ సదరన్ ఇండియా, రాబర్ట్ సూయెల్, ఎడిటెడ్ బై ఎస్. కె. అయ్యంగార్, పుట 223.

47. ఫర్దర్ సోర్సెస్ ఆఫ్ విజయనగర హిస్టరీ, వాల్యూం I, పుట 118, ప్రొ॥ కె. ఎ. నీలకంఠశాస్త్రి, డా॥ ఎన్. వెంకటరమణయ్య.

48. అదే, పుట 120.

49. సాళువ డైనాస్టీ ఆఫ్ విజయనగర్, పుట 149.

50. ది సూర్యవంశీ గజపతీస్ ఆఫ్ ఒరిస్సా, పుట 67. డా॥ ఆర్. సుబ్రహ్మణ్యం.

51. ది విజయనగర్ ఎంపైర్, డామింగో పేయస్- ఫెర్నోన్యూనిజ్, పుట 85. (నేషనల్ బుక్‌ట్రస్ట్ ఆఫ్ ఇండియా ప్రచురణ)

52. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జీవిత చరిత్రము, పుట 34.

53. అదే, పుట 42

54. ది సూర్యవంశీ గజపతీస్ ఆఫ్ ఒరిస్సా, పుటలు 66-67.

55. ఫర్దర్ సోర్సెస్ ఆఫ్ విజయనగర హిస్టరీ, వాల్యూం I, పుట 185.

56. సాళువ డైనాస్టీ ఆఫ విజయనగర్, పుట 161.

57. ఫెరిష్తా వర్ణన, ది సూర్యవంశీ గజపతీస్ ఆఫ్ ఒరిస్సా,పుట 76.

58. ఫర్దర్ సోర్సెస్ ఆఫ్ విజయనగర హిస్టరీ, వాల్యూం 1, పుటలు 135, 136. అధోజ్ఞాపికలు.

59. శ్రీ తాళ్లపాకవారి పద సాహిత్యము, సంపుటము 8వ సంకీర్తన. తొలిసారిగా ఈ సంకీర్తన ప్రాముఖ్యాన్ని గుర్తించిన వారు శ్రీ వేటూరి ఆనందమూర్తిగారు. వారు పల్లవిని మాత్రమే ఉదాహరించారు. అలభ్యమైన 8వ సంపుటంలోని ఈ సంకీర్తనను నా కందజేసిన పరిశోధకులు శ్రీ గోపీకృష్ణగారికి కృతజ్ఞతలు.

60. శ్రీ తాళ్లపాకవారి పద సాహిత్యము, శృంగార సంకీర్తనలు, సంపుటి 12; అన్నమాచార్య విరచితములు, ద్వితీయ ముద్రణము, సంకీర్తన 170.

61. సాళువ డైనాస్టీ ఆఫ విజయనగర్, పుట 167.

62. సప్తగిరి (మాసపత్రిక) జులై 1978, పుట 35.

63. ది సూర్యవంశీ గజపతీస్ ఆఫ్ ఒరిస్సా, పుట 88.

64. శ్రీ తాళ్లపాకవారి పద సాహిత్యము, సంపుటము 2, సంకీర్తన 308.

65. శ్రీ తాళ్లపాకవారి పద సాహిత్యము, సంపుటము 7, సంకీర్తన 195.

66. సప్తగిరి (మాసపత్రిక), ఆగస్టు 1978, పుట 8. "రాధా మాధవ శృంగారం మనకు గజపతులు ఇచ్చిన వారసత్వమే"— ఆరుద్ర, సమగ్రాంధ్ర సాహిత్యం, గజపతులయుగం, అయిదవ సంపుటం, పుట 11.

67. ది సూర్యవంశీగజపతీస్ ఆఫ్ ఒరిస్సా, పుట 5.

68. సప్తగిరి (మాసపత్రిక), ఆగస్టు 1978, పుట 8.

69. శ్రీ తాళ్లపాకవారి పదసాహిత్యము, సంపుటము I (పునర్ముద్రణ) అధ్యాత్మసంకీర్తనలు, అన్నమాచార్య విరచితములు, సంకీర్తన 453.

70. అదే, సంకీర్తన 278.

71 శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జీవితచరిత్రము. ఈ సంకీర్తన శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి పీఠికలో ఉదాహృతం. పుట 49.

72. తిరువేంగళప్ప రచన కావ్యప్రకాశ వ్యాఖ్యను శ్రీ వేటూరి ఆనంద మూర్తిగారు తమ "తాళ్లపాక కవుల కృతులు – వివిధ సాహితీ ప్రక్రియలు" గ్రంథంలో అనుబంధంగా ప్రకటించారు.

73. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జీవితచరిత్రము, పుట 41.

74. అదే, పుట 41.

75. అదే, వేటూరివారి పీఠికలో ఉదాహృతం, పుట 55.

76. శ్రీ తాళ్లపాకవారి పద సాహిత్యము, సంపుటము I (పునర్ముద్రణ); అధ్యాత్మ సంకీర్తనలు,అన్నమాచార్య విరచితములు,సంకీర్తన.235 తిరుమల తిరుపతి దేవస్థాన అధికారులు ఎంతో ధనాన్ని ఖర్చు చేస్తున్నా కూడా శ్రీ వేంకటేశ్వర భక్తులకూ, సాహితీప్రియు లకూ తాళ్లపాకవారి సాహిత్యం అందుబాటులోకి రాకపోవడం విషాదకరం అని చెప్పక తప్పదు.

# నన్నయ ప్రత్యుత్తరము

## శ్రీ పైడిపాటి సుబ్బరామశాస్త్రి

ప్రముదమ్ము నట్లు బల్కిన స
భా ముఖమందున రాజరాజు, హా
సము చిగురొత్త నన్నయ, వి
శాలపు దృక్కుల తేని జూచి, మీ
సము చలియింప కిట్లనియె.
శాంత వచస్సున, రాజపుంగవా !
తమరు వంచించు పల్కు శత
థా పరికింపగ యోగ్యమై చనున్.

2

పండితుల భాష యేను గీర్వాణ వాణి
తెనుగు నొకప్రక్కతా పుంజుకొనుచునుండె
కలుగు క్రమమున వైకృత కావ్యములకు
గౌరవమ్మని, నాకును, కలదు దృష్టి.

3

కాసటు బీసటు బాసను
దోసమ్ములు పెక్కుగలుగు, దోషజ్ఞులకున్
వీసమ్ము నచ్చబోవదు
వ్రాసిన కావ్యమ్ము నేటి బాస, నధీశా!

4

పామరులు పల్కునట్లుగా వ్రాయు కవిత
మెచ్చుటలు కల్ల, సతము పండిత జనమ్ము
మేటి కావ్య పరీక్షకు గీటు రాయి
పండితుడె కాని, మఱి కాదు, పామరుండు!

5

కిచిడీ భాషగ నున్న తెన్గునకు, సత
గీతత్వముం గూర్పగా
పచరింపన్వ్రతి శుద్ధతన్ అదియునున్
వ్యాకర్తకే చెల్లు, త
ద్రచనంబున్ పరిపుష్టమై యొక వ్యవ
స్థన్ నిర్మితిం జేయగా
వచియింపంగల నర్హ తంగలుగు కా
వ్య శ్రేణి కా భాషలో.

6

దోషమును పరిహరించుట; తోడగుణము
కలుగ జేయుట యగును సంస్కరణ మన్న
అట్టి సంస్కృతి గోరు నే డాంధ్ర భాష
కావ్య భాషగ వెలయంగ కాంక్షయున్న

7

జనుడు పుట్టిన దాదిగా సంస్కరణము
నందుచున్నాడు, భాషయు నందవలెనె
అట్టిదే లేనివాడగు నడవి జనుడు
అట్టిదే లేక యుండెడి దడవి భాష.

8

వట్టి వ్యవహారమునకును, పనికి వచ్చు
[illegible] యట్టులే యడవి బాస
పనికి వచ్చును, హావభావములు కొన్ని
తెలుపగా; కాని, కబ్బము వెలయ గాదు.

**9**

దేశ భాష ప్రవాహిని— త్రెంచుకొనుచు
పోవు కట్టలు; నొకతీరు పోదు కాన
యెల్ల కల్లోలమే—మతి, యందు వలన
నియమబద్ధమ్ము జేయుట, నీతి, దాని.

**10**

నేడు ప్రామాణికత్వము నెఱపి, దాని
వ్యాకృతిం జేయకున్నను, భావి కాల
మందు జనులకు; నీభాష యందబోక
మూగ, చెవిటికి, నైనట్టి ముచ్చటగును!

**11**

నమ్ముమో రాజ! వ్యాకరణమ్ము తనువు
రసము పరడించు శాస్త్రమ్ము ప్రాణ మరయ
కావ్యకన్యకు, రెంటను గలుగు పుష్టి
కలుగ నటు పుష్టి యది పండితులకు తుష్టి.

**12**

పండితులకును గీర్వాణ భాషనున్న
మమతనుంబట్టి, సూత్రత్వ మహిమబట్టి
ఆంధ్ర భాషయు దాని తుల్యత్వ మంద
వ్యాకృతియు, దేవభాషనే, వఱలవలయు.

**13**

అదియునుంగాక, తోడి కర్ణాట బుధులు
నితర భాషల వా రాంధ్రకృతుల జదువ
సహకరింపనగు శబ్ద శాసనమ్ము
కామనం దీర్చునట్టి చింతామణి గను

**14**

పప్పు పులుసుల దెమ్మను భావమేలను
తేట పలుచేడి మాటల తీరు వేరు—
పాత్రలను చిత్రణము చేయు పట్టునందు
వ్యక్త పలుచేడి మాటల వరుస వేరు.

**15**

కావ్యము రచించు పట్టున, గ్రంథన కౌశ
లమ్ము కనుపైన యట్టి పదమ్ము వలయు
నట్టి పదములు తెనుగున నల్ప సంఖ్య
గలవు కావున—తత్సమమ్ముల గొనవలె.

**16**

తెనుగునకు నున్న నుడికారమును వదలక
సంస్కృతము నర్థమయ్యెడి చాడ్పునున్న
పదము రీతుల గ్రహియింప వలయుగాన
క్లేశతమమగు కార్యమ్ము రీతి దోచు.

**17**

జీవద్భాషయునౌ తెనుంగు, మొద, శా
సింపంగ సంక్లిష్ట మా
త్రోవన్ సంస్కరణమ్ము చేయఁగవి సూ
రుల్ కావ్యముల్ వ్రాసినన్
భావవ్యక్తి తనంత తాగలుగు, శ
బ్దాంభోధి నీదాడుచో
త్రోవం దప్పిన తప్పనీ! యదియు ము
ద్దుం గూర్చు కొంతేనియున్

**18**

అని, నన్నయ పలికిననే
మన వలయునో యొకింత తోప కచ్చెఱు వడియెన
జననాథుడు, సభవంకకు
నన నన్నగ బఱపె దృక్కు సాలోచనమున్

**19**

ఆ రాజన్యుని దృక్కొంతులు
నారాయణ భట్టు పైన నాట్యము సేయన్
వారాన్నిధి గంభీరుడు
ధీరాగ్రణి యతడు దాని తెలిసియు నుండెన్.

శ్రీ ఆదవాని హనుమంతప్ప

# తెలుగు మీద కన్నడ భాషా ప్రభావం

తెలుగు కన్నడకు దగ్గర సంబంధముందని అటు చారిత్రకంగానూ, భాషాదృష్టితోనూ పరిశోధనలు చాలాజరిగాయి. ఆంధ్రప్రదేశ్ పడమటిభాగాన కర్నాటక సరిహద్దువుంది. తెలుగువాళ్లు కర్నాటక రాష్ట్రంలో సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ సంబంధాలు పూర్వం నుంచే కల్గివున్నారు. శ్రీకృష్ణదేవరాయలు మొ॥ రాజులు కర్నాటక ప్రాంతమూ, తెలుగుభాషాప్రాంతమైన మన రాష్ట్రంలో కొంతభాగమూ కలిపి ఏకంగానే పాలించారు. అందువల్ల ఉభయభాషల సమ్మేళనం జరగడానికి ముందునుంచి యిప్పటివరకు అవకాశముంది. మిగిలిన ప్రదేశాల్లోని వ్యవహారం కంటే కర్నాటక సరిహద్దు ప్రాంతాల్లో మాట్లాడేభాషభిన్నంగావుంది. ఒకవైపు పత్రికలు, సినిమాలు, రేడియోల కారణంగా ప్రాంతీయ మాండలికభాష మారడానికి అవకాశమున్నా పొరుగు రాష్ట్రభాషా ప్రభావం అంతతొందరగా పోయేదికాదు.

## భాషా సంపర్కం

సాధారణంగా ఒకభాషకంటే ఎక్కువభాషలు మాట్లాడేవాళ్ళలో వాళ్లుమాట్లాడగల్గే అన్నిభాషాపదాలు సమ్మిళితమై వుంటాయి. మన రాష్ట్రానికి కన్నడ సరిహద్దు ప్రాంతాల్లో కన్నడ, తెలుగు కూడా మాట్లాడే వాళ్లున్నారు. ఇక్కడ కొన్నికులాలవారు (ఉదా : జంగమ, కురుబ, మాదిగ) యింట్లోమాత్రం కన్నడ మాట్లాడి బయట తెలుగు మాట్లాడుతారు. ఇలాంటి వ్యవహర్తల ప్రభావం యితరులపై తప్పకుండా వుంటుంది. ఈ సరిహద్దు ప్రాంతాల్లో వుండేవాళ్లు కన్నడ మాట్లాడ డానికి రాకపోయినప్పటికీ కన్నడను అర్థం చేసుకునే వాళ్లు సుమారు ఎనభైశాతం వున్నారు. తమ మాతృభాష తెలుగే అయినప్పటికీ యించుమించు యాభైశాతంమంది కన్నడ మాట్లాడ గల్గుతారు.

సాధారణంగా సరిహద్దు ప్రాంతాల్లో బాగా వెనుకబడిన తనం కన్పిస్తోంది. దీనికి కారణం రెండురాష్ట్రాల ప్రభుత్వాలు సరిహద్దు ప్రాంతాలను ఉపేక్షించడం ఒకటి. భాషాసమస్య రెండవది. సరిహద్దు ప్రాంతాల్లో చదివే విద్యార్థుల్లో చైతన్యవంతం అంతగా కన్పించదు. ఎక్కువ భాగం స్తబ్దత వుంటుంది. ఈ స్తబ్దత పోగొట్టడానికి భాషా సామాజిక చైతన్యం రావలసి వుంది. భాషా సామాజిక చైతన్యం రావాలంటే విస్తృతమైన భాషాపరిశోధనలు సాగాలి. ఈ వ్యాసంలో వ్యాకరణ విశేషాలు, విలక్షణ పదబంధాలు, కన్నడ పదాల్ని వ్యవహరించే తీరు మొదలైన అంశాలు పరిశీలింపబడతాయి.

## 1. కొన్నిపదాల్లో వినిపించే విలక్షణోచ్చారణాలు

తాలవ్యాచ్చులతో కలిసినపుడు చ, జలు తాలవ్యోచ్చారణంతోనూ, కంఠ్యాచ్చులతో కలిసినపుడు దంతమూలీయోచ్చారణంతోనూ వినిపించడం తెలుగులో సాధారణంగా వుంటే సరిహద్దుప్రాంతాల్లో దంతమూలీయోచ్చారణతో వున్న తెలుగు పదాల్లోని చ, జ తాలవ్యాచ్చులుగా వినిపిస్తాయి.

ఉదా॥ చదువు-చెదువు; చలి-చెలి; జల్లెడ-జెల్లిడి

ళ/ల; ణ/న తోకూడిన రూపాలు :-

హాళిగ/ఓలిగ హ > ∅

అణ్ణ/అన్న

### విలక్షణమైన వర్ణవ్యత్యయాలు

గెల/గొల : ఎ/ఒ ల వినిమయం ఇక్కడ కన్నడ ప్రభావాన్ని శంకించడానికి వీలుంది. క.గొలె.

ఇలాగే రెడి/రొడ్డి; రోకలి/ర్యాకిలి; ఇసక/ఉసుక లాంటి రూపాల్లోని వర్ణవ్యత్యయాల్లోకూడా కన్నడ నిర్మాణ ప్రభావం కారణం కావచ్చునా అని ఒక సందేహముంది.

## 2. వ్యాకరణాంశాల్లో కనిపించే కొన్ని విశేషాలు

### విభక్తి లోపం

కన్నడలో సంస్కృత శబ్దాల చివర ఏ ప్రత్యయాలు చేర్చకుండానే యథాతథంగా వాడతారు. తెలుగులో సంస్కృత పదాలు వాడేటపుడు సంస్కృత శబ్దాల చివర డు ము వు లు చేర్చుకొని వాడడ

ముంది. కాని కన్నడ ప్రభావంవల్ల సరిహద్దు ప్రాంతాల్లో ఒక్కొక్కప్పుడు ఏ ప్రత్యయాలు చేర్చకుండానే వాడేపద్ధతి అరుదుగా వినిపిస్తుంది

ఉదా :- మజ్జిగన్న (మజ్జిగన్నం)
కూలిమఠ (కూలిమఠం)
నీ సంబళా యెంత ? (నీ సంబళమెంత?)

## విలక్షణసంధి

ఒక్కొక్కప్పుడు ఒకే అర్థాన్నిచ్చే రెండుభాషల పదాల్ని కలిపి వ్యవహరించడముంది.

ఉదా : నీయాకట్లమేం షావుకార్లు కాదనప్పా
(నీమాదిరి మేం షావుకార్లం కాదనడానికి)
నీ అగ + నట్ల > నీ యాగట్ల > నీ యాకట్ల
క. హాగె=వలె, మాదిరి (హాగె > అగె > అగ)
తె. అట్లు=వలె, మాదిరి (అట్లు > అట్ల)

ఇక్కడ కన్నడపదం అగ, తెలుగుపదం అట్ల కలిసి ఈ కింది విధంగా సంధికావడం విశేషం.

నీ అగ + అట్ల > నీ అగ అట్ల > నీ అగట్ల > నీ(య్) అగట్ల > నీ యాగట్ల > నీ యాకట్ల.

## సంకర రూపాలు

కన్నడ నామవాచక పదానికి తెలుగు విశేషణ పదం చేర్చి వ్యవహరించడముంది.

ఉదా:- తెల్ల జిబ్బ (తెల్లమచ్చ)
క. చిబ్బ = ఒక విధమైన చర్మరోగం, మచ్చ
తె. సిబ్బె/సిబ్బి = ,, ,,

తెల్లఁదనం వంటి రూపాల్లోలాగా లుప్త అనునాసికం తర్వాతి చ> జగా మారి వుండాలి.

## విధ్యర్థక రూపాలు

కన్నడలోని విధ్యర్థక ప్రత్యయం 'ఇ' చేరిన కొన్ని తెలుగు క్రియా పదాల విధ్యర్థక రూపాలు విన్పిస్తాయి.

ఉదా :- పిలీ, నడీ, కలీ (పిలుచు, నడచు, కలుసు)
అతన్ని పిలీ (అతన్ని పిలుచు)

కన్నడ క్రియా పదాలు విధ్యర్థకంలో మాడి, హోగి మొదలైన విధంగా వున్నాయి.

## కిలార్థం

క. అంతె, త > ట
తె. అంట > అఁట > అట (చేస్తాట్ట)
ఉదా :- క. నీను హోగు బేకంతె
తె. నీవు పోవాలంట

## కన్నడ ధాతువులకు తెలుగు క్రియలలో వచ్చే అనుబంధ ప్రత్యయాలు చేర్చి వాడడం

ఉదా:- ముక్కిళించు (పుక్కిలించు)

కన్నడ ధాతువు; క్రియ — ముక్కిళిసు. తెలుగు 'ఇంచు ప్రత్యయాన్ని ధాతువుకు చేర్చి వాడడం ఇక్కడి విలక్షణం

ఇదే విధఁగా చిముకురించు క. చిముక్ కు తె. ఇంచుచేరింది.

## సర్వనామం

తెలుగులో 'మనం' వాడే చోట్ల ఈ ప్రాంతాల్లో 'మేము' వాడడం వుంది.

మనం వెళ్దాం (ఇన్‌క్లుజివ్)
మేం పోదాం (ఎక్స్‌క్లుజివ్)

క. నావు < { ఇన్‌క్లుజివ్, ఎక్స్‌క్లుజివ్ }

కన్నడలో ఎక్స్‌క్లుజివ్‌కు, ఇన్‌క్లుజివ్‌కు రెంటికి నావు అన్నది ఒక్కటే వుంది.

# 3. పదబంధాలు

ఒక కన్నడ పదం, ఒక తెలుగు పదం కలిసి పదబంధంగా ఏర్పడడం, అది సరిహద్దు ప్రాంతాల్లో మాత్రమే వినిపించడం విశేషం.

ఉదా :- బెంకిపెట్టి (క. బెంకి=అగ్గి; తె. పెట్టి)
కబ్బిణపెట్టె (క. కబ్బిణ=ఇనుము)

ఒకే వస్తువుకు ఒకే అర్థాన్నిచ్చే కన్నడ పదం, తెలుగు పదం రెంటినీ కలిపి వ్యవహరించడం ఇక్కడి ప్రత్యేకత.

ఉదా :- చెలికి పార (క. చెలికి; తె. పార)
నెరి బొక్కలు (క. నెరి; తె. బొరక 'రంధ్రం')
సున్నపుకాయి డబ్బి (క. కాయి; తె. డబ్బి)

# 4. పద క్రమం

సమస్త రూపాల్లో కన్నడ నిర్మాణ ప్రభావం కనిపించేచోట్లు వున్నాయి.

ఉదా :- అప్పాఅమ్మ; క. తందెతాయి
తల్లీదండ్రులు; తె. అమ్మానాన్న

## సంఖ్యా వాచకం

పదహైదు/పదైదు క. పదునైదు 'పదిహేను' కోస్తా వ్యవహారంలో పదిహేను అని వినిపిస్తూంటే ఇక్కడ పదహైదు / పదైదు అని మాత్రమే వినిపించడం కన్నడ ప్రభావమే.

ఇన్నూరు, మున్నూరు, నన్నూరు మొ॥ సమాసరూపాలే ఇక్కడి వాడుకలో ఉన్నాయి. కోస్తాలో రెండువందలు, మూడు వందలు, నాలుగు వందలుగా ఉన్నాయి. సరిహద్దు ప్రాంతాల్లో ఇన్నూరు, మున్నూరు, మొ॥ రూపాలు ఉండడానికి కారణం కన్నడలో ఎరడునూరు, మూరునూరు అని ఉండడమే.

# 5. వాక్యం

పదాల్లో కనిపించే ప్రభావం కన్నా వాక్యాల్లో కనిపించే ప్రభావం తక్కువగా వుంటుంది. అనంతపురం తెలుగు కన్నడ ఆధారాన్ని (సబ్‌స్ట్రాటమ్) కల్గిందా లేదా అనే విషయాన్ని వాక్యాల నిర్మాణం ఆధారంగా పరిశీలించడం చాలా అవసరం.

ఉదా:- ఉరవకొండకు పోయెల్లేదా / పోయెల్దా

పై వాక్యంలో అన్నీ తెలుగు పదాలే వున్నాయి. కానీ ఆ వాక్యం నిర్మాణం కన్నడ ప్రభావాన్ని కలిగివుంది.

క. ఉరవకొండగె హోగోదిల్లా

హోగోదిల్లా అనే దానికి పోయెల్లేదా అన్నది తర్జుమా. అదే వాక్యం యితర ప్రాంతాల్లో అయితే ఈ విధంగా వుంటుంది. 'ఉరవకొండకు పోవా'.

## సర్వనామం

ఉ. ఇంగా యారారు పోయార క. యారు 'ఎవరు' తెలుగులో ఎవరు అని వుండగా కన్నడం యారు అన్న పదాన్ని యథాతథంగా వాడడం ఇక్కడి విశేషం.

## వచనం

లేదు, లేవు అని వ్యతిరేకార్థంలో ఏకవచనం, బహువచనం రెండూ వేర్వేరు వుండగా కన్నడంలో రెంటికీ 'ఇల్ల' అన్నది ఒక్కటే వుంది. దీని ప్రభావం కింది ఉదాహరణలో కనిపిస్తుంది.

ఉదా:- 1. బియ్యం లేదు (బియ్యం లేవు అనడానికి)
క. అక్కి యిల్ల
2. ఎవ్వరూ లేదు క. యారూ యిల్ల 'ఎవ్వరూ లేరు'.

## పరిపూర్ణార్థకం

కన్నడలో 'బిడు' అనే సహాయక క్రియను చేర్చితే పరిపూర్ణార్థక మేర్పడుతుంది. దానికి సమాన పదమయిన 'విడు' ఈ ప్రాంతంలో వాడబడుతుంది.

ఉదా :- చేసిడిసినాడు ( < చేసి విడిచినాడు 'చేశాడు')
తుడిచిడి ( < తుడిచివిడి 'తుడిచేసెయ్')

## వ్యతిరేక సామర్థ్యార్థకం

చెయ్యలేపడు 'చేయలేడు' చెయ్యలేపడు అన్నది కన్నడ 'మాడలారను' నుంచీ వచ్చింది కావచ్చు.

## కరణ కారక ప్రత్యయం

1. చేతిలో రాయి 'చేత్తోరాయి'
క. కియ్యల్లి బర్రి
2. కంటిలో చూడు 'కంటితో చూడు'
క. కణ్ణల్లినోడు

మిగతా ప్రాంతాల్లో చేత్తోరాయి, కంటితోచూడు అని మాత్రమే వుంటే కర్నాటక సరిహద్దు ప్రాంతాల్లో వాటితోపాటు కంటిలో చూడు, చేతిలో రాయి అని వుండడం ఇక్కడి ప్రత్యేకత.

## నిర్ధారక వాక్యం

నేను పెద్దోడు. క. నాను దొడ్డోను / నాను దొడ్డవను
నేను పెద్దది. క. నాను దొడ్డోదు / నాను దొడ్డవదు

తెలుగులో నేను పెద్దవాణ్ని, నేను పెద్దదాన్ని అని వుండాలి. పెద్దవాడు, పెద్దది అని ప్రథమ పురుషంలో వుండడం కన్నడ ప్రభావం.

## విధి, సంప్రార్థనం

ర్రారి, పోర్రి 'రాండి, పోండి'
క. బర్రి, హోగిరి.

శిష్టవ్యవహారంలో రాండి, పోండి అనివుంటే యిక్కడ ర్రారి అన్నది క. బర్రి అన్నదానికి; పోర్రి అన్నది హోగిరి అన్నదానికి సమాన రూపాలు.

### విశేషార్థం

చెప్పవద్దు/చెప్పొద్దు క. హేళబేడ

చెయ్యవద్దు/చెయ్యొద్దు క. మాడుబేడ

కోస్తా, తెలంగాణాలో "చెప్పొద్దు'కు చెప్పాకు అనికూడా వుంది. కాని ఇక్కడ చెప్పొద్దు, చెయ్యొద్దు అని మాత్రమే వుంది. చెప్పాకు, చెయ్యాకు ఇలాంటి రూపాలు లేవు. చెప్పొద్దు అన్నది హేళబేడ అన్నదానికి సమానరూపం.

### అవ్యయం

నిన్నల్లా కనిపించలేదే 'నిన్నటి రోజంతా కనిపించలేదే'

క. నిన్న ఎల్లా కాణిసిలిల్లే

ఎల్ల అన్నది బాలవ్యాకరణం ప్రకారం అవ్యయం. నిన్నల్లా కనిపించలేదే అనే వాక్యం కన్నడ ఆధారాన్ని కల్గింది కాకపోతే ఇతర దేశమంతటా ఈ ప్రయోగ ముండాలి. ఈ వాక్యం మిగతా ప్రాంతంలో కన్పించదు కాబట్టి కన్నడ ప్రభావమే అని నిస్సందేహంగా చెప్పవచ్చు.

### తుమర్థం

పనిచేసేకి పోయినాడు 'పని చెయ్యడానికి పోయినాడు' క. కెళిస మాడోక్కె ఓగాన

పై వాక్యంలో కన్నడ 'మాడోక్కె' అనేదానికి 'చేసేకి' అన్నది సమానమైన పదం.

## 6. అర్థపరిణామం

భాషలో మార్పుసహజం. ఒక భాషలో నుంచి వేరొక భాషలోకి ఎరవు తెచ్చుకున్న పదాలు ప్రజల వ్యవహారంలో పడినపుడు మూల భాషలో వున్నదాని కంటే అర్థాంతరాలు ఏర్పడవచ్చు. అర్థం కొన్ని సందర్భాల్లో మారి కొత్తఅర్థం రావచ్చు. ఉదాహరణానికి కల్యాణమ్ అనే సంస్కృత పదం శుభం, ఉత్సవం అనే అర్థాల్లో వుంటే తెలుగులో పెండ్లి అనే అర్థం వచ్చేసింది. అదే విధంగా కన్నడనుంచి దిగుమతి చేసుకొన్న పదాలు కన్నడలో వున్న అర్థం కంటే భిన్నార్థాల్లో వాడడం ఇక్కడి ప్రాంతంలో కనిపిస్తుంది.

### నిర్వాకం

క. నెరవా/నిర్వాహ, కన్నడంలో గతి,సహాయం, వేరేమార్గం అనే అర్థాల్లో వుంటే తెలుగులో దానితోపాటు ఊరకేవుండు అనే అర్థంలో వాడడం వుంది.

ఉదా : నన్నుయాడా నిర్వాకం కానీవే (నన్ను ఎక్కడావూరకే వుండ నీయవే అనడానికి)

### లగ్నం

క. లగ్న ( < సం.) కన్నడలో లగ్న అంటే పెండ్లి అనే అర్థం వుంది. సంస్కృతంలో ముహూర్తమని అర్థం. కాని కన్నడలో పెండ్లి అనే విస్తృతార్థంలో వ్యవహరించడముంది. దాని ప్రభావం ఇక్కడి ప్రాంతం వారిపై బడి సంస్కృతార్థంలో కాకుండా పెండ్లి అనే విస్తృతార్థంలోనే వ్యవహరింపబడుతోంది.

### ఉషారు

క. హుషారు ( < హి.స్థా.) కన్నడలో జాగ్రత్త అనే అర్థంలో వుంటే తెలుగులో ఈ అర్థంతోపాటు ఉత్సాహం అనే అర్థంలో వాడడం విశేషం.

ఉదా :— ఏమో బలే ఉషారుగా వున్నాడీపొద్దు (ఏమో బలే ఉత్సాహంగా ఉన్నాడీరోజు అనడానికి)

### తారు

( < హి.స్థా) కన్నడంలో అలసిపోవు అనే అర్థంలో వుంటే ఈ ప్రాంతం తెలుగులో ఎండిపోవు అనే అర్ధంలో వాడతారు.

ఉదా :— దనేల కట్టె తారిపోయింది (ధనియాలకట్టె ఎండిపోయింది అనడానికి). ఈ విధంగా కన్నడలోవున్న అర్థాలకంటే తెలుగులో భిన్నార్థాల్లో వాడబడే పదాల్ని చాలా ఉదహరించవచ్చు.

## 7. విలక్షణ పదాలు

కర్నాటక సరిహద్దు ప్రాంతాల్లో తెలుగు వ్యవహరించే ప్రజల వాడుకలో కన్నడ పదాలకు తన భాషా సహజమైన ప్రత్యయాలు డు ము వు లు చేర్చి ఎక్కువగా మాట్లాడడం వుంది. కొన్ని పదాలు యథాతథంగా వాడతారు. సరిహద్దుకు మరీ దగ్గరా వున్న ప్రాంతాల్లో కన్నడ పదాలు, తెలుగు–కన్నడ పదాల సమ్మేళనం విపరీతంగా వినిపిస్తుంది. కన్నడనుంచి వచ్చిన పదాలు కోకొల్లలుగా వున్నాయి. కాని ఇక్కడ ఉదాహరణకు కొన్ని మాత్రమే చూపబడతాయి.

### అగత్యంగా

క. అగత్య, 'తప్పకుండ' నేను శుక్రవారం నాడగత్యంగా వస్తాను (నేను శుక్రవారంనాడు తప్పకుండా వస్తాను అనడానికి)

### అరకు:

క. అరకె 'అజీర్ణం'. నాకన్నం అరకువ కాలేదు.

### అసడ్డం

క. అసడ్డె. 'ఆటంకం' ఈ పొద్దు వూరికి పోదామంటే అన్నీ అసడ్డాలే. (ఈ రోజు వూరికి పోదామనుకుంటే అన్నీ ఆటంకాలే కల్గుతున్నాయి)

## కొట్టిడి

క. కొట్టిడి 'గది'. మీ యింట్లో ఎన్ని కొట్టిడీలున్నాయి. 'మీ యింట్లో ఎన్ని గదులున్నాయి'.

## కాయ్‌లా

క. కాయ్‌లే (< కాహిలే) 'రోగం'. మా పెద్దన్న నెల దినాలు కాయిలాతోపడిపోయిండె 'మా పెద్దన్న నెలరోజులు రోగంతో పడుకొని వుండెను' కాయ్‌లా అనే ఈ పదాన్ని మామూలు జ్వరానికి వ్యవహరించరు. దీర్ఘ రోగాలకు మాత్రమే కాయిలా అని ఇక్కడ వ్యవహరిస్తారు.

## గుడిసిలి

క. గుడిశలు. 'చిన్నకొట్టము, గుడిసె'. గుడిసె అని కాకుండా యిక్కడ వ్యవహారంలో గుడిసిలి అని వుండడం విశేషం.

## జోపానం

క. జోపాన. 'జాగ్రత్తగా కాపాడడం' పైరును బాగా జోపానం చేసుకుంటే పంట భాగా పండుతాది—అని వ్యవహారం.

## మెయ్/మయ్/పయ్

క. మెయ్. 'శరీరం'. మెయ్ తిక్కమ్మా 'వీపు రుద్దమ్మా'. ఇక్కడ తిక్కు అనే పదంకూడా కన్నడపదమే (తిక్కు=రుద్దు)

## సుగ్గి

క. సుగ్గి. 'ఒక కాలం, సీజన్'. చెనిక్కాయ సుగ్గి 'వేరుశనక్కాయలు పండే కాలం'.

## సోలు

క. సోలు 'ఓడిపోవు'. వాడు పందెంలో సోలిపోయినాడు.

సరిహద్దు ప్రాంతాలనుండి దూరంగా పోయేకొద్దీ ఈ విలక్షణత తగ్గుతూ వస్తుంది.ఉదాహరణకు సంబళం అనే కన్నడ పదం ఉరవకొండ (అనంతపురం జిల్లా) ప్రాంతంలో ఎక్కువగా విన్పిస్తుండగా అనంతపురం జిల్లాలోనే అనంతపురం నుంచి గుత్తికిపోయే మార్గంలో ఇది అసలు విన్పించదు.

రాష్ట్ర వ్యాప్తంగా విద్యాబోధన అన్ని స్థాయిల్లోనూ వ్యవహార భాషలోనే జరగడానికి సమగ్ర ఆధునికాంధ్ర భాషానిఘంటు నిర్మాణం, సమగ్ర ఆంధ్ర భాషా వ్యాకరణం అవసరమవుతాయి కనుక ఇలాంటి పరిశోధనలు నేడు యెంతైనా అవసరం.

## రెఫరెన్సులు


ఉపాధ్యాయ, సుశీల-పి. : "హిందీ – కన్నడ కామన్ వొకాబులరీ", సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజస్, మైసూరు ప్ర. (1979)

కామేశ్వరి, ఇ. : "హిందీ–తెలుగుల్లో వాడబడే సమరూప సంస్కృత పదాల అర్థ విపరిణామం: ఒక వివేచన" భాష–జానపదం. తెలుగు సాంస్కృతికసమితి మైసూరు ప్ర.(1981)

కృష్ణమూర్తి, భద్రిరాజు : (సం) 'తెలుగుభాషా చరిత్ర' ఆం.ప్ర.సా. అ. ప్ర. (1979)

చిదానందమూర్తి, ఎమ్ : 'వాగర్థ' (కన్నడంలో) బి. ఏ. పి. పి. కం. ప్ర. (1981)

చిన్నయసూరి, పరవస్తు : 'బాల వ్యాకరణము'

నాగభూషణరావు, కె. : 'రాయలసీమ మాండలికం - అనంతపురం ప్రాంతీయత', డి. యల్. ఏ. ప్ర., సంఖ్య. 3 (1972)

నారాయణరావు చిలుకూరి: 'ఆంధ్రభాషా చరిత్రము' (మొ. సం.) ఆంధ్ర విశ్వ కళాపరిషత్తు. ప్ర. వాల్తేరు (1937)

బ్రహ్మానంద, హెచ్.ఎస్. : 'తెలుగన్నడం'. స్రవంతి 23-12 [1977]

,, ,, : 'రాయలసీమ తెలుగు', స్రవంతి 30-3 పుటలు 12-18 [1983].

మోహన్, జి. యస్. : 'నేసబోయ కులమాండలికం - ఒక పరిశీలన' తెలుగు [త్రైమాసిక వైజ్ఞానిక మాసపత్రిక] జులై-సెప్టె. [1981]

రామనరసింహం, పరిమి : 'మైసూరు తెలుగు', అనంతరాగం, రాళ్ళపల్లి అభినందన సమితి ప్ర. [1977]

,, ,, : 'భాషాబోధన - తెలుగుధాతువులు', భాష-జానపదం, తెలుగు సాంస్కృతిక సమితి ప్ర. మైసూరు [1981]

లక్ష్మీనారాయణశర్మ, కుంటిమద్దికల : 'నారాయణపేట మాండలికం-కొన్ని విశేషాలు' స్రవంతి 23-12 [1977]

సుందరం, ఆర్.వి.ఎస్. : 'కోలారు తెలుగు', భాష - జానపదం, తె. సా. స. ప్ర. మైసూరు [1981]

స్వరాజ్యలక్ష్మి, వి. : 'తెలుగులో అన్యదేశ్యాలు', భ. కృష్ణమూర్తి [సం.] తెలుగుభాషా చరిత్ర, ఆం. ప్ర. సా. అ. ప్ర. [1979]




7

# జీవితం ఇల్యూషన్

జీవితం,

అందమైనది_అదృష్టవంతులకి
విలువైనది_వివేకవంతులకి
బంగరుబాట_బ్రతుకనేర్చినవారికి
అందనిది_అదృష్టహీనులకి
విలువలేనిది_వివేకహీనులకి
అతుకుల గతుకుల బాట_బోర్లాపడితే
సమర్థుడికి_సాధన
అసమర్థుడికి_యాతన
వాస్తవం తెలియకుంటే_అందమైనకల
తెలిసి వస్తే_అంతా కల్ల
మధురమైనది_మధువులా త్రాగితే
దుర్భరమైనది_దుఃఖంతో లాగితే.

అసలు

జీవితం ఏమికాదు
ఒక్కోసారి
ఒకలా కన్పిస్తుంది,
ఒకలా అన్పిస్తుంది.

అందుకే,

జీవితం ఇల్యూషన్.

# మతానికి మచ్చ

మనం
తనయులం
ఎందరం ?
మనం
జీవులం
ఏ దేవుళ్ళ అంశలం??
మనకు తల్లి ఒక్కతే,
తల్లడిల్లే ఆ తల్లి బాధ ఒక్కటే.
మాధవుడయినా,
మహమ్మదు అయినా,
మేరీమాత కొడుకయినా,
అకాలీల ఆరాధ్య దైవమయినా
వాడెవడయినా
మన దేవుడే అయినా !
కంటికి కనిపించని వాడు
నేడు మన సోదరుడి చావుకి కారకుడు?
కంటికెదురుగా మన తల్లి కళ్ళకొలుకులు,
మింటికెగిసే కన్నీటి ధారల చినుకులు,
ఎంత కాలం మోస్తాయి?
"బాధ" అనే భావానికి
"భాషలు" వేరనేభయంతో
ఇంకి పోతాయి.
మతాలకు చెరగని గతంలా,
మచ్చనే మిగిల్చి పోతాయి.

శ్రీ పి. వి. ఎల్. సుబ్బారావు

## శ్రీ ఏ. ఏ. బి. రామారావు

# వీలు

"అమ్మాయిగోరూ ! అమ్మాయిగోరూ!... అబ్బాయిగోరూ!... అంతా అయిపోయింది నాయనోయ్... అంతా అయిపోయిందమ్మోయ్!" లచ్చిమి గట్టిగా అరుస్తోంది.

రెండు నిముషాలలో గదులొకటీ ఒకటీ తెరుచుకున్నాయి. కొడుకులూ, కోడళ్లూ- పెద్దాడబడుచూ ముసలాయన గదిలోకి బిలబిలా వచ్చారు.

కొద్దిసేపట్లో ఇరుగుపొరుగువారూ రావడం ప్రారంభించారు. మురళీధర్‌రావ్‌గారు పోయారన్న వార్త ఊరంతా గుప్పుమంది.

"రేత్తిరి రెండయినాదేటో 'నచ్చిఁవే నువ్వెల్లిపోయే' అనేసి నారమ్మా ఇయ్యాలిలాసూస్తాననుకోనేదు"- సొంత తాతయ్య ప్రాణం తనవడిలోపోవడమే...లచ్చిమికి గుర్తువస్తోంది. తను క్రిందటిరాత్రి ఆ ముసలి ప్రాణందగ్గర లేకపోయాననే అని ఆమె మనసు విలవిల్లాడుతోంది. ఆమె గోడు ఎవరూ పట్టించుకోవడంలేదు. అంతాహడావుడి.

"మంచంమీదే ప్రాణంపోయింది... రామ,రామ!" అంటున్నారెవరో. శవాన్ని క్రిందకు దింపుతుంటే తలగడక్రింద నున్న గుండీ పుస్తకం చిన్నకొడుకు లాఘవంగా తప్పించేశాడు.

పెద్దకోడలికి కంటపడకూడనిదేదో కంటపడిందని ఆడబడుచుకు ఎలాగో తెలిసిపోయింది.

"ఇంకా రావలసినవాళ్ళు ఎవరయినా ఉన్నారాబాబూ?" అంటూ పురోహితుడు పెద్దకొడుకునడిగి అతని కళ్లవంకచూసి దూరంగా తప్పుకున్నాడు.

దహనకాండ పూర్తిఅయ్యేవరకూ ఆ ఇంటిలో నెలకొనిఉన్న ప్రశాంతత తుఫానుముందరి ప్రశాంతతే.

-గదిలో మంచంబదులు జ్యోతి చోటుచేసుకున్నాక పెద్దకోడలు మరిదిని మెల్లగా కదిపింది.

"రాఘవా, తల్లిలాంటిదాన్ని. నాదగ్గర రహస్యమెందుకు ? నువ్ పొద్దున్న నాన్నగారి తలగడ క్రిందనుంచి ఏదోతీసి దాచడం చూశాను. ఏమిటది ?"

రాఘవరావ్ మారుమాటాడలేదు. వదినగారు అతన్ని వదలలేదు. "చూడు రాఘవా, ఈ ఆస్తికి మనమందరమూ వారసులమే- ఆయనగారికయితే పాపం డబ్బు పిచ్చనుకో... కాని మనమంతా ఇంతోఅంతో సంపాదించుకుంటున్న వాళ్ళమే. డబ్బుమొహం తెలియనివాళ్ళం కాదు- నువ్వంటే నాకు ప్రత్యేకమైన అభిమానం... నిన్నుచూస్తే చచ్చిపోయిన మూతమ్మర్ణి చూసినట్టుంటుంది."

"వదినా, నేబయటకు వెళుతున్నా... మీరు ఏవేవోగుర్తుతెచ్చుకుని బాధపడకండి... మీ చెల్లెలికి ఒంట్లో నలతగా ఉందని మేడదిగలేదు. ఇంటినిండా మనుషులు... చచ్చిపోయినవాళ్ళతో మనమూచచ్చిపోలేం. వంటమనిషికి దగ్గరఉండి రాత్రికి తిండి ఏమిచెయ్యాలో చేయించండి!"

రెండో అబ్బాయి కారుతాళాలు జేబులోనుంచి తీస్తూ బయటకు నడిచాడు.

పెద్దకోడలు వెంటనే లాయరు రంగనాధంగారికి ఫోన్‌చేసింది. "మురళీధర్‌రావ్‌గారు వీలునామా రాశారు... నన్ను సాక్షిసంతకం చెయ్యమన్నారు. నేనుచేశాను... ఆస్తి ఎవరికిరాశారో నేను చెప్పలేను. వీలు గుండీ పుస్తకంలో ఉంచడం నేనుచూశాను..." లాయర్ ఫోన్ పెట్టేశాడు.

రాత్రి పదయ్యాక ఆ లాయరును తీసుకువచ్చి మరిదిని నిలదీసి అడిగింది పెద్దకోడలు.

"మీరే చదివి వినిపించండి" అంటూ వీలునామా ఆయన చేతికిచ్చి మేడమీదకు వెళ్ళిపోయాడు రాఘవరావ్.

వకీలుగారు తీరికగా చదవడం మొదలెట్టారు.

నీటిలో మునిగి ప్రాణం పోయేక్షణంలో మనిషి జ్ఞాపకాలన్నీ ఒక తృటి కాలంలో మనసులో గిర్రున తిరుగుతాయంటారు. ఆ అనుభూతి నా కెందుకో కలుగుతోంది.

అయినా ఇంతవేగం చచ్చిపోను- మరో రెండేళ్ళయినా బ్రతుకుతానని డాక్టరుగారు ఆశకల్పించేటట్టు మాటాడుతున్నాడు. పెద్దాడితో ఈ అర్థం వచ్చేటట్టు ఆయన అంటూవుండటం నాచెవినపడింది.

కాళ్లు పొంగుచూపినా ఫర్వాలేదట.

కాని ఎవరు చెప్పగలరు ! వానతాకట లాంటిదే ప్రాణం పోకట ...క్షణం మనది కాదు - ఈ మాట జ్ఞానంరాని వయసునుంచీ వింటున్నదే.

—అంటా తంటా లేని — వ్యాపారం చేపట్టాను. బ్రాహ్మడికి వ్యాపారం ఏమిటన్నారందరూ.

ఎంతకాలం వచ్చినా మర్యాదేమవుతుందోనన్న భయంతో ఊపిరి బిగించి ఉగ్గబట్టుకోడంవల్ల రక్తపుపోటు తెచ్చుకున్నాను.

—ఈ ముసలాడి గోడు ఎవడు వింటాడు! వినాలని ఎవరికుంటుంది? ఇదో సొద—దీనికి అంతుండదని మీరందరూ విసుక్కుంటూ ఉంటారు.

ఎన్ని కష్టాలు పడ్డానా! మూర్ఖులారా! నా బాధ మీకెలా తెలుస్తుంది! నేనేం చెప్పినా, చెప్పగలిగినా మీరెలా అర్థం చేసుకోగలరు!

పిల్లలు తల్లిదండ్రులకు — ముసలై మంచంపట్టిన వాళ్ళకు — ఋణపడి ఉండాలా?— 'వాళ్ళకి వీళ్ళేంచేసేరని! వాళ్ళనడిగి—వాళ్ళ కోసం కన్నారా?'— ఈ ధోరణి పదహారేళ్ళ వయసు తరవాతే ఎందుకు వస్తుంది?

—వెధవ, ముసలాడు — చావాచావడు — చావా ఇవ్వడు — అని మీచేత విసుళ్లూ—కసుళ్లూ తింటూ-శరీరంలో వింత బాధలతో ఎలారా పడడం?

చచ్చేవాడినేరో! నాకూ చావాలనే ఉంది. కాని ఆ ఘడియ రావాలి కదా, నేనేం చెయ్యను చెప్పండి!

పిల్లలుకారు మీరు రాక్షసులై పోయారు. కొంచెమయినా మమతా' మానవత్వం లేకుండా ఇలా తయారయ్యారేమిటా అనే నా ఆవేదన.

—నాకేం, ఇద్దరు కొడుకుల చేతిమీదగా పోతున్నాననే తృప్తి లేద్రా — అది నా ఖర్మేమో!

ఏ జన్మలో ఏ పాపం చేశానో! ఈ జన్మలో చేసినవి మీ కోసమేరా! కనుక్కన్నవాళ్ళే నన్ను నీచంగా చూస్తున్నారు. పువ్వోపువ్వోమని పెంచుకున్న పిల్లల ఆప్యాయతకి నోచుకోలేక పోయాను. నేనేం తప్పు చేశానని?

—కాస్త డబ్బుదగ్గర కాఠిన్యం వహించాను. డబ్బు సంగతే అంత. మరికొంచెం పిడికిలి వదులుచేస్తే పిల్లలకి చిప్పే మిగులుతుందని ఆరాటపడి చచ్చాను.

అన్ని పరిస్థితులలోకీ మహా నికృష్టమైంది దారిద్ర్యం. అదంటే నాకు భయం.

అందుకేకదా పెళ్లి చేసుకుంటానని మాట ఇచ్చిన లలితకి దూరమై— నీచమైన ద్రోహంచేసి— మనసులోనే కాకుండా, గుండెలో ఓ ముక్కని గునపంతో పెళ్లగించి-నరసమ్మని పత్నిగా స్వీకరించాను!

పిల్లకాకులకేం తెలుస్తాయిరా ఉండేళ్ల దెబ్బలు!

ఇక నా వీలునామా...

నా బాధ తదనంతరం... నా సపర్యలు చెయ్యనవసరంలేని కర్మైముందు—తృప్తిగా ఊపిరి పీల్చుకునేముందు—నా రక్తం పంచుకుని పుట్టిన నా బిడ్డలు—ఈ నా మాటలు శాంతం వినాలి—వినితీరాలి.

మీ అమ్మ మీ నాన్నలాంటిది కాదు. మహా ఇల్లాలు. నామాటకెప్పుడూ ఎదురు చెప్పలేదు. పుణ్యాత్మురాలు—కాబట్టే నాకంటే ఐదేళ్లు ముందే ఈడుపోతలుపడకుండా నాలా తిట్టించుకోకుండా కన్ను మూసింది.

దానికి జరిగినట్టు నాకు ఏనాడూ జరగలేద్రా.

డబ్బు సంపాదించేరోజుల్లో అదొక్కటే నా యావ. అది పడిపోయిన తరువాత ఉన్నదాన్ని భద్రపరచుకోవాలన్న తాపత్రయం.

డబ్బు సంపాదించడంకంటె కష్టంరా దాన్ని భద్రపరచుకోడం! ఎలా సంపాదిస్తున్నామన్నది కాదురా ప్రశ్న. ఎలా ఖర్చు పెడుతున్నామన్న ఆలోచన ఉండాలి. అది ఒంటికీ, ఇంటికీ మంచిది.

నరసమ్మ పోవడంతో నా రక్తపుపోటుతోపాటు నా పాట్లు పెరిగి ఎగసి పడడం ప్రారంభించాయి.

ముసలి వెధవ కన్నుమూసేముందు—ఎప్పుడు ఈ గది ఖాళీ అవుతుందా అని పిల్లలు ఎదురు చూస్తున్న తరుణంలో రాయాల్సిన వీలునామా నాకు మరో వీలు కలుగచేస్తోంది.

నా మనసులో మాట—నా మనసులో బాధ వాళ్ళ గుండెల్లోకి జొరబడాలి.

—మమత పెంచుకున్నందుకా నాకీ శిక్ష?

ఏది పిసినారి తనం? ఏది జాగ్రత్త? వీటిమధ్య గీత ఎంతటిది? కట్టుకున్న దానికి తెలుసురా నాది పిసినారితనం కాదని— కట్టుకోకుండా వదిలేసిన దానికీ తెలుసురా నా మనసు!

పిల్లవెధవలందరినీ చదివించానా, దానికెంత ఖర్చయింది? ఆ డబ్బు నేను జాగ్రత్తగా ఉండకపోతే కూడపెట్టడం సాధ్యమయ్యేదా?

నా చిన్నతనంలో నేనెంత బీదరికం అనుభవించానో మీకెలా తెలుస్తుంది! ఆ సత్తి కాలపు రోజుల్లో పెద్దాడికి నెలనెలా రెండేసివందలు పంపుతూ ఉండేవాడిని. వేనగా ఎంత? నా వ్యాపారఘనగా ఎంత? ఇంతకీ ఆ రోజుల్లో!

అది వాడికేమయినా తెలుసా?

బీద ఇంటి పిల్లయినా — నేను డబ్బువాపి మనిషినే అయినా— వాడు ప్రేమించాడని—ప్రేమంటే గుండెలో ఎలా తొలిచేస్తుందో తెలుసు కాబట్టి ఆ పెళ్ళికి ఒప్పుకున్నా.

నరసమ్మ నా స్వభావం తెలిసి వాళ్ళవాళ్ళని అవీ ఇవీ పెట్టమంటే మాత్రం- డాక్టరు చదువుకున్న పిల్ల—తనుపడుతున్న కోడంత్రి కానికి బాధ్యత అంతటినీ నా మీదకే నెట్టాలా?

——తన తండ్రినయితే డాక్టరమ్మ అలాగే చూస్తుందా?

పోనీ కోడలయితే పై ఇంటినుంచి వచ్చినపిల్ల— మరి కొడుకో- కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది—అలాగని ఊరుకోలేంకదా!

ఈ ఆస్తి నా స్వార్జితం... ఈ మేడ...

నేను బొక్కికొంపకొని పదేళ్ల తరువాత— పాతకాలం రోజుల్లో ఇటిక ఇటికకీ డబ్బు కూడచేసి సిమ్మెంటుబస్తా ఐదు రూపాయల రోజుల్లో అణా అణా పోగుచేసి కట్టించుకున్న మేడరా ఇది!

కొడుకూ, కోడలూ, ఇద్దరూ డాక్టర్లు నీకేం మహరాజువి అంటారు నాకు తెలిసినవాళ్ళు. వాళ్ళతో చెప్పుకోను!

శెలవుపెట్టి ఏ ఒక్కరూ నాదగ్గర పట్టుమని పదిరోజులుండరు. అదరాబాదరా రావడం ఇంకాచావడని వెళ్ళిపోవడం. నాబాధ మామూలే.

పోనీ కూతురు ఉందంటే— ఏటేటా కాన్పులు నత్తానావా పిల్లలు- నేనెలావస్తానంటుంది.

'ఆయనకు శెలవులేదు. మరో పదివేలుంటే కారుమారుస్తానంటున్నారు... ఒడ్డికేలెండి.' అంటుంది నాకూతురు.

కూతురి కాఠిన్యం కొడుకుల కాఠిన్యంకంటె బాధకలిగిస్తుంది.

ఆచిన్న వెధవ చిన్ననాటినుంచి ఆకతాయివెధవే. వాళ్ళమ్మయితే ఎలాగో వాడిని బుజ్జగించి మెల్లగా బి.కాం. చేయించింది.

ప్రేమించేస్తే గొడవని నాస్నేహితుడి కూతురినిచ్చి ముందే పెళ్లిచేసేశాను. వాడిగోలవాడిది. వాడూ-వాడిపెళ్ళాం... మేనమామల పోలికవెధవకి.

వెధవాయిలు తల్లిమంచాన బడితే బిలబిలావచ్చేశారు. ఊరట కబుర్లు చెప్పారు. కాలూ, చెయ్యీ రాశారు.

మరి నేనేం పాపంచేశాను?

నిన్న డాక్టరుమొహం అదోలా పెట్టాడు. నేను బ్రతికివుండటం చూసి ఆశ్చర్యపోయినట్టున్నాడు. ఈ కుర్రకారుల్ని ఇంతప్పటినుంచీ చూసి వాళ్ళబుర్రల్లోని ఆలోచనలను తెలుగు లిపిలా చదివేస్తాను- పిల్లకాకులు వాళ్ళకేం తెలుసు!

రోగం తీసుకుపోయేదే అయినా ఎందుకోగట్టిగా మొరాయిస్తోంది ప్రాణం వెళ్ళనని.

నా ఆవేశం... నా అక్కసు తీర్చుకోవాలి. ఈ వెధవలకి సరియైన శాస్తిచేసే చావాలి...

లేచికూచోలేను. రాయకుండా ఉండలేను. కొద్దికొద్దిగా రాస్తూ ఆపుతూ మెల్లమెల్లగా నా ఆలోచనలని అక్షరాల్లో పొందుపరుస్తున్నాను.

ఇక్కడ ఎవరూలేరు. అసలు ఎవరుంటున్నారు. ఆ లచ్చిమి గోడకు జేరగిలబడి నిద్దరోతోంది. పాపం చిన్నముండ! దానిఋణం ఎలాతీర్చుకుంటారో వెధవల్లారా!

మమతకి రక్తసంబంధం అక్కరలేదు. మనిషిలో వుండాల్సిన మనసుంటేచాలు.

వారంరోజులై రాస్తున్నా, వీలునామా తెగిచావడంలేదు. ఎవరికి రాయాలీ ఈ ఆస్తి?

నా ఆస్తికివారసత్వపు హక్కు నా కడుపున పుట్టిన పిల్లలకి లేదు. వాళ్ళు ప్రాజ్ఞులుకారు- డిగ్రీలున్నాయంతే... ఇది నా స్వార్జితం ఈ ఆస్తి నేను ఎవరికి రాసినా అది నా పిల్లలకళ్ళు తెరిపించేటట్టుగా వుండాలి.

ఇది నాపూర్తి స్వస్థతతో, నాపూర్తి మనసుతో, చిత్తశుద్ధితో దీర్ఘంగా ఆలోచించిన తరువాత నా స్వదస్తూరీతో రాస్తున్న వీలునామా!

పాపం లచ్చిమి! మారు మనువాడడానికి డబ్బు నేనిస్తానన్నాను.

లలితకోసం ఎప్పుడో ఓక్షణం ఆవేశంలో చేయించిన గాజులు నరసమ్మతో-ఎవరివోప ద్దువని చెప్పినవీ ఓ గొలుసూ లచ్చిమికివ్వాలి.

మనుషుల పుట్టుకతో జాతినిర్ణయింపబడడం కేవలం అసందర్భం మనుషులు మనుషులా రాక్షసులా అన్నది వాళ్ళఆలోచనలమీదా,వాళ్ళు చూపించగలిగే జాతిమీదా ఆధారపడి ఉండాలి.

లలిత విసుక్కుంది. అందంగా కోపగించుకుంది.

"ఛీఛీ! ఇవేంపనులు!" దొరికినట్టేదొరికి పారిపోయింది.

"నేను నిన్ను పెళ్ళిచేసుకుంటాను" అన్నా... లైంగికానుభవంలో అనుభూతిలో మగాడికి స్వార్థమేఎక్కువ! ఆడదానికి అంత స్వార్థంఉండదేమో!

నాన్నపోయాక వాళ్ళనాన్న నాతోనే సంప్రదించాడు.

నాకుడబ్బు కావాల్సివచ్చింది.

లలిత మాఅమ్మ కొంగుపట్టుకు తిరుగుతూవుండేది. "అత్తయ్యా"! అంటూ మురిపాలు పోయేది.

నానుంచి ఏం ఎదురుచూసిందో! ఏకాంతంలో ఎన్నిసన్ని వేళాలు!

'మురళీ, నాన్ననాకు పెళ్ళిసంబంధాలు చూస్తున్నారు!' అంది గడుసుఘటం.

దానిపిలుపులో ఎంతమార్దవం...ఎంత ఆర్ద్రిత...ఎంతవలపు-ఎంత మమత!

నేను పన్నెండువేలు కట్నంతీసుకుని నరసమ్మమెడలో పుస్తె ముడివేశాను. నా బ్రతుకు కుదటపడడంకోసం చేశానని, కుటుంబంకోసం నేనో త్యాగంచేశాననీ నన్నునేను సమాధాన పరచుకున్నాను... కాని కొడుకుల నెత్తుకున్న నా కొడుకులు ఎప్పుడయినా నన్ను మనిషిగా చూశారా? నాకూతురు నన్ను 'నాన్నా!' అనిపిలిచి డబ్బుఅడగకుండా ఎప్పుడుంది కనుక! ఇక మనవలా, నా గదిలోకివస్తే నాజబ్బు అంటుకుంటుందని నమ్ముతారు! పెద్దవాళ్ళన్నమాటలే. పాపం వాళ్ళకేం తెలుస్తుంది. నా గదిలో కంపట!

ముసలాడి శరీరంలోనుంచి సుగంధం ఎలావస్తుందర్రా! మీరు అసహ్యించుకున్నా మీకూ ఓనాడు ఇది తప్పదని తెలుసుకోరేం?

నాతదనంతరం నా స్వార్జితమైన ఈమేడా, బ్యాంకుల్లో నాపేర వున్నడబ్బు- నాభార్య నగలూ...

పాపం లలిత! కట్నాలిచ్చుకోలేక పట్టబ్బుర బ్రాహ్మడికి కట్టేశారు. వరసగా ముగ్గురు పిల్లల్నికంది. లారీయాక్సిడెంటులో డ్రైవరు తుక్కయిపోయాడు. లలిత వితంతువైపోయింది.

నా ఆస్తి అంతటినీ నాతదనంతరం లలితకి సంక్రమించేటట్టు రాసేస్తే?

నా తదనంతరం-

లలితకి డబ్బుఎలా ఖర్చుచెయ్యాడమో తెలీదు. పిల్లలు లారీలు తోలుతూనో, కడుగుతూనో, బ్రతుకుతున్నారు... బంగారంబొమ్మలాంటి లలితగుండూ, అడ్డకట్టూ చూడటానికి వీల్లేకుండా తయారైపోయింది. దీనిదుంపతెగ సరిగా తిండయినాలేకుండా ఏటేటాపిల్లలట... అదేం మనుషులమో అదేం యావో!

దానికెందుకు డబ్బు! నేను లలితపేర ఆస్తి రాసేస్తే నాకూ లలితకీ అక్రమ సంబంధం ఉందని అనేసినా అనేస్తారు పిల్లవెధవలు.

—లచ్చిమికీ నాకూ రంకే కట్టేసింది పెద్దకోడలు! ఏమి చదువులో ఏమో! డాక్టరు బుర్ర— దానినిండా కుళ్ళే ఉండాలా?

ఆ పెద్దకొడుకూ, కోడలూ డాక్టర్లు కాకపోయి ఉంటే లచ్చిమి వయసు మనవరాలే ఉండేదినాకు. గుంటపూలు పూస్తున్నారు. ముప్పైఐదోఏట మొదట కానుపా?

లలితకి ఆస్తిఇచ్చి ప్రయోజనం లేదు... ఆ నగలు చేయించాను, ఇవ్వగలిగానా? కనీసం ఎదుటపడి మాటాడగలిగానా?

అదిరా జీవితంలోని ఆంతర్యం! తమాషా!

—అనాధశరణాలయంలోని పిల్లలకి తల్లితండ్రుల ఆలనాపాలనా ఉండదు. వాళ్ళకి కొంచెం సుఖం ఏర్పాటు చేసిన వాడినవుతానేమే! నా పేరు చెప్పుకుంటారు కుర్ర నాగమ్మలు....

ఈ వీలునామా సొంతం చదివాక సువర్ణ కళ్ల ఎలాపెడుతుందో నేను ఒక్కక్షణం చూడగలిగితే ఎంత బాగుణ్ణు!

—కొన్ని కోరికలే వికృతంగా ఉంటాయి. అనాధశరణాలయాల్లో ఉండే ఓ అబ్బకీ అమ్మకీ పుట్టినివాళ్ళకోసమా ఇన్నాళ్లు—ఇన్నేళ్లు కష్టపడి ఈ ఆస్తి పోగుచేశాను! డబ్బు కోసమని నా పిల్లలకే నేను దూరమైపోయానే!

ఆస్తి ఎవరికో రాసేసి చచ్చికూడా శాపనార్థాలు తినేదా?

—పాపం! లచ్చిమి కష్టపడి పనిచేస్తూవచ్చింది. మారుమనువు కెళ్ళకుండా, నీతిగా ఉంటోంది. దానికి రాసిచ్చేస్తే!

దాన్నిచూస్తే ఎందుకో చంటిది గుర్తొస్తోంది. బ్రతికిఉంటే చంటిదానికి దీని వయసే ఉండేది. ఎప్పుడూ నా దగ్గిరే పడుకునేది...

—ఇక పెద్దది... దాని మొగుడు తెమ్మంటే అడగక ఏం చేస్తుంది? ఆడదానికి మొగుడంటే ఎందుకుచెప్మా అంత అభిమానం! ఇక చిన్నాడు... నేనువాడిని విచ్చలవిడిగా ఖర్చు చెయ్యనివ్వనని వాళ్లావిడదగ్గర వాడికి నామోషీ! ఇక పెద్దాడా...డాక్టరుమరి. రెండు చేతులా సంపాదన! నేను ఎలాగూ బ్రతకనని తెలుసు. నా దగ్గర కూర్చుంటే ఏం లాభం? నా పోలికేవాడికి! ఏది ముఖ్యమో అదే—అంతే! పిల్లలు కాన్వెంటు చదువులు... ఓ పూట పాఠం పోతే ర్యాంకు పోయే ప్రమాదం ఉందట. వాళ్ళగొడవలు వాళ్ళవి.

—నా పిల్లలూ—వాళ్ల పిల్లలూ, వాళ్లవాళ్ల పిల్లలూ మమత మరిచిపోకుండా ఉండాలనే నా దీవెన.

—ఇందుమూలంగా ఖరారుగా తెలియచేయడమేమనగా — నా తదనంతరం నా ఆస్తి— నా పిత్రార్జితమైతే ఏ విధంగా నా పిల్లలకు చెందుతుందో—అదే విధంగా — ఈ ఆస్తిఅంతా నా పిల్లలకే చెందాలి. ఆస్తి పంపకాలు వాళ్లలోవాళ్లే చేసుకోవాలి. ఆస్తి పంపకాల మరుక్షణం — నా అనుభవాల ఈ చివరిచిట్టా నా కట్టెలాగే నిప్పులలో వెయ్యాలనీ ఇందు మూలంగా నా చివర కోరికగా చెబుతున్నాను."

—వకీలుగారు కాగితాలు మడిచి "ఇక మీ ఇష్టం!" అని పెద్దబ్బాయి చేతిలో ఉంచారు.

"అన్నట్టు మరిచిపోయాను...లచ్చిమికి ఇమ్మని నా చేతికి కొంత డబ్బూ, బంగారం ఇచ్చారు. ఆ సీలుచేసిన కవరు మీ సమక్షంలో ఆమెకిస్తాను. ఆమెకు కబురు చెయ్యండి!"

మురళీధరరావ్‌గారు పిల్లలు ఒకరి ముఖాలు ఒకరు చూస్తు కుంటూ అలా ఉండిపోయారు.

శ్రీ కావూరు పాపయ్యశాస్త్రి

# శ్రీమద్రామాయణ కల్పవృక్షము

# సుందర కాండము - సీతాచారిత్రము

వ్రాసిన రామచంద్రుడు కథ వ్రాసితినంచని పించుకో వృధా
యాసములేల కట్టుకత లైహికమా! పరమా! యటంచు దా
జేసిన తండ్రి యాజ్ఞయును జీవుని వేదన రెండు నేకమై
నాసకలోహ వైభవసనాథము నా కథఁ రచించెదఁ.

రామాయణ మహాకావ్యమును వ్రాసే అసామాన్య శక్తి తన పుత్రున కున్నదా? లేదా? అనే శంక యేమాత్రం లేకుండా చిన్ననాడు పద్యములు గిలుకువేళ తండ్రి చేసిన ఆజ్ఞ ఒక కారణము కాగా, జాగ్రత్స్వప్న సుషుప్తుల యందు గూడా మానస జిహ్వలు రామనామ గ్రహణం చేయు తన జీవుని వేదన మరో కారణంగా శ్రీమద్రామాయణ కల్పవృక్షమును రచింప బూనినట్లు విశ్వనాథ సత్యనారాయణగారు అవతారికలో చెప్పుకొనినారు. ప్రాచీనాంధ్ర మహాకవులను తలపించేలా, మరపించేలా తన ప్రతిభావ్యుత్పత్తుల వినియోగించి ఒక మహాతపో దీక్షతో సార్వకాలికమైన ఈ మహా గ్రంథమును విశ్వనాథ ఆంధ్ర సాహిత్యంలో వెలయించాడు.

కూజంతం రామరామేతి మధురమ్ మధురాక్షరమ్
ఆరుహ్య కవితా శాఖామ్ వందే వాల్మీకి కోకిలమ్॥

మహాకవి వాల్మీకి మహర్షిని స్తుతిస్తూ చెప్పబడిన ఈ శ్లోకమును విశ్వనాథకు అన్వయించు కున్నట్లయితే ఆంధ్రసాహిత్యోద్యానవనంలో ఆ కోకిల విశ్వనాథ.

మహర్షి వాల్మీకి తన రామాయణమును - "కావ్యమ్ రామాయణమ్ కృత్స్నమ్ సీతాయాశ్చరితమ్ మహత్" అని సీతాచారిత్రముగా పేర్కొనెను. రామాయణమునందలి సుందరకాండమునందలి సీతకును తక్కిన కాండముల యందలి సీతకును అత్యంత వ్యత్యాసము కలదు. సుందరకాండము నందలి సీత అహోరాత్రులు రామధ్యాన మగ్నయై తన మనమును రామప్రభువు పైననే కేంద్రీకరించి తపమున మునిగిన తపోమూర్తిగా భాసించును. జీవాత్మ పరమాత్మను జేరుటకు అనుభవించు పరితాపమున కామె ప్రతీక. కావుననే రామాయణ సుందర కాండమున కంత వైశిష్ట్యము చేకూరినది. ఇందు సీతాహృదయము ప్రదర్శింపబడినది. రామవియోగ దుఃఖాకుల స్వాంతయైన సీతాకాంత యొక్క పాతివ్రత్యము - పరిశుద్ధమగు నైగమార్థ తేజము వంటి వినిర్మల సీతాచారిత్ర్యము-బ్రహ్మజ్ఞానియు విశుద్ధ తత్త్వాకారుడు నగు హనుమంతుని చేత కీర్తింపబడినది. ఆనాడు హనుమ దర్శించిన; వాల్మీకి మునిపుంగవుడు దర్శించిన, సీతాదేవిని విశ్వనాథ తాను దర్శించి, మనకు దర్శింప చేయుచున్నాడు.

* * *

శ్రీరామచంద్ర సేవా విశిష్ట కార్యార్థియై మహానుభావుడు, మహాత్ముడు నగు హనుమంతుడు సీతాన్వేషనార్థమై వినువీధిని బయలుదేరినాడు. ఇక్కడ విశ్వనాథ మహోదాత్తమైన ఉపమాలంకారం ద్వారా సుందరకాండ సారమ్మునుద్ధరించినాడు.

స్తుత్యము నైగమార్థ పరిశుద్ధము తేజము సీత, సోమకా
పత్యని భుండురావణుడు, వాయుతనూజుడు మత్స్యమై సదా
గత్యుప మానమూర్తి కనగా బొలుపొందెను ఖేచరీనరీ
నృత్య దుదారనేత్ర శఫరీ వియదర్ణవ మీదుచుండగఁ॥

"సీత వేదార్థమువలె పరమ పవిత్రమైనది" యను నీ యుపమానము పరమ పవిత్రమై, పరమోత్కృష్టమై ఆమె నైర్మల్యమును పవిత్రతను ప్రదర్శించు చున్నది. వేదము వంటి సీతామాతను రావణుడను సోమకాసురు డపహరించినాడు. శివాంశ సంభూతుడును, పరమ భాగవతోత్తముడు, సాక్షాత్తు శ్రీరామ హృదయ మనదగిన ఆంజనేయుడు మత్స్య మూర్తియై వేదోద్ధరణార్థమై గగన మహార్ణవము నీదుట ఆర్ష ధర్మమును, వైదిక ధర్మమును ఉద్ధరింపబూనుట. హనూ

మంతుని మత్స్యమూర్తిగా చెప్పుట భక్తాగ్రేసరుడైన హనుమకు, భగవంతునకు అభేదత్వము సూచించుట ఇందలి మరొక విశేషము.

*  *  *

హనుమ లంక యందు అవనిజ కొరకు గాలించు చున్నాడు. చంద్రోదయమైనది. చంద్రు డెట్లున్నాడు ?

"మున్ను జూడ నట్టి భూజాత గుర్తింప
బోవదేమొ కపి విభుండటంచు
దల్లి మోము పోల్కి తా జూపు చున్నట్లు
చెలగె మింట కలువ చెలిమికాడు."

ఇక్కడ వర్ణన చంద్రుని గూర్చి. అందుననే మరొకవైపు సీతా వదన సౌందర్య వర్ణన. సీతమ్మతల్లి మోము చల్లని జాబిల్లి వంటిది. తల్లి చూపుల నుండి అమృత వృష్టి కురియును అని హనుమ ఆలోచన.

*  *  *

హనుమ యింటింటా సీతను వెదకు చున్నాడు. ఆ రాక్షస నగరిలో అంతటా అందరూ మధుపానమత్తులై శృంగార క్రీడాసక్తులై యున్నారు. వారిని గని హనుమ - "ఇంతటి యింద్రియ జ్ఞానము మాలిన సుషుప్తి భావమునకును నిత్యజాగ్రదవ స్థాభూతయగు జానకీ దేవికి సంబంధము లేదు" - అనుకొంటాడు. జనకజ జ్ఞాన జ్యోతి. ఆమెకు సుషుప్తి యుండదు. ఆమె ఇక్కడ పేరుకు మాత్రం సీత. కాని ఆమెలో సత్యమైన పరతత్త్వం నిక్షిప్తమై యున్నది. కనుక ఆమె నిత్యజాగ్రదవస్థాభూత యగును గాని సుషుప్తిలో మునుగదు. అట్లే జరిగిన విశ్వమంతయు అంధకారబంధురమగును.

ఎంత వెదకినా సీతాకాంత కనుపించలేదు. అంత హనుమ ఒకచో నిలచి ఆమె ఆకృతిని తలపోసెను.

"యి, ట్లని మదినెంచె భూమి సుత యాకృతి యంజని సూనుడామె ప
చ్చని పసినిమ్మపండు మెయి చాయగ నుండును పొట్టికాదు, కా
దని పొడుగైన నను గాదుచితమైన ప్రమాణము బొమ్మయుండెడిన్."
అని ఆమె పవిత్రా కృతిని తలపోసి  ...  ...

"ఆమె పదంబులం గనిన యంతన పాదములందు వ్రాత్రలం
పామెయి గల్గునం చెడద నంకురితంబయి..."

ఆమె పరమ పవిత్ర గాత్రి. ఆమె పదములు పరమ పథము నకు నిధానములు. ఆ చరణాల అన్వేషణ కొరకు మహాతప స్సంపన్ను డైన ఆంజనేయుని తపన. ఆ తపస్సులో ఎన్నో రూపాలు ఎదుట నిస్తులున్నవి. మనసును మరింత కుదుటపరచుకొని హనుమ ప్రయత్న మును కొనసాగిస్తున్నాడు- తనకు కావలసిన శ్రీచరణముల కొరకు. ఇక్కడ సీతాదేవి రూపలావణ్యములకు అద్దం పట్టాడు విశ్వనాథ. ఆ అద్దము హనుమ హృదయము.

*  *  *

అంతకు మునుపెన్నడూ సీతను చూచి యుండలేదు. కావున-

"ఎఱిగి యున్నవారి నెఱుంగగ నగుగాని.
యెఱుగ నట్టివారి నెఱుగు టెట్లు"

తెలిసిన వారి కొఱకు ఎంతైనా శ్రమపడి వెతకవచ్చును. తెలుసుకోవచ్చును. అసలెన్నడూ చూడనట్టి వారిని ఎలా తెలుసు కోవడం ? అని హనుమ హృదయములోని సందేహ మందేహుడు జ్ఞాన సూర్యుని అడ్డుకొనగా ...  ... కొంత తడవునకు జ్ఞాన సూర్యుడు సందేహమును జయించి-

"అవని జాత నెఱుగ ననుటెట్లు పొసగునో
యింత రామ చంద్రు నెఱిగి ఎఱిగి"

అని భావించి సీతారాముల రూపములను ధ్యానించుచూ అంతర్వీక్షణలో బడి పోగా -

"అంతలోన దేవి యంతర్హితంబయ్యె
నిలచె రామమూర్తి నీరజాక్షు
డంత హనుమ యెఱిగె నాత్మలోపలి తన
రామ మూర్తి కాడు రామమూర్తి"

హృదయమునందు శ్రీరామ చంద్రాకృతిని తలపోసి తదను గుణముగా సీతాదేవి రూపును నిలుప యత్నించుచుండ ఆయమ రూపు ఒక మెరువు తీగవలె భాసించి అంతర్హితమయ్యెను. మందహాస రుచిరాననుడగు "రామమూర్తి" నిలచియుండెను.

"రామమూర్తి కాడు రామమూర్తి" యన్న శ్లేషచేత సీతా రాముల యభేదత్వమును విశ్వనాథ అత్యంత ప్రతిభావంతముగ చెప్పినాడు. ఇచ్చట విశ్వనాథ స్వయముగ హనుమ యైనాడు. రామమూర్తి యను మాటలో శ్రీరామమూర్తి – స్త్రీమూర్తి (సీతాదేవి) యను రెండర్థములలో శబ్దార్థములయందు రెండింటను సార్థక ప్రయోగ మొనర్చి భాషపై తనకుగల యధికారమును చమత్కారముగా ప్రదర్శించినాడు. ఆ "రామ" యే ఈ "రాముడు"; ఈ "రాముడే" ఆ "రామ". ప్రకృతి పూరుషుల అవిభాజ్య, అవినాభావ సంబంధము నకు యిది మహోదాత్త రూపకల్పన.

*  *  *

అశోక వనిలో శింశుపా వృక్షము క్రింద భాష్పధారాఝరీ భూమిధర దృశాంతయై, వస్త్రమాలిన్య సంభార మూర్తియై, ఏక వేణీధరయై, ప్రౌఢ దంష్ట్రాకాళ రాత్రుతా రాక్షసీ గణము కత్తులు పూని కాయుచుండ – సూర్యాగ్ని తేజో విలాసదేహయైన రాఘవుల యింటి కోడలగు సీతాదేవిని దర్శించి–

"ఈయమ ముఖాబ్జమున నే
వో యాధ్యాత్మిక మహస్సులు దితజ్యోత్స్న
ప్రాయముగ నుబికి వచ్చెడు
నీయమ జానకియె సంశయేతర ఫణితిన్"

భర్తృవియోగ దుఃఖాకుల స్వాంతయై, మూర్తీభవించిన శోక దేవతయగు సీతాకాంతలో ప్రాకృతమగు ఆమె యాకృతిని ఆ మహ నీయ తపస్వి దర్శింప గలిగాడు. ఆమె ముఖమండల మొక ఆధ్యాత్మ తేజోమండలము. పాతివ్రత్య దీధితులకు నిధానము. ఇంత తేజోమూర్తి సీతకాక మరెవ్వరు? నిస్సంశయముగా సీతయే యని భావించుచు...

చేతమునందుఁ బూర్వమున శ్రీ రఘురాము నెఱింగినట్లుగా
నే తల పోసినాడ నిపుడీయమ గాంచిన యంత సర్వము
జ్ఞాతము గాగ నుండె నను సంగతి నాకెఱుగంగ నయ్యెడున్
సీత నెఱుంగకుండ రఘుశేఖరు డర్థముగాడు పూర్తిగా॥

సీతలేక రాముడు లేడు. సీతా తత్త్వము దర్శించిననే గాని రామతత్త్వమర్థముగాదు. సీతను తెలుసుకొనలేకపోయిన రాముడర్థము గాడు. అప్పుడీ సమగ్రమైన జ్ఞానము సంప్రాప్తమైనట్లగును. కావుననే ఒకరులేక మరొకరు లేరు. ఇరువురూ లేక విశ్వము లేదు. కనుకనే వాల్మీకి రామ కథను సీతా చారిత్రముగా పేర్కొనెను. ఈ భావననే విశ్వనాథ పై విధముగా చెప్పినాడు.

సీత యెవరు? రాముడెవరు? వారిరువురు నొక్కరే కదా! ఒకరినొకరు పరిపూర్ణులను చేయువారే కదా!

పూర్ణ ....................... .. ...................
................................................ పూర్ణమేవావశిష్యతే॥

మఱి అట్టివారిని విడదీయనెంచుట ఎంత మూర్ఖత? సీతా హృదయముననే గదా రాముడుండునది! రామ హృదయాధి దేవత సీతయే గదా! మరి వారిని విడదీయనెంచుట అజ్ఞానుల పనికాదా! అది ఎటువంటిదన కాయముతో జీవమును వేరు పరచుకొనుట. అనగా ఆత్మ హత్యా సదృశము!

"ఈ యిద్దరి నయ్యో విడ
దీయగ యత్నించు నట్టి తెలివి తెలివియా!
కాయమ్మును జీవముతో
బాయగ జేసికొను వ్యర్థ భావన కాకన్"!

కావున వివేకవంతుడైనవాడు గమనించవలసినదేమనగా....

"ఆయన వీడిలేదు జలజాయత లోచన భూమి జాతతా
నీయమ వీడిలేదు జలజేక్షణుడా రఘురామమూర్తి.."

"ఈ సీతారామ తత్త్వమే పరబ్రహ్మ తత్త్వము. అది సంసార మూలకందము" అని గుర్తించగలవాడే జ్ఞాని యని తాత్పర్యము.

* * *

క్రూరులు, వికృతాకారులు; ధర్మదూరులు; నాగరకతా హీనులు నగు రాక్షసి మూకల నడుమ సీతాసాధ్వి– "పంచాగ్ని మధ్యంబు నందుండి తపించుచున్న మహా యోగీశ్వరి వోలెనున్నది". రామ ప్రభుని సాక్షాత్కారమే ఆమె తపమునకు ఫలము.

ఆ స్థితి యందున్న సీతను హనుమ అశోక భూరుహముపై నుండి తిలకించినాడు. రామచంద్రుని హృదయమే వచ్చి అట కూర్చున్నదా యన్నట్లుగా క్రూరోని చూచినాడు. అప్పుడామె అతనికి....

ప్రళయ వారాశిలోపల బాడబాగ్ని
వృక్షమూలాన యాదోతి భీకర ప్ర
దేశమున సోమకుండరు దేర గాంచి
కళవళంబడు న్నతయాకాంత వోలె

చాపగా జుట్టి నిట్ట బుజాన బెట్టి
యల హిరణ్యాక్షుడేగెడు నపుడు వాని
పల్లకోఱ గీసుకపోయి పాలిపోయి
క్రిందు మీదగు ధారుణీ సుందరివలె.

పరమ దురహంక్రియా శిఖా భాసురుండు
తానె సర్వేశ్వరుడనని తర్జనంబు
సలిపెడి హిరణ్యకశిపుని సభను సర్వ
ప్రళయ భీతిని గను విష్ణుభక్తి వోలె.

తిన్న యింటి వాసంబుల నెన్నునట్టి
కార్తవీర్యార్జునుని పరాక్రమము వలన
నావు వోలె నంభాయని యరచి యల్లె
దిగులు పడిపోవు నాతిథ్య దేవతవలె.

కలత చెందిన వేదమాతవలె, తల్లడిల్లు ధారుణీదేవివలె, బిక్కు బిక్కుమనుచున్న విప్లుభ క్తివలె, నిస్సహాయమై; దిగులుచెంది దీనయైన అతిథ్య దేవతవలె - సీత యున్నది. వీటన్నిటి అర్థమేమన - యుగ యుగమునను రాక్షసత్వము ప్రబలి, దౌర్జన్యము బలిసి ధర్మమును, సత్యమును, నీతిని హింసించెడిది. అప్పుడాప దుద్ధారకుండైన, జగ ద్రక్షుడు జగద్రక్షకుండైన పరమాత్మ అవతరించి అధర్మమును, దౌర్జన్యమును నశింపజేసి ధర్మ సంరక్షణ మొనర్చుట సార్వకాలిక సత్యం. ఇదియే ప్రత్యవతార పరమార్థం. రామావతారానికి కూడా ఆ లక్ష్యమే.

యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత
అభ్యుత్థాన మ ధర్మస్య తదాత్మానమ్ సృజామ్యహమ్।
పరిత్రాణాయ సాధూనామ్ వినాశాయ చ దుష్కృతామ్
ధర్మ సంస్థాప నార్థాయ సంభవామి యుగేయుగే॥

అని గదా భగవానువాచ. అట్లే ఈ సీతాదేవి దుఃఖము తొలగిపోవు ననియు అందుకు కారణమైన దౌర్జన్యము, రాక్షసబలము నశించుననియు కవి భావన. సీతాకాంత పవిత్రతకు, వినిర్మల పాతివ్రత్యమునకు పై ఉపమానములు ఎంతయును తగియున్నవి. విశ్వనాథ అంతటితో సంతృప్తి చెందలేదు.

ఆకృతి రామచంద్రవిరహాకృతి, కన్బొమతీరు స్వామి చా
పాకృతి; కన్నులన్ ప్రభుకృపాకృతి; కైశికమందు రాము దే
హాకృతి; సర్వదేహమున యందున రాఘవ వంశమౌళి ధ
ర్మాకృతి కూరుచున్న విధమంతయు స్వామి ప్రతిజ్ఞమూర్తియై

ఇందు మహోదాత్త భావనయున్నది. సీతయే రాముడనియు- అవిభాజ్యమైన; అవిచ్ఛిన్నమైన; అచ్యుతమైన పరమాత్మ తత్త్వమే ఆ ఆదిదంపతుల సంబంధమని ఇందలిభావము- రాముని విరహమే సీత రూపుదాల్చినట్లున్నది. ఆమె తన కన్నులలో రాముని ప్రసాదగుణ మునూ ఆయన కృపామతిత్వమునూ నింపుకొని యున్నది. తన వినీల కేశపాశంలో రామునీలమేఘ శ్యామతనూ, రామణీయకతనూ నింపుకొని యున్నది. రాఘవుల యింట్ల ధర్మమంతా; మర్యాద అంతా ప్రోవై కూర్చున్నది. రాము స్థిర హృదయము రూపుదాల్చి కూర్చున్నది. సీతారాముల యభేదత్వమునకు యింతకన్న విస్పష్ట మహోత్కృష్టమైన ఉత్ప్రేక్ష విశ్వనాథకుతక్క నాన్యతో సాధ్యము.

అప్పటి ఆమె స్థితి "ధీశిత దృష్టి లేకనుపదింపగ బడ్డ మహాగ మోక్తినాన్'' వలె నున్నది. తగిన యధికారము; జ్ఞానము లేనివారు వేదార్థము చెప్పనెంత పేలవముగా, కళాహీనముగా నుండునో ఆగమ రూపిణియగు సీతయు రామవియోగమున దుష్టజనుల మధ్యచిక్కి యున్నది.

రావణు డవివేకి. కనుకనే మహాగ్నిని కొంగున కట్టుకొనినాడు. పెట్టెలో భద్రముగా దాచి యుంచినాడు.

మండుచున్నదాని మందసంబున దాచ
నొక్కమూర్ఖు, వేడి యెక్కి యెక్కి
యల్ల మంద సంబు నంటుకోబోయెడు
తీరుగాగ నున్న దివ్వెవోలె.

సీత పవిత్రాగ్ని. క్రతయోగ్యమైనంతపరకు అనలము మంగళ ప్రదాయినియే. మామూలు స్థలముల అది ప్రమాదకారియగును. ఆ యగ్నిని, యెఱుగక మూర్ఖత్వముచేత తెచ్చి మూటకట్టిదాచినట్లు లంకలో పెట్టుకొనినాడు. అది దావానలమై దహించగలదు.

* * *

అశోక వనిలో నున్న సీతను దర్శింప మోహాతురుడైన కామ జ్వరపీడితుడైన రావణుడు అనునిత్యం వచ్చి యేవేవో ప్రేలాపిస్తాడు. అవి కామాంధకారంలో మునిగి, వివేకం కోల్పోయి సదసద్వివేక చింతన చచ్చిపోయి, అహంకారంతో పలికే పలుకులు. అయితే విశ్వనాథ ఇక్కడొక చమత్కృతిని కనపరుస్తాడు. రావణుని పలుకులు పైకి కామ వచనాలు. కానీ వానికి తెలియకనే వాని పలుకులలో సత్యంధ్వనిస్తుంది. ఒక్కొక్కపరి అప్రయత్నంగానే అంతరాంతరాలలో దాగి ఉన్న వాస్తవం వాగ్రూపం ధరిస్తుంది. అది లోపల జీవుని ధ్వని. విశ్వనాథ రావణునిచేత ఈ రీతిగాపలికించుటయే యిక్కడి ప్రత్యేకత. అంతేకాక రావణుడు కామాంధుడు అని ద్వేషించే వారికి వాడి పలుకులు కామ ప్రేలాపనగా, రావణుడు ప్రణయారాధకుడు అని బలపరచే వారికి ప్రణయవచనాలుగా రావణుడు సీతా తత్త్వము నెరిగిన జ్ఞాని అనుకొనే వారికి అవి ఆమెను స్తుతించినట్లుగా భాసిస్తాయి. రావణు డామెను "శివమూర్తీ"! యని పిలచి...

"భ్రాజితమైన యీ సకల వైభవముంద్యజియించి యొక్క నీ
తోజను తెంతు నేరికిని దోపని సీమల నీవుదేవతా
భ్రాజిత మూర్తి నేను పదవారిజ సేవకుడన్ భవత్కటా
క్షాజిర రంగ వల్లులకు నద్దినదౌ మృగనాభి కల్పుడన్''

నీవఖిల భవాంభోనిధి
నావవు నేనుప్పు నీళ్ళు నాసా కంఠ
వ్యా వల్గువులుగ నుంటి, గృ
హావేశ్తము నిచ్చి యొడ్డు పట్టింపగదే॥

ఆమె జగదంబ. సర్వమయి. దేవతాభాజితమూర్తి ఆమె పద సంసేవ భవాంభోనిధి దాటించునావ. విశ్వవ్యాపిని. ఆమె శివమూర్తి. శివంకరి. శ్రీకరి. ఆమె తమోపహ ప్రకట చంద్ర జ్యోత్స్న.

* * *

రావణుని తృణముకన్న నీచముగ భావించిన సీత రాముని ఔన్నత్యమును వివరించి తమ పవిత్ర దాంపత్యము నందలి స్వచ్ఛతను; అసాధారణత్వమును పసిపిల్లవానికి చెప్పినట్లుగా :

తాను రాముడు సాలంబు నేను లతను
తాను రాముడు వీణియ నేను తీగ
తాను పతి వార్షి కాభంబు నేను మెఱుపు
తాను పతి సూర్య దేవుడు నేను వెలుగు.

రాముడు సీత కాశ్రయము. సీతలేని రాముడు శోభించడు. రాముడు శబ్దమున కుత్పత్తిస్థానము. సీతశబ్దము; రాముడు వీణ. సీత తీగ. తీగలేని వీణ మోగదు. "నా తంత్రీ వాద్యతే వీణా". రాముడు వెలుగునకు మూలము. సీత వెలుగు. రాముడు సూర్యుడు. సీత కాంతి. ఇట్లవినాభావమైన, అవిభాజ్యమైన, అచ్యుతమైన ప్రకృతి - పురుషులు వారు.

మూర్తీభవించిన దురహంకారము, దుర్మార్గమునైన రావణునకు ఇంకను అర్థమగునట్లు.

అతడు కులాలుడు మెత్తని
క్షితిమృత్తును నేనతండు చివురాకు సమీ
హితనైగ నిగ్యమును నే
నతండు దైవంబు భక్తురాలను నేనున్॥

అతడెలా మలిస్తే అలామలిగేమట్టి ఆమె.భూజాతగదా! ఆయన నుపాసించి ధన్యతగా కోరిన ఉపాసకురాలు ఆమె. అంతేకాదు.

పతియు జలంబు నేనును ప్రవాహము రాఘవుడాకసంబు నే
నత మృదుగీతి, నింద్రుడగు నాయన నేను హవిస్సు వేద సం
తతి యతడే స్వరంబు వసుధాపతి తారసమూర్తి స్థాయినే
నతనికి నాకునైన యవినాస్థితి దుస్థితి పొందదెప్పుడున్.

అహస్సు దైవములకు చెందునేగాని శ్వానములకు చెందదు. వేదముతోనే సర్వమావిర్భవించినది. వేదములేనిదే స్వరములేదు. స్వరహీనమైన వేదము వేదముగాదు. రసంతోటే స్థాయీభావం. వారిరువురకు ఉండే అవినాస్థితి దుస్థితి లేనిది. అట్లు చేయుటకుపూనువాడు మాత్రమే దుస్థితిపొందును.దుర్గతుల పాలగును.ఆమె సువర్చల రాముడు సూర్యుడు. ఆమె శచీదేవి- అతడు ఇంద్రుడు. ఆమె అరుంధతి అతడు వశిష్ఠుడు. ఆమె రోహిణి అతడు చంద్రుడు. తాను లోపాముద్ర. అతడు గౌతముడు. వారిరువురు పవిత్రాత్ములు. పావనమూర్తులు. జ్యోతిరాకృతులు. సర్వోపగతులు. సర్వకాలములలో పవిత్ర దాంపత్య జీవనమునకు ప్రతిమూర్తులు. రాక్షసమూకలకి జ్ఞాన మెక్కడిది. వారికి తన పాతివ్రత్యమై శిష్యమును వివరించుచు....

"నేను తొల్లి సావిత్రినై యమునకు ధర్మ సూక్ష్మం బుపదేశించితిని. శ్రీమతినై కపిలునకు నా తత్త్వంబు కరతలామలకంబు గావించితిని. దమయంతినై శివభక్తి ఫలంబు నలున కొనగూర్చితి. నేనిపుడు సీతనై యనసూయాతముగా వచ్చు పాతివ్రత్యంబునకు పరమ ప్రమాణము కల్పించుచుంటి"- అని చెప్పిన మాటలలో ఆయమ స్థిరచిత్తము, తన నిష్కల్మష పాతివ్రత్యము పట్ల తనకు గల ఆత్మవిశ్వాసము వ్యక్తమగుచున్నది. అయినను ఆమె పల్కులలోని మహార్థము సంస్కృతీ హీనులకెట్లు బోధపడును.

ఈ సృష్టి ఎంత సహజమో, సృష్టిలోని పంచభూతములు ఎంత శాశ్వతమో, సహజమైనవో అట్లే సీతారాముల పరమ పవిత్ర దాంపత్యము స్వాభావికమైనది. వాయువునకు స్పర్శ, అగ్నికి తేజము; జలమునకు శైత్యము, నిత్యమైన ఆత్మకుచైతన్యము వలె సీతారాములు విడదీయరానివారు.

మహోన్నత వినిర్మల గుణ సంపన్నురాలగు జానకి తాను రాముని అర్ధాంగి నయినందుకు, ధర్మమూర్తులైన రాఘవుల ఇండ్ల కోడలైనందుకు, సౌమిత్రి వంటి మర్యాదా స్వరూపమునకు వదినగారైనందుకు తన జన్మసార్థక మైనట్లు భావించుచున్నది. అట్టి మహాత్ముల నందరను భక్తితో సేవించు భాగ్యము కల్గినచో మన జన్మ సార్థకమైనట్లు భావింపవలె. అదియే స్వర్గ పదవి. కైవల్య సంప్రాప్తి.

ఆ సౌమిత్రి యొకండు నా మఱిది మర్యాదా స్వరూపంబునే
నా సౌమిత్రికి దేవతాకృతిని నాహా స్వామికిం భార్యనై
యా సౌమిత్రికి వానికిన్ వదినగారై జన్మసార్థక్యమై
నా సంపత్తియు మీ కెఱుంగుటకు నైనం జాల దింతేనియున్.

* * *

పరమ సుకుమారి యగు ధరాకుమారిని రాక్షసీగణము బాధించుచుండ నిద్రించుచున్న త్రిజట యను రక్కసి హఠాత్తుగా మేల్కాంచి, తాను కలగాంచితి ననియు ఆ కలలో సీత కన్పించినదని చెప్పును. కలలో కన్పించిన ఆ సీత ఎట్టి సీత ? ఆమె జగజ్జనని. సౌందర్య రత్నాకరి. అంతర్బహిశ్చ తత్సర్వములందు నిండిన మహాజ్యోతిర్మయి. సర్వగ్రహ చక్రములను సంచలనము గావింపజేయు మాయామయి. అనంతశక్తి సమన్వితయై అలరారు విశ్వరూపిణి. సృష్టిస్థితిలయములకు కారణమైన ఓంకారరూపిణి.

".....తా నొకతయే తారుణ్య రత్నాకరం
బంతా రూప చతచ్ఛకన్మదన నేత్రాంభోజ కాంతిచ్ఛటా
సంతానాకృతి మింటిలో దిరుగు భాస్వచ్చంద్రులే కన్నులై"

* * *

"ఆమె నఖాంత కాంతులవి యాడెను తారకలట్లు నామె దృక్
ప్రీచ్ఛమృదు కజ్జలంబులు చరించెడు నాకసమట్లు నామె చే
లామృత కాంతి సంతతి సితాంబుదముల్ పరిణామ మందు భూ
మీ మహిళాసుతా తనువె మిన్నఖిలంబుగ గానిపింపగన్"

అమ్మధురావలోకనము లద్భుత మయ్యెను యామె లోచనాం
తమ్ములు సాగినంతన శత ప్రమితుల్ మధురేక్షు చాపఖం
డమ్ముల వారు రత్నమకుటమ్ములవారు జగద్విలోభనా, స్యమ్ముల
వారు నుం ప్రభవ మందెద రంబుద నీలరోచిషుల్.

ఆమెయే పార్వతి. లక్ష్మి. సరస్వతి. ఆమెయే త్రిమూర్తులు. ఆమెయే సకల దేవతా గణములు. సర్వజీవసంతతి ఆమె కన్నుల నుండి కురియు అమృత వాహినిచే మనుగడ సాగించు చున్నది. ఆమె లోకపాలక సమాజ్ఞా చక్ర నిభృత పాలన కళానేత్ర: ఆమె సుప్రసన్న వాగ్దేవత. సకల విద్యాప్రదాయిని. సర్వకళాస్వరూపిణి. విశుద్ధ శారదామూర్తి.

ఆమె సీతయే యని సుస్పష్టముగా తెల్సికొనిన మహాజ్ఞాని హనుమ.

మాతృదేవీ సమాజ్ఞా తీర్థ సుస్నాత
 వినతా తనూజుండు వేల్పు బువ్వ
కనుగొన్న యట్టుగాఁ గనుగొంటి జానకీ
 దేవి గవేషణా తీర్థ ఫలము.
పరమ యాజ్ఞికులు నిర్భర మహాచ్ఛందో ఉవ
 తారంబు గాయత్రిఁ దత్వమూర్తి
గనుగొన్న యట్టుగా గనుగొంటి జానకీ
 దేవి శ్రీరఘురామ దీపధంబు

కవి మహర్షి తపోగ్నిచే క్రాగి క్రాగి
సర్వతేజః ఫలంబు రసంబు తుదకు
చూచినట్లుగ జూచితి క్షోణిజాత
చారితార్థ్యంబు జన్మకు సంఘటింప.

గరుడుడు అమృత కుంభమును కనుగొన్న యట్లాంజనేయుడు అమృత స్వరూపిణి యగు సీతను కనుగొనెను.

వేదమూర్తులు, పరమ యాజ్ఞికులు నైనవారు నిశ్చల ధ్యాన సమాధి యందు మహాఛందోవతారము తత్త్వమూర్తియునైన గాయత్రీ మహాదేవిని దర్శించినట్లు హనుమ అయోనిజను దర్శించెను.

మహాకవి తపోదీక్షతో శ్రమించి సర్వతేజః ఫలమైన రస స్వరూపమును సిద్ధింపజేసికొనినట్లు ఆంజనేయుడు క్షోణిజాతను దర్శించి నాడు. ఆ మహాకవులెవరు? వాల్మీకి, విశ్వనాథ.

*  *  *

తుదకు అంజనీసూనుడు అవనిజ ముందు నిలచి తనను తెలియ జెప్పకొని సీతాదేవితో సంభాషింప మొదలిడెను. "నా చిత్తము త్వత్పద సేవా పర్యాప్తి గాంచె. అమ్మా! నీ వెవరవు?"

"స్వాహా దేవివో యగ్నిదేవుని శిఖాసామ్రాజ్యముంబాసి యీ
దేహం బూని చరింప వచ్చితివొ భూదేవీ నవీనా కృతీ!
మహాత్మ్యంబును జూడ ఖేచర సతీ మంజు ప్రభాదీప్తి సం
దేహం బయ్యెడి మింటనుండి దిగివత్తే! తప్తచిత్తాకృతీ!"

అని అడుగుతాడు.

రాముడు పవిత్రాగ్ని. సీత ఆ యగ్ని తేజము.

"ఆతని జెప్పిన నింకొక
రీతిని నిను జెప్పుటౌ సరీసృపమూర్తీ!"-ఆమెను గూర్చి చెప్పిన రాముని గూర్చియు చెప్పినట్లే యగును. ఆయనను స్తుతించిన ఆమెనూ తలంచినట్లే యగును. వాగర్థముల వంటివారు ఆ యిరువురు.

"పడతి సీత పాము. పడగ శ్రీరాముడు
తోక త్రొక్కినాడు దుష్టదనుర"

సీత మహా పన్నగము. ఆ పన్నగ శీర్షము శ్రీరాముడు. రావణుడు పొగరుతో ఆ పాము తోక త్రొక్కినాడు. రాముడు కాటు వేయక మానడు.

వాస్తవమునకు సీతారాముల కెడబాటు ఎక్కడిది? వారి దేహములు మాత్రమే ఎడబాటు ననుభవించు చున్నవి. వారిరువురు ఒకరి హృదయమునందు మరొకరున్నారు. వారి భావన లొక్కటియే. వారి ఆత్మలకు వియోగ మెక్కడిది? అది ఎరిగిన ఆంజనేయుడు ఈ భావాన్నే వ్యక్త పరుస్తూ ... ...

"మీ యాంతర్యములందు మీరు స్థిరమై మేలే జగన్నాశముల్"-

"పరగ మీరు మీరు భద్రమ్ముగా నుంటి
రొకరి యాత్మలందు నొక్క రొకరు
వట్టి పిచ్చి జగము పట్టి పాలార్చకు
డంబ! కొంటి మీ పదాంబుజములు."

అజ్ఞానులకు మాత్రము వారు ఎడబాటు అనుభవించుచున్నట్లు తోచును. దర్శింప గలారికి,ఆత్మజ్ఞానము గలవారికి వారిరువురు ఒక్కరే.

*  *  *

రామునకు చెప్పవలసినదిగా హనుమకు చెప్పవలసినన్ని చెప్పి చివరి మాటగా......

రాముడయి మాత్రమప్పటికేమి చేయు
ననిన నదియేమి చేయునో మనకు నేల
యతని భార్యను దొంగిలె నతడు చూచి
కోవలయు గాని నీకును నాకదేల ?- అని పలుకును.

తానెంత వేదన యనుభవించు చున్నది; రాక్షస గణములెంత హింసపెట్టు చున్నది, రాముడెలా దండెత్తి రావలసినదీ ఇత్యాదు లన్నింటినీ వివరించగా ఆ మాటలలోని చిత్త స్థైర్యమునకు, శేముషికి ఆంజనేయుడు అచ్చెరువందినాడు. కానీ ఆఖరుగా పలికిన ఈ పలుకులలోగల సీతా హృదయము బుద్ధిమంతులలో శ్రేష్ఠుడగు హనుమంతునకు సైతమంతుబట్టలేదు. పల్చని మబ్బుల మధ్యనున్న చంద్రబింబమువలె భాసించి, భాసించకుండ నుండుసదా విశ్వరూపిణి హృదయము. మహితాత్ముల మహోన్నత భావముల నర్థము చేసి కొనుటకు హనుమ యంత మహాజ్ఞానికే అశక్యమైనపుడు అజ్ఞానుల; అల్పుల మాటేమిటి? కావున పరమాత్మ జ్ఞానమును అవగాహన చేసు కొనుటకు జీవుడు తన ఆత్మజ్ఞానమును పెంపొందింప జేసుకొనవలెను.

* * *

హనుమంతుడు నిష్క్రమించిన మీదట రాక్షస స్త్రీలు "ఆ వచ్చిన వాడెవ్వడు? నీవు-వాడు ఏమి మాటలాడితిరి?" అని సీతను వేధింప సాగిరి. అందుకు సీత సౌమ్యంగా...

నమ్మిన నమ్ముడు మఱియున్
నమ్మక పోయినను మీరు నమ్మకు డంతే
యిమ్మగ నను సరిగా న
ర్థమ్మును జేసికొనుడంతె రాక్షసులారా!

ఈ మాటలు ఎవరినుద్దేశించి చెప్పబడినవి ? ఒక్క రాక్షసుల నేనా! కాదు. తమోగుణ ప్రధానులైన జీవులందరకూ సీత హెచ్చరిక యిది. "నమ్మగలవారికి; నమ్ముకొన్నవారికినే నమ్మను. వారిని గూర్చి నే నాలోచింతును. నమ్మని వారిగతివారిదే." ఆ యనంత శక్తి స్వరూపిణిని సరిగా అర్థము చేసుకొను శక్తికావలె. అది పెంపొందించు కొనవలె. అందుకు రాక్షస సహజమైన తమో గుణమును వీడి సత్త్వ గుణమును పొందవలె. అందుకు తగిన సాధన కావలె. అప్పుడే పర తత్త్వము సరిగా అర్థమగును.

హనుమ వాలానికి నిప్పంటించారు రక్కసులు. అది జ్వాలా తోరణంలాగా మండుచున్నది. తోకనున్న నిప్పు పాకంబునంబడి బాధ యెక్కువయ్యే పావనికి. అంతలోనె హనుమకు అగ్ని చల్లగా తోచింది. ఈ వింత పరిణామానికి హనుమకు ఆశ్చర్యం కలిగింది. ఆలోచించాడు. అర్థమైనది.

"అంతలోన నగ్ని హనుమకు జల్లనై
తోచినంత మఱల జూచినంత
మనసునందు హనుమ మహిజాత మహిమంబు
తూచినంత మొగ్గ తోచినంత".

బిడ్డ కష్టము తల్లికే తెలియును. ఆ తల్లి చల్లని ఆశీస్సుల వలన హనుమకు అగ్ని చల్లనైనది.

* * *

లంకా దహనమైనది. హనుమ కోపాగ్ని శాంతించినది. కోపం ఎంతటి వారికైననూ వివేకాన్ని నశింపజేస్తుంది. "సీతమ్మ ఈ ప్రళయాగ్ని కీలల వంటి జ్వాలలలో ఎట్లున్నది?" అనెడు ఆలోచనయే కలుగలేదు హనుమకు. తన పొరబాటుకు, తొందరపాటుకు చింతించుచూ తల్లికడకేగినాడు.

"మఱియునశోక వీధి చని క్ష్మాసుత దూరమునందు గాంచి, ద
గ్గరకును బోవగా నొడలు కాల దొడంగిన జిత్రమయ్యె మం
థరు డనలుండు తానొడల దారిన వేళను జల్లనై యనం
తరమున వెచ్చనయ్యె ననినట్టి దొలి దెట్టిదొ యిద్ది యట్టిదే!"

పొనరగ దాను దగ్గరకు పోవు కొలందిని వేడి యెక్కువై
హనుమ యెటింగెబో యనలు డౌష్ణ్యము జానకి యందుదాచి జొ
చ్చెను దన తోకయందిచట సీతకు జుట్టును నున్న రాక్షసాం
గనలును దవ్వు దవ్వగను గానగ వచ్చిరి భీతచిత్తలై.

ఇంతవరకును అగ్నికీలల మధ్యనున్ననూ ఏ మాత్రమూ బాధపడని హనుమకు సీతాదేవికి సమీపమునకు పోవుకొలది ఉష్ణతీవ్రత బాధింప దొడగెను. హనుమ కర్థమైనది. తన మనసు చల్లదనమంతయు ఆ తల్లి యగ్నియందుంచి అగ్ని కీలల మహోష్ణతను తన తనువున దాల్చినదా శీలవతి. అందుకే ఆమె చుట్టూ అంత ఉష్ణోగ్రత. పావన మూర్తియగు అవనిజను పావకుడేమి చేయును? పాంచ భౌతికమైన ఈ విశ్వమునకంతటికీ ఆమెయే అధికారిణి గదా! అందగ్నియు నొకటి. కావున ఆ యగ్ని కీలలకు శీతలత్వము కలుగ జేసినదా అనంతశక్తి స్వరూపిణి.

హనుమయు దవ్వున న్నిలచి యంజలి పూని మనస్సులోన రా
ముని దలపోయగా దొడగె, భూసుత కన్నులు విచ్చిచూచి న
వ్విన ననిలాత్మమంతట నవీనముగాగను శీతలత్వమే
చిన గపిసార్వభౌముడును జేరె ధరాసుత పాదదేశముః.

తల్లి సమీపమున కేగుటకు మరేగతి కానక మారుతి మనమున మందహాస రుచిరాననుడైన రామచంద్రుని మనోహర రూపమును నిలిపి కొని ధ్యానించినాడు. సీత కనులు విప్పి చూచినది. శీతమయూఖుని కిరణములవలె చల్లదన మేర్పడినది. సీతాపతిని ప్రార్థించి సీతను సుప్రసన్నము గావించుకొనినాడు హనుమ. సీతారాముల యభేద్వత మునకొక చక్కని ధ్వని గర్భిత కల్పనము. అనల్పమైన విశ్వనాథ ప్రతిభకు ఒక వందన సమర్పణము.

* * *

ఆఖరు మాటగా సీత హనుమతో అంటుంది—

"ధాత్రిజ గుప్పిలిలోన ప్రాణముల్ చేరిచి గూరుచున్నదని చెప్పగదయ్యా కపీంద్ర!"

"గర్వితⓘ వృత్తియౌ యసుర కాండము జంపుట నాకు ముఖ్యమా
పర్వము వోని స్వామి ముఖ భావము చూచుట నాకు ముఖ్యమా"

రాక్షసులామెను పలువిధముల బాధించిరి. తన ప్రాణమైన రామునితో తనను విడదీసినవాడు రావణుడు. వారినందరినీ రాముడు చంపిన చంపునులేక వారే చత్తురు. వారు చచ్చుట యన్నది కాదు ప్రశ్న. తన మనోవాంఛితము రామ సమాగమము. అది యామె తపః ఫలము. అది యా జీవుని వేదన. మరి తాను పడినన్నిబాధలు వారును పడవద్దా ! అది అమె వాంఛితము కాదు. వారు క్రూరులు, పాపులు.వారికర్మవారిది. కర్మఫలమేదో ఒకే రీతి వారే యనుభవింతురు. తాను మాత్రము వారిని క్షమించును. ఆమె ధరాజ కదా ! "క్షమయా ధరిత్రీ"– తల్లిపోలిక. దొడ్డబుద్ధిగలవారి ఆలోచన లిట్లుండును.

* * *

హనుమంతుడు తిరుగు ప్రయాణం గావించి ఈవలి ఒడ్డుకు చేరుకున్నాడు. తనరాక కొరకు ఆత్రంగా వేచియున్న కపి వీరులకు సీతను కనుగొనినట్లు చెప్పి....

నే నమస్కరింతు నీరజాతాప్తుని
సకల వివిధ శబ్ద శాస్త్ర గురుని
నే నమస్కరింతు నీరజేక్షణ నీర
జాక్షి గూఢయోగ శాస్త్ర గురువు.

సీత యోగమాత. తత్త్వాకార. వేదాంతజ్యోతి. హనుమయంతటి సకల వివిధ శబ్ద శాస్త్ర పండితునకు ఆమె యోగశాస్త్ర గురువుగా తోచినది. హనుమ దృష్టిలో ఆమె సూర్య సమానురాలు.

వారితో యింకా యిలా అంటాడు :

కన్నులు గల్గినన్ ధరణి కన్యక గాంచవలెన్ ననుస్కృతిన్
మన్నన జేయ నెంచినను క్ష్మాసుతకుం బొనరింపగా వలెన్
విన్నధరాకుమారికను వీనుల పండువగా విన్గ వలెన్
మన్నన రాము భార్య. పదమంజుల సన్నిధి నేమన్గ వలెన్

కండ్లున్నందుకు సీతాదేవిని చూడాలి. జీవితానికి సార్థకత చేకూరాలి. రాముని ఆత్మనే సందర్శించినట్లగును ఆది పరమాత్మ సాక్షాత్కారము. విన్న "సీతా చారిత్రము"నే వినవలెను. "వింటే భారతం వినాలి" అనే నానుడికి బదులు విశ్వనాథ క్రొత్త నానుడి సృష్టిస్తున్నాడు–" వింటే సీతా చారిత్రము వినాలి. పరతత్త్వము నావిష్కరింప జేసుకొనవలెను. రాము భార్య పదమంజుల సన్నిధికి చేరుటయే కైవల్య పదవీ సంప్రాప్తి. హనుమ నోటిద్వారా విశ్వనాథ మనకొసగిన సందేశం.

హనుమ ఒక ధ్యాన ముద్రతో కనుల యెదుట సీతామాతను నిలిపి చెప్పుచున్నాడు.

ఆయమ యాత్మ లక్షణము నందలి సూక్ష్మత నేర్వనెన్ని సా
ర్థో యత సంబొనర్చితిన యూహకు నందదు లేశమైన బ
ద్మాయత నేత్ర దైత్యపతి యందున జాలి బొందుసూక్ష్మ రే
ఖా యతి గాన నొక్కడది యన్నిట కన్నను నాకు చిత్రమై.

సీతా తత్త్వమును అర్థమొనర్చుకొనుటలో జీవుడు పడవలసిన పాట్లు అన్ని యిన్ని కావు. నాలుగు మార్గములు కలసిన చోట బాటసారి నిలచినాడు. సరియైన మార్గమేది? దానిని గుర్తించ గల్గిన గమ్యమును చేరనగును. పరంజ్యోతిని దర్శించ గోరువారి స్థితియుగూడ యిట్టిదే. సూక్ష్మబుద్ధితో పవిత్రమైన భావనతో అభ్యాసము చేయవలె. తత్త్వజ్ఞానా కారుడైన ఆ కపి ధూర్జటికే అది కష్టమైన మరి సామాన్యులకు సాధ్యమా !

* * *

లంకయందు సీత యెట్లున్నది? ఆమె మెయి జీవములెట్లు నిలచియున్నవి ?

ఉన్నది యున్కిగా బ్రదికి యున్నది జానకిదేవి చేరెడౌ
కన్నులలోన బ్రాణములుగా రఘువీరుని వారి గాంచుచున్
మన్నది మన్కిగా గగన మండల వాయు మహాపథాంత రా
సన్న దుఃఖిత దృశా సుషమాసిత దేహవల్లియై.





10A

"కన్నుల నిద్దుర యెఱుగద
యన్నము తిని యెఱుగదింత ప్రాణాధారం
బన్న రసాకృతి రాము ల
సన్నామాక్షర సుధారస పృషత్కంబుల్"

ఆమె రామ ధ్యానమున యోగినివలె నిద్రాహారములు లేక రామనామ సుధాపానమే ప్రాణాధారముగా కాలము గడుపుచున్నది.

* * *

సముద్ర తీరమున కపిసేనలన్నియు విడిసినవి. సాగరము చెంతనే సమరోత్సాహముతో ఎగసిపడు కపిసేనా సాగరము. గంభీర మైన అంభోరాశిని చూచిన అంభోరుహ నేత్రుడు రాముడు లక్ష్మణునితో

విదితముకాక చిత్రమని పించుచు సున్నదినాకు; నీవు మీ
పదిన పదంబులే యెఱుగు వాడవు నీకు నెఱుంగరాదు నా
సదమల శీల నేత్ర జలజాతము లందున జూచినట్టు లు
న్నది సుమి యీపయోనిధి గనక బరినీల గభీర రేఖయె.

సముద్రమును జూడగనే రామునకు సీతకన్నులు గుర్తుకు వచ్చినవి. సీతకన్నులు అంత గంభీరములైనవి. ఆమె భావములు అంత లోతైనవి. ఆ లోచనాల వెనుక నున్న ఆలోచనలు రామునకు సైతమందనట్టివి.

అన్నా మైథిలు లాడుబిడ్డలకు వేదాంతార్థ సంభార భా
వౌన్నత్యంబు జితించి రక్తమున నేత్రాబ్జంబు లట్లుండునా
యెన్నంజైన త్వదూర్మికానయన సాహిత్యంబులో లోతులం
గన్నావా! యొక యుర్విజాత కనులే కంధి ప్రభావంబులా!

సీత మైథిలు లాడుబిడ్డ. జనకపుత్రి. జనకు డెవరు? మూర్తీభవించిన వేదాంతము తత్త్వజ్యోతి. ఆ జ్యోతినుండి వెలువడిన కిరణము సీత. కావున విదేహ రాజకన్యలకు వేదాంతము కరతలామలకములు గదా! లోతైన ఆకన్నులు వేదాంతార్థ సంభార భావౌన్నత్యంబులు.

రాముడు నిస్సందేహంగా, నిర్ద్వంద్వంగా నిశ్చలంగా చెప్పిన మాటలు సీతాచారిత్రమునకు పరమ ప్రమాణములు.

ఇది నాకెప్పుడు తెలియును
మదవతి నా ప్రాణ చయము మద్దేహమునా
యెద, మేధ, బుద్ధి సర్వము

* * *

సీత రాముని హృదయము. ఆమె రాముని బుద్ధి. ఆమెయే రాముని మేధస్సు. ఇంతయైన రాముని జలమే సీత.

కావుననే రామాయణమును రామకథయనుట కన్న "సీతాయాశ్చరితమ్" అనుటయే యుక్తియుక్తమని మహర్షిభావన. అదియే జ్ఞానుల భావన. విశ్వనాథయు ఆ భావనతోనే సీతా చారిత్రమును తీర్చి దిద్దెననుట సుస్పష్టముగా తెలియనగును.

# నన్నయ్యకు నతులు

## డా॥ ఎస్. గంగప్ప

1. నన్నయ్యా ! మా కందర
కన్నయ్యవు శబ్దవిధుల అను శాసనతన్;
మున్నెవ్వరు చేయరు నీ
యన్నుల మిన్నగు కవితను; ఆది కవివిగా!

2. అన్న ! పండువెన్నెలగును నీదు ప్రసన్న
కవితలోని అర్థకలితయుక్తి;
ఆరవిచ్చిన పువు అక్షర రమ్యత
పరిమళాలు చల్లు పరువమునను.

3. శుద్ధ నానా రుచిరమైన సూక్తులనిధి
మాత్రుడవె కాదు; వ్యాసుని మంత్రవిధిని
తెలుగులో వెలయించిన వెలుగు కవివి,
శుద్ధ నానా రుచిరమైన సూక్త నిధివి !

4. పద్య విద్యకు తెలుగులో నాద్యుడైన
సంస్కృతాంధ్ర భాషోభయ సారమతివి,
సరస సాహితీక్షేత్రాన సార బీజ
ములను ఫలియింపజేసి తపూర్వముగను!

5. పొంగు భారత సంగ్రామ రంగమందు
క్రీడికి కడు తోడు పడిన కృష్ణునట్లు,
భారతాను వాదపువేళ భట్టు మైత్రి
నరుడుగా స్మరించిన నిన్ను మరవతరమె ?

6. నవ వధువు ముద్దు మొగమున
నవనవ లొలికించు కాంతి నాడెముగా నీ
కవిత శరదిందు జ్యోత్స్న !
నవనీత సమానమగును; నన్నయ సుకవీ !

7. తెలుగు అనువాదమా అది ? తెలుగు కవిత
కంద చందాలు దిద్ది కావ్యాభరణము
వర్ణనాతీతముగ జేసి వ్యాసమునికి
టీకలు రచియించిన శిల్పి, నీకు కవివి.

8. అంత వాక్సుధలు కలిగె నబ్బురమగు
నీదు కవితలో నన్నయ ! ఏది కతము ?
అర్థమయ్యెనయ్యా ! మనసార గ్రోలి,
పూత గౌతమీ జలకాల స్నాతవగుట !

9. ఎన్ని రీతుల్ స్మరించిన, మిన్నగాను
పొగడినను తీరదయ్య ! నీ ప్రోదిచేసి
పెంచిన తెలుగుకబ్బపు విరుల లతల;
నీదె ఒరవడి; నన్నయ్య ! నీకు నతులు !

# శబ్దశాసనుడు

**డా॥ సురగాలి తిమోతి జ్ఞానానందము**

తెలుగు మాగాణి భూములదొల్త తిరుగాడు
దేశీయ కవితకు తెరువుసూపి
కుండవాంబాదేవి కొడుకు గీచినయట్టి
విజ్ఞతాయుతపు టనుజ్ఞ దాల్చి
శిరమెత్తి యింత యూపిరి పీల్చుకొన్న వై
దికతత్త్వమునకు పథకమువైచి
సకల భాషాకళాజలరాశి ఘనుడు నా
రాయణభట్టు సాయమ్ము నంది

తొలి మహాంధ్రకవిగ నిలిచి మానేలలో
రమ్యమైన యక్షరాల విత్త
నాలు సల్లి యదొక శైలి నీదిగ నిల్పి
నట్టి శబ్దశాసనా! జోహారు!

మధురములైన సంస్కృత సమాసములన్ జొనిపించి వైదిక
ప్రథ నిలిపింప వ్యాసముని భారతమున్ తెనిగించినావు ప్ర
ప్రథమముగా మహాంధ్రమున రాజిల రాజనరేంద్రుడెన్న నీ
పథకము హర్షణీయము ప్రపంచముమెచ్చె కవీడ్గజేంద్రమా!

యోజనగంధి నందనుని యూహకు నీవొక యూహ
చేర్చి యు
త్తేజముగా మహాంధ్రమున దిక్కులు మ్రొక్కగ
భారతమ్ము వి
భ్రాజితమూర్తి! వ్రాసితివి పండుగ యయ్యెను తెల్గునేల కీ
రోజున నేమి నోచుకొనిరో కద! తెల్గులు నన్నయాభిధా!

ఆ రాజేంద్రుడు వెడందలో మొదలు నూహారేఖలీకైతకున్
ప్రారంభమ్మయి రెండుపర్వములపై పైనర్థ పర్వమ్ము భా
షా రమ్యమ్మున నీ కతమ్మునను దీక్షన్ త్వన్మహా గౌతమీ
తీరంబందు రచింపగా బడుట నాంధ్రీదేవతా భాగ్యముల్

అనుకూల సమయాన తనివార పశ్చిమ
సంధ్యామరుత్తుల స్వాగతమ్ము
ప్రతి నిమేషము రాజరాజ నరేంద్రుడు
సహకరించిన మహోత్సాహ బలము
నిను నెప్పుడావహించిన కుమారిల భట్టు
చూపించు వైదిక సూత్రగతి
గొనబు నీ మస్తిష్కమున విహారము సేయు
పంచపాండవుల గొప్పందనమ్ము

నీ రచనమున కవి ప్రేరణమ్ములు వ్యాస
భారతమ్ము హృదయ ధారణమ్ము
ఆంధ్రగేహమునకు నదియ యలంకార
తోరణమ్ము గర్వకారణమ్ము

రమణీయాక్షర రమ్యసార కవితార్థశ్రీ ప్రసాదింప ను
త్తమ ధర్మైక హితోపదేశము సముద్యద్రీతి భాసింప పం
చమ వేదమ్మగు భారతమ్మును ఋషిచ్ఛందో నిబద్ధమ్ముగా
ఇముడన్ వ్రాసిన నీకు మా ప్రణతులోయీ! పద్యవిద్యా
ప్రభూ!

శోకశ్లోకుడు బోయరాట్సుకవి వాక్యాకత్వమే శ్లోకమై
లోకంబందున నిల్చె రాఘవుని కీర్తుల్ నింపి యీతెల్గు భా
షా కల్యాణియు నిల్చె నీ వలన నీ సాహిత్యలోకమ్ములో
బాకీపడ్డది తెల్గుజాతి రసశబ్దబ్రహ్మ! నీకుర్వరన్

గొనబారన్ మధుర స్రవంతియగు నీ గోదావరీ పుణ్యజీ
వనమందున్ తమిదీర మున్కలిడి విశ్వక్షేమవాంఛా మన
మ్మున ఘంటమ్మును కేలబూని రసలుబ్ధుల్ మెచ్చ
సాహిత్యపున్
గనియౌ భారతమున్ రచించితివి లోకజ్ఞా! కవిగ్రామణీ!

హాళ గన్నడములోని విలసనోజ్జ్వల మంజు
వృత్తమ్ములను స్వీకరించునాడు
వేంగిధరాస్వామి పేరోలగమ్మున
ప్రథమ తాంబూలమ్ము పడయునాడు

తెలుగులో తొలికావ్యమలర నిర్మలమైన
భావమ్ముతో స్వస్తి పలుకునాడు
త్రిదశ భాషాశక్తి పొదిగించి తెల్గులో
సుప్రసన్నత జాటు జూపునాడు

నీ పునీతబుద్ధి నిపుణతచే తెల్గు
నేల భారతమ్ము వ్రాలునాడు
మఱొక స్వర్గమేల? మధుర శర్కరయేల?
నన్నయాభిధా! ప్రణామశతము

నీ వాంధ్రుండవొ కావొ? యెవ్వరివొ? గానీ నేటి యీ
తెల్గు భా
షా విద్యుల్లత వెల్గెనీ యమృత హస్తచ్ఛాయలో పొంగె
వేం
గీ విశ్వంభర రాజ్మహేంద్ర వరమున్ గీలించె కీర్తి ప్రతి
ష్ఠా విభ్రాజిత వజ్ర సంభృత కిరీటమ్మున్ మహానందమున్

ఓయీ! సూక్తినిధీ! ప్రసన్న కవితా వ్యూహకళాసేవధీ!
వేయేండ్లైన జయంతి నీది యిటు నువ్వీళ్లూరుచున్నట్టిమో
దాయోగ్యమ్మున సాగుచున్నది మహాంధ్రక్షోణి వీక్షింప రా
వోయీ! పూర్వ చళుక్య భూపుడిటు లేడోయీ!
విచారంబగున్

నీపయి నెవ్వడో కినిసి నిన్నపరాధిని చేయజాలగా
మోపె నభాండమొండు నిజమో మఱికాదొ? యెవం
డెఱుంగు మా
కా పనితో పనేమి? కవితామృత భాండమొసంగి సాహితీ
దీపము నిల్పినట్టి కవిధీమణి వందులకే నమస్కృతుల్

తొలగునా దారిద్ర్య వలయ శృంఖలముల
బంధితంబగు కవీశ్వరుని బ్రతుకు
వెలుగునా పుట్టగొడ్డుల ప్రక్రియలమధ్య
దయివార ఋషి సంప్రదాయ కవిత
కలుగునా భేదాల కలుష ధారుణిలోన
నణగారు కవికి మహాశ్రయమ్ము
మలగునా సవిమర్శకులు లేనితావులో
నందాల సుకవితాస్యందనమ్ము

రాజరాజు నిన్ను పూజించి పోషించె
నీ యదృష్టమదియ నేడు రాజ
రాజు లేడు తగిన రసికుండు లేడోయి
స్వార్థభూత మిటు పచారుసేయు.

[రాజమహేంద్రవరములో నన్నయ ఉత్సవ సమావేశ కవిసమ్మేళనములో పఠింపబడినవి.]

## కీ. శే. శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు

# కన్నడ జానపద సాహిత్యం

["గద్యం కవీనాం నికషం వదంతి" అన్నాడు ఆచార్య వామనుడు. "గద్యమే కవులకు గీటురాయి" అని దీని కర్థం. ఆంధ్రదేశంలో ఈనాడు కీ॥ శే॥ శ్రీమాన్ రాళ్ళపల్లి వారిని గూర్చి తెలియనివారు లేరు. తెలుగు వచన రచనకు ఒరవడి దిద్దిన మధుర వచన రచనావిశారదు డాయన. వీరి వచన రచనా శిల్పాన్ని గూర్చి ప్రముఖ విమర్శకులు ఒకరిద్దరి మాటల నుల్లేఖిస్తాను.

"మాధురీ మార్దవములకుఁదావలమైన వచన రచన యెవని సొమ్మనగా, అది రాయలసీమలో నుదయించి మైసూరున నివసించు వారిదని వెంటనే వచ్చు సమాధానము.... నేటి తెలుఁగునాట పద్య రచయితలు పెక్కురనియు గద్య రచయితలు తక్కువ యనియు దీని పరమార్థము. సర్వాంధ్రమున వచన రచనా విశారదుడు ఒక్కడే యనుట యతిశయోక్తికి జేరు మాట. ఇట్టి చిక్కులు రాకుండు పరిష్కారముండనే యున్నది. అది అనంత కృష్ణ శర్మగారు నేటి ప్రముఖ వచన రచయితలు నలుపురైదుగురిలో నొక్కరనుట" అని అంటున్నారు 'ఆంధ్ర రచయితలు' అనే గ్రంథంలో (పుట-466, మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారు.

"శర్మగారి వ్యాస శైలి సజీవమైనది. మనసుమీద ముద్ర పడునట్లు చెప్పగల శక్తి దానికి గలదు. వాక్యములు చిన్నవియై పటుత్వము గలవి. భావబంధురమైనవి. సరసమగు హాస్యముతో జాతీయతను ప్రకటించునవి. 'సారస్వత లోకము'న ప్రకాశిత మైన వీరి వ్యాసములలో ననుకరణమునకు నలవియని రచనా శిల్పము కలదు. కావుననే శ్రీ శర్మగారు వ్యాసరచయితలలో ప్రత్యేక వ్యక్తిత్వము గల మనీషి" అన్నారు 'ఆంధ్ర వచన వాఙ్మయము' లో (పుట-166) శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు.

"రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ - ఆయన రచనలు" గూర్చి వ్రాస్తూ శ్రీమాన్ పుట్టపర్తి నారాయణాచార్యులు గారు (భారతి, నవంబరు, 1941, పుటలు 459-68) యిలా అంటున్నారు:

"శర్మగారు శకము నిలిపిన గద్య రచయిత. ఆయన పేరిట నిక్కముగా నాంధ్రమున శకాబ్దమేర్పడును. కందుకూరి వారితో నారంభమైన వచన రచనకు కృష్ణశర్మ కలము భరతవాక్యము పాడినది. నూతన పరికరములతో, నూత్న వస్తువులతో నూత్న తరమగు శైలి నారంభించినాడు. ఆ యంత్యప్రాసలలో ఆ యతుల సౌభాగ్యములో పదజాలము నడచిపోవుచున్నప్పు 'డచ్చముగ' పూలతేరే కదలి వచ్చినటులుండును."

"శర్మగారి వచన రచన కిసలయ పేశలము. ఒక్క యక్షరము కటువుగా నుండిన నాతనికి గిట్టదు. ప్రాకృతము వలె పెదవి గదలింపకయే రచన సాగిపోవలెను..... వారి వాక్యములు పూలరేకుల వంటివి. ఒత్తుగా పరపుగా మట్టసముగా నుండును. సాధారణముగా కొంచెము పెద్ద వాక్యములు వ్రాయనే వ్రాయరు. వ్రాసినచో భావమున నొక ప్రత్యేకత యుండియే తీరవలెను."

"ఇంకను జెప్పినచో కృష్ణశర్మగారి ప్రతి వాక్యమును నొక పల్లవి వంటిది. అతని వచనమునకు సంగీతము ప్రాణము.... ప్రతి వాక్యమును నొక యప్సరసగా తయారుచేయవలెనని యతని యాశ.... గద్య రచనలో శర్మగారిని మించిన వారాంధ్ర దేశమున లేరు."

వచన మంటే ప్రజల నిత్య వ్యవహారంలో గల మాటల సముదాయం. గద్యమంటే కవులచేత ఛందోబద్ధం కాని మాటల సముదాయం. కవి ప్రయుక్తమైన గద్యలో ఛందస్సు లేకున్నా ఒక లయ, ఒక గతి, సమత ఏర్పడి చదవడానికి హృద్యంగా వుంటుంది. వచనం ప్రజల నోళ్ళలో వచ్చింది వచ్చినట్లుగా వ్రాయబడిన నిసర్గ రమణీయమైన సాహిత్య ప్రక్రియ. మరి యిలాంటి వచన రచనలో ఒక లాలిత్యాన్నీ, మాధుర్యాన్నీ సౌందర్యాన్నీ, సౌకమార్యాన్నీ విశేషించి జాతీయతనూ తీసికొని వచ్చి సజీవమైన శైలికి ప్రాణ ప్రతిష్ఠ చేసిన ఘనత రాళ్లపల్లి వారికే దక్కుతుంది.

**జానపద సాహిత్యరీతులు :** ఎస్. ఎల్. శ్రీవాత్సవ రచించిన "ఫోక్ కల్చర్ అండ్ ఓరల్ ట్రెడిషన్" అనే గ్రంథంలో జానపద సాహిత్యరీతుల్ని ఈ క్రిందివిధంగా విభజించినారు. జానపదగేయం

(ఫోక్ సాంగ్), వీరగాథ (బాలెడ్), ఇతిహాస గాథలు (ఎపిక్‌లేస్), పురాణగాథలు (మిథ్), పురాకల్పిత కథలు (లిజెండ్స్), అద్భుత కథలు (ఫోక్ టేల్సు), సామెతలు (ప్రొవర్బ్సు), పొడుపు కథలు (రిడిల్స్), చాటువులు (ఛామ్స్). వీటిలో జానపద గేయం యిలా నిర్వచింపబడింది.

"ఎ ఫోక్ సాంగ్ ఈజ్ ఎ లిరికల్, షార్ట్, సింపుల్, లెస్ ఆర్టిస్టిక్ రిథమిక్ సాంగ్ ఆఫ్ ఎ ఫోక్ కమ్యూనిటీ. ఇట్ జనరలీ రిఫ్లెక్ట్స్ ది సోషల్ హెరిటేజ్, ది ఎన్‌విరాన్‌మెంట్ అండ్ ది లైఫ్ ఆఫ్ ది ఫోక్ లివింగ్ యిన్ ఎ పర్టికులర్ టెరిటొరీ."

గేయం జానపదుల జీవితానికి నిత్య సన్నిహితమైంది. సహజ సుందరమైన గేయం జానపదుల సొంత ఆస్తి అయితే అలాంటి మధుర మంజుల శైలిలోనే వారి సాహిత్య వికాసాన్ని వివరించి చెప్పారు శర్మగారు.

కన్నడాంధ్ర సాహిత్యాలకు మధ్య సేతువు వంటి వారైన రాళ్లపల్లి వారు రచించిన "కన్నడ జానపద సాహిత్యం" పేరుకు కన్నడం అని శీర్షికలో చెప్పబడినా ప్రాథమికంగా జానపద సాహిత్యమంటే ఏమిటి అనే నిర్వచనం మొదలుకొని కన్నడాంధ్ర జానపద సాహిత్య రీతుల తులనాత్మక పరిశీలన వరకు పాఠకుల్ని తీసుకు వెళుతూవుంది.

జానపద సాహిత్యమంటే ఏమిటి? దీన్ని రాళ్లపల్లి వారిలా నిర్వచించారు. "జానపద సాహిత్యంలోని ముఖ్య గుణమేమంటే శబ్దాని కంటే అర్థానికీ, దానికంటే భావానికీ కనవచ్చే ప్రాధాన్యం. ఆర్ద్రమై, నిర్మలమై సంకోచమూ, సంకేతమూ లేని అనుభవం దాని జీవధాతువు. ఎవరేమనుకొన్నాసరే తనకు తోచిన భావాన్ని తనకు వచ్చిన మాటల్లో తనకై చెప్పుకొనేదీ, పాడుకొనేదీ జానపద కవుల ప్రవృత్తి" అని స్పష్టంగా తేటగా నిర్వచించారు.

**కీ॥ శే॥ నేదునూరి గంగాధరం:** ఇక జానపద సాహిత్య సంగ్రాహకులు ఎటువంటివారో వారి నిష్కామకర్మ ఎటువంటిదో రాళ్లపల్లివారే యిలా చెప్పారు.

"మనుష్య జీవితంలో రసానుభవానికుండే విలువను గుర్తించిన మహానుభావులు, దీర్ఘదర్శులు, గంభీర హృదయులు అప్పుడప్పుడు దేశంలో అవతరించి ఆ సాహిత్యంలోని రత్నాలను ఏరి యెత్తి చూపి లోక కల్యాణానికి మార్గదర్శకులౌతారు. వారి మహత్వంలో ఆ రచనలు కొంత వ్యాప్తికి వండిత గోష్ఠిలో రాగల్గుతున్నవి."

రాళ్లపల్లి పేర్కొనకపోయినా అటువంటి మహానుభావులు, దీర్ఘదర్శులు, గంభీర హృదయుల్లో మొట్టమొదట పేర్కొనదగ్గవారు కీ॥ శే॥ నేదునూరి గంగాధరంగారు. కవికోకిల, జానపద వాఙ్మయోద్ధారకులైన శ్రీ నేదునూరి గంగాధరంగారి 12 వ వర్ధంతి మార్చి 11వ తేదీ 1982 రాజమండ్రిలో జరిగింది. ఆ సందర్భంలో నేదునూరి గంగాధరం కవి జానపద సాహిత్య గ్రంథాలయం కమిటీ అధ్యక్షులైన దుర్గా వెంకట రమణరావుగారు 'ఆంధ్రప్రభ' దినపత్రికలో 19-2-82 వ తేదీ వ్రాసిన 'లేఖ'లోని విషయాలు చెబితే గంగాధరంగారి నిష్కామకర్మ ఎలాంటిదో తెలుస్తుంది.

"గంగాధరంగారు తమ జీవితకాలంలో సుమారు 45 సంవత్సరములు తెలుగు దేశంలో అనేకసార్లు సంచారం చేసి లిఖిత పూర్వకంగా లేని అనోట అనోట వంశపారంపర్యంగా పాడుకొనే జానపద గీతాలు, గేయాలు, పాటలు, స్త్రీల పాటలు, కథలు, గాథలు, ఆటలు, ఆటల పాటలు, మాండలికాలు, సామెతలు, నుడులు, నానుడులు, పూర్వవాద్యాలు, వివిధ అచ్చు ప్రతులు, పారిభాషిక పదాలు, ఎన్నెన్నో — నాటి ప్రాచీన సారస్వత ప్రక్రియలను వృద్ధులైన జానపదుల నుండి ఆయా గ్రామాలలో విని తాము వ్రాసుకువచ్చి సేకరించిన వేల వేల పుటల గ్రంథ సంచయాన్ని తమ యింట 'జానపద కుటీరమ్' లో భద్రపర్చారు."

"ఈ మార్చి 11 వ తేదీని వారి వర్ధంతి సందర్భమున గంగాధరం గారు సేకరించిన అన్నిరీతుల జానపద సాహిత్యాన్ని లిఖిత, అముద్రిత, ముద్రిత రచనలు, లేఖలు, ఛాయా చిత్రములతో పుస్తక ప్రదర్శనను ఏర్పాటుచేయ తలపెట్టాము."

"అశేష జానపద సాహిత్యమును భద్రపర్చిన వారి జానపద కుటీరమ్ చోటనే తెలుగు దేశమునకు ఏకైక జానపద సాహిత్య గ్రంథాలయం భవన నిర్మాణ కార్యక్రమం చేపట్టాము."

"కనుక గంగాధరంగారిని ఎరిగిన మిత్రులు, సన్నిహితులు, సాహితీవేత్తలు, కవులు మొదలగువారు గంగాధరంగారు వారికి వ్రాసిన లేఖలు, పంపిన రచనలు (వ్రాతలోగాని, అచ్చులోగాని వున్నవి), ఛాయాచిత్రములు, వారిపై తమ అభిప్రాయాల రచనలు, సందేశములు దయచేసి అధ్యక్షుడు, నేదునూరి గంగాధరం కవి జానపద సాహిత్య గ్రంథాలయం కమిటీ, తలుపు నెం. 29 3-2, శ్రీ వేంకటేశ్వర ఆశ్రమ కళాకేంద్రం వెనుక, రాజమండ్రి - 4 విలాసమునకు పంపి మా కృషికి సహాయపడగోరుతూ అర్థిస్తున్నాము."

ఈ అభ్యర్థన గత సంవత్సరంలో వచ్చినదైనా నిరంతరమైన జానపద సాహిత్య సంబంధి అభ్యర్థనగా పాఠకులు గ్రహింప

గలరు. గంగాధరంగారు ప్రకటించిన జానపద వాఙ్మయం - మేలుకొలుపులు (1949), మంగళహారతులు (2 సంపుటాలు - 1951), సెలయేరు (1955), వ్యవసాయ సామెతలు (1956), పసిడి పలుకులు (1960), స్త్రీల వ్రతకథలు (2 సంపుటాలు-1960), జానపద గేయ వాఙ్మయ వ్యాసావళి (1960), ఆటపాటలు (1964), మిన్నేరు (1968), మున్నీరు (1973). ఇంకా అనేక గ్రంథాలెన్నో వుండవచ్చు. పదివేల పుటల సేకరణలో ముద్రితమైన సాహిత్యం సహస్రాంశమే.

పై లేఖ 'ఆంధ్రపత్రిక'లో వచ్చిన తరువాత ఆచార్య బిరుదురాజు రామరాజుగారు గంగాధరంగారి 'జానపద కుటీరాన్ని' ప్రభుత్వం తీసుకొంటే మంచిదని సూచించారు. కాని నా దృష్టిలో ఆ కుటీరం ప్రభుత్వపరం చేయడంకంటే ప్రత్యేక వ్యక్తుల చేతిలో వుండటమే మంచిది. ప్రభుత్వం ప్రచురణలకు, సంరక్షణకు నిధుల్ని యివ్వవచ్చు.

**కీ. శే. వేటూరి ప్రభాకరశాస్త్రి :** రాళ్ళపల్లివారు వ్యాసంలో సూచించిన జానపద వాఙ్మయోద్ధారకులైన మహానుభావుల్లో రెండవవారు వారి ఆప్తమిత్రులు ప్రాతఃస్మరణీయులు కీ. శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు. ఈ సందర్భంలో శ్రీ దువ్వూరి రామిరెడ్డిగారు "ది ఆంధ్ర ఫోక్‌లోర్ - ఎ వర్డ్ టు స్టూడెంట్స్" అనే శీర్షికతో ఆంగ్ల త్రైమాసిక పత్రిక 'త్రివేణి'లో వ్రాసిన 'లేఖ'లోని కొన్ని వాక్యాలు జ్ఞాపకం వస్తున్నాయి. ఆ లేఖలో రామిరెడ్డిగారు విద్యార్థుల్ని జానపద వాఙ్మయ సేకరణకు పురిగొల్పుతూ ఉదాహరణంగా వేటూరి ప్రభాకరశాస్త్రుల్ని చూపారు.

"వాట్ ఐ విష్ టు సజెస్ట్ టు మై ఫ్రెండ్స్ ఈజ్ దట్ విత్ సచ్ ఎ ప్రాక్టికల్ ఎగ్జాంపుల్ ఆఫ్ ది ఐరిష్ ఎంగ్‌మెన్ బిఫోర్ అజ్, ఉయ్ కెన్ స్టార్ట్ ఎ మూవ్‌మెంట్ అండ్ ఆర్గనైజ్ ది స్టూడెంట్స్ ఆఫ్ ది కాలేజిస్ ఇన్టు స్మాల్ బాండ్స్ ఆఫ్ లిటరరీ వర్కర్స్ హూ విల్ హవ్ యాంపిల్ లీజర్ ఇన్ ది వెకేషన్స్ టు కలెక్ట్ ది అవైలబుల్ ఫోక్ లోర్ అండ్ పబ్లిష్ ఇట్. ఇట్ ఈజ్ నాట్ ఎ వర్క్ టు బీ క్యారీడ్ ఔట్ బై ఎనీ సింగిల్ ఇండివిజుల్, ఈవన్ దో అవర్ ఎంతూజియాస్టిక్ పండిట్ వేటూరి ప్రభాకరశాస్త్రి హాజ్ బీన్ కలెక్టింగ్ ది ఫోక్ లోర్ వెన్ ఎవర్ హి కుడ్ స్నాచ్ ఎనీ అపర్చ్యూనిటీ ఇన్ హిస్ అఫిషియల్ టూర్స్."

ఈ పై లేఖను పూర్తిగా చూడదలచినవారు కె. వి. రమణారెడ్డి రచించిన "కవికోకిల దువ్వూరి రామిరెడ్డి - జీవితమూ సాహిత్యమూ" (1965) అనే గ్రంథానికుండే అనుబంధం చూడవచ్చు.

ఈ విధంగా తెలుగుదేశంలో జానపద వాఙ్మయ సేకరణకు పునరుద్ధరణకు నడుంకట్టి ప్రతిఫలాపేక్ష లేకుండా, నిస్వార్థంగా సాహిత్యకృషి చేసినవారిలో నేదునూరి, వేటూరి ప్రముఖంగా పేర్కొనదగ్గవారు. వారి కృషి 'నిర్నామకర్మ' అయిపోకుండా నేదునూరి జానపద కుటీరానికి గ్రంథాలయ భవన నిర్మాణం చేయడం, వర్ధంతి జరపడం, పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేయడం ముదావహం. అలాగే అముద్రిత జానపద వాఙ్మయాన్ని ప్రక్రియా దృష్టితో విభజించి పండితులచేత పరిష్కరింపించి ప్రచురించే కార్యక్రమం చేపట్టడం అత్యవసరంగా నేను భావిస్తున్నాను.

ప్రస్తుతం వేటూరివారి పుత్రులు డా. వేటూరి ఆనందమూర్తిగారు 'మణిమంజరి' అనే షాణ్మాసిక పత్రికను స్థాపించి వేటూరివారి అముద్రిత వ్యాసాలనూ, ఉపన్యాసాలనూ, కవితలనూ, యోగసంబంధ విషయాలనూ ప్రచురించడమేగాక 1988 లోగా శాస్త్రిగారి సంపూర్ణ గ్రంథావళిని ముఖ్యంగా 'చాటుపద్య మణిమంజరి'ని మూడు సంపుటాలలో వెలుగులోనికి తీసుకువచ్చే బృహత్కార్యక్రమాన్ని చేపట్టారు. ఇది తెలుగు సాహిత్యానికి ప్రత్యేకించి జానపద సాహిత్యానికి మంచిరోజులు వచ్చినట్లుగా నేను భావిస్తున్నాను.

**రాళ్ళపల్లి వ్యాసం పునర్ముద్రించడంలోని ఔచిత్యం :** ప్రస్తుతం రాళ్ళపల్లివారి వ్యాసాన్ని 'భారతి' పత్రికాముఖంగా ప్రకటించడానికి కారణాలు నాలుగైదు వున్నాయి.

1. ప్రకటింపబడిన రాళ్ళపల్లివారి సాహిత్యవ్యాస సంపుటాలలో ప్రస్తుత వ్యాసం లేకపోవడం.
2. 'అనంతరాగం' అనే రాళ్ళపల్లి అభినందన గ్రంథం (1977)లో శర్మగారి రచనల సూచికలోగాని గ్రంథంలో మరెక్కడా గాని ప్రస్తుత వ్యాసాన్ని సంపాదకులు పేర్కొనకపోవడం.
3. రాళ్ళపల్లివారి జీవిత - సాహిత్యాలను పరిశోధించి ఎం. ఫిల్. డిగ్రీ తీసుకొన్న మదీయ మిత్రుడు శ్రీ చంద్రశేఖర్ తన సిద్ధాంత గ్రంథంలో 'కన్నడ జానపద సాహిత్యం'పై రాళ్ళపల్లి వ్యాసం ఒకటుందని ఎక్కడా తడవక పోవడం.
4. తెలుగు కన్నడ జానపద గేయాలపై తులనాత్మక పరిశోధన జరిపి మైసూరు విశ్వవిద్యాలయంనుండి పిహెచ్. డి. డిగ్రీని పొందిన డా॥ ఆర్వీయస్ సుందరంగారికి నేను లేఖ వ్రాయగా

రాళ్లపల్లివారు వ్రాసిన ప్రస్తుత వ్యాసం తాను చూడలేదని జవాబివ్వటం.

5. విశేషించి, తన జీవిత సర్వస్వాన్ని జానపద వాఙ్మయోద్ధరణకు అంకితం చేసిన కీ. శే. నేదునూరి గంగాధరంగారి 13 వ వర్ధంతి సందర్భంగా తెలుగు కన్నడ జానపద వాఙ్మయంలో తులనాత్మక పరిశీలనకు ప్రాతిపదిక వేసి ఆ వాఙ్మయ సేకరణ, పరిశీలన, పరిశోధనకు పురికొల్పిన రాళ్లపల్లి వారి అపురూప విస్మృత వ్యాసాన్ని జానపదవాఙ్మయ జిజ్ఞాసువులకు సమర్పించడంలో ఎంతో ఔచిత్యముందని నేను భావిస్తున్నాను.

ఇక్కడ 'విస్మృత' మని ఎందుకంటున్నానంటే పరిశోధకుల దృష్టికి రాకపోవడంచేత 'విస్మృత' మనే మాట అటుండనిచ్చి, 'అసలు జానపద వాఙ్మయమే నానాటికి లుప్తమై విస్మృత పథంలో పడిపోతూ వుంది' అనడం న్యాయసమ్మతంగా వుంటుంది. అటువంటి 'విస్మృత జానపద సాహిత్యం' పై రాళ్లపల్లి వ్రాసిన వ్యాసం సైతం విస్మరింపబడడంలో ఆశ్చర్యం ఎంతమాత్రమూ లేదు. కాబట్టే 'విస్మృత సాహిత్య వ్యాసాల్లో' ఇది మొట్టమొదటిదిగా పేర్కొన్నాను.

## 'రాళ్లపల్లి అభినందనసమితి'వారు చేయవలసిన మరికొన్ని పనులు

"'అనంతరాగం','రాళ్లపల్లి పీఠికలు' ప్రచురించి 'రాళ్లపల్లి అభినందన సమితి' కార్యకలాపాలు పరిసమాప్తి పొందాయి" అని పీఠికా సంపాదకులు 'తొలిపలుకు' చివరలో పేర్కొన్నారు. కాని నా దృష్టిలో వారు చేయవలసిన పనులు రెండు మూడు యింకా మిగిలి వున్నాయనిపిస్తోంది.

1. రాళ్లపల్లి వారి సమగ్ర వ్యాస సంపుటం ఒకటి వెలువడాలి. అది రెండు సంపుటాలుగా వేసినా బాగుంటుంది. అందులో ప్రస్తుత వ్యాసం తప్పకుండా చేర్చాలి. 12-2-1951 లో కాకినాడ సరస్వతీ గాన సభ వారి మొదటి పండిత పరిషత్తున చేయబడిన అధ్యక్షోపన్యాసము "సంగీత కళాభివృద్ధి" కూడా చేర్చాలి.

2. చెదురుమదురుగా నున్న ఆయన కవితలన్నింటినీ సేకరించి సంస్కృతాంధ్ర సమాహార కావ్యఖండికా సంపుటంగా వెలువరించాలి.

3. 'అనంతరాగం' లో రాళ్లపల్లివారి మొత్తం పీఠికల సంఖ్య 65 కాగా రాళ్లపల్లి పీఠికాసంకలనంలో 78 దాకా పెరిగాయి. కాని 'తొలిపలుకు' లో సంపాదకులు ఇంకా సేకరింపవలసిన పీఠికలున్నట్లుగాని, పీఠికలన్నింటినీ పర్యాప్తంగా తాము సేకరించినట్లుగాని వారు చెప్పలేదు. కాబట్టి దానికి 'అనుబంధం'గా 'రాళ్లపల్లి లఘు పీఠికలు' అనే గ్రంథం వెలువడవలసిన ఆవశ్యకత వుంది. నేనింతవరకు ముప్పయి లఘు పీఠికలు సేకరించాను. "మరీ లేఖాప్రాయంగా ఉన్న అభిప్రాయాలను వదలివేయడం జరిగింది" అని సంపాదకులు 'తొలిపలుకు'లో చెప్పినా నేను సేకరించిన పీఠికల్లో పది పెద్ద పీఠికలే వున్నాయి. పైగా ప్రచురింపబడిన 'రాళ్లపల్లి పీఠికల్లో' గ్రంథంలోని సర్వోదయగానము, అశ్వత్థభారతము 'విషయసూచిక' లోనికి ఎక్కలేదు. అప్పుడు 76 సంఖ్య కాక 78 సంకలింపబడినవని తేలుతోంది.

4. రాళ్లపల్లివారి లేఖావాఙ్మయం సేకరించి ఒక సంపుటంగా వెలువరించాలి.

ఈ పనులు 'అభినందన సమితి' వారో, రాళ్లపల్లి కుమారులైన శ్రీ జయంతలాంటి వారో భవిష్యత్తులో చేస్తారని ఆశిస్తున్నాను. 'పనులు చూచుకోవాలి కదా' అని డా॥ సుందరంగారు లేఖలో పేర్కొన్న మాట నిజమే. వీరు ఇటీవల 'యువ భారతి' తరపున 'జానపద సాహిత్యం' పై ఒక గ్రంథం వెలువరించారు.

**ముగింపు మాటలు :** కన్నడంలో జానపద వాఙ్మయ సేకరణ, పరిశీలన, పరిశోధన జరిగినంతగా తెలుగులో జరగడం లేదని నా అభిప్రాయం. దీనికి ప్రబలోదాహరణం కర్ణాటక విశ్వవిద్యాలయంలో జానపద విజ్ఞానానికి ఒక ప్రత్యేక అధ్యయన శాఖ ఉండడమే. పైగా ఆంధ్రప్రదేశ్‌లో ఆరు విశ్వవిద్యాలయాలున్నా ఏ విశ్వవిద్యాలయంలోనూ తెలుగు సాహిత్య పరిశోధనకు సంబంధించిన ఒక ప్రామాణిక పరిశోధన పత్రిక లేకపోవడం శోచనీయం. అదే కర్ణాటక రాష్ట్రంలో మైసూరు విశ్వవిద్యాలయం నుండి గత అరవై సంవత్సరాలుగా 'ప్రబుద్ధ కర్ణాటక' 'మానవిక కర్ణాటక' అనే రెండు పరిశోధన పత్రికలు కన్నడ సాహిత్యానికే ఉద్దేశింపబడి నడుస్తున్నాయి. తమిళనాడులో 'జర్నల్ ఆఫ్ టమిల్ స్టడీస్' వుంది. ఇరుగు పొరుగు వారిని చూచైనా మనవారు ఎందుకు నేర్చుకోరో తెలియడం లేదు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జానపద వాఙ్మయరాశిని సేకరించి భద్రపరచాలని ఆచార్య బి. రామరాజుగారు, డా॥ నాయని కృష్ణకుమారిగారు శ్రమిస్తున్నారు. అంతేకాని ప్రత్యేక అధ్యయన శాఖ వున్నట్లులేదు. అక్కడి తెలుగు శాఖ వెలువరిస్తున్న వార్షిక సంచిక 'వివేచన' ఆ శాఖకే పరిమితమై వుంది. ఇదీ మన తెలుగుదేశపు స్థితి.

"1919 నాటికే జానపద కథా గేయాలను గురించి మాస్తి వేంకటేశం అయ్యంగార్ వ్రాసిన వ్యాసం కన్నడ జానపద సాహిత్యం వైపుకు అందరి దృష్టి ప్రసరించేటట్లు చేసింది" అని కన్నడ సాహిత్య చరిత్రలో డా॥ ఆర్వీయస్ సుందరంగారు చెప్పారు. మరి తెలుగులో 1951 లో రాళ్లపల్లివారు ప్రకటించిన "కన్నడ జానపద సాహిత్యం" మన తెలుగువారి నెంతమందిని కదలించిందో చెప్పలేము. ఇటీవల ఒక సాహిత్యసభలో గజ్జెల మల్లారెడ్డి యిలా అన్నారు — "తెలుగువారి చర్మానికి మందం ఎక్కువ" అని. ఈ వాక్యంలో ఎంతో సత్యముంది కదా!

| | జననం | మరణం | జీవిత కాలం |
|---|---|---|---|
| కీ.శే.వేటూరి ప్రభాకరశాస్త్రి | 7-2-1888 : | 29-8-1950 | 62సం. |
| కీ.శే.రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ | 23-1-1893 : | 11-3-1979 | 86సం. |
| కీ.శే.దువ్వూరి రామిరెడ్డి | 9-11-1895 : | ....9-1947 | 52సం. |
| కీ.శే.నేదునూరి గంగాధరం | 4-7-1904 : | - -1970 | 66సం. |
| కీ.శే.నిడుదవోలు వేంకటరావు | 10-1-1904 : | -10-1982 | 78సం. |

సేకరణ - వివరణ : శ్రీ ముదివేడు ప్రభాకరరావు

కనీసం పదిహేను నూర్ల యేండ్లుగా కన్నడ దేశంలో ఆ భాషా సాహిత్యం ప్రచారంలో వుంటూ వచ్చింది. ఇప్పటికి దొరికిన చరిత్ర సాధనాలను బట్టిచూస్తే, తెలుగుకంటే కన్నడంలో సాహితీసంస్కృతి ప్రాచీనంగా కానవస్తుంది.[1] ఇంతేకాదు. మత ప్రచారమందు పరస్పరం పోటాపోటీచేస్తూ జైనులు, అద్వైతులూ, వైష్ణవులూ, వీరశైవులూ ఈదేశంలో మూలమూలలనూ సాహిత్యం మూలాన సంస్కృతిని సాగించినారు. కాబట్టి కావ్యకళ కన్నడ దేశంలో ఆబాల గోపాలంగా వ్యాపించింది. వీరశైవ కవుల వచనాలనబడే సులభ గీతాలు వేలకుమించి వున్నవి.[2] వైష్ణవుల దేవర నామాలు గూడా అట్లే అసంఖ్యంగా ఉన్నవి.[3] ఒక విశమైన ద్విపద ఛందస్సులో హరిహరకవి జనసామాన్యానికై వ్రాసిన రగడలు దొరికినవి.[4] ఇప్పటికి నూటికి పైబడినవి. ఇప్పటికి దొరకిన దానికంటే నష్టమైన సాహిత్యం ఎన్నింతలు గొప్పదో చెప్పుటకు వీలులేదు.

కన్నడులకు మన వేమన్నవంటి సర్వజ్ఞుడు "సాహిత్య ఎల్లరిగిల్ల సర్వజ్ఞ" — "సాహిత్య మందరికీలేదు సర్వజ్ఞా!" అన్నాడు.[5] కాని నిజంగా కన్నడదేశానికామాట అంతగా అన్వయించదు. కన్నడ దేశమంటే ఇప్పటి దేశంకాదు. ఇప్పటి కన్నడ దేశమూ అన్ని మన దేశాలవలెనే ఇన్నూరేండ్ల ఇంగ్లీషు సంస్కారంతో స్వరూపనాశనం చేసుకొన్నది. కాని పూర్వకాలంలో కన్నడ జీవితంలో సాహిత్యం విడదీసే వీలులేకుండా మేళగించుకొని వుండేదనడంలో సందేహంలేదు. సర్వజ్ఞకవిమాట అతని అతృప్తిని మాత్రం సూచిస్తుందంటే! దానికి మితిలేదు కదా!

పండితులు అక్షరాస్యులు మాత్రమే కాదు. అక్షర హస్తులు కూడా. కనక వారి సాహిత్యంలో ఉత్తమ మధ్యమాధమ రచనలు కూడా పుస్తకాలకెక్కి పురుగులను కూడా తప్పించుకొని చాలా వరకూ నిలిచినవి. కాని, పామరుల సాహిత్యం పాపం నిత్య జీవితంలో సంప్రదాయ శరణులైన వారినోళ్లలో, తలల్లోమాత్రం నిలుపవలసివచ్చింది. ఈ రెండు శతాబ్దాల భావదాస్యపు తుపానులో అది బహుభాగం చేతికి దొరకకుండా కొట్టుకొని పోయిందంటే ఆశ్చర్యమేమీ లేదు.

మరి పూర్వకాలంలోనైనా సాహిత్యాభిమానమూ, అనుభవమూ, పండితుల కంటే పామరులకే యెక్కువేమో అనిపిస్తుంది. విషయాలను ఎక్కువగా సంగ్రహించేదీ, తీవ్రంగా వాటిని విమర్శించి వినిపించేదీ పాండిత్యాని పని. ఆ ఉద్యోగంలో పండిత చిత్తాలకు అనుభవానికీ ఆనందించడానికీ అవకాశం చాలదు. కనక తామేర్పరచుకొనే నియమాలకూ, సిద్ధాంతాలకూ లొంగని రచనలంతా వారు గమనించక వదలుతారు. ఏ కొందరో ఈ అహంభావానికి తప్పుకొన్న వారుంటారు. కనక జానపద సాహిత్యం పండితుల ప్రాపు పోషణ పూర్వకాలంలో గూడా పొందలేదు.

జానపద సాహిత్యంలోని ముఖ్య గుణమేమంటే శబ్దానికంటే అర్థానికీ, దానికంటే భావానికి కానవచ్చే ప్రాధాన్యం. ఆర్ద్రమై, నిర్మలమై సంకోచమూ, సంకేతమూ లేని అనుభవం దాని జీవవాతువు. ఎవరేమనుకొన్నా సరే, తనకు తోచిన భావాన్ని తనకు వచ్చిన మాటల్లో తనకై చెప్పుకొనేదీ, పాడుకొనేదీ జానపద కవుల ప్రవృత్తి. రసానుభవ చాపల్యం కలవారి కిందులోవున్న ఆకర్షణ సాంకేతిక సాహిత్యంలో వుండదు. మనుష్య జీవితంలో రసానుభవానికుండే విలువను గమనించిన మహానుభావులు, దీర్ఘదర్శులు, గంభీర హృదయులు అప్పుడప్పుడు దేశంలో అవతరించి, ఆ సాహిత్యంలోని రత్నాల నేరి యెత్తిచూపి లోకకల్యాణానికి మార్గదర్శకులౌతారు. వారి మహత్వంలో ఆ రచనలు కొంత

వ్యాప్తికి, పండిత గోష్ఠిలో రాగల్గుతున్నవి.6 తరువాత కొందరు పండితులు వాటిలో యెక్కడాలేని అర్థాలూ, భావాలూ, తాత్ప ర్యాలూ, ధ్వనులూ, రహస్యాలూ తవ్వి బైటికి తీస్తారు.7 నాథ మునీశ్వరుడు తమిళ వైష్ణవ ప్రబంధాలలో ఎంతో భాగాన్ని ఇష్టే వ్యాపింప జేసినాడు. లేకపోతే అండాళమ్మ తిరుప్పావై వంటి నగ్నసుందర రచనలకు ఇంత గొప్ప వ్యాప్తి, ప్రామాణికతా వచ్చియుండదు.8 శక కర్త శాలివాహన చక్రవర్తి తన కాలంలో కోట్లకొలదిగా వుండిన జానపద ప్రాకృత గాథలలో ఏర్చి సప్త శతిని కూర్చినాడు. తరువాత వాటిని ఉదాహరించి దీవించి చర్చింపని అలంకారికుడు లేడు.9 తెలుగులో బహుజనపల్లి సీతారామా చార్యులు క్షేత్రయ్య పదాలకు ఇట్టి స్థానం సంపాదించే ప్రయత్నం మహాభయంతో కొంత చేసినాడు. కాని అప్పటి ఆంగ్ల సంప్రదాయ ప్రవాహంలో ఆయన యెత్తిన చేయి యెవరి కంటికీ పడలేదు.10 ఇటీవల త్యాగయ్యగారి రచనల గూర్చి కూడా ఇటువంటి ప్రయత్నం కొంత జరుగుతూ వుంది.11

ఇప్పటికి సుమారు ముప్ఫయి యేండ్లుగా భారత స్వాతంత్ర్య సంపాదన కోసం పోరాడే కన్నడ విద్యాధికులలో తరుణులు కొందరు, మునిగిపోతూ వుండిన తమ జనపద వాఙ్మయాన్ని ఉద్ధ రించే ప్రయత్నం చేస్తున్నారు.12 దాని ఫలితంగా ఎంతో గ్రంథం బైలు పడింది. పాటలుగా, పద్యాలుగా, రగడలుగా, కన్నడ జాన పదులు రచించి చల్లిన కృతులు ఎన్నో ఇప్పుడు మనము చదువు కొని ఆనందపడ గల్గుచున్నాము. అలౌకికంగా కావ్య రసానం దాన్ని అనుభవించటమంటే యేమిటనేది వీరి మూలాన మనకు కొంచెం అర్థమవుతుంది. అన్ని రసాలూ, ధర్మాలూ, తత్వాలూ, నీతులూ ఇందులో అనుభవించి తెలుసుకోవచ్చును. దుర్నీతులు కూడా రసధార చేత పరిశుద్ధమై మనకు భోగ్యమవుతున్నది. కన్నడ జాతిలో తరతరాల అకృత్రిమ జీవనమే ఇందులో స్పష్టంగా ప్రతిఫలిస్తూ ఉన్నది. దాని ఆశ, నిరాశ, ధైర్యం, ఉత్సాహం, ఉద్వేగం, సంతోషం, దుఃఖం, రక్తి, విరక్తి అన్నీ ఇందులో సంగ్రహంగా చక్కగా చదివేవారి మనస్సులలో నాటుకొంటుంది.

విశేషమేమంటే ఈ సాహిత్యంలోని స్త్రీల రచన ఇప్ప టివైన దానిలో చాలాభాగం ఆడవారి నిర్మాణమే. వీర కథలైన లావణులు, భక్తిరచనలైన పదాలూ, రచనలూ మొదలైన పురుష రచనలుపోగా, త్రిపది అనబడే చిన్న ఛందస్సులో ముక్తకాలుగా దేనికదే స్వతంత్రంగా రచించిన వారందరూ ఇంచుమించు స్త్రీలే.13 అంటే రచించినవాం పేర్లూ, ఊర్లూ మనకు తెలుసునని కాదు. ఆ ప్రసిద్ధి కాంక్ష అంతా మొత్తంమీద మగవారిసొమ్ము. మరి ఆ త్రిపది ముక్తకాలలో ప్రతిఫలించే మనోధర్మం, అపుసోపులూ ముఖ్యంగా స్త్రీలవి. మరిన్నీ నేటికీ అవి పాడుకునేవారంతా వాండ్లే. వీని వినియోగం ముఖ్యంగా నిశరాత్రిలో పిండి విసరేటప్పుడు. కన్నడదేశంలో ముఖ్యమైన సామాన్యాహారం జొన్నలు, రాగులు. జొన్నలు రొట్టిగా, రాగులు సంకటిగా నిత్యభుక్తి కుపయోగించేది ఈ దేశ జానపద పద్ధతి. రెంటినీ విసరక విధిలేదు. కనుక స్త్రీలకు నిత్యకృత్యాలలో మొదటిదీ, ఎక్కువ దేహశ్రమాన్నిచ్చేది తిరుగలి పని. అరుణోదయానికి ముందే లేచి ఆ పని చేసుకొనేది కన్నడ గృహిణీ పద్ధతి. అందలి బేజారు, అయాసం తొలగించుకొనే టందుకు వారీ త్రిపదులు పాడుకొంటూ పని నెమ్మదిగా ముగించు కొంటారు.14 వారి గీత రచనాకళ నుద్బోధించే సరస్వతీ దేవత ఈ తిరుగలి; వారి యేకాంత భావనలకు సాక్షిగా ఉండే సఖి. ఒకానొక బీదరాలు పాపం సొంతంగా ఇంట్లో విసర్రాయిలేంది. పొరుగింటామె పుణ్యాన ఆమె తిరుగలిలో పిండి విసరుకొని ఆమెకు కృతజ్ఞతతో ఇట్లాశీర్వదించింది.

రాయిచ్చినమ్మకు అన్ని భాగ్యాలూ
దాని కొడుకు పల్లకి నెక్కరానీ
ఆ యింటికి మల్లెలు ముడిచే కోడలు రానీ

ఇంకొక ముదిత విసరి తన చేతులు నొచ్చింది గమనించక రాతికి నొచ్చిందని సమాధానం చేసి పూజించింది.

పుట్టెడు రాగులు విసరి
బడలితినమ్మా సరస్వతీ ।
గంధం తెచ్చినాను
ధరించవమ్మా, సరస్వతీ ।
దండ తెచ్చినాను
ముడుచుకోవమ్మా ।

ఈ త్రిపది తెలుగులో ఆటవెలదివలె దేశీయమైన చిన్న పద్యం. మూడు పాదాలని పేరేకాని పాడేవాడు దాని రెండవ పాదాన్ని రెండుమార్లుపాడి చతుష్పదిగా చేసుకొంటాడు. దీని కుప యోగించే మెట్లుకూడా చాలా సులభమై సుగ్రహంగా వుంటాయి. నేను విన్నరీతి ఇది. నేను ఆ దేశీయ రీతిని చక్కగా గ్రహించ లేదని చెప్పవలసి వున్నాను.

కల్లు కొట్టమ్మెక్కెల్ల భాగ్యవు బరలి
పల్లక్కి మేలె మగ బరలి - అగిమనె
మల్లిగి ముడియో సొసి బరలి

ఇంకా వేరు విధంగా గూడా దేశపద్ధతి ప్రకారంగా పాడుకొనేది కద్దు.[15] గణాలు లెక్కించేవారికి ఈఛందస్సు అర్థంకాదు. దీనిలోని తాళగతి — 'ఖండగతి' అనబడే ఐదు మాత్రల నడక. సహజంగా సృష్టిలో సర్వత్రా మనుష్యచిత్తాన్ని ముఖ్యంగా ఆకర్షించేది నాలుగు మాత్రల చతురస్రగతి అయినా, తెలుగులోనూ, కన్నడంలోనూ దేశీయ ఛందస్సు నడక 3, 5, 7 మాత్రల విషమగతే ఎక్కువగా కలిగి జనప్రియంగా ఉండేదొక అనిర్వచనీయమైన వింత.[16] తెలుగు సీసం, ద్విపద వీటిలో ఈ ఖండ నడక స్పష్టంగా ఉందికదా! కన్నడంలోనూ పాటలలో, షట్పదులలో సాంగత్య రగడ అనే ఒక విధమైన ద్విపదలో ఈ విషమగతే నిలిచింది ముఖ్యంగా.[17]

— విజయవాణి (3-1-1951)

పునర్ముద్రణ : "ఏరిన ముత్యాలు" శీర్షికతో
పుటలు 152-54

"కిన్నెర" సాహిత్య మాసపత్రిక
ఎడిటర్ - పందిరి మల్లికార్జునరావు
సంపుటం - 3 సంచిక - 2
ఫిబ్రవరి - 1951.

## రాళ్లపల్లి వ్యాసం - పత్రికా ప్రకటన కాలాది వివరాలు

కీ॥ శే॥ రాళ్లపల్లి వారి పై వ్యాసం నాకు లభించినవైనం కొంచెం వివరిస్తాను. ప్రస్తుతం నేను శ్రీ విశ్వనాథవారి ఖండకావ్యాలనూ, సాహిత్య వ్యాసాలనూ, పీఠికలనూ సంకలనం చేసే ప్రయత్నంలో వుండడం మూలాన పాత పత్రికలనూ, సంచికలనూ తిరగవేస్తున్నాను. కిన్నెర, 1951 సంవత్సరం పత్రికలో "ఏరిన ముత్యాలు" అనే శీర్షిక క్రింద సంపాదకుడు, పందిరి మల్లికార్జునరావు గారు రాళ్లపల్లివారి పై వ్యాసాన్ని పునర్ముద్రించారు. వారు విజయవాణి, (3-1-'51) నుండి పై వ్యాసం గ్రహించినట్లు సూచించడం ఎంతో మేలైంది. నేను 'విజయవాణి' కోసం వేటాడటం ప్రారంభించాను. నా సాహితీ మిత్రులు తామూ పత్రిక పేరు వినలేదన్నారు. డా॥ అప్పయస్ సుందరం గారికి లేఖ వ్రాయగా ఆయన యిలా వ్రాశారు. "మీరు పేర్కొన్న 'కన్నడ జానపద సాహిత్యం' వ్యాసం నా కంట పడలేదు. 'విజయవాణి' పత్రికను గురించి తెలియదు. తెలిసినవాళ్లు చెప్తే మీకు వ్రాస్తాను." (లేఖ - 9-3-'82)

పరిశోధనా పరమేశ్వర (కీ॥ శే॥) నిడుదవోలు వేంకటరావు గారి వద్దనుండి 5-3-'82 వ తేదీ ఈ క్రింది విధంగా లేఖ వచ్చింది. "మీరు కోరినట్లు మా శివ సుందరేశ్వరరావుకి చెప్పాను. వాడు చెప్పిన సంగతి. రెండు, మూడు 'విజయవాణు'లు ఉన్నాయి. ఒకటి, మూలా నారాయణస్వామి గారి విజయవాణి, అనంతపురం నుండి వెలువడింది. అందులో మీరు అనుకొంటున్న వ్యాసాలు కనబడవచ్చు. రెండవది, ప్రకాశం పంతులు నడిపిన 'విజయవాణి' (డైలీ) ఆర్నెల్లకే పోయింది. మూడు, బెజవాడలో 4 పేజీలు, కోర్టు అడ్వర్‌టైజ్‌మెంట్లతో ఒక 'విజయవాణి' వెలువడేది. అదీ, రెండోది మీకు పనికిరాకపోవచ్చు. ఇక ప్రతులు ఏమైనా ఉంటే శ్రీ ఎన్. రామారావు, కౌన్సిలర్, ఆంధ్రపత్రిక కరస్పాండెంట్, అనంతపురంకి రాయండి. లేదా అక్కడ సాయిబాబా మహిళా కళాశాలను అడగండి. ఇప్పటికి ఇంతే." అని వ్రాశారు.

మూలా లక్ష్మీనారాయణస్వామిని గురించి పరిశోధించగా తెలుగు విజ్ఞాన సర్వస్వం, నాల్గవ సంపుటంలో పాలగుమ్మి పద్మరాజు పుటలు 1054 లోను 1197 లోనూ ఈ క్రింది వివరాలు యిచ్చారు గాని నారాయణస్వామిగారి సంపాదకత్వంలో 'విజయవాణి' అనే పత్రిక వెలువడేది అని సూచింపలేదు. నిడుదవోలు వేంకటరావు గారి నిర్ణయమే గ్రహించాను నేను.

## 'విజయవాణి' సాహిత్య మాసపత్రికా సంపాదకుడు - శ్రీ మూలా లక్ష్మీనారాయణస్వామి (క్రీ. శ. 1912 - 1950)

"వీరి స్వగ్రామం తాడిపత్రి. వీరి తండ్రి వెంకటరంగయ్య. తల్లి రంగమ్మ. వీరు చిన్నతనంలోనే చక్కని వ్యాపారదక్షతను అలవరచుకొన్న యువకులు. ఉత్సాహవంతులు. 1938 వ సంవత్సరములో నేటి ప్రముఖ దర్శకులైన బి. యన్. రెడ్డి, కె. వి. రెడ్డి గార్ల సాహచర్యంతో 'వాహినీ పిక్చర్స్ లిమిటెడ్' అనే సంస్థను స్థాపించారు. రామనాథ్, శేఖర్‌గార్లవంటి ప్రతిభావంతులైన చలనచిత్ర నిర్మాణ చతురులను, నాగయ్యగారివంటి నటశేఖరులను, సంగీత దర్శకులను సమన్వయపరచి వారి సహకారంతో తెలుగు చిత్రపరిశ్రమకు ఒక స్థితిని, గౌరవాన్ని సమకూర్చినారు. వందేమాతరం, సుమంగళి, పోతన, స్వర్గసీమ, వేమనవంటి ఉత్తమోత్తమ చిత్రాలను 'వాహినీ పిక్చర్స్' నిర్మించింది. 1944 వ సంవత్సరంలో వ్యాపారదృష్టినిబట్టి కేవల చిత్రనిర్మాతలు కొంత పెద్ద పెట్టుబడితో 'వాహినీ ప్రొడక్షన్స్ లిమిటెడ్' అనే మరొక సంస్థను స్థాపించారు. గుణసుందరికథ, మల్లీశ్వరి, పెద్దమనుష్యులు, బంగారుపాప — ఈ సంస్థ నిర్మించిన చిత్రాలు."

"1947 లో వీరు ఆసియాలోని కంతటికీ పెద్దదిగా ప్రసిద్ధి చెందిన 'వాహినీ స్టూడియో' నిర్మాణం ప్రారంభించారు. వ్యాపార దృష్టిని, కళాదృష్టిని చక్కగా సమన్వయపరచి పండిత పామర రంజకమైన చిత్రాలు నిర్మించిన 'వాహినీ సంస్థలు', 'వాహినీ స్టూడియో' వీరి ఉత్సాహ కార్యదీక్షా ఫలితాలు. వీరు అకాల మరణానికి గురికాకపోతే ఈ సంస్థలు ఇతోధికమైన ఫలితాలను సాధింపగలిగియుండుటకు సందేహములేదు." ఇవి పాలగుమ్మి పద్మరాజుగారి మాటలు. ఇంతటి కళాదృష్టి కలిగిన నారాయణ స్వామిగారు ఒక సాహిత్య పత్రిక స్థాపించినడపడంలో ఆశ్చర్యం ఎంతమాత్రమూలేదు. కాబట్టి అనంతపురంనుండి వెలువడిన 'విజయవాణి' పత్రికలోనే రాళ్లపల్లివారి వ్యాసం ప్రచురింపబడి వుండాలి. ఎందుకంటే ఆ పత్రికా సంపాదకులు లక్ష్మీనారాయణ స్వామిగారి స్వగ్రామం తాడిపత్రి. ఇది అనంతపురం జిల్లాలోనిది. రాళ్లపల్లివారు అనంతపురానికి చెందినవారే. చిలుకూరి నారాయణ రావుగారుసైతం అనంతపురవాసులే.

కాబట్టి కీ. శే. మూలా లక్ష్మీనారాయణస్వామిగారిచే సంపాదితమై అనంతపురం నుండి వెలువడిన 'విజయవాణి' 3-1-1951 సంచికలో రాళ్లపల్లివారి రమణీయ వ్యాసం 'కన్నడ జానపద సాహిత్యం' ప్రచురితమైందని నిర్ధారణ చేయవచ్చు.

పై పత్రిక ప్రతుల కోసం కీ॥ శే॥ నిడుదవోలువారు చెప్పిన అడ్రసుల ఆధారంగా నేను చేసిన ప్రయత్నాలు ఫలించ లేదు. ఆ వ్యాసం ముందు వెనకా మరికొంత విషయమున్నదా అని నా అనుమానం. గుడ్డిలో మెల్లగా 'కిన్నెర' సంపాదకుడు పందిరి మల్లికార్జునరావుగారైనా అది పునర్ముద్రించారు కాబట్టి అంత మాత్రమైనా లభించింది. ఈయనా 1982 జనవరిలో కీర్తిశేషు దయ్యారు. వేటపాలెం గ్రంథాలయంలో 1948 నుండి 1963 వరకు గల ఒక 'విజయవాణి' వుందని తెలిసింది కాని అది నిడుదవోలు వారు చెప్పిన మూడు విజయవాణుల్లో ఏదో ఖచ్చితంగా తెలియ లేదు. ప్రస్తుతం లభించినంత మేరకే రాళ్లపల్లి వ్యాసం ముచ్చటగా మూడవసారి పునర్ముద్రింప బడుతోంది. అదీ సుప్రసిద్ధ సాహిత్య మాస పత్రిక 'భారతి' ద్వారా వెలువడడం అత్యంత హర్ష దాయకం.

శ్రీ నేలనూతల శ్రీకృష్ణమూర్తిగారిచే సంపాదితమైన వ్యాస రచనల సూచి (1875-1972) తెలుగు పత్రికల నుండి వ్యాసములు సూచికగా తయారు చేయబడింది. ఈ గ్రంథంలో తప్పులు కోకొల్లలు. 'విజయవాణి' అనే పత్రిక సంపాదకుని దృష్టికి వచ్చినట్లులేదు. 'కిన్నెర'లో ముద్రింపబడిన 1951 నాటి వ్యాసమూ సూచికలోనికి ఎక్కలేదు. సూచికాకారులు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని గ్రంథాలయాన్నిగాని, ప్రాచ్య పరిశోధన సంస్థలోని గ్రంథాలయాన్నిగాని సంప్రదించినట్లు లేదు. వారు అలభ్యము లని చెప్పిన అనేక సంపుటాలు పై రెండు గ్రంథాలయాల్లో వున్నాయి. ఆ సూచిక మరలా చక్కగా పరిష్కరించి పునర్ముద్రించవలసిన అవసరం ఎంతైనావుంది.

## వివరణకర్త అధోజ్ఞాపికలు

1. ద్రావిడ భాషలలో అత్యంత ప్రాచీనమైన భాష తమిళము. అటు పిమ్మట కన్నడము, తరువాత తెలుగు. ఆ తరువాత మలయాళము. కనీసం రెండువేల సంవత్సరాలనుండి కన్నడం వాడుకభాషయై యుండిన దనటానికి తగినన్ని ఆధారాలు లభించాయి. క్రీస్తు శకారంభంలో టాలెమీ అనే భూగోళ శాస్త్రజ్ఞుడు బాదామి, ఇండి, కలకేరి, ముదగల్లు మొదలైన ఊర్ల పేర్లను చెప్పియున్నాడు. క్రీ. శ. 5-6 శతాబ్దాలనుండి శిలా శాసనాలు కన్నడంలో లభిస్తూవున్నాయి. వీనిలో క్రీ. శ. 450 నాటిదైన హల్మిడి శిలాశాసనం అతి ప్రాచీనం. కన్నడ కవిరాజమార్గము 9వ శతాబ్దిలో రచింప బడిన దనగా దాని కంటె 400 సంవత్సరాల పూర్వంనుండే కన్నడంలో గ్రంథ రచన వుండి వుండాలి. కనీసం 15 శతాబ్దాల ప్రాచీనత గల్గింది కన్నడభాష.

2. 1928 లో రాళ్లపల్లివారు ఆంధ్ర విశ్వకళాపరిషత్తు నుండి సర్ సి. ఆర్. రెడ్డిగారిచే ఆహ్వానింపబడి సర్ ఆర్. వేంకట రత్నంగారి ధర్మనిధి ఉపన్యాసాలలో వేమన గురించి ప్రసంగించారు. అందులో ఆరవ ఉపన్యాసంలో—వేమనవంటివారు అనే శీర్షిక కింద ద్రావిడ భాషల్లో ముఖ్యంగా కన్నడ, తమిళాల్లో మన వేమనను పోలిన యోగి వంటివారి రచనలను తులనాత్మక పరిశీలనచేశారు. వీరిలో—సర్వజ్ఞమూర్తి, కన్నడ వచనకారులు (బసవేశ్వరుడు, అక్కమహాదేవి), కన్నడ సంకీర్తనకారులు (పురందరదాసు, కనకదాసు), తెలుగు సంకీర్తనకారులు (రామదాసు, త్యాగరాజు), తిరువళ్లువరు వ్రాసిన తిరుక్కురళ్ (త్రివర్గ దీపిక), పోతులూరి వీరబ్రహ్మం గారి కాలజ్ఞాన తత్త్వాలు, వేటూరి ప్రభాకరశాస్త్రి తమకు పరిచయ మొనర్చిన ఏగంటివారి వచనాలు, ఆనంద వరద రాజయోగి, ముత్యాల నారసింహయోగి, రామకృష్ణపరమ హంస వీరిని గురించి వివరించారు. ఇటీవల డా॥ బాదాల రామయ్యగారు 'బసవేశ్వరవచనాల'ను ఆంధ్రీకరించారు. దానికి

రాళ్లపల్లివారు 'పీఠిక' వ్రాశారు. (1976-77) ఇది 'రాళ్లపల్లి పీఠిక'ల్లో లేదు.

3. విష్ణుభక్తి గల కన్నడ మాధ్వులలో పండితులట్లుండగా పామరులలో సామాన్యమైన వేషభాషలు, వాదములు, జాతి భేదములు మొదలగు వాని ప్రాబల్యాన్ని చూచి అసహ్యపడి ఆ భావాలనూ, తమ భక్తినీ పాటల రూపంలో వెల్లడించిన పురందరదాసు, కనకదాసు మొదలైన వారనేకులున్నారు. వారి రచనలనే దేవర నామాలంటారు. ఉదాహరణకు మా తల్లి పాడే దేవరనామాల్లో కొన్ని-

1. ఇంతా ప్రభువ కాణేనో, ఈ జగదొళ
గింతా ప్రభువ కాణేనో ।

2. బందేవు పండరి పురక్కె, బహు
బంధనవు కళి వుదక్కె ।

3. అల దెలయమేలె మలగిదా
బాలకృష్ణన నోడ బన్నిరి ।

ఇవి పురందరదాసు దేవర నామాలు. కన్నడంలో దేవరనామాల వలె తెలుగులో ఏగంటివారి వచనాలు అద్వైత బోధకములైన పదాలెన్నో వున్నాయి. ఉదాహరణకు

"అంతా చిన్మయ మఖండ మద్వయ మా
నందో బ్రహ్మ ।" ఇలాంటివి ఏగంటివారి వచనాలు.

4. <u>హరిహరుడు</u> : 12 వ శతాబ్ది మధ్యకాలం నుండి 13 వ శతాబ్దారంభం వరకు ఉన్న హరిహర, రాఘవాంక, పద్మరసు లను ముగ్గురు భక్తకవులు ప్రసిద్ధులు. ఈముగ్గురికిని బసవేశ్వ రుడు మొదలైన శరణుల మార్గం నుండి, వచన సాహిత్యం నుండి స్ఫూర్తి దొరికింది. వీరిలో హరిహరుడు గొప్పభక్తకవి. పంపా శతకము, రక్షా శతకము, ముడిగెయ అష్టక, గిరిజా కల్యాణ, శివగణద రగళెగళు ఈతని కృతులు. ఇందులో చివరిదైన రగడలనే రాళ్లపల్లి వారు వ్యాసంలో ప్రస్తావించారు. వీరశైవ సిద్ధాంతంలోని మాహేశ్వర స్థల నిష్ఠ వీర శైవ సాహిత్యధ్యేయమై హరిహరునిలో మొదట పొడ సూపింది. తర్వాత, వీరశైవ కవులందరికీ 'హరిహరమార్గ' మను పేర ఆదర్శమైంది.

'శివగణదరగళెగళు' — ఇందులో సుమారు 120 వరకు రగడలున్నాయి. ప్రతి రగడా ఒక శివభక్తుని చరిత్ర. తమిళనాడులో ప్రసిద్ధులైన అరువత్తు మూవురు నాయన్మారులు శివభక్తులు, ఇతరులు, బసవేశ్వరుడు మొదలైన వీరశైవ శరణులలో కొందరి చరిత్రలు ఈ రగడలలో కథావస్తువు. ఇవిగాక, పుష్ప రగడ, బసవరాజ దేవర రగళె, నంబియణ్ణన రగళె, తిరునీల కంఠర రగళె, మహాదేవి యక్కన రగళె, ప్రభుదేవర రగళె, రేవణ సిద్ధేశ్వర రగళె, గుండయ్యన రగళె ముఖ్యమైనవి.

రగళె (రగడ) అనునది లయబద్ధం. మాత్రాసమత గల్గిన పాదాలు కల ఛందోవిశేషం. పాద నియతి లేదు. అది అంత్యప్రాసలు గల ద్విపదయై ఎన్ని పంక్తులైనను ఇది పెరుగవచ్చును. హరిహరునకు పూర్వముండిన కవులు చంపూ కావ్యములలో దీనిని వర్ణన కొరకు ఉపయోగించిరి. కథ, వర్ణన రెండింటికిని హరిహరుడే మొట్టమొదటిసారి ఉపయో గించినారు. కొన్ని దీర్ఘ రగడలలో వైవిధ్యం కోసం కొంత రగడ పద్యముగాను, కొంత గద్యముగాను రచించినాడు. ఈవిధంగా ఒక వినూత్న గద్య పద్య మిశ్రమమగు చంపూ ప్రకారమును హరిహరుడు నిర్మించుకొన్నాడు.

5. తిరువళ్లువర్ (క్రీ. శ. 800 - 1000) అని జి. యు. పోప్ చెప్పగా పి. టి. శ్రీనివాస అయ్యంగార్ 6 వ శతాబ్ది అంటు న్నారు. సర్వజ్ఞుని కాలము 1575 - 1600 గా నిర్ణయించారు. వేమన కాలము 17 వ శతాబ్ది ప్రారంభం. వేమన 'ఆటవెలది' ఉండడానికి నాల్గుపాదాలైనా చివరిపాదం మకుటం వదలివేస్తే మూడుపాదాల రచనే. సర్వజ్ఞుని 'త్రిపది' కన్నడ జానపద సాహిత్యానికి గాయత్రివంటిది. మూడుపాదాల ముచ్చటైన ఛందస్సులో సర్వజ్ఞకవి ముల్లోకాలకూ సరిపడే విషయాలు రాశాడు. "వేమన, తిరువళ్లువర్ లవలె సర్వజ్ఞుడూ మన జాతీయ వ్యక్తులలో ఒకడు" అంటున్నారు 'సర్వజ్ఞ' అనే గ్రంథంలో హా. మా. నాయక. 'వేమన- సర్వజ్ఞులపై తుల నాత్మక పరిశీలన చేశారు ఆచార్య గంధం అప్పారావుగారు. తిరువళ్ళువర్ రచన రెండు పాదాల ద్విపద. తిరుక్కురళ్‌కి ముప్పాల్ (త్రివర్గం) ఉత్తరవేదం, తమిళ్ మఱై (తమిళ వేదం) అని పేర్లు. ఇది చూచి 'వేమన్నవేదం' అంటున్నారు మనవాళ్లు యిప్పుడు.

6. కీ॥ శే॥ నేదునూరి గంగాధరంగారు 1960 లో వేమన పద్యాలను ఐదు వేలు సేకరించి ప్రచురించారు. ఆ గ్రంథానికి విశ్వనాథవారు అభినందించారు. "శ్రీ నేదునూరి గంగాధరము

గారొకరు తమ జీవితము జీవితము నంతయు సాంప్రదాయ భాష కొఱకు వినియోగ పరచినవారు. పరచుచున్నవారు.... ఇప్పుడు వీరు వేమన్న పద్యములను ఐదువేల నేకత్ర సంగ్రహించెను. ఇంతపని మున్నెవ్వరు చేయలేదు....వాని నీరీతి సేకరించుట కెంత యోపికయో యెంత పట్టుదలయో యొక తీవ్రమైన జీవితాశయముతో యొక నిరంతరమై నిగూఢమైన జీవితో ద్వేగముతో బనిచేసెడి వారికి మాత్రమే తెలియును." గంగాధరంగారిని గురించి తెలుసుకో గోరినవారు

౧. శ్రీ నేదునూరి గంగాధరంగారు- వారి జానపద వాఙ్మయ సేవ — శ్రీ యస్వీ. జోగారావు గారు, కిన్నెర, సం. 6, సం. 6, జూన్ 1954.

౨. అనాదృత వాఙ్మయ భిక్షువు - కీ.శే. నేదునూరి గంగాధరంగారు — ఘట్టమరాజు అశ్వత్థనారాయణ, భారతి, అక్టోబరు, 1977, పుటలు 48-50.

౩. తెలుగు జానపద గేయ వాఙ్మయము —డా॥ బి. రామరాజు.

7. ఆధునిక జానపద వాఙ్మయ పరిశోధకుల్లో ఆచార్య బి. రామరాజు, డా॥ నాయని కృష్ణకుమారి, డా॥ ఆర్వీయస్ సుందరం, డా॥ జి. యస్. మోహన్, డా॥ టి. వి. సుబ్బారావు, ఆచార్య తూమాటి దోణప్ప, డా॥ ఎస్. గంగప్ప, డా॥ కె. సర్వోత్తమన్, డా॥ కె. సంపత్కుమార ప్రముఖులు.

8. తిరుప్పావై తెలుగు లిపిలో ఆరాయిరప్పడి వ్యాఖ్యతో, మూవాయిరప్పడి వ్యాఖ్యలతో ప్రచురింపబడ్డాయి. గోదాగ్రంథ మాలవారు చక్కని ప్రచురణలు వేశారు. తెనుగు తిరుప్పావు అనే పేరుతో సామినేని రాజారావు అనువదించారు. వేటూరి ప్రభాకరశాస్త్రి తిరుప్పావై - సప్తపదులు ప్రచురించారు. ఇటీవల దేవులపల్లి కృష్ణశాస్త్రి కూడా తిరుప్పావు తెనిగించారు.

9. 'శాలివాహన గాథాసప్తశతీసారము' అనే పేరుతో 400 గాథలను రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు ప్రచురించారు. అది మూడు ముద్రణలు పొందింది. వీరేకాక కూచిభొట్ల ప్రభాకర శాస్త్రి, గట్టి లక్ష్మినరసింహశాస్త్రిగార్లు 'గాథాసప్తశతి' తెలుగు చేశారు. కోవెల సంపత్కుమారాచార్యగారు 'మధురగాథలు' అనే పేరుతో కొన్ని అనువదించారు. దిగుమర్తి సీతారామస్వామిగారు కాటయవేముని వ్యాఖ్య భావప్రకాశికాసహితంగా గాథాసప్తశతిని ఆంధ్ర విశ్వవిద్యాలయం వారిచే ప్రచురింపజేశారు.

10. "ఒకనాడు శబ్దరత్నాకర కారులను కొక్కొండ వేంకటరత్నముపంతులుగారాక్షేపించిరట : 'మీ నిఘంటువున క్షేత్రయ పదములనుగూడ ప్రమాణముగా గ్రహించిరి. రాతాయ ('యె' అనుటకు) పోయ (పోయెన్ అనుటకు) అని యాతని పదములలో ప్రయోగములుకూడ మీకు పరిగ్రాహ్యము లయినపుడు మీ నిఘంటువునకు ప్రామాణ్యము సిద్ధించదు' అని. శ్రీ సీతారామాచార్యులుగారు వేశ్యాభినయాద్యభిరుచి హెచ్చుగాగల వారట; క్షేత్రయ పదములను వేశ్యలభినయించుట, వారభినయించుట పరిపాటియట : 'క్షేత్రయ ప్రామాణికుడైన సత్కవి కాకపోతే ఆంధ్రమున నిక సత్కవి యుండడు. క్షేత్రయ రచనము అక్షరాక్షరమును పరమ ప్రమాణమే.పోయ, అయ ఇత్యాదులు పంచతంత్ర కారుడును ప్రయోగించినాడు. మీకు క్షేత్రయ రచనము గ్రాహ్యము కాక పోవచ్చును. లోకమున సహృదయత యంతరించిపోదు. నా నిఘంటువు నాదరించు వారుండకపోరు' అనిరట !"

.... .... .... ....

"నాకు క్షేత్రయ పదముల గానాభినయ ఘనత నాటికి నేటికి కూడ నపరిచితమే. కాని కొన్ని నెలల క్రింద శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు సీతారామాచార్యులుగారు ప్రస్తుతించి నట్టుగానే క్షేత్రయను ప్రస్తుతించిరి. సీతారామాచార్యులు గారన్న విషయమును శర్మగారెఱిగి యుండరనుకొంటాను. క్షేత్రయ ఘనతను తార్కాణించుటకై యిది పేర్కొన్నాను."

— "స్మృతిపథంలో ... "
వేటూరి ప్రభాకరశాస్త్రి
ఆంధ్రపత్రిక (ఆదివారం) 5-3-1944.

ఇదే వ్యాసం 'మణిమంజరి' సం-1; సం. 2 ఆగస్టు 1981, పుటలు 113-114లో పునర్ముద్రింపబడింది. సంపా. డా॥ వేటూరి ఆనందమూర్తి, మరియు చూడుడు, 'క్షేత్రయ్య పద కవిత్వము - రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ', సాహిత్యోపన్యాసములు-3, ఆం. ప్ర. సా. అకాడమీ, హైదరాబాద్ 1963. క్షేత్రయ్య పదములు - విస్సా అప్పారావు, క్షేత్రయ్య పదములు - మంచాళ జగన్నాధరావు.

11. ఈ సందర్భంలో తాళ్లపాకవారి వాఙ్మయాన్ని విస్మరించారు రాళ్లపల్లివారు. ఆ పాటలకు తామే స్వరకల్పన, పరిష్కరణ చేసివున్నారు. ఈ సందర్భంలోనే వేటూరి వారి పరిశోధన ప్రత్యేకించి పేర్కొనదగింది.

12. 20 వ శతాబ్దంలో కన్నడ విద్వాంసులు అనేకులు జానపద సాహిత్యక్షేత్రంలో బంగారు పంటలు పండిస్తున్నారు. జానపద కథా గేయాలను గురించి మాస్తి వేంకటేశయ్యంగార్ 1919 లో ప్రకటించిన వ్యాసం కన్నడ జానపద సాహిత్యం వైపు అందరి దృష్టి ప్రసరించేటట్లు చేసింది. హలసంగి సోదరులనేవారు 1931 లో గరతియ హాడు (గృహిణి గీతాలు) అనే సంకలనాన్ని ప్రచురించారు. అది ఈనాటికి కూడా అత్యుత్తమ సంకలనంగా పరిగణింపబడుతోంది. ఆ తర్వాత జీవన సంగీత, హళ్లియ హాడు (పల్లెపాట), మల్లిగెదండె మొదలైన ఉత్తమ సంకలనాలు ప్రచురింపబడ్డాయి.

తెలుగులో స్త్రీలపాటలు, మూడు సంపుటాలలో నంది రాజు చలపతిరావుగారు, స్త్రీల రామాయణపు పాటలు, స్త్రీల పౌరాణిక పాటలు, పల్లెపదాలు, శ్రీపాద గోపాలకృష్ణమూర్తి గారు, చాటుపద్య మణిమంజరి (రెండు సంపుటాలు) వేటూరి ప్రభాకరశాస్త్రి, చాటుపద్య రత్నాకరము దీపాల పిచ్చయ్య శాస్త్రిగారు, తెలంగాణా పల్లెపదాలు – డా॥ బి. రామరాజుగారు సంకలించి ప్రచురించారు. నేదునూరివారి కృషి అంతా జానపద వాఙ్మయం మీదనే. ఇటీవల జానపద సాహిత్యంపై ఎల్లోరా గ్రంథం ప్రకటించారు.

13. సర్వజ్ఞుని త్రిపదులకు వచనాలని అంటారు. సర్వజ్ఞుని వచనాలకూ 12వ శతాబ్దంలోని శివశరణుల వచనాలకు ఛందస్సులో భేదం వుంది. వచనాలు వచన పద్యాలు త్రిపదులు పద్యాలే. వచనాలలో అక్కడక్కడ త్రిపది, సాంగత్య, అక్కర మొదలైన పద్యాల లయలు కనిపిస్తాయి. అంతేకాని అవి పద్యాలు కావు.

14. ఇప్పటికీ చెదురుమదురుగా కొన్ని సంప్రదాయ కుటుంబాల్లోని ముసలివాళ్లైన స్త్రీలు, పురుషులకు ఈ ప్రాచీన జానపద సాహిత్య పరిచయం వుంది. కాబట్టి యిప్పుడైనా కళ్ళు తెరచి అకాడమీల్లాంటి సంస్థలు, జిజ్ఞాసువులు ఆ మౌఖిక సారస్వతాన్ని గ్రంథస్థం చేసే ప్రయత్నం చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.

15. తెలుగు-కన్నడ జానపదగీతాల తులనాత్మక పరిశీలన గూర్చి చూడుడు డా॥ ఆర్వీయస్ సుందరంగారి కన్నడ సాహిత్య చరిత్ర. పుట 235. జానపద సాహిత్య సంపద – విసరురాతి పాటలు – శ్రీ ఎస్. గంగప్పగారు (అనంతపురం, పెనుగొండలో సేకరించిన పాటలివి) భారతి, డిసెంబరు, 1970.

16. దేశి సారస్వతానికి చెందిన జానపద వాఙ్మయం సామాన్యంగా వ్యావహారిక భాషలో వుంటుంది. వైరి సమాసాలు, ఆమ్రేడితాలు కొల్లలుగా వుంటాయి ఛందస్సు మాత్రా ఛందస్సు. వాటి గతుల వివరాలివి :

1. తకిట — త్రిశ్రగతి (మూడు మాత్రలు)
2. కిటతక — చతురస్రగతి (నాలుగుమాత్రలు)
3. కిట తకిట — అయిదు మాత్రల ఖండగతి
4. తకిట తకిట — ఆరు మాత్రల రూపక తాళం
5. తకిట కిటతక — ఏడు మాత్రల మిశ్రగతి
6. కిటతక కిటతక — ఎనిమిది మాత్రల ఆదితాళము

17. సాంగత్యమునకు నాలుగు పాదములు. 1-3 పాదము లందు 4 విష్ణుగణములు. 2 - 4 పాదములందు 2 విష్ణుగణములు బ్రహ్మగణము రావలయును. ఆదిప్రాస పాటింపవలయును.

2. సాంగత్య పాదములందు విష్ణుగణములకు బదులుగా రుద్రగణములను గాని బ్రహ్మగణములను గాని ప్రయోగింపవచ్చును.

3. బ్రహ్మ, విష్ణు, రుద్ర గణ నియమములకు లొంగని అక్షర సముదాయము కూడ సాంగత్యములో నెడనెడ కనిపించును. ఇది గేయ ధర్మమగును. కన్నడమున 'సాంగత్యము'నకు ప్రబల ప్రచారము కలదు. హొన్నమ్మ రచించిన హది బదెయ ధర్మము 'రత్నాకరవర్ణి' రచితమైన భరతేశవైభవము మొదలగునవి సాంగత్య ఛందస్సులోని కన్నడ కావ్యములు. ఈ సాంగత్య చ్ఛందస్సునకు తెలుగులో ప్రచారము తక్కువ. దక్షిణాంధ్ర వాఙ్మయమున కొన్ని సాంగత్యములు తెలుగులో రచింపబడినవి. సాంగత్యము మాత్రాచ్ఛందస్సులోనిది. ఇది మొట్టమొదటి సారిగా శివమాయణుని కావ్యములలో కానవచ్చును. సాధారణముగ స్త్రీల పాటలన్నియు ఈ ఛందస్సులోనే వ్రాయబడి యున్నవి.

రాళ్లపల్లివారు వ్యాసం చివరలో చెప్పినట్లుగా 'సాంగత్యము' రగడ భేదము కాదు. అసలు 'సాంగత్య రగడ' అనునది లేదు. షట్పదులలో రగడ భేదమున్నది కాని 'సాంగత్యము' ప్రత్యేకమైన మాత్రాఛ్ఛందస్సుకు చెందింది.

సంప్రదించిన గ్రంథాలు


1. కన్నడ సాహిత్య చరిత్ర - డా॥ ఆర్వీయస్ సుందరం (1977)
2. కన్నడ సాహిత్య చరిత్ర - రం. శ్రీ ముగళి అనువాదం: ఎం. ఎస్. మహంతయ్య (1978)
3. తమిళ సాహిత్య చరిత్ర - డా॥ చల్లా రాధాకృష్ణశర్మ (1976)
4. దాక్షిణాత్య సాహిత్య సమీక్ష - డా॥ జి. నాగయ్య (1976)
5. దాక్షిణాత్యదేశిచ్ఛందోరీతులు- తులనాత్మక పరిశీలనము } డా॥ కె. పర్వోత్తమన్ (అముద్రిత సిద్ధాంతవ్యాసం)
6. కన్నడ ఛందోవికాస - డా॥ డి. యస్. కర్కి
7. తెలుగు జానపద గేయ వాఙ్మయము-డా॥బి. రామరాజు (1978)
8. వేమన -రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ (1929)
9. వేమన పద్యములు - (సంపా.)నేదునూరి గంగాధరం (1960)


[తక్కిన గ్రంథాలు, వ్యాసాలు — వ్యాసంలో ఎక్కడికక్కడే పేర్కొనబడినాయి. శ్రీమాన్ రాళ్లపల్లివారి పై వ్యాసాన్ని పునర్ముద్రణకు పంపడానికనుమతించిన శ్రీ రాళ్లపల్లి జయంత, ఎం. ఏ., (ఆంగ్లోపన్యాసకులు, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం) గారికి మిక్కిలి కృతజ్ఞుడను.]



# అమరత్వం

శ్రీ రావి రంగారావు

కాగితం జైల్లో
చిక్కుకున్న సౌందర్యాల్ని
బయటకు పంపిస్తాడు చిత్రకారుడు
మూగరాతి పలకలలో
తలుపులు మూసుకొన్న అందాల్ని
వెలికి లాగేస్తాడు శిల్పి
శబ్దాల పువ్వుల్లో
అట్టడుగున స్రవించే మాధుర్యాల్ని
ప్రసారం చేస్తాడు గాయకుడు

శరీర విశ్వంలో
అంతర్లీనమై వున్న కాంతి విన్యాసాల్ని
ప్రదర్శించి వెలిగిస్తాడు నటుడు
భాషామందిరంలో
మత్తుగా నిద్రిస్తున్న చమత్కారాల్ని
మేల్కొలుపుతాడు కవి....
స్తబ్ధత విషంతాగి
చావబోతున్న నా ప్రజలకు
అమృతం పోస్తాయి కళలు.

శ్రీ కె. ఆర్. కె. మోహన్

# ఆరోప్రాణం

ఎండలు మండిపోతున్నాయి. వేసవికాలంలో ఎండలు ఎక్కువగా ఉండడంలో విశేషమేమి లేకపోయినా, ఆ యేటి ఎండలు మాత్రం ఎప్పటికంటే ఎక్కువగా ఉన్నాయి. పాత తరం వాళ్ల "ఏమి ఎండలు బాబూ ఇవి. నాలుగైదు పుష్కరాలు చూశాం కాని ఈ యెండలు మేమెరగం" అనడం సామాన్యమైంది. ఏ యేటి కాయేడు ఆ ఎండలే ఎక్కువ అనిపించడం సహజమే అయినా, వాతావరణ శాఖ వారి ప్రకటనల ప్రకారం కూడా ఆ యేటి ఎండలు నిజంగానే ఎక్కువగానే ఉన్నాయి. వార్తాపత్రికలలో ప్రతిరోజు వడదెబ్బ వల్ల చనిపోయిన వార్తలు తప్పనిసరిగా ఉంటున్నాయి.

ఆ మిట్ట మధ్యాహ్నం ఆ మామిడి చెట్టు నీడలో వాలుకుర్చీ వేసుకుని విశ్రాంతిగా నడుం వాల్చుకున్నాడు విశ్వనాథం. చుట్టు ప్రక్కల ఎంత ఎంత తీవ్రంగా వున్నా ఆ చెట్టు నీడలో, అదిచ్చే చల్లని గాలికి ప్రాణం లేచి వస్తోందతనికి. చిన్నతనంలో తల్లి ఒడిలో ఆడుకునేటప్పుడు చెప్పలేని హాయి కలిగేది. ఆ మామిడి చెట్టుకీ అతనికీ ఏమి సంబంధమోకాని, ఏ జన్మలోని అనుబంధమో కాని, దాని నీడలో కూర్చుంటే తల్లి ఒడిలో ఉన్నట్లే అనిపిస్తుంది. నిజమో, అబద్ధమో తెలియదుకాని, మనిషికి పంచప్రాణాలు ఉంటాయంటారు. ఎవరైనా అతి సన్నిహితంగా ఉంటే వారిని ఆరో ప్రాణం అంటారు. అదేమి విచిత్రమోకాని మనుషులలో ఆఖరికి కట్టుకున్న భార్య కూడా అతనికి ఆరోప్రాణం కాలేకపోయినా ఆ మామిడిచెట్టు మాత్రం అంతకు మించింది అయింది. ఇన్నాళ్ళూ లేనిది, ప్రాణాధికమైన ఆ చెట్టు వల్ల ఇప్పుడు నిత్యమూ మనసుని వ్యాకులపరిచే సమస్యలు ఉత్పన్నం అవుతుండడంతో, పైకి చెప్పలేని ఆవేదనని అనుభవిస్తున్నాడు విశ్వనాథం.

తల పైకెత్తి చూశాడు విశ్వనాథం. ఎటుచూసినా సూర్య కిరణాలని కూడా జారనీయనంత దట్టంగా పచ్చని ఆకులు చెట్టు నిండా ఉన్నాయి. వాటి రెమ్మల నుంచి దోరగా ఎదిగిన మామిడి కాయలు పెళ్ళి పందిరికి కట్టే పాదరసం బుడ్లలాగా వ్రేలాడుతున్నాయి. వందల సంఖ్యలో ఉన్న ఆ కాయలనీ, వాటిని మోస్తున్న ఆ చెట్టునీ చూస్తుంటే వనదేవత సంచరిస్తూ వచ్చి తనింట్లో ఆగినట్లు అనిపిస్తోంది. కాయలతో కల కల లాడే ఆ చెట్టుని చూస్తుంటే, కడివెడు పిల్లలతో కిల కిల లాడే పెద్దకూతురు జ్ఞాపకానికివచ్చింది విశ్వనాథానికి. "ఒకరు లేక ఇద్దరు అన్న కుటుంబ నియంత్రణ నినాదం దద్దరిల్లుతున్న ఈ రోజుల్లో ఆ విషయమే పట్టించుకోలేదు ఆ దంపతులు. అమ్మాయి ఆరోగ్యానికి కాని, అల్లుడి ఐశ్వర్యానికి కాని కొరత లేకుండడం వల్ల ఆ అవసరమే కలుగలేదు వాళ్ళకి. ఆరుగురు పిల్లలతో హాయిగా ఉన్నారు వాళ్ళు.

పైనించి ఒక చిన్న మామిడి పిందె గాలికి రాలి, విశ్వనాథం మీద పడింది. ఉలిక్కిపడి కళ్ళు తెరచి చూశాడు అతను. చిన్నతనంలో తను మహా కొంటెగా ఉండేవాడు. తగని అల్లరి చేసేవాడు. పరుగు పరుగున వచ్చి అమ్మ మీద పడేవాడు. అమ్మకి బాధ కలిగి "అబ్బ ... ఏమిట్రా వెధవ అల్లరీ నువ్వూనూ" అని కసురుకునేది కాని ఇంకేమి అనేది కాదు. కాని ముఖంలో ఆవేదన కనిపించేది. ఆ ఆవేదన వెనుక, మాటలకి అతీతమైన ఒక ఆనందానుభూతి కనిపించేది. అందుకనే అమ్మ కసురుకున్నా అందులో కోపం కనిపించేది కాదు. ఇప్పుడు తనకీ అలాగే అనిపిస్తోంది. తన పిల్లలకి తన దగ్గర చిన్నప్పటి నుంచీ చనువు బాగా ఎక్కువ. వాళ్ళు చిన్నప్పుడు భుజాలమీద, తొడలమీద ఎక్కి గంతులు వేస్తుండే వాళ్ళు. ఒక్కొక్కప్పుడు అది బాధగా కూడా అనిపించేది. అయినా ఆ బాధలో కూడా ఏదో అనిర్వచనీయమైన ఆనందం ఉండేది. అందువల్ల ఆ తియ్యటి బాధని ఓర్చుకుని అమందానందం అనుభవించేవాడు. ఇప్పుడు మామిడి పిందె మీద పడినప్పుడూ అటువంటి అనుభూతే కలిగింది. తిరిగి కళ్ళు మూసుకుని కాస్తంత జోగడానికి ప్రయత్నం చేశాడు. నిద్రయితే రాలేదు కాని, ఆలోచనలు గతంలోకి వెళ్ళిపోయాయి.

* * *

అప్పుడు విశ్వనాథానికి పదేళ్ళుంటాయేమో. అతనికి చిన్నతనం నుంచీ మొక్కలన్నా, పూలన్నా ఎంతో ఇష్టం. ఎప్పుడూ దొడ్లోనే తిరుగుతుండేవాడు. పూర్వకాలపు కొంపేమో లంకంత

ఉండేది. పెద్ద మండువా, దాని చుట్టూ వసారాలు వాటి వెనుక గదులు అంతా అట్టహాసంగా ఉండేది. ఇల్లే పెద్దది అనుకుంటే, ఇంటిని మించి ఉండేది దొడ్డి. ఆ రోజుల్లో అది చిన్న ఊరు. తాతలు ఏనాడు సంపాదించారో ఏమో, పెద్ద స్థలం అది. చుట్టూ కాంపౌండ్ వాల్ అంటూ ఉండేది కాదు. పక్క ప్రక్కన ఇళ్ళున్నా మధ్య గోడలు ఉండేవి కావు. మనసుల మధ్య గొడవలుంటే కదా మనుషుల మధ్య గోడలు ఉండడానికి. అందరి దొడ్లలోనూ చిన్న అడవిలా చెట్లు గుబురుగా పెరిగిఉండేవి. ఎవరి స్థలం హద్దులు ఎంతవరకో, దస్తావేజులు చూస్తేనేకాని ఖచ్చితంగా తెలిసేదికాదు. విశ్వనాథానికి ఒక అన్న, ఒక తమ్ముడు, ఇద్దరు చెల్లెళ్ళు ఉండేవారు. ఒకరోజున వాళ్ళ నాన్నగారు సంతకి వెళ్ళి మంచి మామిడి పళ్ళు తెచ్చారు. అవి ఎంత రుచిగా వున్నాయో చెప్పలేం. ఆ పళ్ళ రుచి వాళ్ళు మరచిపోలేకపోయారు. అందువల్ల ఆ చెట్టుని దొడ్లో పాతుకోవాలనుకున్నారు. నలుగురూ నాలుగు టెంకలు తెచ్చుకుని గుర్తుగా దొడ్లో పాతుకున్నారు. రోజూ ఆ బోదెలలో నీళ్ళు పోసేవారు. కొన్నాళ్ళకి ఆ టెంకల నుంచి మొలకలు వచ్చాయి. ఆ మొలకల్ని చూసినపుడు వాళ్ళకి కలిగిన ఆనందానికి అవధులు లేకపోయాయి. ఇంట్లో కొత్తగా పాపాయి పుడ్తే ఎంత ఆనందంగా ఉంటుందో అంతటి సంబరం పడ్డారు వాళ్ళు. విశ్వనాథం మాత్రం తన మొక్కని అతి జాగ్రత్తగా నీరు పోసి, పేడ ఎరువు వేసి పెంచుకుంటుండేవాడు. మిగిలిన వాళ్ళు మొదట్లో శ్రద్ధగా పెంచినా ఆ తర్వాత ఆ ఉత్సాహం వారికి లేకపోయింది. చూసీ చూడనట్లు పెంచసాగారు వాళ్ళు. అందుకు తగినట్లుగానే అవి కూడా ఉసూరు మంటూ పెరుగుతూ, చివరకు పెరగలేక చచ్చిపోయాయి. విశ్వనాథం మొక్క మాత్రం త్వర త్వరగా చిలవలు పలవలతో, కొమ్మలు రెమ్మలతో గుబురుగా, గున్న ఏనుగులా పెరగసాగింది. ఆ చెట్టంటే పంచప్రాణాలు విశ్వనాథానికి. అది మాత్రం నిజంగా అతనికి ఆరోప్రాణం. ఇంట్లోవున్న సమయంలో ఎక్కువసేపు ఆ చెట్టు దగ్గరే గడిపేవాడు. చదువుకున్నా అక్కడే. ఆడుకున్నా అక్కడే.

ఏణ్ణర్థం గడిచింది. విశ్వనాథం మామిడి చెట్టు ఇంతింతై, వటుడింతై అన్నట్లు ఎదుగుతున్నది కాస్తా ఎదగడం మానేసింది. ముందు దాన్నెవరూ గమనించలేదు. ఆ తర్వాత ఆకులు రాలి పోతుండడం, రెమ్మలు పచ్చబడుతుండడం మొదలైంది. ఆకురాలు కాలంలో ఆకులు రాలిపోవడం. వెంట వెంటనే కొత్త చిగుళ్ళు రావడం మామూలే. అలా అనుకోవడానికి అది ఆకురాలు కాలమూ కాదు. కొత్త చిగుళ్ళు వచ్చిందీలేదు. కొద్ది రోజులయ్యేసరికి చెట్టుకేదో తెగులు పట్టిందని ఊహించారువాళ్ళు. అయినా వాళ్ళు చూసీ చూడనట్లు పట్టించుకోకుండా ఊరుకున్నారు. గ్రహించినవాడూ, గ్రహించలేనివాడూ విశ్వనాథం ఒక్కడే. చెట్టుకి నీళ్ళు తగ్గాయేమో ననుకొని రోజూ మరింతగా నీళ్ళు పొయ్యసాగాడు. అయినా చెట్టు నానాటికీ క్షీణిస్తుండడంతో దిగులుపట్టుకుంది అతనికి. తల్లి, తండ్రి దగ్గరకుపోయి ఆ చెట్టు విషయంచెప్పి గోలపెట్టేవాడు. వాడి గోలకి చిరాకుపడి "ఏమిట్రా.... వెధవా చెట్టుకోసం నీగోల. దానికేదో తెగులుపట్టింది. చస్తుందో ఏమో!" అని కసురుకుంది తల్లి. ఆ మాటలు వినగానే విశ్వనాథం పసిహృదయంలో పిడుగు పడినట్లయింది. తానంతగా ప్రేమించుకున్నచెట్టు చచ్చిపోతుందేమోనని భయం వేసింది. తండ్రిదగ్గరకుపోయి ఆ చెట్టుకి ఏమైనా మందు వేయమని గగ్గోలు పెట్టాడు. తండ్రి "చూద్దాం" అని తేలిగ్గా అనేసి బయటకు వెళ్ళిపోయాడు. తమ్ముడు దగ్గరకి, చెల్లెళ్ళ దగ్గరికి పోయి ఏడుస్తూ "నా చెట్టు చచ్చిపోతోందర్రా" అంటూ గోల పెట్టాడు. చెట్టుకోసం విశ్వనాథం ఏడుస్తుంటే వాళ్ళకి నవ్వు వచ్చింది. అతన్ని వేళాకోళంచేస్తూ "బలేవాడివిరా నువ్వు. చెట్టు కోసం ఏడుపేమిటి? మేము పాతినచెట్లు చచ్చిపోలేదూ. మేమేమైనా ఏడ్చామా?" అన్నారు. ఇంక తనగోడు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాలేదు విశ్వనాథానికి.

విశ్వనాథం తండ్రి షావుకారుదగ్గర పద్దులు రాస్తుండేవాడు. పొద్దున ఎనిమిది గంటలకి వెళ్ళినవాడు రాత్రి తొమ్మిది దాటితేకాని వచ్చేవాడుకాదు. మధ్యాహ్నం ఓ గంట, గంటన్నర సేపు భోజనంకోసం వచ్చేవాడు. పద్దులు రాసిరాసి అలసిపోయి ఇంటికివచ్చి భోజనంచేశాక పడుకునేవాడు. విసుగ్గా కనిపించే ఆయన ముఖాన్నిచూస్తే ఏమాట మాట్లాడడానికీ పిల్లలకి ధైర్యం ఉండేదికాదు. రోజూ పెందరాళే నిద్రపోయే విశ్వనాథం ఆ రోజు తండ్రి వచ్చేదాకా మేలుకొని ఉన్నాడు. ఆయన రాగనే ఆత్రతగా "నాన్నా....నామామిడిచెట్టుకి మందు తెచ్చావా?" అని అడిగాడు.

అసలే అలసిపోయి చిరాకుమీదున్నాడేమో ఆయన "పో.... వెధవా.... నాకు వేరే పని లేదనుకున్నావా?" అని కోప్పడ్డాడు. విశ్వనాథం ఇంకేదో అనబోయేసరికి కళ్ళెర్రచేసి, చెయ్యెత్తి కొట్టేంతపనిచేశాడు. అంతవరకు తండ్రి మందు తెస్తాడన్న ఆశతో వున్న విశ్వనాథానికి తండ్రి ప్రవర్తన అశనిపాతం అయింది. ఇంక తన మామిడిచెట్టు చచ్చిపోతుందేమోనన్న భయం పట్టుకుంది. ఏడుపు కట్టలు తెంచుకు రాసాగింది. అక్కడ ఉండలేక గదిలోకి పోయి పడుకుని వెక్కి వెక్కి ఏడవసాగాడు. ఏడ్చేడ్చి ఆ ఏడుపులోనే నిద్రపోయాడు. కాని అదీ కలత నిద్రే. ఆ నిద్రలో కలలన్నీ

మామిడిచెట్టు మీదే. అది చచ్చిపోయి ఎండిపోయినట్లు, దానిని తండ్రి కొట్టేస్తే ఆ కట్టెల్ని అమ్మ పొయ్యిలో పెడ్తున్నట్లు- అన్నీ పాడు కలలే. ఆ కలలతో మధ్య మధ్య ఉలిక్కి-పడి లేస్తూండడం, మళ్ళీ పడుకుంటుండడం - రాత్రింతా ఈవిధంగానే నడిచింది. ఆ రాత్రి పడుకునేముందు తల్లి వచ్చి పిల్లలందర్నీ చూసుకుంది, కాని విశ్వనాథాన్ని ప్రత్యేకంగా గమనించలేదు.

విశ్వనాథానికి మామూలుగా తెల్లవారకుండానే నిద్రలేవడం అలవాటు. అటువంటిది మర్నాడు పొద్దున ఏడుగంటలుకావస్తున్నా అతను నిద్ర లేవలేదు. అతన్ని నిద్ర లేపుదామని తల్లి వచ్చి వంటి మీద చెయ్యివేసింది. ఒళ్ళు వేడితో పేలిపోతోంది. "అబ్బా.... వీడికి ఇంత జ్వరం వచ్చిందేమిటి?" అనుకొని అతన్ని నిద్రలేపి "మొహం కడుక్కో బాబు. మందు వేసుకొందుగాని" అంది. విశ్వనాథం లేచి మొహం కడుక్కో-డానికి దొడ్లోకి వెళ్ళగానే, ఆమె భర్త దగ్గరికివెళ్ళి "ఏమండీ.... విస్సిగాడికి ఒళ్ళు పేలి పోతోంది" అంది.

"ఊ.... అల్లరివెధవ.... చెట్టూ పుట్టా పట్టుకు తిరుగుతాడు. జ్వరం రాకుండా ఎలావుంటుంది? జీలకర్ర కషాయం కాచియ్యి. అదే తగ్గుతుంది." అని మామూలుగా అనేసి ఊరుకున్నాడు. తర్వాత తన పనిలోకి వెళ్ళిపోయాడు.

భర్త చెప్పినట్లే విశ్వనాథానికి కషాయం కాచిచ్చింది ఆమె. కాని అందువల్ల గుణం ఏమీ కనిపించలేదు. అన్నం ఎలాగూలేదు. కనీసం జావకూడా త్రాగలేకపోయాడు. బలవంతాన త్రాగబోయినా నోటికెక్కలేదు. పైగా వాంతి అయింది. "లంఖణం పరమౌషధం" అన్నట్లుగా రెండు పూటలూ పొట్ట మాడిస్తే అదే తగ్గుతుంది అనుకుని ఆమె ఊరుకుంది.

విశ్వనాథం నీరసంగా పడుకున్నాడు. అతని ఆలోచనలన్నీ ఆ మామిడిచెట్టుమీదే. అవతలికి వెళ్ళినప్పుడల్లా ఆ మామిడిచెట్టుని చూసుకొని రాసాగాడు. దాన్ని చూసినపుడల్లా అతనికి కళ్ళనీళ్ళు రాసాగాయి. తల్లికళ్ళముందు పిల్ల చనిపోతోంటే, తల్లి ప్రాణం తల్లడిల్లినట్లు కొట్టుకోసాగింది అతని మనసు. అసహాయంగా తిరిగి వచ్చి మంచంమీద పడుకొని తనలో తానే కుమిలి పోసాగాడు.

ఆ రాత్రి విశ్వనాథానికి జ్వరం బాగా ఎక్కువైంది. మనిషి మగతలో ఉండి పిలిచినా పలకని స్థితిలో ఉన్నాడు. తనలో తనే పలవరింతలు. రాత్రి ముదురుతున్న కొద్దీ పలవరింతలు ఎక్కువ అయ్యాయి. ఆ పలవరింతలలో అస్పష్టత తగ్గి స్పష్టత ఎక్కువ కాసాగింది. "అమా.... నాన్నా.... నా మామిడి చెట్టు చచ్చి పోతోంది దానికి మందేయండి" అంటూ ఒకటే పలవరింతలు.

"ఏమిటి-వీడు చెట్టు కోసం ఇంత బెంగ పెట్టుకున్నాడు." అని ఆశ్చర్యంతోపాటు ఆవేదన పొందాడు తండ్రి. బెంగతో పిల్లవాడు ఏమైపోతాడో అని దిగులుపట్టుకుంది తల్లికి. విశ్వనాథానికి మెలకువ వచ్చినప్పుడు "బాబూ.... దిగులుపడకు, రేపే మామిడిచెట్టుకు మందువేయిస్తాం. అది బతుకుతుంది" అని తల్లీ తండ్రీ నచ్చచెప్పసాగారు.

అన్నప్రకారం మర్నాడు పొద్దునే విశ్వనాథం తండ్రి అగ్రికల్చరల్ అసిస్టెంట్ ఇంటికివెళ్ళి స్వయంగా ఆయన్ని ఇంటికి తీసుకువచ్చారు. ఆయన ఆ మామిడి చెట్టుని పరీక్షించి దాని కేదో తెగులు సోకిందని చెప్పి ఫలానా మందులు కొని ఫలానా విధంగా వాడండి అని చెప్పాడు. అది విని "బాబ్బాబూ.... అదేదో.... మీరే చేయండి ఆ ఖర్చులు నేను పెట్టుకుంటాను. మీ ఋణం ఉంచుకోను. మేమైతే సరిగ్గా ఆ మందులూ అవీ వేయగలమో లేమో ?" అన్నాడు విశ్వనాథం నాన్న.

"సర్లెండి, ఒక ఇరవై రూపాయలు ఇయ్యండి ఆ మందులు తెస్తాను" అని ఆ డబ్బు తీసుకొని వెళ్ళిపోయాడు అసిస్టెంట్.

వెధవది ఒక మామిడి చెట్టు కోసం ఇరవై రూపాయలు ఖర్చుపెట్టడమంటే నిజానికి ఆయనకి మనసొప్పలేదు. కాని పిల్లవాడు ఏమౌతాడోనన్న భయంతో ఆ డబ్బు ఇచ్చాడు.

అగ్రికల్చరల్ అసిస్టెంట్ వచ్చి తన మామిడి చెట్టుని పరీక్షిస్తుంటే, ప్రమాదస్థితిలో వున్న పిల్లవాడిని స్పెషలిస్టు డాక్టరు వచ్చి పరీక్షచేస్తుంటే తలిదండ్రులకి కలిగేటంత ధైర్యం కలిగింది విశ్వనాథానికి.

మరో గంటలో వచ్చి మందులు చల్లాడు ఆ అగ్రికల్చరల్ అసిస్టెంటు. ముందు చెట్టు చుట్టూతా నేలకి గొయ్యి చేశాడు.

కొన్ని వేళ్ళను కొంతవరకు నరికాడు. ఆ తరువాత ఏదో మందుని నీళ్ళలో కలిపి చెట్టు చుట్టూతాపోసి మట్టికప్పాడు. ఆ తర్వాత ఇంకేదో మందుని బాల్చీనీళ్ళలో కలిపి స్ప్రేయర్‌తో చెట్టు కాండం మీదా, కొమ్మలమీదా, ఆకులమీదా బాగా చల్లాడు. వారం తర్వాత ఇంకోసారి మందు చల్లుతానని చెప్పి వెళ్లాడాయన.

విశ్వనాథానికి సగం దిగులు తగ్గింది. ఇంక ఫరవాలేదనే ధైర్యంవచ్చింది. ఇంతచేసినా ఆచెట్టు చచ్చిపోతుందేమోనన్న

భయం ఒక ప్రక్కన లేకపోలేదు. ఏది ఏమైనా ఆయనవచ్చి వెళ్ళాక విశ్వనాధానికి జ్వరంతగ్గకపోయినా, పలవరింతలుతగ్గాయి. డాక్టర్‌ని పిలిచి అతనికి మందులిప్పించసాగాడు విశ్వనాధంతండ్రి.

నాలుగు రోజులు గడిచాయి. విశ్వనాధం జ్వరం క్రమేపి తగ్గుతోంది. మామిడిచెట్టుకి కొత్త చిగుళ్ళేమీ కనిపించలేదు కాని, ఆకులు రాలిపోవడం ఆగింది. పచ్చబారుతున్న కొమ్మలు, పసుపు బారడం ఆగి మళ్ళీ గోధుమరంగులోకి రాసాగాయి.

మరో మూడు రోజుల తర్వాత అగ్రికల్చరల్ అసిస్టెంటు తిరిగి వచ్చాడు. అనుభవజ్ఞుడైన వైద్యుడు. రోగిని చూస్తూనే రోగాన్ని గుర్తించినట్లు, ఆయన ఆ మామిడిచెట్టును చూస్తూనే దాని తెగులు తగ్గిందని చెప్పగలిగాడు. అంతేకాదు చురుకైన ఆయన కళ్ళకి తలలు పైకి ఎత్తుతున్న కొత్త చిగుళ్లు కనిపించాయి. ఇంక ఫర్వాలేదండీ, మీ మామిడిచెట్టు బతికింది. "ఇదుగో.... కొత్త చిగుళ్లుకూడా వేస్తోంది." అని చూపించి మళ్ళీ చెట్టుపైన మందులు చల్లి వెళ్ళాడు.

ఆ మాటలు వింటుంటే గుండెలమీద కుంపటి దిగినట్లని పించింది, విశ్వనాధం తల్లిదండ్రులకి. ఇంక అతని ఆనందం గురించి చెప్పడానికి లేదు.

అగ్రికల్చరల్ అసిస్టెంటు చూపించిన కొత్త చిగుళ్ళవంక ఆసక్తిగా చూశాడు. మామిడిచెట్టు కాండాన్నీ, కొమ్మల్నీ ప్రేమగా నిమిరాడు.

మామిడిచెట్టు కొత్తచిగుళ్ళు మెల్లమెల్లగా పైకివచ్చి త్వరత్వరగా ఎదగసాగాయి. అంతకన్నా వేగంగా విశ్వనాధం జ్వరమూ తగ్గిపోయింది. ఆ తర్వాత త్వరలోనే మామిడిచెట్టు చక్కగా కొమ్మలూ, రెమ్మలతో గుబురుగా ఎదగసాగింది. చచ్చి బ్రతికిన చెట్టేమో, అదంటే విశ్వనాధానికి మరింత ప్రేమ ఏర్పడింది. అదంటే కొడుకికి ఉన్న ఆప్యాయతను గుర్తించిన తలిదండ్రులూ, ఇతరులూకూడా దానిపట్ల శ్రద్ధ చూపసాగారు.

*　　　*　　　*

ఏళ్లు గడచిపోయాయి. విశ్వనాధం తల్లీ, తండ్రీ చని పోయారు. తమ్ముడు ఉద్యోగంచేస్తూ వేరే ఊరికి వెళ్ళిపోయాడు. చెల్లెళ్ళకి పెళ్ళయి అత్తవారిళ్ళలో కాపరాలు చేసుకుంటున్నారు. తానూ ఓ ఇంటివాడయి నలుగురు బిడ్డల తండ్రి అయ్యాడు. పెద్దమ్మాయికి పెళ్ళిచేసి అత్తవారింటికి పంపాడు. రెండో అమ్మాయి పెళ్ళికి ఎదిగి ఉంది. మిగిలిన ఇద్దరూ అబ్బాయీ, అమ్మాయి.... చదువుకుంటున్నారు. తాతలనాటి ఆస్తి ఇంకా కాస్తో కూస్తో ఆ ఊళ్ళోనే ఉండడంతో, అక్కడేవుండి గుట్టుగా కాలక్షేపంచేస్తు న్నాడు విశ్వనాధం.

ఈ మూడు దశాబ్దాలలో రోజులు ఎంతగానో మారిపోయాయి. పల్లెటూళ్ళమీదకూడా బస్తీల ప్రభావం బాగా పడింది. పల్లెలలో వెనుకటి రోజుల్లో ఉన్నటువంటి ఆప్యాయతలూ, అభిమానాలూ అంతకంతకీ అంతరించి పోసాగాయి. మనుషులు ఎంతసేపూ అంటీ ముట్టనట్లుగా ఉంటూ, పూర్తిగా డబ్బుకి విలువ ఇచ్చేవారిగా మారిపోయారు.

విశ్వనాధం ఇంటి ప్రక్క స్థలం రాజారావుది. విశ్వనాధం తండ్రీ, రాజారావు తండ్రీ బ్రతికివున్న రోజుల్లో ఒకే కుటుంబం వారిలాగా అన్యోన్యంగా వుండేవారు. రాజారావు పట్నంలోచదువు కుంటుండేవాడు. కొద్ది నెలల క్రితమే అతనితండ్రి చనిపోయాడు. దాంతో ఏకైక పుత్రుడైన అతను తండ్రి ఆస్తికి వారసుడు అయ్యాడు. పట్నంలో చదువుకున్న అతనికి కోళ్ళ ఫారాలు, డైరీ ఫారాలు పెట్టాలని సంకల్పం కలిగింది. అందువల్ల ఉన్న ఊళ్ళో సొంతస్థలంలో వాటిని ఏర్పాటు చెయ్యాలనుకున్నాడు. దాంతో విశ్వనాధం స్థలానికీ, తన స్థలానికీ మధ్య సరిహద్దు నిర్ణయించుకో వలసిన అవసరం ఏర్పడింది.

ఒక రోజున రాజారావు తన దస్తావేజులు తీసుకువచ్చి, తన ఆలోచనలు చెప్పి ఇద్దరి సరిహద్దు నిర్ణయించుకుందామని విశ్వనాధంతో చెప్పాడు. దానికేంలెమ్మని విశ్వనాధం తన దస్తా వేజులు తీసుకువచ్చాడు. అదేం దురదృష్టమోకాని, విశ్వనాధం ఆరోప్రాణంగా పెంచుకున్న మామిడిచెట్టు, ఇద్దరి స్థలాల మధ్యన గల సరిహద్దు మీద ఉంది. అంతవరకు ఆ విషయాన్ని గమ నించిన వారెవరు లేరు. అన్నాళ్ళూ ఆ చెట్టు మీద వచ్చే ఫల సాయాన్ని విశ్వనాధం కుటుంబమే అనుభవిస్తూ వచ్చేది. అయితే పల్లెటూళ్లలో సాధారణంగా జరుగుతుండే విధంగా దాని కాయలనీ, పళ్ళనీ ఇరుగు పొరుగుకీ తెలిసిన వారికీ పంచుతూండేవారు. అందరూ ఆ చెట్టు విశ్వనాధంది అనే అనుకునేవారు.

ఎప్పుడైతే ఆ మామిడి చెట్టు సరిహద్దు మీద వున్నట్లు తెలిసిందో అన్నాళ్ళూ వున్న స్నేహాన్ని మరచిపోయి పేచీకి దిగాడు రాజారావు. అన్నాళ్ళూ విశ్వనాధం దాని మీద అనుభవించిన ఫలసాయంలో తనకి సగం వాటా రావాలంటాడు. ఆ చెట్టు తాను వేసుకున్నాననీ, ప్రాణప్రదంగా పెంచుకున్నాననీ విశ్వనాధం ఎంత నచ్చచెప్పినా వినిపించుకోలేదు. లేదా ఆ చెట్టు కొట్టేయిస్తా, నేను

గోడ పెట్టుకుంటా అంటాడు రాజారావు. చెట్టుని కొట్టడం అంటే ప్రాణం పోయినట్లే అనిపించింది విశ్వనాథానికి.

ఈ వివాదాన్ని ఊరి పెద్దల వద్దకు తీసుకెళ్ళాడు విశ్వనాథం. వాళ్ళకి విశ్వనాథం సంగతి బాగా తెలుసు కనుక రాజారావుకి నచ్చచెప్పాలని ఎంతో ప్రయత్నించాడు. కాని అతడు ససేమిరా వినలేదు. పైగా కోర్టుకి వెళ్తానని బెదిరించాడు. కోర్టుకి వెళ్ళే స్థోమత విశ్వనాథానికి లేదు. పైగా కోర్టుకి పోయాక, ఎప్పటికి, ఏవిధంగా తీర్పు వస్తుందో ఎవరూ చెప్పలేరు. ఏదో విధంగా సర్దుబాటు చేసుకోవాలనే అతని తాపత్రయం.

"రాజారావు ఈ చెట్టును నేను వేసుకున్నాను. ఇన్నాళ్ళు అందరి లాగా అది మాదేనని అనుకుంటూ వచ్చాను. అయిందేదో అయిపోయింది. పచ్చని చెట్టుని కొట్టాలనే ఆలోచన వదిలేయి. ఇంకముందు దానిమీద వచ్చే ఫలసాయాన్ని సమానంగా అనుభవిద్దాం. నీవేపు కాయలు నీవు తీసుకో, నా వేపు కాయలు నేను తీసుకుంటా" అని నచ్చచెప్పాలని ప్రయత్నించాడు.

కాని రాజారావు మొండిపట్టుదల పట్టాడు. "ఇవన్నీ ఎవరుచెప్ప గలరు? నీవేపు ఎక్కువ కాయొచ్చు. నావేపు తక్కువ కాయొచ్చు. మేము చూడకుండా మీరు కాయలు కోసుకోవచ్చు. ఇవన్నీ జరిగేవి కావు. ఈ తగాదా తేలాలంటే ఒక్కటే మార్గం. ఆచెట్టుని కొట్టించివేస్తా. ఇన్నాళ్ళూ నువ్వు నా బదులు అనుభవించిన ఫలసాయం బదులుగా, ఆ కలపని అమ్మిన డబ్బును నేను తీసుకుంటా" అంటూ మొండికెత్తాడు. అతను అంత మొండికెత్తడానికి కారణం కాయలతో పచ్చగా ఉన్న ఆ చెట్టుని చూస్తే అసూయతో కళ్ళు కుట్టడమే.

"రాజారావు చెట్టుని కొట్టడం మాట వదిలిపెట్టి వేరే ఏదైనా చెప్పు. ఆ చెట్టుని కొట్టడం జరిగితే నేను బ్రతకను. దానికీ నాకు ఉన్న సంబంధం నీకు తెలియందికాదు. లేదా నీకిష్టమయితే ఒక పని చేయి. నీది ఎలాగూ ఖాళీస్థలమే కనుక, ఆ మామిడి చెట్టు ఉన్నమేరకు నిలువుగా స్థలాన్ని నాకు అమ్ము. అప్పో, సొప్పో చేసి స్థలాన్ని నేను కొంటా" అన్నాడు విశ్వనాథం ప్రాధేయ పూర్వకంగా.

"ఇది మరీబాగుంది. నా పౌల్ట్రీఫారంకే స్థలంచాలదని నేనను కుంటుంటే, నా స్థలాన్నే అమ్మమంటావా? సరే ఆలోచన చెప్పావు కనుక నేనూ ఒక సలహా చెప్తాను. ఆ మామిడి చెట్టు ఉన్నమేరకు నీ స్థలాన్ని నాకు అమ్ము. అక్కడ గోడ కట్టవలసిన అవసరం ఉండదు గనుక చెట్టును కొట్టను. అయితే ఇన్నాళ్లూ నీవనుభవించిన ఫలసాయానికి బదులు ఆ చెట్టుకేమీ ఖరీదు కట్టను. స్థలం గజం ఐదు రూపాయల చొప్పున కొంటాను నీ కిష్టమైతే సరే. లేదా చెట్టును కొట్టక తప్పదు." అని ఖండితంగా చెప్పాడు రాజారావు. నిజానికి అక్కడ స్థలం కనీసం గజం ఇరవై రూపాయలు చేస్తుంది. కాని విశ్వనాథానికి ఆ చెట్టుపై ఉన్న అభిమానాన్ని సొమ్ముగా చేసుకోవాలనుకొన్నాడు రాజారావు.

"సరే రాజారావు. ఈరోజు బాగా ఆలోచించి చెప్తా" అని కన్నీళ్ళతో వెళ్ళిపోయాడు విశ్వనాథం.

ఆ రాత్రి విశ్వనాథానికి నిద్రపట్టలేదు. తను అన్నాళ్ళు పెంచిన చెట్టును కొట్టేస్తే ఎలా ఒప్పుకోగలడు? భార్యని, పిల్లల్నీ కూడా సలహా అడిగాడు అతను. అతనికీ, ఆచెట్టుకీ ఉన్న అనుబంధం గురించి ఎవరికితెలుసు? తెలిసినా అర్థంచేసుకోగలవారెవరు? "కోర్టు తగాదాలెందుకునాన్నా? చెట్టు పోతే పోయింది. చెట్టుకోసం స్థలం చవగ్గా వదులుకుంటామా?" అని అన్నారు పిల్లలు.

"అమ్ముకోదలచుకుంటే స్థలాన్ని ఎంతో కొంతకి అమ్ముకోండి. ఎలాగూ చిన్నదానికి పెళ్ళి ఖాయం అయినట్లేకదా? డబ్బుకి వెతుక్కుంటున్నాం. పోనీ ఈరూపేణా డబ్బు అందుతుంది" అంది భార్య.

"అవును కూతుర్ని ఎంతో ప్రేమగా పెంచాక అత్తవారింటికి పంపక తప్పదు. పిల్ల ఎక్కడయినా క్షేమంగా ఉంటే చాలనే తండ్రి భావిస్తాడు. ఇప్పుడు మామిడిచెట్టు కూడా అంతే. ఇన్నాళ్ళూ నాబిడ్డకంటే ఎక్కువగా, నా ఆరోప్రాణంగా పెంచుకున్నానీచెట్టుని. ఈచెట్టుని ఇన్నాళ్ళకి వేరేవారి పరంచెయ్యాల్సి వస్తోంది పోనీ అక్కడైనా అది పచ్చగా ఉంటే చాలు. ఇన్నాళ్లు తన కాయలూ, పళ్ళతో నా రుణం తీర్చుకుంది. ఇప్పుడు పరాయి సొత్తు అవుతూ నా బిడ్డ పెళ్ళికి పరోక్షంగా సాయపడుతోంది. తప్పదు. నేనా చెట్టుని రాజారావుపరంచేయ తప్పదు" అని నిర్ణయానికి వచ్చాడు విశ్వనాథం.

మర్నాడే వెళ్ళి రాజారావుకి తన నిర్ణయం తెలిపి స్థలం అమ్మకానికి పెట్టాడు. అయితే దస్తావేజులో మాత్రము "మామిడి చెట్టును ఎట్టి పరిస్థితులలోను కొట్టను" అనే షరతు రాశాడు. ఆ షరతుకి రాజారావుకూడా సంతోషంగా ఒప్పుకున్నాడు. కాయలు, పళ్ళనీ ఇచ్చే పచ్చని చెట్టుని కావాలని కొట్టుకునేంత మూర్ఖుడు కాదు రాజారావు.

అన్నాళ్ళూ పెంచుకున్న మామిడి చెట్టును చివరిసారిగా ఆప్యాయంగా తడిమి, దస్తావేజులు రాజారావు కప్పచెప్పి తిరిగి వచ్చాడు విశ్వనాథం.

ఆ తరువాత మళ్ళీ అతను వీధి ముఖం చూసిందిలేదు.

# సత్య దర్శనం

సౌందర్యం సత్యం
సత్యం సౌందర్యం —
అన్నమాట సత్యం!

అయితే, సత్యం అంటే ఏమిటి?
జెస్టింగ్ పైలేట్ ఈ ప్రశ్న వేసి
జవాబు కోసం
నిరీక్షించలేదు.

సత్యానికి ముఖాలు
సత్యాన్వేషకుల సంఖ్యకి
సమానం.

సత్యం అసత్యానికి
తారు మారు;
అసత్యం సత్యానికి
మారుపేరు.

సత్యంగా, సత్యదర్శనం
బాహ్యప్రపంచ బద్ధం
అనడం అబద్ధం!

ఆత్మ విలోకనం
విమర్శనాత్మక ఆత్మ వివేచనం
అంతర్దర్శనం
సత్యమైన సత్యదర్శనం!

# ఏకాంత తత్వం

కోలాహల హాలాహల నరకం
చుట్టూవున్న లోకం!

వికృత శబ్దాల యంత్రగానం
మానవ ప్రగతి గాథకి
అపస్వర మిళిత భాష్యం!

ఈ హాలాహలాన్ని
కంఠసీమ అదిమిపట్టే
నీలకంఠుడు దిగిరాలేదు, ఇంకా.

సామాజిక సమస్యకి
సామూహిక పరిష్కారం
దొరకలేదు, ఇంకా;

వ్యక్తిగత పరిష్కారాన్ని
అన్వేషించాలి, మరి.

కోలాహలానికి
కోటిమైళ్ల దూరంగా పోయినా,
ప్రజావళి పటాటోపం,
అదుపులేని ధ్వనికాలుష్యం
విడిచిపెట్టవు మానవుణ్ని.

దూరం సహాయంతో
ఈ కాలుష్యాన్ని
దూరం చేయలేను.

జనసమ్మర్దం మధ్యలోనే
ఏకాంతత్వాన్ని
అలవరచుకోవాలి!

కోలాహలం మధ్య వుంటూ
కోలాహలానికి అతీతంగా
నా వ్యక్తిత్వాన్ని
పరిరక్షించు కోవాలి!

ఈ ఏకాంతం
నా అసలు జీవితానికి వరం!
నా అంతరాంతర సీమల్లో
అహరహం వెలిగే
ఆత్మజ్యోతి సాక్షాత్కారానికి

నా ఏకాంతోపాసన
ఏకైక సాధనం.

నన్ను నేను తెలుసుకోవడానికి
నా ఆత్మసాక్షాత్కారంతో
విశ్వాత్మ విలోకనం
సాధించడానికి
నా ఏకాంత తత్వం
నా వైయక్తిక తత్వం!

**శ్రీమతి ఎస్. పద్మావతి**

# లంచం

## శ్రీ పులికంటి కృష్ణారెడ్డి

జీతమందుకొనుట జీవనమ్ము కొరకు
లంచ మనుట సుఖము పెంచుకొరకు
సుఖము పెంచగలుగు సూక్ష్మమే లంచము
కంటి నలుసుర! పులికంటి మాట!!

ఎంత లంచమైన అంత సులువుగాదె
పనులు జరుపుకొనుట పదిలముగను
మేపుకొలది గోవు చేపును పాలను
కంటి నలుసుర! పులికంటి మాట!!

ఉత్త కాగితమును ఉంచిన ఫలమేమి?
ఎగురకుండ గాలికెటుల నిలుచు?
అందుకొరకుగాదె అవసరమ్ము బరువు!
కంటి నలుసుర! పులికంటి మాట!!

కన్న కొడుకు కూడ కాదను పనిచెప్ప
కాసు లివ్వనపుడు కలహమాడు
అన్యుడెవడొ కొంత అడిగిన పాపమా?
కంటి నలుసుర! పులికంటి మాట!!

విశ్వరూపమెత్తి వేయారు రీతుల
లంచ మనెడు శక్తి మించియుండ
ముడుపుగట్టుటేల? మూఢులై రాళ్ళకు
కంటి నలుసుర! పులికంటి మాట!!

ఎన్ని పేర్ల పరగు యిలపైని దైవమ్ము
అన్ని రూపములను అదియు వెలుగు
కొలిచిచూడు దాని కోటీశుడౌదువు!
కంటి నలుసుర! పులికంటి మాట!

శ్రీ శ్రీరంగాచార్య

# మాలికా కవిత్వము

తెనుగు సాహిత్య మందలి ఆశు, మధుర, చిత్ర, విస్తరములను చతుర్విధ కవితలలో మాలికా కవిత్వ రచన యనునది ఆశు కవితా శాఖలో చేరును. అవధానముల యందును - చాటువుల యందును ఆశు కవిత ప్రసిద్ధమైనది. ఆ విధముగానే చెప్పదలచిన విషయమును పాద పరిమితి లేకుండా విస్తరించి చెప్పుట మాలికా రచనల ప్రత్యేకత. దీనిని లాక్షణికులు గుర్తించి ప్రాచుర్య మొనరించుటయే ఒక విశేషమనవచ్చును.

మాలికా రచన యనగా - నాలుగు పాదములుగా నియతములైన వృత్తాలను ఒకే ప్రాసతో పెక్కు పాదములుగా వ్రాయుట. రాను రాను ఇది ఎక్కువగా సీస పద్యాలలో వ్యాప్తిచెందినది. అందుకు కారణము - సీసానికి ప్రాస నియమము లేకపోవుట - పైగా - 'కవికి కంసాలికి సీసం సులభము కదా !'

శాసన పద్ధతి కాక - ప్రారంభమున ఇట్టి కవితకు అల్లసాని పెద్దన శ్రీకారమును చుట్టినాడు. ఆయన 'పూత మెఱుంగులున్-' అను 'సింహావలోకనోత్పలమాలిక' తకారప్రాసతో 29 చరణములుగా కలదు. దీని వెంటనే వచ్చిన రామరాజ భూషణుని 'లొట్ట యిదేటిమాట'- అను ఉత్పలమాలిక 26 చరణములున్నది. ఈ రెండును ఉత్పలమాలికలగుట విశేషము. దీని వలన ఉభయుల కవితాస్పర్థ - ప్రతిభ వ్యక్తమగును. పెద్దన-భూషణుల మార్గమును అనుసరించి ఆ వెనుక తెనుగు సాహిత్యములో చంపకోత్పల మత్తేభ శార్దూల మాలికలు వచ్చినవి. ఇవియేగాక స్రగ్ధరామాలిక రచనయు వచ్చినది. చంపకోత్పలములకు మాలికా నామము కలదు కాని - మిగిలిన మత్తేభ శార్దూల స్రగ్ధరలకు ఆ పద్ధతి లేదు. కవులు మాత్రము దానిని అతిక్రమించినారు. కొమ్మన శాసనమునందు పంచపాది మత్తేభమున్నది. గ్రంథకర్తలు కొందరు మత్తేభమును నాల్గు పాదములనుండి దాటించినారు.

ఆధునిక యుగములో మాలికా రచనకు మండపాకవారు ప్రసిద్ధులు. వీరు నాలుగు విధాలైన వృత్తాలను మాలికలుగా కూర్చినారు. మండపాకవారికి పూర్వుడైన గొడ్లపర్తి వెంకనకవి రకార ప్రాసతో — ఉత్పలమాలికలో — రెండువేల పాదాలలో రామాయణ కథను చెప్పినాడు. సుప్రసిద్ధుడైన గణపవరపు వెంకటకవి 'పెద్దగిరి విజయము' మాలికాకృతి. దీనియందు 426 పాదాలు గల ఉత్పలమాలిక నాల్గు విధాలైన ప్రాసలతో కలదు. (పైన పేర్కొన్న రామాయణము, పెద్దగిరి విజయము—అముద్రితాలు) గురజాడవారి 'కవిజీవితముల'ందు శిష్టు కృష్ణమూర్తి, తదితరుల మాలికా రచనలను చూడవచ్చును. ఇటీవల నేను సేకరించిన మాలికలలో — గోవర్ధనం వెంకట నరసింహాచార్యులవారు వివిధ విషయాలపై చెప్పిన 8 సీసమాలికలు, నాలుగు పెద్ద మత్తేభ మాలికలు కలవు. మా నాయనగారు — శ్రీమాన్ రాఘవాచార్యులవారు — నల్లగొండ, మిర్యాలగూడెం, దేవరకొండ తాలూకా గ్రామ నామాలను ఒక్కొక్క సీసమాలికగా కూర్చిరి. వీరి చాటువులలో మరికొన్ని మాలికలు కలవు. మాలికా కవిత్వ రచనలను పరిశీలించినప్పుడు సీసమాలికలలోనే ఈపద్ధతి వ్యాప్తిచెందినదని తెలియును.

లాక్షణికులు ఉత్పల చంపకములనే మాలికా రచనకు పేర్కొన్నను, ప్రాచీన సాహిత్యమును - శాసనాలను పరిశీలించినప్పుడు - మాలికలుగా సీసమాలికలు కన్పడును. దీనివలన మాలికా కృతుల ప్రాచీనత ఎంతటిదో వ్యక్తమగును. ఎంత పెద్ద సీసమాలిక వ్రాసినను చివరలో ఎత్తుగీతి మాత్రము తప్పనిసరిగా ఉండవలెను.

సీసములు మాత్రాచ్ఛంద స్సంబంధములు. వృత్తములు అక్షర గణ ప్రధానములు. కావున సీసపద్య రచనయే ప్రాచీనమైనది. మనకు లభించిన ప్రాచీనమైన శాసనాలలో 'తరువోజ' యున్నను, అదే గుణగ విజయాదిత్యుని కందుకూరి శాసనములోను, చాళుక్య భీముని శాసనములోను సీసపద్యములు గలవు. అంతేగాక క్రీ. శ. 850 నుండి క్రీ. శ. 1250 వరకున్న పద్యమయ శాసనాలలో 33 సీసములున్నవి. ఈ విధముగా తెలుగునందు సీసమాలికలకు ప్రాముఖ్యమున్నది. మాలికా కవిత్వమునకు తెనుగున శ్రీకారము చుట్టినది - బణపతి - లేక శ్రీనాథుని దీర్ఘాసి శాసన రచనయని చెప్పవచ్చును.

శ్రీశకునేండులు భూసతిపై శైల
నంబాబ్జభవ సంఖ్యనొంది వేంగి

అని ప్రారంభింపబడి —

'ఇష్టపూర్త ఫలము లెల్లకాలంబుల
మెచ్చుతోడం డమకు నిచ్చుచుండ-' అని

ఆటవెలదితో ముగింపబడిన ఈ శాసన సీసమాలిక 8 పాదములు గలదు. దీనియందు ఐదవ పాదమైన

దీర్ఘాసి భగవతిదేవి దేవాలయ
మున మెుదటం గడు ఘనతరముగ-'

అనునది మాత్రమే ప్రాసయతి పాటింపబడని చరణము. ఇది 1075 (క్రీ. శ.) నాటి శాసనము. మొదటి సీసమాలిక సీస పద్యము యొక్క చారిత్రిక పరిణామ మెఱుగుటకు ఇది ఒక ముఖ్యాధారము. యుగముల వారీగా చూచినపుడు - ప్రాఙ్నన్నయ యుగములో 4 సీసములు కలవు. వీని యందు రెండు శాసనములలోనివి, రెండు నన్నయకు పూర్వుడైన పద్మకవి, సర్వదేవుని రచనల లోనివి.

నన్నయ యుగములో — పైన తెల్పిన దీర్ఘాసి శాసన సీస మాలిక, నన్నయగారి భారతములో దాదాపు 251 సీసములు కలవు, అనంతరము వచ్చిన శివకవులలో- పాల్కురికి సోముని చతుర్వేద సారము ముఖ్యమైనది. ఇది — తెనుగునందు సీసపద్య శతకములకు మార్గదర్శకమైనది. ఇది 400 పద్యాల రచన యని పరిశోధకుల భావన. ఇప్పుడు 367 పద్యాలు మాత్రమే లభించినవి. సోమనవే మరికొన్ని సీసములు కలవు. వానిలో చెన్నమల్లు సీసములు 32. మరిరెండు సీసములు- 'చిరశుభాంక సోమశేఖరాంగ' 'శరభలింగ'— అని కలవు. నన్నయ కన్న కొంచెము తక్కువగా నన్నెచోడుని కుమార సంభవములో 172 సీసపద్యాలున్నవి.

క్రీ.శ. 1158 ప్రాంతమునకు చెందిన నుదురుపాడు శాసనము-

వఒసదమ్మోలిన గిరి వల్లభమున భూ
మండలాధీశుల దండి మిగల'— అని ప్రారంభమై

'ఇద్ధకీర్తి ప్రజ సమృద్ధిగా నగపతి
వారిజాప్త చంద్రతారకముగ-' అని ముగింపబడినది.

ఎఱ్ఱన తిక్కనలు :— ఈ యుగములో శ్రీగిరి కవి కృతమైన- 'చిరతరప్రకాశ శ్రీగిరీశ' మకుటముతో సీసపద్య శతకము వచ్చినది. ఎఱ్ఱన తన కృతులలో 572 సీసములను — తిక్కన 1222 సీసములు (భారతంలో 1160) ఇట్లు విస్తరించిన సీసరచన-

శ్రీనాథ యుగమునందు — జక్కన తన విక్రమార్క చరిత్ర (1 - 20) లో 12 పాదములుగల సీసమాలికను వ్రాసి కావ్యము లందు సీసమాలికా రచనకు ఆద్యుడైనాడు. ప్రసిద్ధమైన ఆ మాలిక-

సంస్కృత ప్రాకృత శౌరసేన్యాదుల
ఘటికలో నొక శతకంబు జెప్పె —

అని ప్రారంభింపబడి —

ఎల్ల విద్యల సంచులెఱుగనేర్తు - అని ముగింపబడినది. మాలికా రచనకేగాక - సాహిత్యమునందు మరికొన్ని విషయాల లోను ఈ పద్యము విశిష్టమైనది. ఈ యుగాంతములోనే పిడుపర్తి సోమన పద్య బసవపురాణము వచ్చినది. దీనియందు ఏడు ఆశ్వాసములో ఒక సీసమాలిక రచింపబడినది - ఈకాలమునందే 'తిరు కాళహస్తిలింగ' శతకము, చెన్నమల్లేశ శతకములు సీసము లలో వచ్చినవి - అనంతరము - ప్రబంధయుగము లేదా కృష్ణ రాయ యుగము-నందు. సీసమాలికలు రాలేదు. కాని మొదట పేర్కొనిన పెద్దన, భూషణుల ఉత్పల మాలికలు వచ్చినవి. తాళ్లపాక పెదతిరుమలయ్యగారి నీతి సీసపద్య శతకము - బొద్దపాటిపేరయ 'మల్లికార్జునలింగ ఉమాప్రసంగ-' మకుటముగల — శతకము వచ్చినది. ప్రబంధ యుగానంతరము - సీసమాలికలు కలవు. హంస వింశతిలో అయ్యలరాజు నారాయణకవి నూట యెనిమిది తిరుపతుల సీసమాలికతోబాటు మరికొన్ని సీసమాలిక లున్నవి. క్రీ. శ. 1656 లో రచింపబడిన అప్పకవీయమందు— 10 సీసమాలికలున్నవి. అవి—

1. శబ్దార్థలక్షణాలంకార సీసమాలిక
2. శబ్దార్థ దోష ,,
3. శృంగారరస ,,
4. అష్టరస ,,
5. నాయక నిర్ణయ ,,
6. రేఫాక్షర ,,
7. అకార ,,
8. ఛందోవృత్త ,,
9. ద్రుతప్రకృతిక ,,
10. కల్పిత కల్పవల్లీ సమానలక్షణ ,,

ఛందో గ్రంథమందు ఇన్ని సీసమాలికలు రచింపబడుట వాని ప్రసిద్ధిని — ప్రాముఖ్యమును తెల్పును.

క్రీ. శ. 1605 లో మట్ల అనంతరాజు— కకుత్థ్స విజయ రచన తర్వాత వేయబడిన సిద్ధవట శాసనములో 22 పంక్తుల సీసమాలిక యున్నది— దాని ప్రారంభము—

శాలివాహన నామ శకవర్షములు వేయి
నే నూట యిరువది యేడు చనిన— అని—

హృదయ మొప్పంగ సిద్ధవటేశ్వరునకు
ఔపచారికమైన సాలాంతరముగ
పురము చుట్టును వరణమై పరిణమింప
ధాత్రి గట్టించెనా చంద్రతారకముగ—' ఇది ముగింపు.

ఈ శాసనము చారిత్రికముగను - సాహిత్యపరముగను విఖ్యాతమైనది.

అముద్రితాలైన— చాగంటి వేంకట కృష్ణ కవి హైమవతీ పరిణయము నందు తన వంశవృత్తాంతమును సీసమాలికలో చెప్పు కొనినాడు.

అమలాపురం సన్యాసి కవిని గూర్చి— తుమురాడ పాపకవి ఒక సీసమాలికను చెప్పినాడు.

కాశీచయనుల లక్ష్మణకవి— పంచపద సీసమాలికలు— అయిదు బహుపద సీసమాలికలు— ఇందులో ఒక్కొక్క సీసము 12 పాదములు గలది. ఇవి మొత్తం 12 సీసమాలికలు.

ఔషధయోగములు— ఇది వైద్య గ్రంథము— మందుల పేర్లు సీసమాలికగా చెప్పబడినవి. (ఈ యుగంలోనే రామలింగేశ్వర, కుక్కుటేశ్వర, ఆంధ్రనాయక, సింహాద్రి నారసింహ, నరసింహ శతకములు సీసాలలో వచ్చినవి.)

దక్షిణాంధ్రయుగము— నందు సీసమాలికా రచన పరమావధి చెందినది. తెలుగు భాషలోనే పెద్ద సీసమాలికగా పరిగణింపబడినది గణపవరపు వెంకటకవి ఆంధ్రకౌముది. (ఇతనిదే గణయతి ప్రాస లక్షణ సీసమాలిక అలభ్యము) ఇది ఆంధ్ర వ్యాకరణమును వివరించు వేయి చరణాల సీసమాలిక. తరువాత— బాలకవి అనంతయ్య కృతమైన నల్లందిఘళ్ వంశావళి. ఇది 200 పాదములుగా గలదు.

కోటి రఘునాథ తొండమాన్ నాయకుని ఆస్థాని నుదురుపాటి వేంకనార్యుడు— 'తొండమాన్ వంశావళి' కూడా ఇట్టి మాలికగా రచింపబడినది. దీనికి పూరణముగా వెంకనార్యుని కుమారుడు సాంబశివ కవి రచించిన 'తొండమాన్ వంశప్రశాప మాలిక' 342 చరణములు కలది. ఈ కాలములోనే 100 సీసములతో వెంకటేశాంధ్ర నిఘంటువు, ద్విరూపకోశము, సాంబ నిఘంటువు— అనునవి వచ్చినవి—

దాదాపు ఇదే కాలానికి చెందిన చిరుమర్రి నరసింహ కవి— 'లక్షణ నవరత్నమాలిక' పేర తొమ్మిది సీసమాలికలలో ఆంధ్ర చ్ఛందమును వివరించినాడు. (దీనిని నేను 1967 మార్చి 'భారతి'లో ప్రచురించినాను)

అధునిక యుగములో - వద్దిమర్తి కోనమరాజకవి 1816 లో జమాబందీ సీసమాలికను రచించినాడు. 35 చరణాలుగానున్న ఈ మాలిక ప్రసిద్ధమైనది. గుంటూరు వర్ణన సీసమాలిక లభించినంత వరకు 32 పంక్తులుగలదు. రచయిత - గోపరాజు వల్లభరాయ కవి —

తెనుగు సాహిత్య చరిత్రలో ప్రసిద్ధమైన ముప్పది యిద్దరు నియోగుల సీసమాలిక 32 చరణములు కలది. ప్రతిపాదమునందు ఒక నియోగి వృత్తాంతము చెప్పబడినది, ఇది.

గణకనిర్వాహంబు గల్పించె నూరూర
మహిగోప రాజర్షామ ప్రధాని—

అని మొదలిడి—

నిరతాన్నదాతయై నిత్యకీర్తి వహించె
కాశిబందా పరదేశి మంత్రి—

అను చరణముతో ముగింపబడినది. ఈ సీసమాలిక ఆంధ్రదేశ రాజకీయ చరిత్రకు మిక్కిలి ఉపయోగకరమైనది. 'మాలికా రచనకు మండపాకవారు ప్రసిద్ధి' — అను దానికి ప్రతీకగా తమ 'రాధాకృష్ణ సంవాదము' అను గ్రంథమునందు 91 చరణాలలో బొబ్బిలి మహారాజు సభావర్ణన చేసినారు. 1886 సం. నందు ఈ గ్రంథము ముద్రింపబడినది.

మండపాకవారిని అధిగమించిరా యనినట్లు కొక్కొండ వెంకటరత్నం పంతులుగారు తమ బిల్వేశ్వరీయమున — పంచమ బింబమునందు — 108 పంక్తులుగా 'దేవ్యష్టోత్తర శతక్షేత్ర సీసమాలిక'ను రచించిరి. కవితాపరముగా కొక్కొండవారు బిల్వేశ్వరీయమునందు అనేకములగు నూతన పద్ధతులను ప్రవేశపెట్టిరి. దానియందు ఈ క్రింది రచన ఒకటి — మామూలుగా చూచిన ఇది వచనమువలెనున్నను — యథార్థముగా సీసపద్యము. ఆ రెండు పద్ధతులను ఇచ్చట చూపుచున్నాను.

శ్రీరస్తు

బిల్వేశ్వరీయము

విషయసూచిక　　　　　　　　పుట సంఖ్య

పీఠిక
కథాముఖము
శౌనక ప్రముఖ క్షేత్ర జిజ్ఞాస
తత్సూత్ర కృతము క్షేత్ర ప్రశంస
అకారణమున బిల్వారణ్యము ప్రశంస
ఇంకను మరికొన్ని కలవు.

పై ముద్రణను కలిపి చదివిన—

శ్రీరస్తు బిల్వేశ్వరీయము విషయ సూ
　　చిక పుటసంఖ్య పీఠిక కథా ము
ఖము శౌనక ప్రముఖ క్షేత్ర జిజ్ఞాస
　　తత్సూత్ర కృతము నక్షేత్ర మహిమ
అకారణమున బిల్వారణ్యము ప్రశంస
　　తద్వన దేవతా తపము మెచ్చి—

అని సీసముగా ఏర్పడును. గ్రంథమును నిర్వచనముగ రచింతునని చెప్పిన పంతులుగారు విషయసూచికను కూడా పద్యముగా రచించుట వారి ప్రతినకు తార్కాణము. బిల్వేశ్వరీయమందలి ఆరు బిందువుల విషయసూచిక నూటయెనిమిది సీసపాదముల మాలికగా చెప్పబడినది.

వీరు విషయసూచికను పద్యమయము చేయగా పంతులుగారి ప్రతి స్పర్థులైన కందుకూరివారు ఇచ్చట కూడా ఆ పద్ధతిని వదలక తమ శుద్ధాంధ్ర భారత సంగ్రహము - ముఖపత్రమునే పద్యమయం చేసినారు. అది

శ్రీరస్తు

శుద్ధాంధ్ర భారత సంగ్రహము
వినుడి

ఇది
చెన్నపురిని మిగుల
　　వాసిని గన్న
కొల్లా సుబ్బారాయలు సెట్టియు
　　గురుసామి సెట్టియు
ననువారి కంకితముగ
వసుధలో గల పట్టణములలోన గణ్యతకు నెక్క—
గౌతమి నది తూర్పు గట్టున నలరారి
　　రాజమహేంద్రవరమను పేర
సమరు పట్టణ రాజంబునందు నుండు
కందుకూరి వీరేశలింగమను నాఖ్యఁ
బఱగు కవిచేతఁ బండిత పామరులకు
వింపు పుట్టునట్లుగ రచియింపఁబడియె.

( చెన్నపురి, శ్రీనిలయ ముద్రాక్షరశాల - 1879 సం. )

దీనినిప్పుడు సులభముగా సీసపద్యముగా చదువవచ్చును.

వీరిని చూచి - పులుగుర్తి లక్ష్మీనరసమాంబ - తన 'మహిళా కళా బోధిని' యను పద్యకావ్య ముఖపత్రిన్ని కూడా సీసపద్యముగా వ్రాసినది. (ముద్రణ 1898)

వేంకటగిరి సంస్థాన ఆస్థాన కవిరాజు బిరుదురాజు శేషాద్రి రాజు 57 చరణాలలో 'పత్రికాపత్రసీసమాలిక'ను 1896 మార్చిలో రచించినాడు.

మండపాక కామకవి - తమ తండ్రినిగూర్చి 84 చరణాలలో "మండపాక పార్వతీశ్వర కవీశ్వర చరమ చరిత్రము"ను (1897 సెప్టెంబర్‌లో) వ్రాసినారు.

సంస్కృతపురాణాంధ్రీకరణ సవ్యసాచులైన జనమంచి వారు — ఆంధ్ర బ్రహ్మాండ పురాణ ప్రచురణకు తోడ్పడిన దాతల పేర్లను — సీసమాలికగా చెప్పినారు.

ఈ విధముగా సీసపద్య చ్ఛందస్సు — అనేకములైన పద్ధతులుగా మారినది. చివర ఆటవెలది, తరువాత తేటగీతము — ఇట్లుగా చేరినవి.

పద్యము పద్ధతిలో ఎన్నిమార్పులు వచ్చినను, అది ఎంతగానో అభివృద్ధి చెందినది. కవుల హస్తములయందు సీసము క్రీడాకందుకమైనది. లేనిచో గణపవరపు వేంకటకవి వేయి చరణాల సీసమాలికనేగాక — ఒక్క సీసమునందు 40 గర్భిత వృత్తాలను, 20 బంధాలను ఇమిడించినాడా? ఈ సీసము పేరే ముద్రణలో దాదాపు 16 చరణాలుగా వచ్చును. దీనిని కొందరు సాహిత్యకసరత్తుగా భావింతురుకాని జిహ్వాగ్రమున ఛందశ్శాస్త్ర సంప్రదాయము — ఏకాక్షర నిఘంటువులు — అక్షర చిత్రములైన బంధ కవితా పరిపాటి — వీనిని ఆమూలాగ్రముగా అకళింపుచేసుకొననిది అసాధ్యము.

ఈ విధముగా మాలికారచన — ముఖ్యముగా సీస (పద్య) మాలికల కూర్పు — అనేక విధములుగా అభివృద్ధిచెందుచు వచ్చుచున్నది.

ఆధునిక కాలమున ఎందరో అవధాన నిష్ణాతులు ఆయా సమయములందు మాలికా రచనచేయుట ఒక గమనార్హ విషయము.

నేను కొంతకాలముగా సేకరించుచున్న తెలంగాణ ప్రాంతంలోని చాటువులలో ఎన్నో మాలికలు లభించినవి. ఇటీవల మా మిత్రులు కపిలవాయి లింగమూర్తిగారు మరికొన్ని మాలికలను సేకరించుటయేగాక వారు స్వయముగా నాగరకర్నూలు, అచ్చంపేట, కొల్లాపురం తాలూకాల గ్రామాలను 3 సీసమాలికలుగా కూర్చినారు. వివిధ విషయాలపై వీరు వ్రాసిన మరికొన్ని చంపకోత్పలమాలికలు కలవు.

ఈ 'మాలికా కవిత్వమును' ను గూర్చి లోతుకు దిగి పరిశోధించినచో అనేక విషయములు వెల్లడికాగలవు.

ఏక పద్య కృతులవలె (ఒకే పద్యముతో మొత్తం గ్రంథాన్ని) ఏకమాలికా రచనలుండవచ్చును. దండక - యక్షగానముల వలె వీనిని గూర్చి పరిశ్రమించుట యవసరము.

[గమనిక : 1967 మార్చి 'భారతి'లో నేను చిఱుమఱ్ఱి నరసింహకవి - లక్షణ నవరత్న మాలికను ప్రచురించుటకు కారణభూతులై - దానికి చిన్న పీఠికను కూర్చి - 'మాలికా కవిత్వము'ను గూర్చి గ్రంథమును సిద్ధము చేయవలసిందిగా ఆదేశించి - దాని పద్ధతుల వివరించిన 'పరిశోధన పరమేశ్వరులు' శ్రీ నిడుదవోలు వెంకటరావుగారు - యశఃకాయులైన వారికి ఈ వ్యాసాన్ని అర్పిస్తున్నాను.]

# మౌ న భా ష్యం

## శ్రీ కె. అం జ య్య

మౌనం అనంత భాష్యాల్ని వల్లిస్తుంది
అయినా నాకది నచ్చదు
నా సోదరుల్ని జాగృతపరిచే శక్తి లేనిదది.
మౌనం
అద్భుత సౌందర్యాన్ని కూడ గట్టుకున్నదైతే కావచ్చు
జీవన శబ్ద సాగర తరంగము
మౌన భూమిని చుంబించి
తాత్కాలికానందాన్ని పొందుతుంది.
మౌనం ఎక్కుపెట్టిన విల్లైతే కావచ్చు
మౌనం గోడకేసిన తుపాకీయైతే కావచ్చు
మౌనం బద్దలవని బాంబయితే కావచ్చు
కానీ పురుగుల్ని మింగి దిక్కులుచూసే గోడమీది బల్లి
శాంతి పరిరక్షణ పేరుతో
నాసా, యెస్మా, కర్ఫ్యూల సంధించి
మౌనాన్ని బానిస వైరాగ్యాన్ని సూచించే గీతం చేస్తుంది
మౌనాన్ని శ్మశానంలో కాలని శవం చేస్తుంది
శబ్ద కదలికల్ని సంధించే యోధుడు
నిరంతర విప్లవ దుందుభుల్ని మోగిస్తుంటే
ఈ మౌనం నిప్పు తొక్కిన కోతిలా గంతులేస్తుంది
పెదవుల కదలికల్ని
కలం అక్షరాయుధాల్ని
పత్రికా స్పందనల్ని
కుత్తుకల వరకూ కత్తిరించడమంటే
జనాన్ని మౌనంలో సమాధి చేయడమే.

శబ్దాలతో ఉత్తేజం పొందిన శక్తులు
పునః పునః శబ్దోత్పత్తి చేస్తాయి
మౌనం దౌడు గుర్రాలనెక్కి ఉత్తేజం పొందిన జీవాలు
సుఖవాంఛా పీడితులై మౌనంలోనే చల్లబడి నశిస్తాయి.

# కళిగారగంప

## సిరిపురము నందు త్రవ్వకములు - చారిత్రకాంశములు

సిరిపుర గ్రామము విజయనగరం జిల్లా కేంద్రానికి 20 కి.మీ. దూరములో నున్నది. ఈ గ్రామము చేరుటకు విజయనగరం - శృంగవరపుకోట బస్సురూటులో లకిడాం జంక్షన్ వద్ద దిగి నాలుగు కిలోమీటర్లు దూరం నడవవలెను. ఈ సిరిపుర గ్రామము విజయనగరం జమిందార్లైన పూసపాటి వంశజు లిచ్చిన అగ్రహార గ్రామం. పూసపాటి రాజులు యీ గ్రామమును అనేక మంది బ్రాహ్మణులకు దానమొసగిరి. సిరిపుర గ్రామములో బ్రాహ్మణ వీధి, జంగమ వీధి మొ॥ వీధులు యిప్పటికీ గలవు.


రాష్ట్ర పురావస్తు పరిశోధన శాఖ వారు సిరిపుర గ్రామమందు లభ్యమైన చారిత్రకాధారములను బట్టి యిచ్చట ఉత్ఖాతనము జరుపుటకు మార్చి 1979 లో నిర్ణయించిరి. ఈ ఖనన పరిశోధన అప్పటి రిజిస్టరింగు ఆఫీసరు ఇన్‌ఛార్జి మరియు క్యూరేటర్ అయిన శ్రీ ఎస్. దాశరధి గారి అధ్వర్యములో జరిగినది. అందు, నేను కూడా పాల్గొనే అవకాశము కలిగించిన రాష్ట్ర ప్రభుత్వమునకు, శ్రీ దాశరధి గార్కి నా కృతజ్ఞతలు.

### స్థల ఉనికి

సిరిపురగ్రామ ఈశాన్యదిక్కునగల 'లింగాల చెరువు' గట్టున 3' అడుగుల ఎత్తు గలిగిన శివలింగము ప్రతిష్ఠితమైయున్నది. చెరువుగట్టు నానుకొని నంది విగ్రహము, విష్ణు, విఘ్నేశ్వర, స్త్రీ దేవతామూర్తి మొదలగు రాతి విగ్రహములు అక్కడక్కడ చెదురు మదురుగా, సగము భూమిలోనికి కూరుకొనిపోయి ఉన్నవి. కృష్ణశిల వాడబడుటచే శివలింగము నునుపుగా మెరయుచున్నది. మిగిలిన యితర విగ్రహములు ఎర్ర ఇసుకరాయిచే చెక్కబడినవి. ఈ స్థల విస్తీర్ణము 20 × 15 మీటర్లు. చెరువు గట్టుకు పడమర దిక్కున గట్టుకు క్రిందిభాగమున యిటుక వరుసలు అక్కడక్కడ ఎత్తు పల్లములలో అగుపించినవి. పైన పేర్కొనబడిన ఆధారముల వలన యిచ్చట ఒక శివాలయము ఉండెడిదని ఊహింప వచ్చును.

### త్రవ్వకములు - వివరాలు

ఈ శివాలయ నిర్మాణము ఎటుల జరిగినదో, ఎప్పుడు జరిగినదో తెలుసుకొనుటకు, భూమి లోపున కప్పివేయబడ్డ యితర శిల్పములు వెలికి తీయుటకు 5 పరిఖలు 4 × 4 మీటర్ల కొలతలలో త్రవ్వబడినవి. మొదటి పరిఖ 4 × 4 మీటర్ల కొలతలలో ఉత్తర - దక్షిణ ముఖముగా త్రవ్వబడినది. 1.40 మీటర్ల లోతునకు త్రవ్వబడిన యీ పరిఖలో 5 స్తరములు గుర్తించడమైనది. అందు మొదటి రెండు స్తరములందు చెప్పుకోదగ్గ అవశేషములు లభ్యము కాలేదు. 3 వ స్తరము చెదురు మదురుగా యిటుక ముక్కలతో విస్తారముగా వ్యాపించి యున్నది. మరల నాల్గవ స్తరము బంకమట్టితో కలిసిన యిసుక పొరతో నిండియున్నది. ఐదవ స్తరమునందు ఆలయ నిర్మాణ చిహ్నములు కనబడినవి. ఈ స్తరమందు యిటుకలతో కూడిన 5 వరుసలగోడ బయల్పడినది. (చూడుడు 1వ చిత్రము) ఇటుక కొలతలు 26 × 18 × 8 సెంటిమీటర్లు. యిందు మూలముగా మనకు 3 వ స్తరములోను, 5 వ స్తరములోను ఆలయ నిర్మాణము జరిగినట్లు తెలియుచున్నది. 5వ స్తరమునందు బయల్పడ్డ గోడ బహుశ 12 వ శతాబ్దములో నిర్మితమైన శివాలయపు గోడ అయి ఉండవచ్చును. ఆ ఆలయము నేలకొరిగిన మీదట 4 వ స్తరము ఏర్పడెను. అటు పిమ్మట 3 వ స్తరములో కూడా యిటుకలు లభించుటకు కారణము, మరల అచ్చోటనే ఆలయమును నిర్మించుటగాని, లేక పడిపోయినయిటుకలను, శిలలను, ఇంకేదో పనికి ఉపయోగించుటగాని అయి యుండవచ్చును.



1వ చిత్రం

మొదటి పరిఖ యందు బయల్పడ్డ యిటుకల గోడ

స్థానికుల కథనం ప్రకారము యీ పడిపోయిన యిటుకలను, శిలలను అచటనేగల చెరువునకు తూము నిర్మించుటకు ఉపయోగించినట్లు చెప్పుచున్నారు. ఈ స్తరమందు రకరకముల పరిమాణములతో మృణ్మయపాత్ర శకలములు లభించినవి. శివాలయమునుండి లింగాల చెరువునకుగల మెట్లకు ఉపయోగించిన శిలలే, తూముకు బహుశ ఉపయోగింపబడి యుండవచ్చు. 5 వ స్తరమునందు లభించిన పెద్ద పెద్ద రాళ్ళు ఆలయ పునాది దిట్టపడుటకు వైచి యుండవచ్చును.

## రెండవ పరిఖ

మొదటి పరిఖను అనుకొనే 4 × 4 మీటర్ల కొలతలతో రెండవ పరిఖ త్రవ్వబడినది. ఒక మీటరు లోతుగల యీ పరిఖ యందు నాలుగు స్తరములు గుర్తింపబడినవి. ఎర్ర యిసుక, బంకమన్ను, చిన్నచిన్న రాళ్ళతో కలిసిన యీ నేలయందు స్తరముల స్వాభావికమైన రంగు మార్పులను బట్టి స్తర విభజన జరిగినది. ఇందు 4వ స్తరమునందు మృణ్మయపాత్ర శకలములు లభించినవి. 4వ స్తరమునందు విస్తారముగా లభించిన యిటుక ముక్కల సముదాయము ఆలయమునుండి లింగాల చెరువుకు ఏర్పర్చిన మెట్లను సూచించు చున్నది.



2వ చిత్రం
**లింగాల చెరువు గట్టుపై గల (4వ పరిఖ ప్రాంతంలో) శివలింగము**

## మూడవ పరిఖ

మొదటి పరిఖయందు బయల్పడిన గోడయొక్క పొడవు తెలుసుకొనుటకు 4 × 4 మీటర్ల కొలతలలో మరియొక పరిఖను 1.45 మీటర్ల లోతునకు త్రవ్విరి. చాలభాగము చెరువు గట్టు ఎత్తు చేయుటకు ఉపయోగించిన మట్టియే. మొదటి పరిఖలోనిగోడ, యీ పరిఖ ఉత్తరపు గోడనానుకొని లోనికి ప్రవేశించినది. జేగురురంగు మృణ్మయపాత్ర శకలములు లభించినవి. స్తరములు బాగుగా పరిశీలించిన ఆలయ నిర్మాణము రెండు దశలలో జరిగినదని తెలియును. మొదట నిర్మింపబడిన ఆలయము పడిపోగా, కొంత కాలమునకు మరల ఆలయ నిర్మాణము జరిగినట్లు తోచును. కొన్ని స్తరములందు ఇటుక ముక్కలు, ఆలయమునకు ఉపయోగించిన శిలలు చెల్లాచెదురుగా పడియుండుట గమనార్హము. యీ గోడ యొక్క పునాది తెలుసుకొనుటకు సహజసిద్ధమైన మట్టిపొర వచ్చువరకు యింకను ఉత్ఖాతనము జరపవలసి యున్నది.

## నాల్గవ పరిఖ

లింగాల చెరువుగట్టున నల్లరాతితో మలచబడ్డ మూడడుగుల నిడివి, అడుగు వ్యాసార్థము గల శివలింగమున్నది. శివలింగ రుద్ర భాగము, విష్ణుభాగముపైకి కన్పించుచున్నవి. బ్రహ్మ సూత్రం భాష్యం వరకు భూమిలో ఉన్నది (చూడుడు - 2వ చిత్రము). శివలింగముయొక్క పునాది మరియు ఆలయముయొక్క గోడలను గూర్చి తెలుసుకొనుటకు యీ పరిఖ 1.25 మీటర్లలోతుకు త్రవ్వడమైనది. చెరువుగట్టు ఎత్తుచేయుటకు చాలాసార్లు మన్ను పోయడం జరిగినది. అందుచే పరిఖ పడమరవైపు ఎత్తుగానూ, తూర్పువైపు పల్లముగానూ వున్నది ...చదునైన నేల ఆలయమునకు ఏర్పాటు చేయుటకు నునుపుగా, వివిధ పరిమాణములలో చెక్కిన శిలాఫలకములను ఉపయోగించిరి. యిటుకల పరిమాణము 33 × 21 × 7 సెం. మి. ఇటువంటి కొలతలుగల యిటుకలు 12 వ శతాబ్దమునకు చెందినవి పాలకొల్లు (ప. గో. జిల్లా) రాజమహేంద్రవరము (తూ. గో. జిల్లా) త్రవ్వకములలో లభించినవి.

## ఐదవ పరిఖ

ఈ స్థలమందు త్రవ్వబడిన అన్ని పరిఖలకన్న ప్రాధాన్యత కలిగినది యీ పరిఖయే. యీ పరిఖ 4 × 4 మీటర్ల కొలతలతో

1.45 మీటర్ల లోతుకు త్రవ్వబడినది. యిచ్చట నంది, విష్ణు, విఘ్నేశ్వర శిలా విగ్రహములు సగము పూడుకొనిపోయి ఉన్నవి. యీ విగ్రహములను పైకి తీయుటయేకాక, మరికొన్ని విగ్రహములు లభించగలవనే ఆశాభావముతో, ఆలయ నిర్మాణ క్రమము తెలుసుకొను ఉద్దేశ్యముతో యీ పరిఖ త్రవ్వడమైనది. యీ పరిఖయందు 6 స్తరములను గుర్తించడమైనది. ఒకటి, రెండు, మూడు స్తరములు మట్టి, ఇసుక కలిసిన పొరలు. నాలుగు, ఐదు స్తరములందు ఆలయమునకు ఉపయోగించిన యిటుకలు, శిలలు. అక్కడక్కడ లభించినవి. ఈ రెండు స్తరములు ఆలయము నేలకు ఒరిగినపిదప ఏర్పడినవి. యీ స్తరములందు లభించిన శిలాఫలకముల వల్ల రెండవ దశలో కూడా ఆలయ నిర్మాణము జరిగినట్లు ఊహింపవచ్చును. 6 వ స్తరము నందు, 1.30 సెం. మీటర్ల లోతున చంద్రశేఖర మూర్తి కాంశ్య విగ్రహము, పంచలోహములతో చేయబడిన గంట లభ్యమాయినవి. గంటకు నాలుక లేదు. ఇక ప్రధానమైన చంద్రశేఖరమూర్తి కాంశ్య విగ్రహము (మూడవ వ చిత్రము) సమపాద స్థానక భంగిమలో నిల్చొని ఉన్న చతుర్భుజ మూర్తి. దక్షిణ, వామ హస్తములలో మృగము, పరశు గలవు. యిది పతాక హస్తమును సూచించుచున్నది. క్రిందకు గల దక్షిణ, వామ హస్తములు వరద, అభయ ముద్రలను సూచించుచున్నవి. యీ విగ్రహము భద్రపీఠముపై యున్నది. పీఠముపై నుంచి మీదకు పొడుచుకొనినట్లు యున్నకొనలు, బహుశ విగ్రహము. ఊరేగింపు వేళలందు వాహనమునకు అమర్చియుంచుటకు ఉద్దేశింపబడినవై యుండును. చంద్రశేఖరమూర్తి పిక్కల వరకు మడతలు కలిగిన ధోవతి ధరించినట్లు మలచబడినది. జటామకుట మందు చంద్రవంక గలదు. శిల్ప సంప్రదాయ లక్షణములను బట్టి యీ విగ్రహము క్రీ.శ. 12 – 13 వ శతాబ్దములకు చెందినదిగా భావింపవచ్చును.

యీ శివాలయ ప్రాంగణములో గల మిగతా శిలావిగ్రహములు కూడా చెప్పుకోదగ్గవే। కాని కాల వైపరీత్యము వలన, దుండగుల విధ్వంస చర్యల వలన విగ్రహములు చెడిపోయినవి.

## విష్ణువు

ఎర్ర యిసుక రాయితో చేయబడిన యీ విగ్రహము సమపాద స్థానక భంగిమలో నిలిచియున్నది. కిరీట మకుటము, శిరః చక్రము గలిగి, శంఖచక్రధారుడై యున్నాడు. వైజయంతీ మాల బంధము, కంఠే, కంకణములు, భుజకీర్తులు, మణి బంధములు అలంకరింపబడినట్లు చెక్కబడినది. పిక్కల వరకు ధోవతి ధరింపబడినది. సర్వాలంకార శోభితమైన యీ విగ్రహము శిల్ప సాంప్రదాయ పద్ధతి ప్రకారము క్రీ.శ. 15 – 16 వ శతాబ్దముల నాటికి చెందినదిగా తోచుచున్నది.

## నంది

ఎర్ర యిసుక రాయితో చేయబడినది. మువ్వల గొలుసు, పృష్ఠ పట్టము, నడుము పట్టిక, కంఠ మువ్వల గొలుసు అలంకారములుగా చెక్కబడినవి. యివియేకాక స్త్రీ దేవతా విగ్రహము, పానవట్టము, గణపతి మొ॥ శిథిలమైన విగ్రహములు కూడా గలవు.

## శిలా శాసనము


ఖనన పరిశోధన జరిపిన లింగాల చెరువునకు ఒక కిలో మీటరు దూరాన "అప్పమ బావి" అనే ప్రదేశంలో ఒక శాసనపు ఫలక పడియున్నది. బహుకాలము నుండి ఆ ఫలకను గ్రామస్థులు బట్టలు ఉతుకుకొనే బండగా వినియోగించుట వలన శాసనాక్షరములు చదువుటకు వీలులేకుండా రూపురేఖలు కోల్పోయెను. ఆ ఫలకమున



3వ చిత్రం

త్రవ్వకములలో లభించిన చంద్రశేఖరమూర్తి కాంశ్య విగ్రహము, పంచలోహపు గంట.

కిరువైపుల శాసనములు గలవు. మొదటి శాసనము కేంద్ర ప్రభుత్వ శాసన శాఖవారు తమ వార్షిక నివేదికలో (1934 - 35) నమోదు చేసిరి. రెండే పంక్తులు కలిగిన యీ శాసనము అసంపూర్ణము, అర్ధంతరముగా ముగిసినది. "స్వస్తిశ్రీ సక వరుషంబులు ౧౦౭౫ (శక. సం. 1075 అనగా క్రీ. శ. 1153) అగునేండ్లి.... ........నమపంగలవారు" అను వాక్యములు మాత్రము కానవచ్చుచున్నవి. ఆ శిలాఫలకమునకు రెండవప్రైపు 15 పంక్తుల తెలుగు - కన్నడ లిపిలో క్రీ. శ. 12వ శతాబ్దమునకు చెందిన శాసనము గలదు. యీ శాసనము 'అంకానాం వామతోగతిః' అన్న నియమ ప్రకారము "గోత్ర శైలాంబర శశి" (గోత్ర 7; శైల - 7; అంబర - ౦; శశి 1) అని శక సంవత్సరము 1077 (అనగా క్రీ.శ. 1155) న యివ్వబడినది. వృశ్చిక శుక్ల ద్వాదశి అని చెప్పబడినది. సరియైన వివరములు లేనికారణమున యింగ్లీషు తేది చెప్పుటకు వీలుకాకున్నది.



4వ చిత్రం
క్రీ. శ. 12వ శతాబ్దమునాటి శిలా శాసనము.

## శాసన సారాంశము

తూర్పు గాంగరాజులలో ఒకడైన కామార్ణవుని (క్రీ. శ. 1147 - 1156) కాలమునకు చెందిన శాసనము యిది. కామార్ణవుని భృత్యుడొకడు 'అరియరాజగజసింహ' బిరుదుగలవాడు ఎఱద పంపులోని 'పళంబూర్ణు' నామగ్రామమందు తనకుగల వృత్తిని (వృత్తి=కట్నము. దానమిచ్చినవారికి ఆ గ్రామమందుగల కొంత పన్ను వసూలు చేసుకొనే హక్కు లేక తద్వారా లభించే మూల్యము) సిరిపురములోని పరమేశ్వర మహాదేవరకు తన ప్రభువైన కామార్ణవ దేవర శ్రీ భుజవర్ధనమునకుగాను దానమిచ్చినట్లు తెలియుచున్నది. శాసనము కామార్ణవుని 9 వ రాజ్యకాల సంవత్సరమందీయబడినట్లు శాసనమందే కలదు. కామార్ణవుడు, తన తండ్రి అనంతవర్మ చోడగంగునికి వారసుడిగా క్రీ. శ. 1147 నుంచే సింహాసనాధీనుడైనట్లు కెందుపట్నం, కెందూలి శాసనములు ధృవీకరించుచున్నవి. కామార్ణవునకు కూడా 'శ్రీ మంధనంతవర్మ' అను బిరుదు యీ శాసనమున వాడబడినది. కామార్ణవుని శాసనములు ముఖలింగము, శ్రీకూర్మము, రెల్లివలస, తాలాడగ్రామములందు లభ్యమగుచున్నవి. కామార్ణవుని జటేశ్వరునిగా, మధుకామార్ణవునిగా కూడా శాసనములు పేర్కొన్నాయి.

శాసనమునందు రిపు నృప గజసింహ, అరియరాయ గజసింహ అను బిరుదులుగలవు. వీటిని సూచించునట్లుగా శాసన ఫలక పై భాగమున పంజాయెత్తి ఏనుగుపై లంఘించు సింహము బొమ్మ చెక్కబడియున్నది. శాసనమందు పేర్కొనబడిన "ఎఱద పంపు", నాటి పరిపాలనా విభాగములలో నొకటి. యీ విభాగము నేటి విజయనగర తాలూకా ప్రాంతమునకు చెందినదిగా గుర్తింపబడినది. కాని శాసనమందు పేర్కొనబడిన పళంబూర్ణు గ్రామము మాత్రము నేడు నిర్జింపబడలేదు.

శాసనపాఠము ప్రకారము, బహుశ యీ దానము ప్రస్తుత పరిశోధనలో బయల్పడ్డ శివాలయమునకు చెందినదై యుండవచ్చును. గ్రామమందు మరి ఏ యితర ప్రాచీన దేవాలయములు లేకపోవుట యీ ఊహను మరింతగా బలపరచుచున్నది. పరిశోధనలో లభించిన కాంశ్య చంద్రశేఖరమూర్తి విగ్రహము యీ శాసనమందు ప్రసక్తమైనది. శివాలయములో నేగల యీ శాసనము కాలక్రమమున ఆలయము కూలిపోయిన పిదప స్థానభ్రంశము పొంది ఉండవచ్చును. పై వారిత్రాత్మక విశేషములనుబట్టి యీ శివాలయము క్రీ. శ. 12 వ శతాబ్దములో వైభవోపేతముగా నిత్య ధూప దీప నైవేద్యాలతో విరాజిల్లినదని తెలియుచున్నది.

పరిమిత నిధులవలన ఖనన పరిశోధన అంతటితో నిలిపి వేయడం జరిగినది. యింకను త్రవ్వకములు జరిపిన, ఆలయము యొక్క పూర్తి స్వరూపము, మరికొన్ని విగ్రహములు దొరకు అవకాశము లభించవచ్చును. కాంస్య చంద్రశేఖరమూర్తి విగ్రహము, పంచ లోహపుగంట పురావస్తు పరిశోధనశాఖ డైరెక్టరు గారి కార్యాలయమున భద్రపరచినారు.

శా స న పా ఠ ము

(4 వ చిత్రము)

1. శాకాబ్దే గోత్ర శైలాంబర శశి రవె వ (వృ) శ్చిక రా
2. ప్రియాశో ద్వాదశ శుక్లప (క్షే) సకల వసుమత్తీ
3. శాస్నకామాన్నా వస్యభృత్య ప్రవిత్తిం స్వభోజ్యం రిపున్రుప
4. గజసింహ ఃటుంబ్యాజ్జు నామ్నా గ్రామం శ్రీ చంద్ర మౌలేస్వగ్గు
5. . రోయతం నృప కామిశ్వరశ్య స్వభోగ్యం స్వస్తిశ్రీ ~ దనంత వమ్మా దే
6. వర ప్రవర్ధమాన విజయరాజ్య [సంవత్స]ా శ్రాహి వృశ్చిక సు
7. క్ల ద్వాదసి నిమిత్యమున శ్రీపురంబునంద్రీ (దు) పరమేశ్వ
8. ర మహాదేవరకు శ్రీ కామాన్నా దేవర పువ్వుల పరి [మౌలిపలి]
9. గ్రహణ.... అరిరాయగజసింహ .. వార ఎబదపంపు
10. లోని తమ జీత వట్టన నగు గట్టులోని పటుంబ్యాజ్జు ప్రవితి
11. కామానావ దేవరకు శ్రీ భుజవర్ధానగా హవి బలి యచ్చా
12. నలకు దేవరం గొలువ ... ... నలకు ప్ర.... ....
13. క్రితికి నిచ్చి.... .స్వదత్తం వా [పరదత్తం వా]
14. యో హరేత వసుంధర.... ..[కల్ప] కోటి స (శ)
15. తం వషాం విష్టాయాం జాయతే క్రిమిః శ్రీ.

ఈ వ్యాసము వ్రాయుటకు ఉపకరించిన గ్రంథములు


1. కుందూరి ఈశ్వరదత్తు — శాసన పదకోశము
2. డా. హరేకృష్ణ మెహతాబ్ — హిస్టరీ ఆఫ్ ఒరిస్సా
3. 'ఈనాడు', 7–4–1979
4. ఏన్యువల్ రిపోర్టు ఆన్ ఎపిగ్రాఫీ, 1959–60, సంఖ్య 164.
5. దక్షిణ హిందూ శాసనముల సంపుటి, నెం. 5, సంఖ్య 1044, 1147, 1148, 1322, 1321.
6. ద. హి. శా. సంపుటి 10, సంఖ్య 707.
7. రాష్ట్ర పురావస్తు శాఖ వార్షిక నివేదిక, 1979.


శ్రీ నాగాభట్ల మార్కండేయ శర్మ

# భగవచ్ఛబ్ద విచారము

నిఘంటువులు భగవచ్ఛబ్దమునకు విష్ణువు, శివుడు, బుద్ధుడు అని అర్థములు వ్రాసినవి. విష్ణుపురాణము భగవచ్ఛబ్దమునుగూర్చి దిగువ నిర్వచనము నిచ్చినది —

"ఐశ్వర్యస్య సమగ్రస్య
వీర్యస్య యశసః శ్రియః,
జ్ఞాన వైరాగ్యయోశ్చైవ
షణ్ణాం భగ ఇతీరణా."

ఇతి ఐశ్వర్యాదిషట్కం యస్మిన్ వాసుదేవే నిత్య మప్రతిబంధేన సామస్త్యేన చ వర్తతే —

"ఉత్పత్తిం, ప్రళయంచైవ
భూతానా మాగతిం, గతిం
వేత్తి విద్యా, మవిద్యాం చ
సవాచ్యో భగవానితి."

ఉత్పత్త్యాది విషయం చ విజ్ఞానం యస్యస వాసుదేవో వాచ్యో భగవానితి.

పైది శ్లోకద్వయమునకు చివర నుదాహరించిన వాక్యములు శంకరుల గీతాభాష్యములోనివి. ఆ రెండు శ్లోకముల భావమిది:- ఐశ్వర్యము, వీర్యము, యశస్సు, శ్రీ, జ్ఞానము, వైరాగ్యము అను నాఱింటికి "భగ" మని పేరు. అట్టి భగము కలవాడు భగవంతుడు. ఈ ఆఱును ఏ వాసుదేవునియందు ప్రతిబంధ రహితము

గాను, సమగ్రముగాను ఉండునో ఆ వాసుదేవుడు భగవచ్ఛబ్దముచే చెప్పదగినవాడు. అట్లే భూతములయొక్క (జగములయొక్క అని కూడ) ఉత్పత్తి, ప్రళయము, గతి, అగతి (రాకడ పోకడలు), విద్య, అవిద్య-అను నాటింటిని ఎవడెఱుంగునో, అతడు భగవచ్ఛబ్ద వాచ్యుడని భావము.

ఇట్టి శక్తిసామర్థ్య జ్ఞానాదులు బ్రహ్మాదులైన మూర్తులకును ఉండునుగావున, ఆ మూర్తులలో ఎవరినైనను భగవచ్ఛబ్దముచేత పేర్కొనవచ్చును. బ్రహ్మాది మూర్తులనే గాక ఋష్యాదులను గూడ సంస్కృత సాహిత్యము భగవచ్ఛబ్దముచే పేర్కొనుచునేయున్నది. "యథాహ భగవాన్ వ్యాసః" మొదలగునవి ఇందుకు ఉదాహరణములు. ఇంకను —

"అచతుర్వదనో బ్రహ్మా
ద్విబాహురపరో హరిః,
అఫాలలోచన శ్శంభు
ర్భగవాన్ బాదరాయణః"

అనెడి శ్లోకమునందు భగవచ్ఛబ్దము బాదరాయణునకు విశేషణముగా వాడబడినది. ఇందుకు "శంకర భగవత్పాదులు, గోవింద భగవత్పాదులు, వీరబ్రహ్మ భగవానుడు" ఇత్యాదులను గూడ ఉదాహరణములుగా తీసికొనవచ్చును.

కాని శివాది దైవతములకు భగవచ్ఛబ్దమును వాడినను, అది ఔపచారికమే అనియు, శ్రీ మహావిష్ణు విషయమున మాత్రమే అది ప్రధానమనియు విష్ణుపురాణ మనుచున్నది. చూడుడు:

"ఏవమేవ మహాన్ శబ్దో
మైత్రేయః భగవానితి
పరమబ్రహ్మ భూతస్య
వాసుదేవస్య నాన్యగః"

"తత్ర పూజ్యపదార్థోక్తి
పరిభాషా సమన్వితః,
శబ్దోఽయం నోపచారేణ
త్వన్యత్ర హ్యుపచారతః"

విష్ణువునకే సర్వేశ్వరత్వమును ప్రతిపాదించుటకు పుట్టిన విష్ణుపురాణము భగవచ్ఛబ్దమును విష్ణునకే పరిమితము చేయుటలో వింతలేదు. ఇంకను విష్ణుపురాణము - జ్ఞానము, శక్తి, బలము, ఐశ్వర్యము, వీర్యము, తేజము - అనునాఱును భగవచ్ఛబ్ద వాచ్యములని కూడ ననుచున్నది —

"జ్ఞానశక్తి బలైశ్వర్య
వీర్యతేజాంస్య శేషతః,
భగవచ్ఛబ్ద వాచ్యాని
వినా హేయైర్గుణాదిభిః"

హేయములైన గుణాదుల కింద మినహాయింపు చూపబడినది. కాగా, జ్ఞానశక్తిబలాదు లాఱును కలవారు భగవచ్ఛబ్ద వాచ్యులన్నమాట!

భగవంతుడనగా విష్ణువు మాత్రమేయని రూఢిగా భావింపబడుటచేతనే, విష్ణులీలలను వర్ణించు గ్రంథము "భాగవత" మైనది. అట్లే కృష్ణుడు చెప్పినది "కృష్ణగీత" కాక, "భగవద్గీత" యైనది. పాపము, శివుడు చెప్పినది "శివగీత" మాత్రమేయై యూరకున్నది. ఇందుచేతనే భాగవత శబ్దమునకు విష్ణుభక్తుడను నర్థము కూడ ప్రచారములోనికి వచ్చియుండును. "భగవతి భక్తః భాగవతః" అని కదా అన్నారు. క్రమముగా భాగవతులనగా హరిదాసులనెడి అర్థమును వ్యవహారమున రూఢమైనది. అంతేకాని భాగవత శబ్దమునకు శివభక్తుడనెడి అర్థము రాదట! శివుని పట్ల భాగవత శబ్దము ఔపచారిక (అప్రధాన) మే కాని, ప్రధానము కాకపోవుటయే ఇందుకు కారణము కాబోలు! అందుచేతనే పాణినీయమున "శివ భాగవతవత్సమాసః" అనవలసివచ్చినది. ఈ అంశము పాణినీయమును చదివినవారి కెఱుకయే. త్రిమూర్తులలో కాని, పంచ మూర్తులలో కాని భగవచ్ఛబ్దమును ఒక్క విష్ణునకు మాత్రమే పరిమితముచేయుట యేమి న్యాయమో!

అందుకే కాబోలు అథర్వ శిఖోపనిషత్తు భగవచ్ఛబ్దమునకు ఇంకొక విధమైన నిర్వచనమును చెప్పుచున్నది: —

భవము, యోగము - అను రెండు శబ్దములును మనకు సుపరిచితములే. భవ మనగా సంసార మనియు, యోగ మనగా సంసార నివృత్తి సాధనము, లేక ఈశ్వరునితో సమైక్యమనియు సుస్పష్టములే.

'భవ' శబ్దమునందు దంత్యవర్ణలోపమును, యోగశబ్దము నందు అద్యవర్ణలోపమునుచేసి, రెంటిని కలిపినచో 'భగ' మనెడి రూపము సిద్ధించగలదు. ఇప్పుడు భ శబ్దముచేత 'భవమును', గ శబ్దముచేత 'యోగ'మును వివక్షితములు. భవమెప్పుడును హేయ (వదలదగినది) మగుచున్నది. అట్లే యోగము, దేయము—అనగా ఈశ్వరునిచే నీయదగినదన్నమాట. సారాంశమేమన? భవమును హరించి, యోగము నొసంగుశక్తిగలవాడు భగవంతుడని భావము

"భవం నిహత్య యోగం దదాతీ త్యర్థః"

అథర్వ శిఖోపనిషత్తులోని వాక్యములివి:

"అథకస్మాదుచ్యతే భగవానితి?
యస్మాదుచ్చార్యమాణ ఏకోరుద్రః
భవం నిహత్యయోగం దదాతీతి,
తస్మాదుచ్యతే భగవానితి."

నేనీ అథర్వ శిఖోపనిషన్మంత్రమును ప్రబోధ చంద్రోదయ నాటక వ్యాఖ్యానములో చూచినాను. దానిమీదట నాగరిలిపిలో ముద్రితమైన ఉపనిషన్మండలిలోవి అథర్వశిఖోపనిషత్తును పరిశీలించితిని. అందు పై నుదహరించిన వాక్యములులేవు. సంస్కృత ప్రబోధ చంద్రోదయ నాటకమునకు వ్యాఖ్యానమును వ్రాసినవాడు తిమ్మరుసు మంత్రి మేనల్లుడైన నాదెండ్ల గోపన్న. అతడు ప్రామాణికుడు గాని, సామాన్యుడు కాడు. అతడు చూచిన అథర్వశిఖోపనిషత్తులోనున్న వాక్యములు ఇటీవల నెట్లు తొలగింప బడినవో చెప్పలేము.

ప్రాచీన వ్యాఖ్యాతలు ఉదహరించినవి అధునిక ముద్రణము లలో అగపడకుండుట ఇంక కొన్ని గ్రంథములందును నేను గమనించియున్నాను. వాని నుదాహరింప నిది యదనుకాదు.

విష్ణుపురాణము భగవచ్ఛబ్దమును విష్ణువునకు మాత్రమే ప్రధానమనుటయు, తదితరులకు అప్రధానమనుటయు ఏమంత బాగుః త్రిమూర్తులనుగూర్చి మన పురాణములు ఎవరిని వర్ణింప వలసివచ్చినప్పుడు వారిని గొప్పగానే వర్ణించినవి కదా ః కనుక భగవచ్ఛబ్దము, బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరులలో ఎవరికయినను ప్రధానముగా వాడవచ్చుననియు, వ్యాసాది ఋషులను గూర్చి వాడునప్పుడు వారు జన్మతః మానవులుకాన, ఔపచారికమనియు తలంచుట సమంజసముగా తోచుచున్నది. ఇప్పటున ఋగ్వేదము లోని రుద్రప్రభావ వర్ణనముగల రెండు మంత్రముల నిచ్చట ఉదాహరించుకొనుట అప్రస్తుతముకాదు.

"కద్రుద్రాయ ప్రచేతసే
మీ ఢుష్టమాయ తవ్యసే
వోచేమశంతమం హృదే" 1-43-1

ఋగ్వేదములో రుద్రదేవుని గూర్చిన మొదటి మంత్రమిది. దీని భావము: ప్రకృష్టమగు జ్ఞానముతో కూడినవాడును, కోరికలను వర్షించు (ఇచ్చు) వాడును, ఎక్కువ వృద్ధిని పొందిన వాడును (సర్వవ్యాపి) మా హృదయములందు నివసించినవాడును అగు రుద్రదేవుని గూర్చి మిక్కిలి సుఖము (శం) నిచ్చు స్తోత్రము నెపుడు పఠింతుమో ః అని. ఇట్టిదే మఱొక మంత్రము. నిత్యమును దేవతార్చనలో పఠింపబడునట్టిది.

త్ర్యంబకం యజామహే
సుగంధిం పుష్టి వర్ధనమ్
ఉర్వారుకమివ బన్ధనాత్
మృత్యోర్ముక్షీయ మామృతాత్ ॥

ఐహికములు, అముష్మికములు, పారమార్థికములు అగు పుష్టి తుష్టుల నొసంగువాడును, శారీరక మానసికారోగ్యముల నిచ్చువాడును, అధ్యాత్మికాది దైవికాది భౌతికములనెడి అర్థములను మూడు కన్నులతో కనుపెట్టుకొని యుండువాడును అగు త్రినేతుని పూజింతుముగాక ః ఇట్లు పూజించుటచేత తొడిమ నుండి పండిన దోస కాయ ఊడిపడునట్లు మృత్యువు నుండి ముక్తులమగుదుము. అంతియే కాని, అమృతము – (మోక్షము) నుండి మాత్రము దూరులము కాము. అనగా శివార్చన వలన మృత్యురూప సంసారము నుండి విడివడి అమృతత్వము నందుదురని భావము. ఈవిధముగా అరాధకులను మృత్యుముక్తులను చేసి, అమృతత్వమును పొందించెడి శివునికి భగవచ్ఛబ్దము అప్రధానమెట్లగును ?

డా॥ కొండూరు వీరరాఘవాచార్య

# అపర నన్నయభట్టు

ఆంధ్రశబ్ద చింతామణిని రచించిన అపర నన్నయభట్టును గూర్చి శ్రీ కొర్లపాటి శ్రీరామమూర్తిగారు మార్చి, ఏప్రిల్ 1983 'భారతి' సంచికలలో ప్రకటించిన వ్యాసము ప్రశంసనీయము. చాగంటి శేషయ్యగారు, కందుకూరి వీరేశలింగముగారు ఊహించిన మరియొక నన్నయభట్టును క్రీ. శ. 1526-1550 మధ్యగల వ్యక్తిగా నిరూపించినారు. వారి వ్యాసములోని ఒకటి రెండు విషయములను గూర్చి ప్రస్తావించవలసి యున్నది.

"శ్రీధరచ్ఛందము ప్రథమతః పదునారవ శతాబ్ది ఉత్తరార్ధములోని లింగమగుంట తిమ్మకవి సులక్షణ సారమునందు ప్రసక్తము. కనుక శ్రీధరచ్ఛందము పదునారవ శతాబ్ది మధ్యకాలములోని గ్రంథము కావలయును" అని శ్రీ శ్రీరామమూర్తిగారు వ్రాసిరి (మార్చి 'భారతి'. ఇది సరికాదు. క్రీ. శ. 14 వ శతాబ్ది ఉత్తరార్ధ

మునగల గౌరనకవి తన 'లక్షణదీపిక'లో శ్రీధరచ్ఛందమును పేర్కొనినాడు. (చూ. పరిషత్పుస్తక భాండాగారము. మూడవ భాగము పు. 17) కనుక శ్రీధరచ్ఛందము 14వ శతాబ్దినాటికే కలదు.

హయలక్షణవిలాస కృతిపతియగు సాళువ కంపరాయల బిరుదము 'ఇరవగండ'. 'ఉత్తమగండ' కాదు. కాని ఉత్తమగండ భూవరుని పేర రచింపబడిన అశ్వ శాస్త్రమొకటి కలదు. ఈ అశ్వ శాస్త్రమున పేర్కొనబడిన ఉత్తమ గండభూవరుడు, లక్షణ గ్రంథమున పేర్కొనబడిన ఉత్తమ గండడు ఒకేవ్యక్తి కావచ్చును. ఉత్తమ గండచ్ఛందము ప్రధానమైన ప్రాచీన లక్షణ గ్రంథములలో నొకటిగా ప్రాచీనులు భావించినట్లు కవిజనాశ్రియ ప్రాచీన ప్రతిలో ఒక సాహితీప్రియుడు వ్రాసుకొనిన యీ క్రింది వాక్యములవలన తెలియుచున్నది.

"ఉత్తమగండచ్ఛందం, హనుమచ్ఛందం, అనన్తచ్ఛందం, కవిరాక్షసచ్ఛందం, జయదేవచ్ఛందం, గోకర్ణచ్ఛందం, నీలకంఠచ్ఛందం, ఆదిభీమనచ్ఛందం అనగా ౮ విధముల ఛందములు. ఈ ౮ ఛందములు గావే లక్షణ గ్రంథములనగాను" (చూ. పరిషత్పుస్తక భాండాగారము 3 భా., పు. 35)

పై లక్షణ గ్రంథములు క్రీ. శ. 16 వ శతాబ్దికి ముందువే గనుక ఉత్తమగండచ్ఛందముకూడ 16 వ శతాబ్ది పూర్వగ్రంథమే కాని 16 వ శతాబ్ది గ్రంథము కాజాలదు.

ఆంధ్రశబ్ద చింతామణి వ్రాసిన అపరనన్నయభట్టే ఇంద్రవిజయమును వ్రాసియున్న యెడల 16 వ శతాబ్దినాటి ఇంద్రవిజయములోని పద్యములు తత్పూర్వలక్షణగ్రంథములలో ఎట్లుదాహరింప బడగలవు? ఉత్తమగండచ్ఛందము, శ్రీధరచ్ఛందములలో ఇంద్రవిజయములోని పద్యములు గలవని చెప్పిన ఆంధ్రప్రయోగ రత్నాకరకారుని వ్రాత అసత్యము కావలయును. లేదా ఇంద్రవిజయమను కావ్యమే అతని కల్పితము కావలయును. తమ తమ లక్షణ గ్రంథములలో ప్రతిపాదించిన లక్షణముల కనుగుణముగా ప్రాచీన కవుల పాఠములను దిద్ద సాహసించిన కొందరు లక్షణకవులు తమ గ్రంథములకు ప్రామాణికత లభించునను తలంపుతో నామమాత్రావశిష్టమైన ప్రాచీనలక్షణ గ్రంథములలో ఉదాహరింపబడిన వనుచు, కొన్ని పద్యములను కల్పించి వాటి కర్తృకమును ప్రసిద్ధ ప్రాచీన కవులకు అంటగట్టుటకు సైతము వెనుకాడి యుండరు. నన్నయ ఇంద్రవిజయ మీకోవకు చెందినదే అనుకొనుట తప్పుకాదు.

శ్రీ సూర్యదేవర రవికుమార్

# లేఖలు

## గుమ్మిలేరు జైన క్షేత్రమే

1982 నవంబర్ "భారతి" మాసపత్రికలో నాచే రచింపబడిన "జైనక్షేత్రం - గుమ్మిలేరు" అను వ్యాసమునకు, 1983 జులై "భారతి" మాసపత్రికలో శ్రీ ముసునూరి సాంబశివ రామమూర్తి గారిచ్చిన "ప్రత్యుత్తరము"న, 1) గుమ్మిలేరుకాని దాని పరిసర ప్రాంతములందు గాని జైనక్షేత్రమున్నట్లు నేను కని విని యుండ లేదనీ, 2) రాళ్లబండి సుబ్బారావు, ఆంధ్రా హిస్టారికల్ రీసర్చి సొసైటీ అండ్ మ్యూజియమ్స్‌లో పనిచేయుచున్న యధికారి శ్రీ అక్కిరాజు గారు గుమ్మిలేరు వచ్చి విగ్రహమును పరిశీలించి క్రీ॥ శ॥ నకు సంబంధించిన కాలమందలి బుద్ధ విగ్రహముగా నిర్ణయించి" నారనీ 3) పార్శ్వనాధ విగ్రహముల శిరోభాగము రెండు గాని అంతకెక్కువ గాని వరుసలలో సర్పముఖములు (ఫణాగ్రములు) చత్రాకారమున నుండుట ఆచారము...... నేటి గుమ్మిలేరు విగ్రహము పూర్తిగా పూర్వరూపమును మార్చి వారిచ్చ వచ్చినట్లు శిల్పవైఖరినీ మార్చి అన్యమనస్కుల గావించి భ్రాంతి గొల్పుచున్నారనీ, 4) ఆనాటి విగ్రహమునకు పీఠమున అక్షర సముదాయములేదు, నేడిద్దానికి పీఠభాగమున నేటి దేవనాగరి అక్షర సముదాయమే ఇట్టి స్వేచ్ఛారూప - పరివర్తనకు నిదర్శనమనీ సెలవిచ్చి యున్నారు.

పై విషయములను సమగ్రముగ పరిశీలించి, అందలి దోషములను ఎఱుకపరచ నుపక్రమించుచున్నాను. 1) విగ్రహము బయల్పడు సమయము వరకూ గుమ్మిలేరు జైనక్షేత్రమనీ, తత్పరిసరప్రాంతమందు జైనము వ్యాప్తిలో నుండెడిదనీ ఎవరికీ తెలియదు. అంతటి శిల్పము ఆ ప్రాంతమున లభ్యమగుటచే అట్లూహించుటలో విప్రతిపత్తి లేదు. 2) శ్రీ అక్కిరాజుగారు ఏ ఆధారములచే దానిని బుద్ధవిగ్రహముగా నిర్ణయించినారో తెలియదు. శ్రీసాంబశివరామమూర్తిగారు నావ్యాసములో ఒకముఖ్యవిషయమును దాటవేశారు. దక్షిణభారత జిన ప్రతిమలలో అరుదైన "శ్రీవాత్సవ" అనే డైమండు ఆకారపు గుర్తు ఆ విగ్రహము వక్షఃస్థలమందున్నది అందుచేతనే ఇది "జిన ప్రతిమ" యనుటలో సంశయము లేదు. జైన పరిశోధకులగు డా॥ జవహర్‌లాల్ గారి లేఖనూ, నా వ్యాసములో ఉదహరించియున్నాను. "జైన ఐకనోగ్రఫీ" కూడా ఈ విషయమును బలపరచుచున్నది. 3) పార్శ్వనాదుని విగ్రహమందు ఉండవలసిన ఫణాగ్రములు ఛత్రాకారములోనివి, భగ్నములై ఉండవచ్చు, విగ్రహమునకు పూర్వరూపము మార్చిరనుట, అది

"బుద్ధ విగ్రహము" అని పేర్కొనుటకు చేసే విఫలయత్నమే, కానిచో లాక్షణికుల మాట కాదనుట సాహసము కాదో 4) ఆనాటి విగ్రహమునకు పీఠమున అక్షరసముదాయము లేదు, ఈనాడూ లేదు. శ్రీ సాంబశివరామమూర్తి గారు కేవలం ఛాయాబింబములు (ఫొటోలు) మాత్రమే చూసినట్లున్నారు. మందిరములోనున్న జినప్రతిమకు పీఠమందు ఏవిధమైన అక్షరములూ లేవు. ఫొటో తీయు సమయమున, వస్త్రముపై వ్రాసిన దేవనాగరి లిపితో, విగ్రహము పీఠభాగమునకు సంలగ్నముచేసి వివరణార్థమై ఫోటో తీసారు. అవి పీఠమందు ఆధునిక శిల్పులచేత చెక్కబడినవికావు. ఫొటోలోని అక్షర సముదాయము చూసి "పొరపాటు" బడ్డారు. చారిత్రక విషయముల, విగ్రహముల పరిశీలనలో, విమర్శలో సమగ్ర పరిశోధన యవసరమనీ, పక్షపాతవైఖరి కూడదనీ సహృదయులందరికీ విదితమే గదా! ఆ విగ్రహము "జిన ప్రతిమ" యనీ, అందుచేత ఆ ప్రాంతమునందు జైనము విలసిల్లినదనీ భావించుట సహేతుకమే అవుతోంది.

మేడవరపు సంపత్‌కుమార్, మండపేట.

## సవరణ

"విశిష్టాద్వైత సిద్ధాంత దర్పణము" అనే గ్రంథం పైని నేను వ్రాసిన విమర్శలో చివర "ఇట్టి గ్రంథాలను శేషశర్మగారి వంటి సమర్థులచే రచింపజేసి"— అనుటకు బదులుగా "శేషశర్మగారి కంటె సమర్థులచే" అని తప్పుగా పడినది. పాఠకులు అక్టోబరు 1983 సంచిక 74వ పుటలో ఈ సవరణను చేసుకోవలెనని ప్రార్థిస్తున్నాను.

బులుసు వేంకట రమణయ్య

## ప్రాచీనులు కుల మత ప్రాంతీయ తత్త్వాల కతీతులు కారు

1983 జనవరి 'భారతి' లో వేములవాడ భీమకవి విషయమై తెలిపిన నా అభిప్రాయాన్ని పరామర్శిస్తూ శ్రీ కొల్లూరు సూర్యనారాయణ గారు మార్చి 'భారతి' లో గోపరాజు రచనకు నేను ప్రాంతీయ తత్త్వాన్ని అంటగట్టానని, అది దృష్టిదోషమని, అసలు ఆంధ్రదేశంలో 500 సం॥లకు ముందు ఇప్పుడున్న కుల, మత, ప్రాంతీయ తత్త్వాలు లేవని, వాటిని "దర్శింపబూనటం నిజంగా 'సెంటుపెర్సంటు' దురదృష్టము" అని సెలవిచ్చారు.

వ్యక్తులు విజ్ఞానవంతులై, క్రాంతదర్శులై, కవులై, విశ్వశ్రేయోదాయకమగు కావ్యములకు నిర్మాతలై కీర్తిశరీరులైనప్పటికి వారిలో కొందరు మానవసహజమైన అభిమానాలు, రాగద్వేషాలకు పూర్తిగా అతీతులు కారు. పైగా స్వస్థాన వేష భాషాభిమానము నిందింపదగినది కాదు. భీమన తన ప్రాంతీయుడు కాబట్టే గోపరాజు అతనిని ప్రత్యేకముగా నుతించినాడన్న నా అభిప్రాయము సరియైనది కాదన్నప్పుడు భీమనపై గోపరాజు చూపిన ప్రత్యేకతకు కారణమును శ్రీ సూర్యనారాయణగారు వివరించితే బాగుండేది. భీమనను నుతించిన తరువాత ఒకే చంపకమాలలో తొమ్మిదిమందికవులను తలచినగోపరాజు, వారందరిని 'ముత్కుల చంద్రు' లని అభివర్ణించాడు. గోపరాజు కులమేది? విశాలదృష్టితో చూస్తే అతనిది కవికులము. కాని «ముత్కులచంద్రుల సత్కవీంద్రులన్' అని పేర్కొనుటచేత ఆ 'కుల చంద్రులు' కవికుల చంద్రులని చెప్పుట పునరుక్తమే అవుతుంది. ఆ పద్యములో తలచిన తొమ్మిదిమంది కవులు బ్రాహ్మణులలోని నియోగి శాఖకు చెందిన వారగుటచేత, గోపరాజుకూడ ఆ శాఖకు చెందిన వాడే కనుక 'ముత్కుల చంద్రులు' అన్న పదబంధానికి 'నా నియోగి కుల చంద్రులు' అనే అర్థము చెప్పవలసి వస్తుంది. పరిశోధకులందరు ఇట్లే చెప్పిరి. దీనిని బట్టి గోపరాజు కులాభిమానమును అంచనా వేసికొనవచ్చును.

ఇక, తిక్కన తన మహాభారతమును హరిహరనాథున కంకితమిచ్చుటకు దారితీసిన ఆ నాటి మత పరిస్థితులు, పాల్కురికి సోమనాథాది శివకవులు నన్నయాది కవులను, «హరిహయమయ రూపున కంకితమిచ్చిన గోపరాజాదులు శివకవులను సంస్మరించక పోవుటకు గల హేతువులు, శ్రీ సూర్యనారాయణ గారెరుగనివి కావు. అన్నీ తెలిసి ప్రాచీనులు కుల మత ప్రాంతీయ తత్త్వాల కతీతులన్నట్లు "నేడు మన మధ్య చోటుచేసుకొనే ప్రాంతీయ, కుల, మత తత్త్వాల్ని ఐదు వందల సంవత్సరాల క్రితమే ఆంధ్రదేశంలో దర్శింపబూనటం నిజంగా 'సెంటుపెర్సంటు' దురదృష్టము" అని శ్రీ సూర్యనారాయణ గారు వ్రాయుట నేమనవలెనో!

"రామగిరి ప్రాంతాల్ని 12వ శతాబ్దిలో పాలించి, భీమకవిచే తెలుగు పద్యాలల్లించుకొన్న చాళుక్య వంశమేదో, ఆ 'చొక్కనామ నృప కుంజరుడె' వ్వరో తెలియజేయవల్సిన బాధ్యత శ్రీ రవికుమార్ గారిపై వుంది"

అని శ్రీ సూర్యనారాయణగారు వ్రాశారు. 'చిత్రకూటంబులో' 'చొక్కనామనృపకుంజరు' డున్నట్లు, అతను 'చళుక్యపుం జొక్కనృపాలు' డైనట్లు మనకు భీమకవి చాటువుల వలననే తెలియుచున్నది. క్రీ. శ. 1199 ప్రాంతంలో రేచర్లరుద్రునిచే తీరాంధ్రానికి తరుమబడు నంతవరకు ముదిగొండ చాళుక్యులు తెలంగాణాలో నున్నారు గనుక క్రీ. శ. 12వ శతాబ్ది మధ్య భాగంలో నివసించిన భీమకవి పేర్కొనిన చాళుక్య చొక్కనృపాలుడు ముదిగొండ చాళుక్య వంశీయుడే కావచ్చును. లేక భీమకవే అతనిని చాళుక్య వంశీయుడుగా పిలిచియుండవచ్చును. ప్రసిద్ధ చాళుక్య వంశీయులే కాక ఇతరులు కూడ చాళుక్యుల మని చెప్పుకొన్నారు గదా! కేవలము ఒకకవి చాటుపద్యముద్వారా బయల్పడిన ఒక దుర్గాధిపతి వంశనిర్ణయము సులభసాధ్యము కాదు.

సూర్యదేవర రవికుమార్, కొల్లూరు.

## నీ తు లు

"బ్రతికిన క్షణాలు" మీద "బ్రతకవలసిన క్షణాలు" పేరిట- వేగుంట మోహనప్రసాద్‌గారి రచనపైన డా॥ గుమ్మనూరు రమేష్‌బాబు గారి.... ఏవనాలో తోచటం లేదు- ఏప్రిల్ 1983 భారతిలో చూసాను.

కొందరు మానవుల తాపత్రయం ఏవిటో- భావ ప్రకటన దేనికో వొకపట్టాన బోధపడదు. బ్రతికిన క్షణాలకు ఎంతటి మేధావినయినా కదిలించే శక్తీ, స్పందింపచేసే రసస్ఫూర్తీ వుందని రమేష్‌బాబుగారే వొప్పుకున్నారు. అలాంటప్పుడు- ఏం కనిపించిందని భారతి పాఠకులపై బ్రతికిన క్షణాలను రుద్దుతోందని ఎదురు ప్రశ్న వేయడం దేనికి? పాఠకులను స్పందింపచేయటం. పఠితలకు రసస్ఫూర్తి కలిగించడం కాకపోతే పత్రిక కర్తవ్యం మరింక ఏవిటి? కర్తవ్యం నిర్వహించినందుకా "భారతి" ఈ రకం విమర్శలని "సమాదరించవలసిన" అవసరం రావటం?

భౌతిక దృక్పథం నిండిన జడవాదం, శూన్యవాదం వుండే రచనలు అస్పష్టంగా అయోమయంగా వుంటాయా? అసలు అస్పష్టంగా అయోమయంగా వుండే రచనల్లో ఏ వాదమయినా దృక్పథమయినా ఎలా దర్శిత మవుతాయి?

సామాన్యుల దృష్టి చిన్నదిగా వుంటుంది. తన దృష్టి చిన్నది అని చెప్పుకుని- తను సామాన్యుడనని పరోక్షంగా వొప్పుకున్న రమేష్‌బాబు గారు "బ్రతికిన క్షణాలు" మేధావులను కదిలిస్తాయని ఎలా చెప్పగలుగుతున్నారు? ఆయనే మరోసారి చెప్పాలి.

విమర్శ వాక్యాల కూర్పు-పఠిత అస్తవ్యస్త అసమగ్ర ఆలోచనల పేర్పు కాదు. వొక సమగ్ర సమీక్ష అందించలేకపోతే - వొక కొత్త అవగాహనా వీక్షణాన్ని వికసింపచెయ్యలేకపోతే విమర్శ ప్రయోజనమే వోటమి పొందుతుంది. తన భావప్రకటనలోనే పరస్పర విరుద్ధత్వం వున్నపుడు ఏ సాహితీపరామర్శయినా నిరుపయోగం అవుతుంది.

రమేష్‌బాబుగారి విమర్శలో మరికొన్ని లొసుగులు-

పట్టాభిషేకం భావప్రాధాన్యానికేకాని శిల్ప సౌందర్యానికి కాదని వొక వాక్యం. భావాన్ని విశిష్టంగా ప్రకటించగలిగే శబ్ద సౌందర్యమే అతి ముఖ్యం అని మరొక వాక్యం. శబ్దాన్ని ఆధారంచేసుకునే శిల్పసౌందర్యం ఆవిష్కృతమయేది. శబ్దం అతిముఖ్యం అని భావించినపుడు అయత్నకృతంగా శిల్ప సౌందర్యం కూడా జనితమవుతుంది. ఏది ముఖ్యం అని భావించాలి- రమేష్‌బాబు గారి ఆలోచనా రీత్యా- వొకటి ముఖ్యం అని వొకచోటా- మరొకటి ముఖ్యం అని ఇంకొక చోటా చెప్పబడినపుడు. ఈ విరుద్ధత్వం చాలదన్నట్లు- శిల్పం, భావం సమపాళ్లలోనే వుండాలని మరొక విసురు. పరికిస్తే అయోమయం అస్పష్టత బ్రతికిన క్షణాల్లో లేదు- బ్రతకవలసిన క్షణాల్లోనే వుందని స్పష్టమవుతుంది.

చివరగా వొక మాట _ ప్రతిభ రాణిస్తే సరిపోదు. సామాన్యుడి వరకూ వెళ్లాలని విశ్వసించే రమేష్‌బాబు గారు తన కవితల్లో ఈ క్రింది పదప్రయోగాలు ఎందుకు చేసినట్లు - తెలిక పదాలు వాడితే నాబోంట్లకు శబ్దార్థ చంద్రికలను ఆశ్రయించాల్సిన అగత్యం - ఛాంబర్స్‌కిలో పోవాల్సిన దుర్దశా తప్పేది కదా?

మందహాసం- సమీరం- జముడుగాక సంగీతం- అవిస్మృత_ సెంట్రిఫ్యూజ్_ సెంట్రీ_ ఎస్కార్ట్_ నిర్వేదనిర్వాణం_ అనవగతం_ నిశ్చల నిర్మాల్యం.

ఉదాహరణకి కొన్ని మాత్రమే. స్థలాభావం వల్ల మరొక్క వాక్యం చెప్పి ముగిస్తాను. ఎదుటివాడికి చెప్పేటందుకే నీతులు వున్నాయని భావించటం _ గురివింద లక్షణం - కాదా? టి. చంద్రశేఖర రెడ్డి, వనపర్తి.

# గ్రంథ విమర్శలు

## శివానంద సౌందర్యలహరులు

[ఆదిశంకరాచార్య విరచితములు. సరళతాత్పర్య సహిత ములు. తాత్పర్యకర్త : శ్రీ పురాణపండ రాధాకృష్ణమూర్తి. క్రౌన్ సైజు 12 + 102 + 12 పుటలు, వెల : 5 రూ. ప్రతులకు : శ్రీమతి బి. లక్ష్మీనారాయణమ్మ, మేనేజింగ్ పార్టనర్, సనాతన ధర్మవాణీ ప్రచురణ సంస్థ, డోర్ నెం. 31-1-28, జెండా పండా రోడ్, రాజమండ్రి - 1.]

వ్యాఖ్యాత రాధాకృష్ణమూర్తి గారు ఆధ్యాత్మిక విషయాల్లో అపారమైన కృషిచేసి, తత్త్వాన్ని పెక్కు రచనలలో విశదీక రించారు. వారి సంస్థ వలెనే ఆధ్యాత్మిక గ్రంథాలను ప్రచురించే మరొక సంస్థ సనాతన ధర్మవాణీ ప్రచురణ సంస్థ అనేది రాజమండ్రిలోనే మరియొకటి ఉన్నది. దానిని నడుపుతున్నవారు మహిళామణి కావడం ఒక విశేషం. ఆ సంస్థకు మేనేజింగ్ పార్టనర్ అయిన శ్రీమతి బి. లక్ష్మీనారాయణమ్మగారు సనాతన ధర్మాన్నీ ప్రచారం చేసే సంకల్పంతో మూడు నెలలకు ఒక గ్రంథాన్ని ప్రచురించే దృఢనిశ్చయంతో మొదటి ప్రచురణగా శంకర భగవత్పాదులు రచించిన శివానంద సౌందర్య లహరులను ఎన్నుకొన్నారు. మూలాన్ని మాత్రం ప్రకటిస్తే - అది అందరికీ అర్థంకానందువల్ల, ఆ ప్రచురణవల్ల ఎక్కువ ప్రయో జనం ఉండదని భావించి, ఆంధ్ర తాత్పర్యసహితంగా ఆ రెండు స్తోత్రాలనూ ప్రకటించదలచి, తాత్పర్య రచనకు సర్వసమర్థులైన రాధాకృష్ణమూర్తిగారినే ప్రార్థించారు. వారి తాత్పర్యంతో కూడా ఈ పుస్తకం వెలువడింది. ఈ స్తోత్రాలకు అనుబంధంగా ఉమా మహేశ్వర స్తవది, శివ కవచస్తోత్రం, రాజరాజేశ్వరీ మాతృకా మంత్ర స్తవం పుస్తకం చివర చేర్చబడినవి. ఈ స్తుతి పంచకం భక్తులకు ఎంతో ఉపయుక్తమైనది.

ఇదివరకే శివానంద, సౌందర్య లహరులకు తెలుగులో పద్యానువాదాలు చాలా వచ్చాయి. మూలాభిప్రాయాన్ని సులభంగా తెలుసుకొనుటకు పద్యానువాదాల కంటె తాత్పర్యాలే ఎక్కువ ఉపయోగిస్తాయి. కొన్ని అనువాదాలు, తాత్పర్యం కూడా ఉంటేనే కాని అర్థంకావు. శ్రీ రాధాకృష్ణమూర్తిగారు రచించిన తాత్పర్యం సులభంగాను, సుబోధకంగాను ఉన్నది. మచ్చునకు ఉదాహరణలు :

కళాభ్యాం చూడాలంకృత శశికళాభ్యాం నిజతపః
ఫలాభ్యాం భక్తేషు ప్రకటిత ఫలాభ్యాం భవతు మే,
శివాభ్యా మస్తోక త్రిభువన ఫలాభ్యాం హృదిపున
ర్భవాభ్యా మానందస్ఫుర దనుభవాభ్యాం నతి రియమ్.

తాత్పర్యము : కళాస్వరూపులూ, చంద్రరేఖను శిరోపరి భాగంలో అలంకరించుకున్నవారూ, ఒకరి తపస్సుకు మరొకరు ఫలమైనట్టివారూ, తమ భక్తజనులకు కోరిన వరాలనిచ్చు వారూ, మంగళమూర్తులూ, మూడులోకాలకూ శుభాలను ప్రసాదించేవారూ, మనస్సులో ప్రభవించువారూ, సంతోషం వల్ల స్ఫురించే స్వరూపాలు గల ఉమామహేశ్వరులకు వందనము.

(శివానందలహరి - 1)

శ్లో. అవిద్యానా మంత స్తిమిర మిహిరద్వీప నగరీ
జనానాం చైతన్య స్తబక మకరందస్రుతి ఝరీ,
దరిద్రాణాం చింతామణి గుణనికా జన్మజలధౌ
నిమగ్నానాం దంష్ట్రా మురరిపువరాహస్య భవతి.

తాత్పర్యము : మాతా ! భవదీయ పాదధూళి, అజ్ఞాన రూపాంధకారంలో పరిభ్రమించే వారికి భాస్కరుడు తేజరిల్లే నగరం గానూ, మూర్ఖులకు జ్ఞానం అన్న పుష్పగుచ్ఛానికి ఒదు ధారా ప్రవాహంగానూ, దరిద్రులకు చింతామణి సదృశంగానూ, సంసార సాగరంలో మునిగిపోయిన వారికి వరాహమూర్తియైన శ్రీహరి దంష్ట్రగాను అవుతూన్నది. (సౌందర్యలహరి - 3)

ఈ స్తోత్రాల వైశిష్ట్యాన్ని తెలుపుతూ, వడలి సూర్య ప్రకాశరావు గారు దీనికి విపులమైన సింహావలోకనం (పీఠిక) వ్రాశారు. ముద్రణ చక్కగా ఉన్నది. అచ్చు తప్పులు పాఠకులను తికమకలు చేస్తాయి.

## కన్నడమంలో రామకథ

[రచయిత్రి డాక్టర్ చన్నాప్రగడ జయలక్ష్మి, ఎం. ఏ., పిహెచ్. డి. క్రౌన్ సైజు 83 పేజీలు. వెల తెలియదు. ముద్రణ : రజని ప్రింటర్స్, లక్ష్మీవారపుపేట, రాజమండ్రి.]

ఏ విషయాన్నయినా తీవ్రంగా పరిశోధనలు జరిపేవారు ఆ విషయంపై ఇతర భాషలలో ఉన్న గ్రంథాలను కూడా పరిశీలించడం అవసరం. ఈ విషయాన్ని గ్రహించే తమ డాక్టరేట్ కోసం శ్రీమతి చన్నాప్రగడ జయలక్ష్మిగారు రామాయణం గురించి పరిశీలనచేస్తూ, కన్నడ భాషలో ఉన్న రామాయణ కథలను కూడా పరిశీలించి, తాము తెలుసుకున్న విషయాలను "కన్నడములో రామకథ" అనే యీ పుస్తకాన్ని రచించి ప్రకటించారు.

ఏదయినా కథ బహుళ ప్రచారాన్ని పొంది పెక్కు ప్రాంతాలలోనూ, దేశాంతరాలలోనూ ప్రచారం పొందినప్పుడు, అందులో అనేకమైన మార్పులూ, చేర్పులూ చోటుచేసుకోవడం సహజం. అసలు సంస్కృతంలోనే ఎన్నో రామాయణాలు వచ్చాయి. వాటిలోని వృత్తాంతాలు భిన్నభిన్నాలుగా కానవస్తాయి. అవిధంగానే తెలుగులో వచ్చిన రామాయణాలు కూడా కొన్ని విషయాలలో వేర్వేరుగా కానవస్తాయి. కన్నడంలో కూడా రామ కథ విభిన్న పద్ధతులలో ఉన్నది. ఆ విషయం ఈ పుస్తకంలో వివరించబడింది.

తెలుగు, కన్నడభాషలకు పెక్కువిషయాలలో సాన్నిహిత్యం ఉన్నది. తెలుగులో భాస్కరరామాయణం ప్రసిద్ధంగా ఉన్నట్లే

కన్నడంలో తొరవె రామాయణం ప్రసిద్ధంగా ఉన్నది. ఇది భాస్కరరామాయణానికి అనువాదమే అని చాలామంది అభిప్రాయ పడుతున్నారట। దానిని పరిశీలించినపుడు రచయిత్రి ఇతర రామాయణాలను కూడా పరిశీలించారట।

ప్రాచీన కాలంలో కర్ణాటక దేశంలో జైనమతం ప్రబల వ్యాప్తిలో ఉండినది. శ్రవణ బెళగోళ, మూడు బిద్రి, కర్కల మొదలైన జైన క్షేత్రాలు దీనికి దృష్టాంతాలు. ఆ కాలంలో జైనులు కూడా రామాయణాన్ని రచించడం వల్ల జైన రామాయణాలు కూడా కానవస్తున్నవి. రచయిత్రి యితర రామాయణాలతోపాటు జైనుల రామాయణాలను కూడా పరిశీలించి, విభిన్న కథాంశాలను గ్రహించి దీనిని సమకూర్చారు. తగిన పరిశీలన గ్రంథాలు కన్నడంలో దొరకకపోయినా, అక్కడక్కడ లభించిన విషయాలను సేకరించడానికి ఎంతో శ్రమపడవలసి వచ్చినదట।

ఇలా శ్రమించి తమ సంకల్పాన్ని నెరవేర్చుకున్నారు. దీనిని చదివితే ఈమె పెక్కు గ్రంథాలను పరిశీలించినట్లు తెలుస్తుంది.

గ్రంథ రచన ఉపన్యాసధోరణిలో నడిచినట్లు తెలుస్తున్నది. విషయ విభాగంచేసి, శీర్షికలను నిర్ణయించి, ఆయా శీర్షికలలో ఆయా విషయాలను సంగ్రహిస్తే పాఠకులకు ఎక్కువ ఉపయోగంగా ఉండేది. ఇట్టి పరిశీలన గ్రంథాలకు శీర్షికలతోపాటు విషయ సూచిక ఉండడం ఎంతో అవసరం.

ఓపికతో దీనిని చదివితే కన్నడంలోని రామకథ యొక్క తీరుతెన్నులు బాగుగా గ్రహించవచ్చును.

"ఆంగీరస"

# పండితరాజ జగన్నాథ మహాకవిః

[గ్రంథకర్త: విద్వాన్. వేదవిద్యా విశారద శ్రీ ఖండవిల్లి సూర్యనారాయణశాస్త్రి. క్రౌన్ 14 + 110 పేజీలు. వెల రు. 10. ప్రతులకు శ్రీ ఖండవిల్లి సూర్యనారాయణశాస్త్రి, మంగండ - 233 224, వయా అంబాజీపేట, తూర్పు గోదావరి జిల్లా.]

"పండితరా"జని పేరు పొందినా, విశ్వవిఖ్యాతిగాంచిన విద్వత్సార్వభౌముడు జగన్నాథమహాకవి. సర్వ శాస్త్రాలనూ అపోశనంపట్టి వ్యాకరణాలంకారాది శాస్త్రాలలో ఉద్గ్రంథాలనేగాక, భామినీ విలాసాది సద్యకృతులను ఎంతో రసవంతంగా రచించిన కవిసార్వభౌముడు. అతడు ఆంధ్రుడు కావడం తెలుగు దేశానికే గొప్ప గౌరవం. ఆయన నివాసం తూర్పు గోదావరి జిల్లాలోని ముంగండ అగ్రహారం. ఆయన భారతదేశం అంతటా సంచరించి శాస్త్రార్థ చర్చలలో మహా విద్వాంసులను ఓడించి, ఎవ్వరూపొందని ఘనసమ్మానాన్ని ఢిల్లీ పాదుషావల్ల పొందిన మహామనీషి ఆయన. అసూయాపరులైన విద్వాంసులు, యవన యువతీ సంబంధం మున్నగు లేనిపోని అపవాదులు కల్పించి, యీతని కీర్తిని కళంకితం చెయ్యడానికి ప్రయత్నించారు. కొందరు అవిశ్వసనీయాలైన కథలను విశ్వసించడంకూడా జరుగుతున్నది.

తమ పూర్వీకుల వంశానికి చెందిన ఈ పండితరాజు యథార్థ చరిత్రను సంస్కృత విద్వల్లోకానికి అందజేసి, ఆ మహాకవికి కలిగిన కళంకాన్ని తుడిచిపెట్టే సంకల్పంతో రచయిత సూర్యనారాయణశాస్త్రిగారు ఈచరిత్ర గ్రంథాన్ని రచించారు. శాస్త్రిగారు స్థానికంగానూ, ఇతరత్రా పెక్కు యథార్థ విషయాలను సంగ్రహించి "భారతదేశీయులకేకాక, విదేశీయులకుకూడా ఉపయోగపడేటట్లు సులభమైన సంస్కృతంలో రచించి, దేవనాగరిలిపిలోనే ముద్రించారు. తిరుమల తిరుపతి దేవస్థానములవారి ఆర్థిక సహాయంతో గ్రంథం చక్కగా ముద్రితమయింది.

ఇందులో 33 శీర్షికలలో అయిదు ప్రకరణాలలో - జగన్నాథ మహాకవిని గురించిన యావద్వృత్తాంతమూ విశదీకరించబడినది. మొదటి ప్రకరణంలో మహాకవి జన్మస్థలం, విద్యాభ్యాసం, క్రమశిక్షణ, పాండితీప్రకర్ష వివరించబడినవి. రెండవ ప్రకరణంలో వివిధ శాస్త్రాలలో పండితులతోడిచర్చ ఓడిపోయిన పండితుల దుష్ప్రచారం, కవిసార్వభౌమ బిరుదప్రాప్తి మున్నగునవి ఉన్నవి. ప్రకరణాలన్నింటిలోనూ చతుర్థ ప్రకరణమే పెద్దది. ఇందులో మహాకవి రచించిన గ్రంథాలను గురించిన సంగ్రవివరణ ఉన్నది. లక్ష్మీలహరీ, సుధాలహరీ, గంగాలహరీ, అమృతలహరీ, కరుణాలహరీ అనే అయిదు లహరులు, భట్టోజీ దీక్షితుల ప్రౌఢమనోరమ అనే వ్యాకరణ శాస్త్ర గ్రంథంపై వ్రాసిన మనోరమా కుచమర్దనం, రసగంగాధరమనే అలంకారశాస్త్ర గ్రంథం, అప్పయదీక్షితులవారి అలంకారగ్రంథం చిత్ర మీమాంస పయి విమర్శ అయిన చిత్రమీమాంసాఖండనం, పండితరాజ శతక సముచ్చయం, ప్రాణాభీరణం, భామనీ విలాసం, ఆ ప్రకరణంలో వివరింపబడిన గ్రంథాలు. అయిదవ ప్రకరణంలో లవంగిని గురించిన మిథ్యా ప్రవాదఖండనం, పండితరాజునకుగల ఆత్మవిశ్వాసం, ఆయన అంత్యదశ మున్నగునవి ఉన్నవి.

రచయిత తాను చెప్పిన విషయాలకు ఉద్బోధకాలయిన ఉదాహరణంగా శ్లోకాలను, శ్లోకభాగాలను, ఆంగ్ల విమర్శకుల గ్రంథ భాగాలను ఇచ్చి తాము చెప్పినవన్నీ యథార్థాలని నిరూపించారు. దీనిని చదివినయెడల రచయిత చేసిన పరిశ్రమ బాగుగా తెలియగలదు.

సుప్రసిద్ధ విద్వాంసులైన డాక్టర్ ఎన్. ఎస్ రామానుజ తాతాచార్యులుగారు (తిరుపతి-కేంద్రీయ సంస్కృత విద్యాపీఠం), డాక్టర్ పుల్లెల శ్రీరామచంద్రుడుగారు (సంస్కృత అకాడమీ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు), ప్రొఫెసర్ ఆర్. బి. అఠావలే (బొంబాయి) దీనిపయి సదభిప్రాయాలను ఇచ్చియున్నారు.

పండితరాజును గురించిన సర్వ విషయాలను తెలుసుకొనవలెనంటే ఈ గ్రంథాన్ని చదవడం ఎంతో అవసరం.

శ్రీ బులుసు వేంకట రమణయ్య

# అధిక్షేప శతకములు

[సంపాదకుడు: డా॥ కె. గోపాలకృష్ణరావు. వెల: రు. 4-50. ప్రతులకు : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ప్రచురణలు, హైదరాబాదు-4.]

దీనిలో కూచిమంచి తిమ్మకవి శ్రీ భర్గ శతకము, జగ్గకవి భక్తమందార శతకము, కవి చౌడప్ప శతకము, పోలిపెద్ది వేంకట రాయకవి వేణుగోపాల శతకము, వేంకటకవి కోలంక మదన గోపాల శతకము, గువ్వలచెన్న శతకము - ఈ ఆరు శతకాలు ఉన్నవి.

ఒక్కొక్క శతకానికి పీఠికలో కవికాలాదులూ, విషయ వివరాలూ ఉన్నాయి. వీటిలో చౌడప్పశతకం, వేణుగోపాలశతకం, గువ్వలచెన్న శతకం చాలా ప్రసిద్ధములు.

నీతి - లౌకికం, రాజకీయం అని రెండు విధాలు. తిమ్మకవి భర్గ శతకమునందు రెండూ కనిపిస్తాయి. ప్రత్యేకించి భర్గ శతకములో ఆయన ప్రగల్భ వేషధారులనూ, స్వార్థపరులనూ అధిక్షేపించడం గమనించదగినది.

'అకులమేక్క దె మేక' - అని వేషధారులకు మొట్టుమొట్టాడు.

మగ్గములో కండెలాగా వివేకశూన్యులై సంసారములో జీవితాలు గడుపుతూ ఉంటారన్నాడు.

విశేషించి చెప్పవలసేది 'అస్పృశ్యతా విరాసం' — బోయ కిచ్చిన ఎంగిలి మాంసం నువ్వు తిన్నావుకదా దానికి ఏమిటి ప్రాయశ్చిత్తం? అలాగే మావంటివారు చండాలురను డాయ రాదం టారు - అని గట్టిగా అడిగాడు భర్గుణి.

ఈయనకి అన్నిటా తమ్ముడవిపించుకున్నాడు జగ్గకవి భక్త మందార శతకములో.

కవి చౌడప్ప, గువ్వలచెన్న శతకాలను గురించి ఎవ్వరూ ఇప్పుడు యోగ్యతా పత్రాలివ్వనక్కరలేదు.

పోలిపెద్దికవి వేణుగోపాల శతకం అధిక్షేపశతక మాలికలో మేరువు.

'తెగదిని తలపిక్క లెగయగా బలిసిన
దున్నపోతేనుగుగున్న కాదు....
ఉన్నతస్థానమందు గూర్చుండగానె
భ్రష్టు భ్రష్టే యగుంగాని శిష్టుగాడు'—

ఇంత చురుకుగా చెప్పినవాడితడే. సాంఘిక జీవితం ఆనాడు కూడా ఎంత దిగజారిపోయిందో యీ శతకంవల్ల తెలుస్తుంది. ఇలాటి శతకాలు అందరూ చదివి తప్పినదారిని ఒప్పు చేసుకుంటే లోకం బాగుపడుతుందేమో అని ఆశ.

'పరుల కల్మికి దుఃఖపడుట రోత, పరువు తప్పినయెడ బ్రతుకు రోత, పిలువని పెత్తనంబులకు పోవుట రోత'-ఇలాటివి నేటి యువతరం ఒంటపట్టించుకోవాలి.

'దేవ భూసుర వృత్తి తెరువు పోవగరాదు' — ఇలాటి ధర్మోక్తులు తెలుసుకోవాలి - అలా నడుచుకోవాలి దొరతనం — ఇలాటిదే మదనగోపాల శతకమున్నూ. అయితే దీనియందు అను కరణ దోషం ఎక్కువ కనిపిస్తుంది.

ఇక సాహిత్య అకాడమీ వారికి రెండు మాటలు. 'మీరు చేస్తూన్నపని మంచిదే. కాని యీ పని ఎవరు చెయ్యడానికి తగిన వారు? అని నిర్ణయించుకుని పని అప్పగించాలి.'

'ప్రథమ కబళే మక్షికాపాత' అన్నట్టు మొదటి శతకం మొదటి పద్యం మొదటి పాదంలోనే గణ భంగం - యతిభ్రష్ట ములూ, ప్రాసభ్రష్టములూ గణదోషజుష్టములూ అయిన పద్యాలు దిద్దుకుంటూ చదవడం సాధ్యంకానిది. ఒకటా? రెండా? నూటికి తొంభై పద్యాలు ఇదే దుర్దశలో ఉన్నాయి. మరి సంపాదకులు ఏమిచూసినట్టు? పూర్వపురీడరేమి దిద్దినట్టు? - అకాడమీ పెద్దలేమి పట్టించుకున్నట్టు? ఇక — అచ్చుపని — న, స, ప, వ, ర, ద — అక్షరాలు సరిగా తెలియవు. ఆంధ్రదేశ రాజధానీ నగరములో ఇంత అధ్వాన్నమైన ముద్రణ అంటే ఆంధ్రేతర రాష్ట్రములో ఉన్న ఆంధ్రుడుగా సిగ్గుపడుతున్నాను.

# రఘువంశము (రెండవ భాగము)

[పది నుండి పందొమ్మిది సర్గలు. తెలుగు లఘువ్యాఖ్య సహితము. వ్యాఖ్యాత : శ్రీ కేశవపంతుల నరసింహశాస్త్రి. వెల : రూ. 8-00 లు. ప్రతులకు : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ప్రచురణలు, హైదరాబాదు-4.]

కాళిదాస రఘువంశాన్ని వచనరూపాన, పద్యరూపాన తెలుగులోకి తెచ్చినవారున్నారు. ఇది అలాటిది కాదు. కావ్యం తెలుగులో తేలికగా అర్థంచేసుకోడానికి అనువుగా శాస్త్రిగారు అర్థతాత్పర్యాలు ఇచ్చారు. సంధులు వేరుచేసి, పదాలు ఏర్పడిన విధం, క్రియారూపాలు - వాటి ప్రాతిపదికలూ, కాలాలూ ఇచ్చి వ్యాకరణ విషయాన్ని కూడా తెలుసుకోవాలనే కోరిక కలవారికి చేయూత ఇచ్చారు.

మరీ వాడుకభాష కాదుగాని శాస్త్రిగారి తెలుగు వైదికంగా లేదు. కాబట్టి సర్వులకూ ఉపకారకమయిందనే చెప్పవచ్చు.

ఒకొక్క చోట పదప్రయోగ వైశిష్ట్యం కూడా ఇవ్వడం ప్రధానంగా చెప్పవలసే విషయం.

'లఘుదర్శనః' = ప్రియ దర్శనుడు – ఇచ్చట 'లఘుశబ్దం సుందరార్థకం'– ఇలాటివి చాలా ఉన్నాయి.

ముఖ్యంగా గ్రహించవలసేది. రఘువంశములో ఒకొక్క ఘట్టానికి ఒకొక్క నాయకుడున్నాడు. ఆ నాయకుని కథనుంచి గ్రహించవలసేది లోకానికి ఒకొక్క గుణపాఠం ఉంది. దానిని శాస్త్రిగారు వివరించారు. ఈ గ్రంథములో అదొక క్రొత్త నగ.

కాళిదాసుని గురించి గాని, శ్రీ నరసింహశాస్త్రి గారిని గురించి గానీ విశేషించి చెప్పనక్కరలేదు. శాస్త్రిగారి లఘువ్యాఖ్య 'మల్లినాథ లఘువ్యాఖ్య'– అనే చెప్పవచ్చు.

అసహ్యంగా ఉన్నది ఒక్కటే – ఏమిటది ? అచ్చు – సంస్కృతం అస్పష్టంగా కనిపిస్తే పాఠకుని కోరిక ఏమవుతుంది ? ఇంతకీ సాహిత్య అకాడమీలో సంస్కృతం తెలిసినవారు లేరనుకుంటాను. ఉంటే ముద్రణ ఇంత అధ్వాన్నంగా ఉండదు.

## తెలుగు వైతాళికులు

(ఉపన్యాసాల సంకలనం)

[సంపుటం–4. వెల : రు. 5–00. ప్రతులకు : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ప్రచురణలు, హైదరాబాద్–4.]

శ్రీ జనమంచి శేషాద్రిశర్మ, ఆదిభట్ల నారాయణదాసు, తాతా సుబ్బారాయశాస్త్రి, సురవరం ప్రతాపరెడ్డి, ధర్మవరం రామకృష్ణమాచార్యులు, ఒద్దిరాజు సోదరులు, శివశంకర స్వామి, విక్రమదేవవర్మ, పానుగంటి లక్ష్మీనరసింహరావు, పూండ్ల రామకృష్ణయ్య, వడ్డాది సుబ్బరాయ కవిగార్ల జీవితచరిత్రలకు సంబంధించి కొందరు పెద్దలన్న మాటలు గ్రంథావతారం ధరించాయి.

వీరు 'తెలుగు వైతాళికులు' గా పేరుపెట్టడం నాకు నచ్చలేదు. రాయప్రోలు శాస్త్రి గారిని గురించి చెప్పినవారు జమ్మలమడక వారు. వారి మాటలు మాత్రం యీ సంకలనంలో ముందుగా చెప్పుకోవలసేవి, చేర్చవలసేవిన్నీ. మరి ఆ వ్యాసానికి మూడో సంఖ్యగా స్థానం ఇవ్వడం 'సంకలనం' చేసినవారి 'అజ్ఞత'– అని నిస్సందేహంగా చెప్పవచ్చు.

నారాయణదాసు గారిని గురించి యస్వీ జోగారావుగారు 'కప్పదాట్లు' గా చెప్పినట్టు నాకు తోచింది. చెప్పవలసే గొప్ప విషయాలూ, చతురోక్తులూ చాలా ఉన్నాయి. అవి దానిలో ఏమయిపోయాయి. వీరు చెప్పిన దానిని బట్టి దాసుగారిని తెలియని వ్యక్తి ఇంతేనా ? అని పెదవి విరుస్తాడు. దాసు గారికి దీనిలో రెండో చోటు దొరికింది.

జనమంచి వారి గురించి తరిచి చెప్పినవీ, చెప్పనివీ ఉన్నాయి. ఏమయినా రచన యుక్తంగా ఉందని అనవచ్చు.

మొత్తం పైన బాగున్నది 'సంకలనం' యీ తరం వారికి కొంతవరకైనా ఆ పెద్దలను గూర్చి తెలిపేదై ఉందని అనవచ్చు.

ముద్రణ కూడా బాగానేఉంది.

శ్రీ యామిజాల పద్మనాభస్వామి



›d & Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika
›, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 61247.


అమృతాంజన్‌కే తెలుసు తలనొప్పి బాధ
అసలు తల నొప్పి అంటేనే భరించలేని బాధ. దాన్ని పోగొట్టుకోడానికి సులువైన మార్గము. కొంచెము అమృతాంజన్ తీసుకొని కణతల మీద బాగా గట్టిగా నిమిరి పట్టించండి. వెంటనే తల నొప్పి తగ్గిపోయి హాయిగా వుంటుంది.
అమృతాంజన్ ఇతర మందులవలెగాదు. అమృతాంజన్‌లో చేరివున్న శక్తివంతమైన 10 ఔషధాలు అమోఘంగా పని చేసి రాసిన చోట పై చర్యవల్ల అతి త్వరగా ఇట్టే నొప్పిని నివారిస్తుంది. ఏ అపాయం వుండదు.
85 సంవత్సరాలకు పై బడిన ప్రసిద్ధి కల అమృతాంజన్ వొంటి నొప్పులకు, బెణుకులకు, జలుబులకు గొంతు నొప్పులకు కూడా బాలా అమోఘంగా పనిచేసి నివారిస్తుంది.
ఎప్పుడూ అమృతాంజన్ చేతికి అందుబాటుగా వుంచుకోటం మంచిది. ఎందుకంటే ఎప్పుడు అవసర మొస్తుందో చెప్పలేము.
AMRUTANJAN
Pain Balm
Amrutanjan Ltd.
PAIN BALM
AMRUTANJAN LTD
అమృతాంజన్
శీఘ్రనివారిణి. నమ్మకమైనది. ఏ ఇతర బాధనూ కలుగచేయదు.
OBM 7652 TG-R